www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 15-5-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 29 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, బహుళపక్షం, తిథి: తదియ తె.4:03 తదుపరి చవితి, నక్షత్రం: జ్యేష్ఠ మ.2:07 తదుపరి మూల, వర్జ్యం: రా.10:47-12:31, దుర్ముహూర్తం: ఉ.10:03-10:54, మ.3:11-4:02, అమృతఘడియలు: లేవు, రాహుకాలం: మ.1:30-3:00, సూర్యోదయం: 5:46, సూర్యాస్తమయం: 6:36 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


జస్టిస్ గవాయ్‌తో ప్రమాణం చేయిస్తున్న రాష్ట్రపతి ముర్ము

సీజేఐ జస్టిస్ గవాయ్

ప్రమాణం చేయించిన రాష్ట్రపతి ముర్ము 12

హాజరైన ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు

తొలి బౌద్ధ, రెండో దళిత సీజేఐగా రికార్డు

1985లో న్యాయవాదిగా కెరీర్ ఆరంభం

2003లో హైకోర్టు.. 2019లో సుప్రీం జడ్జిగా..

ఆర్టికల్ 370 రద్దు, బుల్డోజర్ న్యాయం

తదితర కీలక తీర్పుల్లో భాగస్వామ్యం

12న పండుగ

సంక్షేమ సందడి!


టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులతో సమావేశమైన పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు

జూన్ 12న లక్ష మందికిపైగా వితంతువులకు పింఛన్లు

బడులు తెరిచేలోగా తల్లుల ఖాతాల్లో 'తల్లికి వందనం'

ఇకనుంచి 3 గ్యాస్ సిలిండర్ల డబ్బు ముందుగానే జమ

త్వరలోనే సంక్షేమ పథకాల క్యాలెండర్ విడుదల

గిరిజనులకూ పథకాలు అందేలా ప్రత్యేక డ్రైవ్‌లు

16, 17, 18లో అన్ని నియోజకవర్గాల్లో తిరంగా ర్యాలీలు

మహానాడులోపే నీరు-చెట్టు, ఉపాధి బకాయిలు చెల్లింపు

టీడీపీ పొలిట్‌బ్యూరోలో కీలక నిర్ణయాలు

అమరావతి, మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నా.. అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా అమలు చేస్తున్నామని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలు ఒకటొకటిగా నెరవేరుస్తున్నామని, ఈ విషయంలో వెనకడుగు వేసే ప్రశ్నే లేదని స్పష్టం చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం సుమారు 3గంటల పాటు నిర్వహించిన పార్టీ పొలిట్‌బ్యూరో సమావేశంలో 12 అంశాలపై విస్తృతంగా చర్చించారు. సమావేశం వివరాలను పొలిట్‌బ్యూరో సభ్యులు.. మంత్రి అచ్చెన్నాయుడు, పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు విలేకరులకు వివరించారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం వితంతు పింఛన్లు కూడా ఇవ్వలేదని, ఇలాంటివారు రాష్ట్రవ్యాప్తంగా

మిగతా 12వ పేజీలో...

27 నుంచి కడపలో 3 రోజులు వైభవంగా మహానాడు

18, 19, 20న అసెంబ్లీ.. 22, 23న పార్లమెంట్ స్థానాల్లో మినీ మహానాడు

పాడి, పౌల్ట్రీ రంగాల్లో నూతన ఆవిష్కరణలు

అత్యాధునిక టెక్నాలజీతో మెరుగైన ఫలితాలు

వృద్ధిరేటులో పశుసంవర్ధక శాఖది కీలక పాత్ర

రాష్ట్ర జీఎస్‌డీపీలో 11.23 శాతం వాటా

కోడిగుడ్ల ఉత్పత్తిలో ఏపీదే మొదటి స్థానం

గ్రామాల్లో డెయిరీ షెడ్లపై ట్యాక్స్ రద్దు

లైవ్‌స్టాక్ స్టార్టప్ కంపెనీలకు ప్రోత్సాహం

పశుసంవర్ధక-టెక్ ఏఐ 2.0లో చంద్రబాబు


13

'సింధు' ఒప్పందం రద్దు నిర్ణయాన్ని

పునఃసమీక్షించండి

భారత్‌కు పాకిస్థాన్ జలవనరుల శాఖ లేఖ

తీవ్ర దుర్భిక్షం నెలకొంటోందంటూ ఆందోళన

బీఎస్ఎఫ్ జవాన్‌ను భారత్‌కు అప్పగించిన పాక్

ఆ దేశ రేంజర్‌ను విడుదల చేసిన భారత్

పాక్‌కు డ్రోన్లే కాదు.. సైనికుల్నీ పంపిన తుర్కియే

భారత్‌పై దాడికి ఆ దేశం సాయం

'సిందూర్'లో ఇద్దరు తుర్కియే జవాన్ల మృతి

కిరానా హిల్స్‌లో ఏం జరిగింది?

అణుధార్మికత లీక్ అయ్యిందా??

భారత్, పాక్ కలిసి డిన్నర్ చేయాలి!

2 దేశాల మధ్య యుద్ధాన్ని నేనే ఆపాను: ట్రంప్


12

శత్రు డ్రోన్ల దండుపై 'భార్గవాస్త్రం'

స్వదేశీ కౌంటర్ డ్రోన్ వ్యవస్థ పరీక్ష సక్సెస్

జగన్ మనిషి బాలాజీ!

కుటుంబానికి సన్నిహితుడు.. మద్యం స్కామ్‌లో కీలక పాత్ర

తరచూ రాజ్ కసిరెడ్డి ఆఫీసుకు..

ఖాళీ కారులో వచ్చి.. నోట్ల కట్టలతో వెనక్కి

ముడుపులతో కర్ణాటకలో స్థిరాస్తి వ్యాపారాలు

'అంతిమ లబ్ధిదారు'కు చేర్చడంలో కీలకం

వ్యక్తిగతంగానూ లాభపడ్డ బాలాజీ

రిమాండ్ రిపోర్టులో సిట్ వెల్లడి

కస్టడీకి ఇవ్వాలని కోర్టుకు అభ్యర్థన

20 వరకు రిమాండ్.. జైలుకు తరలింపు


బాలాజీ గోవిందప్పను జైలుకు తరలిస్తున్న దృశ్యం

అమరావతి, మే 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో నడిచిన వేలకోట్ల మద్యం కుంభకోణంలో బాలాజీ గోవిందప్ప కీలక పాత్ర పోషించారని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తెలిపింది. ఈ 'సిండికేట్'లో ఆయన ముఖ్యమైన వ్యక్తి అని వెల్లడించింది. అంతే కాదు... బాలాజీ గోవిందప్ప "జగన్ కుటుంబానికి అత్యంత దగ్గరి వ్యక్తి. అందువల్లే... ఈ స్కామ్‌లో కీలకంగా వ్యవహరించారు" అని స్పష్టం చేసింది. కర్ణాటకలోని చామరాజనగర్ జిల్లా అటవీ ప్రాంతంలోని వెల్‌నెస్ సెంటర్‌లో మంగళవారం అదుపులోకి తీసుకున్న బాలాజీ గోవిందప్ప(ఏ-33)ను సిట్ అధికారులు బుధవారం విజయవాడ ఏసీబీ కోర్టులో ప్రవేశ పెట్టారు. రిమాండ్ రిపోర్టులో ఈ కేసుకు సంబంధించిన సంచలన అంశాలను ప్రస్తావించారు. "బాలాజీ గోవిందప్ప భారతీ సిమెంట్స్ డైరెక్టర్లలో ఒకరు. సంస్థ ఆర్థిక వ్యవహారాలను చక్కబెట్టే వారు. భారతీ సిమెంట్స్ వైఎస్ జగన్మోహన్ రెడ్డి కుటుంబం నిర్వహిస్తున్న సంస్థ. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కుటుంబ సభ్యులు, నాటి ఉన్నతస్థాయి వర్గాలతో బాలాజీకి

మిగతా 2వ పేజీలో...

ఏది అడిగినా దాటవేత.. మౌనం

లేదంటే అధికారులకే ఎదురుప్రశ్నలు

ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి తీరిది

6 గంటలు.. 60 ప్రశ్నలు వేసిన సిట్

లిక్కర్ స్కామ్‌పై ఎంతో ఓపిగ్గా అడిగినా ఇద్దరిదీ ఒకే ధోరణి 14

ఒక దశలో వేర్వేరుగా విచారించిన వైనం

నేడు మరోసారి విచారణకు పిలిచిన సిట్


సిట్ విచారణకు వస్తున్న కృష్ణమోహన్ రెడ్డి, ధనుంజయరెడ్డి


పురందేశ్వరి సమక్షంలో బీజేపీలో చేరుతున్న జకియా

బీజేపీలోకి జకియా ఖానమ్ 11

మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా



6జీతో ప్రపంచ లీడర్‌గా భారత్ 2

2028 నాటికి అందుబాటులోకి నెట్‌వర్క్

కేంద్ర మంత్రి పెమ్మసాని

'ఫ్రీ హోల్డ్'పై కదలిక

20న మంత్రివర్గ ఉపసంఘం భేటీ

'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందన 14

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరా!

పాలీసెట్‌లో 95.36% ఉత్తీర్ణత 3

రేకుల ఇంట్లో లింగనిర్ధారణ పరీక్షలు

ఒంటరిగా వెళ్లి పట్టుకున్న చిత్తూరు కలెక్టర్

అదుపులో 11 మంది నిర్వాహకులు, ముగ్గురు మహిళా నిర్వాహకులు 2

అదే సారే.. ఇప్పటికీ వారే!

నాడు జగన్ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసింది. వైసీపీకి అనుకూలంగా ఉండే అధికారులు, కన్సల్టెంట్లు, ప్రైవేటు వ్యక్తులను కీలక స్థానాల్లో నియమించారు. వైసీపీకి వీర విధేయులుగా పనిచేసేలా 'శిక్షణ' ఇచ్చారు. గ్రామ, వార్డు సచివాలయాల రోజువారీ కార్యకలాపాలు, డేటా వంటివన్నీ ఐప్యాక్‌కు చెందిన వ్యక్తి గుప్పిట్లో ఉండేలా మాస్టర్‌ప్లాన్ వేశారు. ఇప్పుడు ప్రభుత్వం మారింది. కూటమి సర్కారు వచ్చి 11 నెలలు దాటింది. అయినా సరే.. ఆ సారే ఉన్నారు. ఇతర కీలక అధికారులూ వారే కొనసాగుతున్నారు.

ఐప్యాక్ గుప్పిట్లోనే గ్రామ సచివాలయాలు

వైసీపీ హయాంలోని అధికారే కొనసాగింపు

కన్సల్టెంట్లు, ఎనలిస్టులూ, అకౌంటెంట్లూ వారే

నిరంతరాయంగా 'ఐప్యాక్'కు సమాచారం!?

ప్రభుత్వం మారి ఇన్నాళ్లైనా అదే పరిస్థితి



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఐప్యాక్.. వైసీపీ, జగన్ ప్రభుత్వంతో అంటకాగిన ప్రైవేటు సంస్థ. జగన్‌కు రాజకీయ వ్యూహాలు అందించిన ఈ సంస్థకు గత ప్రభుత్వం ఎలాంటి మేళ్లు చేసిందో ఇప్పటికే సవివరంగా బయట కొచ్చింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరి 11 నెలలు దాటినా గ్రామ, వార్డు సచివాలయాల విభాగంపై ఇప్పటికీ ఐప్యాక్‌దే పెత్తనం. నాడు జగన్ ప్రభుత్వంలో నియమితులైన అధికారులు, కన్సల్టెంట్లు, ఎనలిస్టులు, అకౌంటెంట్లు, రిటైర్డ్ అధికారులు.. ఇలా ఎందరో ఇప్పటికీ కొనసాగుతున్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ శాఖ నుంచి డేటా నిరంతరాయంగా ఐప్యాక్‌కు చేరిపోతోంది. ఈ శాఖలో ఏం జరుగుతుందో, ఏం చేయనున్నారో ఆ సంస్థకు తెలిసిపోతోంది. కొందరు అధికారులు ఇప్పటికీ ఐప్యాక్, జగన్ కోసం పరితపించి పనిచేస్తున్నారు. గ్రామీణ, పట్టణ ప్రజలను ప్రభుత్వంతో అనుసంధానం చేసే ఇలాంటి శాఖను ఇలాగే వదిలేస్తారా? కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టి సంస్కరించకపోతే ఎలా? అన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వ

మిగతా 14వ పేజీలో...

టీచర్ల బదిలీలకు

నేడు షెడ్యూల్?

కొత్త బదుల ఆధారంగా స్థానచలనం 2

హెచ్ఎంలకు 5, టీచర్లకు 8 ఏళ్లు దాటితే తప్పనిసరి

వికసించని బాల్యానికి చేయూత!

విద్యా శాఖ ఆధ్వర్యంలో భవిత ఆటిజం కేంద్రాలు

రాష్ట్రానికి 125 మంజూరు చేసిన కేంద్రం 2

దేశానికి పైలట్ ప్రాజెక్టులా ఏపీలో అమలు

ఏపీ కోటా ముగిసింది.. 14

తాగునీరూ ఇవ్వొద్దు!

కేఆర్ఎంబీకి తెలంగాణ లేఖ.. తీవ్రంగా స్పందించిన ఏపీ

లెక్కలతో సహా వివరణ.. 3.75 టీఎంసీలు ఇవ్వాలని వినతి


14

తెలంగాణలోని రామప్ప గుడి వద్ద మిస్‌వరల్డ్ పోటీదారులు. చిత్రంలో మంత్రి సీతక్క

సౌందర్య శిల్పాలు

ఓరుగల్లులో అందాల భామల సందడి

చీరకట్టు, నుదుటిన బొట్టుతో తెలుగుదనం ఉట్టిపడేలా ముస్తాబు

వరంగల్ కోట, రామప్ప ఆలయం, వేయి స్తంభాల గుడి సందర్శన

అనంతలో భారీ ఇంధన కాంప్లెక్స్

22 వేల కోట్లతో రెన్యూ సంస్థ ఏర్పాటు

దేశంలో పెద్ద ఇంటిగ్రేటెడ్ పునరుత్పాదక ప్రాజెక్టు

రేపు శంకుస్థాపన చేయనున్న మంత్రి లోకేశ్

కార్యరూపం దాలుస్తున్న దావోస్ ఒప్పందాలు

ReNew POWER

అమరావతి, మే 14 (ఆంధ్రజ్యోతి): దావోస్ ఆర్థిక సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ సమక్షంలో జరిగిన అవగాహనా ఒప్పందాలు కార్యరూపం దాలుస్తున్నాయి. రూ. 22,000 కోట్లతో అనంతపురం జిల్లా, గుంతకల్లు నియోజకవర్గం బేతపల్లిలో భారతదేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ పవర్ కాంప్లెక్స్ ఏర్పాటు కాబోతోంది. దీనిని గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో ప్రముఖ సంస్థ రెన్యూ ఏర్పాటు చేస్తోంది. రెన్యూ ఎనర్జీ కాంప్లెక్స్‌కు 16న మంత్రి లోకేశ్ శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టు తొలిదశలో 587 మెగావాట్ల సౌర విద్యుత్, 250 మెగావాట్ల పవన విద్యుత్, 415 మెగావాట్ల సామర్థ్యంతో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ యూనిట్లను ఆ సంస్థ

మిగతా 14వ పేజీలో...

వికసించని బాల్యానికి చేయూత..!

రాష్ట్రానికి 125 మంజూరు చేసిన కేంద్రం

తొలివిడతలో 71, రెండో విడతలో 54 ఏర్పాటు

దేశానికి పైలెట్ ప్రాజెక్టులా ఏపీలో అమలు

ప్రతి కేంద్రంలోనూ ముగ్గురు థెరపిస్టులు

పాఠశాలలకు అనుసంధానంగా ఏర్పాటు

జూన్‌లో మంగళగిరిలో తొలి కేంద్రం ప్రారంభం



విద్యాశాఖ ఆధ్వర్యంలో భవిత ఆటిజం కేంద్రాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వయసుకు తగ్గ మానసిక ఎదుగుదల లేకపోవడం.. తోటి పిల్లలతో కలవకుండా ఒంటరిగా ఉండడం.. నేరుగా కళ్లలోకి చూసి మాట్లాడలేకపోవడం.. ఇవన్నీ ఆటిజం లక్షణాలు. ఇలా మానసిక వికాసం లేని చిన్నారులకు చేయూతనిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. దేశంలోనే మొట్టమొదటిసారి విద్యాశాఖ ఆధ్వర్యంలో భవిత ఆటిజం సపోర్ట్ కేంద్రాల ఏర్పాటుకు ఏపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ప్రభుత్వ చొరవతో ఏపీకి 125 ఆటిజం కేంద్రాలు మంజూరయ్యాయి. ఒక్కో కేంద్రం నిర్మాణానికి రూ.27.75 లక్షలు, ఉపకరణాలకు మరో రూ.5లక్షలు చొప్పున కేంద్రం నిధులు ఇస్తుంది. పైలెట్ ప్రాజెక్టుగా ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసే కేంద్రాల పనితీరు, ఫలితాల ఆధారంగా మిగిలిన రాష్ట్రాలకూ ఈ కేంద్రాలు మంజూరు కానున్నాయి. రాష్ట్రంలో ఆటిజంతో బాధపడుతున్న సుమారు 20వేల మంది చిన్నారులకు ఈ కేంద్రాల ద్వారా మేలు జరగనుంది. ప్రస్తుతం బాధిత చిన్నారుల తల్లిదండ్రులు ప్రైవేటు ఆటిజం కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. అవి కూడా చాలా పరిమిత సంఖ్యలోనే ఉన్నాయి. వాటిలో ఫీజులు పేదలు భరించే స్థాయిలో లేవు. ఇప్పుడు రాష్ట్రంలో ప్రభుత్వ కేంద్రాలు అందుబాటులోకి రానుండడంతో వారికి కాస్త ఉపశమనం కలుగుతుంది.

ఆటిజం అంటే ఏమిటి..?

ఆటిజం అంటే వయసుకు తగ్గ మానసిక ఎదుగుదల లేకపోవడం. ఇది సాధారణ మానసిక రుగ్మత కాదు. ఆటిజం బాధితుల్లో మెదడు నుంచి వచ్చే సమాచారం పంచేంద్రియాలకు సక్రమంగా సమన్వయం కాదు. దీనివల్ల చూడటం, వినడం, గుర్తించలేకపోవడం లాంటి సమస్యలు బాధిత పిల్లల్లో కనిపిస్తాయి. ఆటిజం పిల్లల్లో ముఖ్యంగా కనిపించే లక్షణాలు...

మంగళగిరిలో తొలి కేంద్రం

ప్రస్తుతం రాష్ట్రంలోని కొన్ని నగరాల్లోనే ప్రైవేటు ఆటిజం కేంద్రాలున్నాయి. వాటిలోని థెరపిస్టులు ఆటిజం బాధితులకు థెరపీ ఇస్తున్నారు. రోజుకు లేదా రోజు మార్చి రోజు గంట చొప్పున థెరపీ ఇస్తారు. ఇందుకోసం నెలకు రూ.20వేల నుంచి రూ.30వేల వరకూ తీసుకుంటున్నారు. ఇంత మొత్తం భరించే పరిస్థితి పేదలకు ఉండదు. ప్రైవేటులోనూ చాలా తక్కువ కేంద్రాలు ఉండటంతో అందరికీ థెరపీ అందడం లేదు. గ్రామీణ ప్రాంతాల వారికైతే అసలే అవకాశం లేకుండా పోయింది. కాగా, రాష్ట్రంలో 125 కేంద్రాలను రెండు దశల్లో ఏర్పాటు చేయనున్నారు. తొలి విడతలో 71, రెండో విడతలో 54 కేంద్రాలు ప్రారంభిస్తారు. వచ్చే జూన్‌లో మొదటి కేంద్రం మంగళగిరి సమీపంలోని వెంకటరెడ్డిపాలెంలో ప్రారంభించేలా ప్రణాళిక రూపొందించారు. రాష్ట్రంలో ఆటిజం బాధితులపై సర్వేచేసి అవసరమైన ప్రాంతాల్లోనే వీటిని ఏర్పాటు చేయనున్నారు.



లక్షణాలు

- తోటి పిల్లలతో కలవలేరు. ఒంటరిగా ఉండటానికే ఇష్టపడతారు.
- మాట్లాడే సమయంలో ఎదుటివారి కళ్లలోకి చూసి మాట్లాడలేరు.
- పేరుతో పిలిచినా చూడరు. అందరు పిల్లల్లా.. ప్రమాదాలను గుర్తించలేరు.
- వస్తువులను సక్రమంగా పట్టుకోలేరు.. ఎప్పుడూ ఒకే ఆట ఆడుతుంటారు.
- ఎప్పుడూ టెన్షన్‌గా ఉంటారు.. కొన్ని సమయాల్లో ఇతరుల స్పర్శను కూడా ఇష్టపడరు.
- ఎలాంటి కారణం లేకుండానే ఏడుస్తారు. కారణం లేకుండానే నవ్వుతారు.
- చెప్పిన మాటలు అర్థం చేసుకోకుండా.. చెప్పిందే మళ్లీ మళ్లీ చెబుతుంటారు.

రాష్ట్రంలో 20 వేల మంది బాధితులు

ఆటిజం బాధిత పిల్లల్లో మానసిక ఎదుగుదల చాలా నెమ్మదిగా ఉంటుంది. ఆటిజంను పలు రకాలుగా విభజించారు. బడికి వెళ్లే పిల్లలను పాఠశాల విద్యాశాఖ గుర్తించగా.. రాష్ట్రంలో సుమారు 20వేల మంది బాధితులు ఉన్నట్లు తేలింది. వారిలో ఇంటలెక్చువల్ డిజేబిలిటీ బాధితులు 13,889 మంది, సెలబ్రల్ పాల్సీ బాధితులు 4,665 మంది, ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ బాధితులు 1,264 మంది ఉన్నారు.

పాఠశాలల్లోనే ఆటిజం కేంద్రాలు

ప్రైవేటు తరహాలో కాకుండా ఆటిజం కేంద్రాలను కొంత భిన్నంగా నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల ఆవరణలోనే వీటిని ఏర్పాటు చేస్తారు. మొదట నాలుగైదు నెలలు ఆటిజం పిల్లలకు థెరపీ ఇస్తారు. వారిలో వచ్చిన సానుకూల మార్పుల ఆధారంగా సాధారణ తరగతుల్లో వారిని కూర్చోబెడతారు. తరగతుల్లోని ఉపాధ్యాయులు, విద్యార్థులకు కూడా ఆటిజంపై అవగాహన కల్పిస్తారు. ఆటిజం పిల్లలను తక్కువ చేయకుండా అందరితో కలుపుకొని వెళ్లేలా చర్యలు తీసుకుంటారు. ప్రతి కేంద్రంలో ముగ్గురు థెరపిస్టులు, ఇద్దరు సహాయకులను నియమిస్తారు. తొలుత ప్రైవేటు థెరపిస్టులను తీసుకుంటారు. ఆ తర్వాత ప్రభుత్వంలోని స్పెషల్ ఎడ్యుకేటర్లకు శిక్షణ ఇచ్చి నియమించాలనే ఆలోచన చేస్తున్నారు.

సాధారణ విద్యార్థులతో కలపడమే లక్ష్యం

"వీలైనంత త్వరగా 125 కేంద్రాలు ప్రారంభిస్తాం. దేశంలోనే ఇది విద్యాశాఖ ఆధ్వర్యంలో తొలిసారి కావడంతో లోతుగా అధ్యయనం చేస్తున్నాం. ఆటిజం బాధిత విద్యార్థులను వీలైనంత త్వరగా సాధారణ విద్యార్థులతో కలపాలన్నది మా లక్ష్యం. బడి ఈడు పిల్లలు 6 నుంచి 14 ఏళ్లలోపు విద్యార్థులకు ఆటిజం కేంద్రాల్లో చేరవచ్చు. భవిత ఆటిజం సపోర్ట్ కేంద్రాల పేరుతో వీటిని ఏర్పాటు చేస్తున్నాం. విద్యా శాఖ ఆధ్వర్యంలో ఏపీలో ఏర్పాటయ్యే ఆటిజం కేంద్రాలు మిగిలిన రాష్ట్రాలకు మోడల్ అవుతాయి"

- బి.శ్రీనివాసరావు, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్

ఉత్తరకోస్తాలో వర్షం.. సీమలో భగభగ

- మరో రెండు రోజులు భిన్న వాతావరణం
- నేడు ఉత్తరకోస్తా, రేపు సీమలో భారీ వర్షాలు



ఏలూరు పత్తేబాద రైతుబజార్‌లో నిలిచిన వర్షం నీరు

అమరావతి, విశాఖపట్నం, ఏలూరుసిటీ, మే 14 (ఆంధ్రజ్యోతి): వాతావరణ అనిశ్చితి నెలకొనడంతో ఉత్తరకోస్తాలో క్యుములోనింబస్ మేఘాలు ఆవరించాయి. ఈ ప్రభావంతో పలుచోట్ల పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. మామిడి, ఇతర పంటలకు నష్టం వాటిల్లింది. ఏలూరు జిల్లాలోనూ ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఏకధాటిగా కుండపోతగా వర్షం కురిసింది. ఏలూరులోనూ ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఏలూరు అర్బన్ ప్రాంతంలో 79.4, ఏలూరు రూరల్ మండలంలో 55.4, శ్రీకాకుళం జిల్లా పాతపట్నం మండలం జగ్గిలబొంతులో 53.25, శ్రీకాకుళం మండలం రాగోలులో 49.25, శ్రీకాకుళం నగరంలో 47.27, ఏలూరు జిల్లా పూళ్లలో 44.5, ఏలూరులో 34.5, మన్యం జిల్లా పాలకొండలో 32.7 మి.మీ. వర్షపాతం నమోదైంది. మరోవైపు కోస్తా, రాయలసీమలో ఎండ తీవ్రత, ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. ప్రకాశం జిల్లా పొనుగోడు, కొనకనమిట్ల, తిరుపతి జిల్లా మంగనెల్లూరులో 42.8, పల్నాడు జిల్లా కాకానిలో 42.7, బాపట్ల జిల్లా కొమ్మాలపాడులో 42, నెల్లూరు జిల్లా దగదర్తిలో 41.7, నంద్యాల జిల్లా బొల్లవరంలో 41.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గురువారం కోస్తా, రాయలసీమల్లో ఎక్కువచోట్ల వర్షాలు కురుస్తాయని, ఉత్తరకోస్తాలో అక్కడక్కడ ఈదురుగాలులు, పిడుగులతో భారీ వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలో మరో రెండు రోజులు భిన్నమైన వాతావరణం ఉంటుందని విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. మన్యం, శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లోని 35 మండలాల్లో వడగాడ్పులు ఉంటాయని తెలిపింది.

'మెట్రో' రుణ సంప్రదింపులు

విజయవాడ, విశాఖలకు 12 వేల కోట్లు

పలు బ్యాంకులు ఆసక్తి వ్యక్తీకరణ

ఏఐఐబీ బ్యాంకుతో ఏఎంఆర్‌సీ ఎండీ చర్చలు

అమరావతి, మే 14(ఆంధ్రజ్యోతి): విజయవాడ, విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్టులపై ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ వేగంగా అడుగులు వేస్తోంది. రెండు మెట్రో ప్రాజెక్టులకు ఇప్పటికే జనరల్ కన్సల్టెంట్ నియామకానికి టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. తాజాగా రుణ సమీకరణపై దృష్టి సారించింది. రెండు మెట్రోల నిర్మాణానికి రూ.12 వేల కోట్ల రుణం... విజయవాడ మెట్రో కోసం రూ.5,900 కోట్లు, విశాఖపట్నం మెట్రో కోసం రూ.6,100 కోట్లు అవసరమవుతుందని అంచనా. తక్కువ వడ్డీకి రుణాలు మంజూరు చేసే బ్యాంకులతో ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఎండీ రామకృష్ణారెడ్డి సంప్రదింపులు జరుపుతున్నారు. మంగళవారం సాయంత్రం బీజింగ్ కేంద్రంగా పనిచేస్తున్న ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) ప్రతినిధులు సంతోశ్, పాస్కల్ రసెల్‌తో విజయవాడలోని తన కార్యాలయంలో రామకృష్ణారెడ్డి సమావేశమయ్యారు. సమావేశానికి ముందు బ్యాంకు ప్రతినిధులు విజయవాడలోని ప్రతిపాదిత మెట్రో కారిడార్‌ల మార్గాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బస్‌స్టేషన్ నుంచి గన్నవరం వరకూ ఉన్న 26 కి.మీ కారిడార్‌ను, బస్టాండ్ నుంచి పెనమలూరు వరకు ఉన్న 12 కి.మీ కారిడార్‌ను పరిశీలించారు. కేఎఫ్‌డబ్ల్యూ బ్యాంక్, ఏఎఫ్‌డీ బ్యాంకు, జైకా బ్యాంకులతో పాటు ఏడీబీ, ఎన్‌డీబీ, ప్రపంచ బ్యాంకులు కూడా రుణం ఇచ్చేందుకు ముందుకొస్తున్నట్లు ఆయన తెలిపారు. వీటిలో తక్కువ వడ్డీ, మెట్రో ప్రాజెక్ట్ త్వరగా పూర్తయ్యేందుకు సహకరించే బ్యాంకులను గుర్తించిన తర్వాత చర్చలు జరపనున్నారు.



ఇటీవల విడుదల అయిన తన ప్రసంగాల సంకలనం 'నారేటివ్స్ ఆఫ్ ది బెంచ్ ఏ జడ్జ్ స్పీక్స్' పుస్తకాన్ని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు అందజేస్తున్న మాజీ సీజేఐ ఎన్వీ రమణ

ఏపీ ఓడరేవులను అభివృద్ధి చేయండి

- కేంద్ర మంత్రి సోనోవాల్‌కు రామ్మోహన్‌నాయుడు విజ్ఞప్తి



కేంద్రమంత్రి సోనోవాల్‌ను కలిసిన రామ్మోహన్

న్యూఢిల్లీ, మే14(ఆంధ్రజ్యోతి): ఏపీలోని ఓడరేవులు, షిప్పింగ్ హార్బర్లలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్‌కు కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు విజ్ఞప్తి చేశారు. బుధవారం కేంద్ర రవాణా శాఖ కార్యాలయంలో సోనోవాల్‌ను ఏపీ ప్రభుత్వ అధికారులతో కలిసి కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు కలిశారు. ఈ భేటీలో ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లాలో నౌకాశ్రయం, ఓడరేవు మౌలిక సదుపాయాల అభివృద్ధిపై చర్చించారు. లాజిస్టిక్స్ హబ్‌గా ఏపీని అభివృద్ధి చేయాలన్న దిశగా ఉప్పు భూములను గుర్తించి వాటిని సమర్థంగా వినియోగించాల్సిన అవసరం ఉందని సోనోవాల్ దృష్టికి తీసుకెళ్లారు. ఓడరేవుల అభివృద్ధి ద్వారా మెరైన్ ఇన్నోవేషన్‌కు ఏపీ కేంద్ర బిందువుగా మారేలా చర్యలు తీసుకోవాలని కోరామని మంత్రి తెలిపారు.

6జీతో ప్రపంచ లీడర్‌గా భారత్

- 2028 నాటికి అందుబాటులోకి నెట్‌వర్క్: పెమ్మసాని

న్యూఢిల్లీ, మే 14(ఆంధ్రజ్యోతి): సమాచార సాంకేతిక విప్లవంలో భారత్ భాగస్వామిగానే కాకుండా, 6జీతో ప్రపంచానికి నాయకత్వం కూడా వహించడానికి సిద్ధంగా ఉందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ సహాయ మంత్రి డా.పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. బుధవారం న్యూఢిల్లీలో జరిగిన 'భారత్ 6జీ 2025' మూడో అంతర్జాతీయ సదస్సు ప్రదర్శన కార్యక్రమానికి పెమ్మసాని ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొదటి 6జీ నెట్‌వర్క్ 2028 నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని, వాణిజ్య పరంగా 2030 నాటికి 6జీ అమలయ్యే అవకాశం ఉందని పెమ్మసాని తెలిపారు. గ్లోబల్ 6జీ నాయకత్వం కోసం ఇప్పటికే ప్రపంచస్థాయిలో పోటీ ఏర్పడిందన్నారు. ప్రపంచంలోనే దేశంలో తక్కువ ధరలో 5జీ డేటా లభిస్తోందని వివరించారు.

లోక్‌సభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ చైర్మన్‌గా బాలశౌరి

న్యూఢిల్లీ, మే 14(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ చైర్మన్‌గా జనసేన ఎంపీ బాలశౌరి నియమితులయ్యారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. మొత్తం 15మంది సభ్యులకు గానూ 13మందిని స్పీకర్ నామినేట్ చేయగా 2 ఖాళీలు ఉన్నాయి.

రేకుల ఇంట్లో లింగనిర్ధారణ పరీక్షలు

- ఒంటరిగా వెళ్లి పట్టుకున్న చిత్తూరు కలెక్టర్

చిత్తూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): ఓ చిన్న రేకుల ఇంట్లో వారానికి 50 మందికిపైగా గర్భిణులకు అక్రమంగా లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్న ముఠాను చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒంటరిగా వెళ్లి పట్టుకున్నారు. బుధవారం జరిగిన ఈ సంఘటనలో 11 మంది గర్భిణులు, ముగ్గురు మహిళా నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల తమిళనాడు వైద్యారోగ్య శాఖ అధికారులు 'మా ప్రాంతం నుంచి గర్భిణులు పెద్దఎత్తున మీ జిల్లాకు వచ్చి లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకుంటున్నారు' అని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు సమాచారమిచ్చారు. దీంతో ఆయన రెండు నెలలుగా దీనిపై నిఘా పెట్టారు. చిత్తూరు నగరంలోని భరత్‌నగర్ కాలనీలో ఓ చిన్న రేకుల ఇంట్లో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నారని పక్కా సమాచారం అందింది. దీంతో అక్కడికి ఒంటరిగా బయల్దేరిన కలెక్టర్.. ఈ విషయాన్ని ఎస్పీ మణికంఠకు తెలియజేశారు. దీంతో ఆయన రెగ్యులర్ పోలీసులను కాకుండా స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ అనిల్‌ను స్పాట్‌కు పంపించారు. కాసేపటికే ఆర్డీవో శ్రీనివాసులు కూడా అక్కడికి చేరుకున్నారు. సంఘటనా స్థలంలో పదకొండు మంది గర్భిణుల్ని, ముగ్గురు మహిళా నిర్వాహకుల్ని అదుపులోకి తీసుకోగా.. ప్రధాన నిందితుడు మాత్రం పరారయ్యాడు. అదుపులోకి తీసుకున్న వారిని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. ఈ రాకెట్ వెనుక పది మంది ఉన్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు.

టీచర్ల బదిలీలకు నేడు షెడ్యూల్?

అమరావతి, మే 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీలకు ప్రభుత్వం రంగం సిద్ధంచేసింది. తాజాగా బడుల పునర్వ్యవస్థీకరణ, పోస్టుల హేతుబద్ధీకరణపై జీవోలు విడుదల కావడంతో గురువారం బదిలీలపై జీవో ఇచ్చేందుకు పాఠశాల విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. గురువారం జీవో విడుదల చేస్తే శుక్రవారం నుంచే బదిలీల ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ షెడ్యూలు విడుదల చేయనుంది. కొత్తగా రూపొందించిన టీచర్ల బదిలీల చట్టం ఆధారంగా బదిలీలు జరగనున్నాయి. ప్రస్తుత పాఠశాలలో ఐదు విద్యా సంవత్సరాలు పూర్తిచేసుకున్న ప్రధానోపాధ్యాయులు, ఎనిమిది విద్యా సంవత్సరాలు పూర్తిచేసుకున్న ఉపాధ్యాయులు తప్పనిసరిగా బదిలీ అవుతారు. పాఠశాలలో రెండేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న టీచర్లు బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యా సంవత్సరాల లెక్కింపునకు మే 31ని కటాఫ్ తేదీగా నిర్ణయించారు.

గురుకులాల ప్రవేశ పరీక్షల ఫలితాలు విడుదల

అమరావతి, మే 14(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యా సంస్థల సొసైటీ అడ్మిషన్ల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్షల ఫలితాలను మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి లోకేశ్ బుధవారం విడుదల చేశారు. 5- 8 తరగతులు, ఇంటర్మీడియట్ ఫస్టియర్, డిగ్రీ ఫస్టియర్ అడ్మిషన్లకు నిర్వహించిన పరీక్షలకు 62,047 మంది హాజరయ్యారు. అందుబాటులో ఉన్న 7,190 సీట్లను ర్యాంకుల ఆధారంగా వారికి కేటాయిస్తారు. ఐదో తరగతిలో 3,920, ఆరో తరగతిలో 761, ఏడో తరగతిలో 442, ఎనిమిదో తరగతిలో 2,078, ఇంటర్ ఫస్టియర్‌లో 1,425, డిగ్రీ ఫస్టియర్‌లో 1,272 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

ఆధిపత్యపోరువల్లే వీరయ్య హత్య

- వివరాలు వెల్లడించిన ప్రకాశం ఎస్పీ దామోదర్

ఒంగోలు, మే 14 (ఆంధ్రజ్యోతి): ఆధిపత్య పోరులో భాగంగానే టీడీపీ నేత ముప్పవరపు వీరయ్యచౌదరి హత్య జరిగిందని ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. ఈ కేసులో మొత్తం 12మందిని నిందితులుగా గుర్తించి, వారిలో తొమ్మిది మందిని అరెస్టు చేశామని పేర్కొన్నారు. వీరయ్య చౌదరిని గత నెల 22న ఒంగోలులోని ఆయన కార్యాలయంలో దారుణంగా హత్య చేసిన విషయం విదితమే. ఈ కేసు వివరాలను ఎస్పీ దామోదర్ మీడియాకు వివరించారు. వీరయ్య స్వగ్రామమైన అమ్మనబ్రోలులో ఆయన ప్రత్యర్థి వర్గానికి చెందిన ఆళ్ల సాంబయ్య అలియాస్ సిద్ధాంతిని ఈ కేసులో ప్రధాన కుట్రదారుగా గుర్తించామని ఎస్పీ తెలిపారు. మొత్తం ఆపరేషన్‌ను ఒంగోలుకు చెందిన వినోద్ అనే ఇసుక వ్యాపారి నడిపించారన్నారు. ఇసుక వ్యాపారాన్ని వీరయ్యచౌదరి అడ్డుకున్నారనే కోపంతో ఉన్న వినోద్.. ఆయన హత్యకు ఆళ్ల సాంబయ్యతో కలిసి ప్రణాళిక రచించారని చెప్పారు. కాగా, మంత్రి లోకేశ్ వీరయ్యచౌదరి కుటుంబాన్ని గురువారం పరామర్శించనున్నారు.

జగన్ మనిషి బాలాజీ!

(మొదటి పేజీ తరువాయి)

అత్యంత సాన్నిహిత్యం ఉంది. ఈ క్రమంలోనే ఆయన లిక్కర్ స్కామ్‌లో ప్రధాన పాత్ర పోషించారు. లిక్కర్ సిండికేట్ తరఫున ముడుపులు తీసుకోవడంలో బాలాజీది కీలకంగా వ్యవహరించారు. లిక్కర్ స్కామ్ పథక రచనలో ముఖ్య పాత్ర పోషించారు" అని రిమాండ్ రిపోర్టులో సిట్ అధికారులు తెలిపారు. రాజ్ కసిరెడ్డి(ఏ1)తో బాలాజీ తరచూ కీలక విషయాలు చర్చించేవారని, ఆయన కార్యాలయానికి ఖాళీ కారుతో వచ్చి మద్యం కంపెనీల నుంచి వచ్చిన ముడుపుల డబ్బులను నింపుకొని వెళ్లేవారని వివరించింది. అలా కార్లలో తీసుకెళ్లిన కోట్లాది రూపాయలు షెల్ కంపెనీల్లోకీ, కర్ణాటకలో స్థిరాస్తి వ్యాపారాల్లోకీ మళ్లించారని తెలిపింది. కమీషన్లు వసూలుచేసి అసలైన లబ్ధిదారుకు ఇవ్వడమే కాకుండా బాలాజీ కూడా వ్యక్తిగతంగా భారీగా లబ్ధి పొందినట్లు వెల్లడించింది. గత ఐదేళ్లలో భారీగా స్థిరాస్తులు, విలాసవంతమైన భవనాలు, కార్లు కొనుగోలు చేశారని వెల్లడించింది.

సిండికేట్‌గా దోపిడీ...

"గత ప్రభుత్వంలో వైసీపీ పెద్దలు, ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు, మద్యం వ్యాపారస్తులు కలిసి రాష్ట్ర ఖజానాకు వేల కోట్ల రూపాయల నష్టం కలిగించారు. లిక్కర్ స్కామ్‌లో ప్రధాన కుట్రదారుడైన కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డికి బాలాజీ సన్నిహితంగా ఉండేవారు. పేరున్న లిక్కర్ బ్రాండ్లను అణచి వేయడం, ముడుపులు సమర్పించుకున్న ఊరూపేరూ లేని బ్రాండ్లను ప్రోత్సహించడంలో బాలాజీ కూడా కీలక భూమిక పోషించారు" అని సిట్ వెల్లడించింది. మద్యం కుంభకోణంలో ఆయన ప్రతి దశలోనూ చురుకైన పాత్ర పోషించారని రిమాండ్ రిపోర్టులో సిట్ అధికారులు తెలిపారు. కేసు దర్యాప్తులో భాగంగా ఇప్పటివరకూ 100 మందిని ప్రశ్నించామని, ప్రభుత్వ యంత్రాంగంలోని పలువురితో బాలాజీకి ఉన్న సంబంధాలు విచారణలో బయట పడ్డాయని సిట్ తెలిపింది. అందులో 25మందికి పైగా సాక్షుల వాంగ్మూలాల్లో బాలాజీ ప్రస్తావన వచ్చినట్లు పేర్కొంది. ఏపీఎస్‌బీసీఎల్, మద్యం ఉత్పత్తి, సరఫరాదారులకు మధ్య జరిగిన కీలక సమావేశాల్లో బాలాజీ పాల్గొన్నట్లు సిట్ తెలిపింది. స్కామ్ రూపకల్పనలో ప్రారంభ దశ నుంచి అంతిమ లబ్ధిదారుకు ముడుపులు చేర్చే దాకా బాలాజీ పాత్ర ఉన్నట్లు వివరించింది. ఆయన అధికార దుర్వినియోగం చేశారని, ఆయన చర్యలు దురుద్దేశాలతో కూడుకున్నాయని రిమాండ్ రిపోర్టులో సిట్ పేర్కొంది. మద్యం స్కామ్‌లో దర్యాప్తు మరింత లోతుగా సాగుతోందని, విచారణలో ఇవన్నీ కీలకం కానున్నందున బాలాజీ విదేశాలకు వెళ్లిపోయే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలిపింది. విచారణకు రమ్మని నోటీసు ఇచ్చినా ఖాతరు చేయకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారని, దానివల్ల ఆయనను అరెస్టు చేయక తప్పని పరిస్థితి ఎదురైందని కోర్టుకు స్పష్టం చేసింది. ఈ కుంభకోణంలో ఇతర నిందితులతో సంబంధాలు, ముడుపులు స్వీకరించిన పద్ధతులు, వాటి మళ్లింపు గురించి తెలియాల్సిన అవసరం ఉన్నందున ఆయనను కస్టడీకి ఇవ్వాలని కోర్టును అభ్యర్థించింది. గోవిందప్పకు కోర్టు ఈ నెల 20వ తేదీ వరకు రిమాండ్ విధించింది. అనంతరం ఆయనను విజయవాడ జైలుకు తరలించారు.



బాలాజీ గోవిందప్పను కోర్టులో హాజరుపరిచేందుకు తీసుకువెళుతున్న పోలీసులు

బినామీతో దందా!

- ధనుంజయ రెడ్డికి నీడలా శ్రీధర్
- వెంటపట్టుకు రావాలని 'సిట్' ఆదేశం

అమరావతి, మే 14 (ఆంధ్రజ్యోతి): తీగలాగితే... డొంక కదులుతుంది! అలాగే... శ్రీధర్ అనే వ్యక్తి నోరు తెరిస్తే, లిక్కర్ స్కామ్ నిందితుడు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ధనుంజయ రెడ్డి గుట్టు రట్టవుతుందని 'సిట్' భావిస్తోంది. అందుకే... గురువారం విచారణకు శ్రీధర్‌ను కూడా తీసుకురావాలని ధనుంజయ రెడ్డిని ఆదేశించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో... శ్రీధర్ ఎవరనే అంశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం... శ్రీధర్‌ది రాయచోటి సమీపంలోని ఒక గ్రామం. ఆయన కొన్నేళ్లుగా ధనుంజయ రెడ్డికి నీడలా, నమ్మిన బంటులా వ్యవహరిస్తున్నారు. ధనుంజయ రెడ్డి తనకు సంబంధించిన అనేక ఆస్తులకు శ్రీధర్‌నే బినామీగా పెట్టినట్లు తెలుస్తోంది. రియల్ ఎస్టేట్, ఇతర వ్యాపారాలూ ఆయన పేరుతోనే నడిపిస్తున్నట్లు సమాచారం. తాడేపల్లి ప్యాలెస్‌తోపాటు సచివాలయానికి స్వేచ్ఛగా రాకపోకలు సాగించేంత చనువు ఉన్నట్లు తెలిసింది.

ఈ నరకం భరించలేను.. కాపాడండి!

- బతుకుదెరువు కోసం సౌదీ వెళ్లిన యువకుడికి చిత్రహింసలు
- తమ బిడ్డను ఇంటికి చేర్చాలని వృద్ధ దంపతుల వేడుకోలు



షేక్ నజీర్

కలువాయి, మే 14(ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం సౌదీఅరేబియాకు వెళ్లిన యువకుడు అక్కడి యజమాని చేతిలో చిత్రహింసలకు గురవుతున్నారు. నెల్లూరు జిల్లా కలువాయి మండలం కుల్లూరు గ్రామానికి చెందిన షేక్ కాలేషా, బీబీ దంపతుల కుమారుడు షేక్ నజీర్ 7వ తరగతి వరకు చదువుకుని స్థానికంగా కూలి పనులు చేసేవారు. ఓ ఏజెంట్ మాటలు నమ్మి గతేడాది డిసెంబరులో రూ.2లక్షలు ఖర్చు చేసి సౌదీకి వెళ్లారు. అయితే, ఏజెంట్ చెప్పినట్లు తోటలలో పని కాకుండా పెద్దపెద్ద చెట్లు ఎక్కడం, కొమ్మలు నరకడం వంటి పనులు చేయమంటున్నారు. 'చెట్లు ఎక్కడం నాకు రాదు. ఎక్కకుంటే మా యజమాని అదే చెట్టుకు కట్టేసి చిత్రహింసలు పెడుతున్నాడు. ఓసారి చెటు ఎక్కి కింద పడ్డాను. దెబ్బలు తగిలినా డాక్టర్‌కు చూపించలేదు. యజమాని జీతం ఇవ్వట్లేదు. స్వదేశానికి పంపించండి సార్ అంటే రూంలో వేసి కొడుతున్నాడు. ఇక ఈ నరకం భరించలేను. దయచేసి నన్ను కాపాడండి సార్'.. అంటూ కన్నీటి పర్యంతమవుతూ రికార్డు చేసిన వీడియోను నజీర్ తల్లిదండ్రులకు పంపించారు. ఈ వీడియో చూసిన తల్లిదండ్రులు... ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తమ బిడ్డను కాపాడి ఇంటికి చేర్చాలని వేడుకుంటున్నారు.

వ్యక్తిగత కారణాలతోనే వెళ్లలేదు

- గవర్నర్ నుంచి ముందస్తు అనుమతి: లవ్ అగర్వాల్

న్యూఢిల్లీ, మే 14(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ పర్యటనకు వచ్చిన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు విమానాశ్రయంలో ప్రొటోకాల్ ప్రకారం ఆహ్వానం పలికేందుకు తాను వ్యక్తిగత కారణాలతో వెళ్లలేకపోయానని ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్(ఆర్‌సీ) లవ్ అగర్వాల్ పేర్కొన్నారు. గవర్నర్‌కు ఈ విషయం తెలిపి, ముందస్తుగా అనుమతి తీసుకున్నట్లు వెల్లడించారు. గవర్నర్‌కు ఎయిర్‌పోర్టులో ఆహ్వానం పలకకుండా అవమానించారని వస్తున్న ఆరోపణలపై 'ఆంధ్రజ్యోతి' లవ్ అగర్వాల్‌ను సంప్రదించింది. ఆయన స్పందిస్తూ.. ఢిల్లీకి వచ్చిన గవర్నర్ నజీర్‌ను ఏపీ భవన్‌లోని గవర్నర్ గెస్ట్‌హౌస్‌లో మంగళవారం కలిశానని తెలిపారు. ఆహ్వానం పలకడానికి తాను రాలేకపోవడానికి గల కారణాలను గవర్నర్‌కు వివరించినట్టు చెప్పారు. కాగా ఏపీ భవన్‌లోని ఆక్రమణలను తొలగించి ప్రభుత్వ భూమిని కాపాడేందుకు కృషి చేస్తున్న కమిషనర్ పట్ల ఆక్రమణదారులకు కొమ్ముకాసే కొందరు కుట్రకు పాల్పడుతూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని భవన్‌లో చర్చ జరుగుతోంది.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, కె.ఆర్.సూర్యనారాయణ

5న ఉద్యోగుల సంఘం కౌన్సిల్ సమావేశం

- పోస్టర్ ఆవిష్కరించిన సీఎస్ విజయానంద్
- వైసీపీ ప్రభుత్వంలో సమస్యలు పరిష్కరించలేదు: సూర్యనారాయణ

విజయవాడ (వన్‌టౌన్), మే 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కౌన్సిల్ సమావేశం జూన్ 5వ తేదీన విజయవాడలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ తెలిపారు. సుమారు 10 వేల మంది ప్రతినిధులతో ఈ సమావేశాన్ని నిర్వహిస్తామని చెప్పారు. కౌన్సిల్ సమావేశానికి హాజరు కావాలని.. సంఘానికి చీఫ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా ఉన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ను ఆయన చాంబర్‌లో బుధవారం పలువురు నాయకులతో కలిసి సమావేశం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు సంబంధించిన 15 అంశాలపై నివేదికను విజయానంద్‌కు అందచేసి, ఉద్యోగుల సమస్యలను వివరించారు. జూన్ 5వ తేదీన జరిగే సమావేశానికి తప్పనిసరిగా రావాలని కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఉద్యోగులకు సంబంధించి పలు సమస్యల పరిష్కారానికి హామీలు ఇవ్వటంతో ఆనాడు పలు సంఘాల నాయకులు ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారని, అయితే ఆ సమస్యలు పరిష్కారం కాలేదని గుర్తు చేశారు. ఓ సంఘం నాయకులు ప్రభుత్వం మారగానే రంగులు మార్చినట్టు సంఘాలు మారారని విమర్శించారు. 2023లో ఉద్యోగుల బకాయిలపై తాము గవర్నర్‌ను కలిస్తే కొన్ని సంఘాల నాయకులు విమర్శించారని తెలిపారు. ఇటీవల శాసనసభలో ఉద్యోగులకు బకాయిలు రూ.25 వేల కోట్లు ఉన్నట్టు ప్రకటించారని, ఆనాడు తాను చెప్పిందే నిజమైందన్నారు. వేతన సవరణ కమిషన్‌కు సిట్టింగ్ లేదా రిటైర్డ్ న్యాయమూర్తి నేతృత్వంలో 12 పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలన్నారు. రూ.20 వేల కోట్లకు పైగా ఉన్న పెండింగ్ పీఆర్సీ, డీఏ, ఎస్ఎల్ఎస్ఏపీజీఎల్ఐ బకాయిల చెల్లింపునకు కాలపరిమితితో కూడిన రూట్ మ్యాప్‌లు విడుదల చేయాలన్నారు. సీపీఎస్, జీపీఎస్ రద్దు, ఓపీఎస్ పునరుద్ధరణకు ఉద్యోగ సంఘాలతో చర్చలు జరపటానికి చర్యలు తీసుకోవాలని కోరారు. వాణిజ్య పన్నుల శాఖలో అధికార దుర్వినియోగానికి పాల్పడిన 80 మంది ఉద్యోగులపై తాను న్యాయ పోరాటం చేస్తున్నానని తెలిపారు.

మార్కెట్ యార్డులకు పాలకవర్గాల నియామకం

అమరావతి, మే 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులకు చైర్మన్లను నామినేట్ చేసిన ప్రభుత్వం... తాజాగా పూర్తి స్థాయి పాలకవర్గాల నియామకానికి చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా బుధవారం ఏలూరు, దెందులూరు, ఉంగుటూరు యార్డులకు కమిటీలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీలో స్థానిక ఎమ్మెల్యేను గౌరవ చైర్మన్‌గా నియమించింది. చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు రిజర్వేషన్ ప్రకారం 13 మంది సభ్యులు, నలుగురు అధికారులు... మొత్తం 20 మందితో కమిటీలను నియమించింది.

ఆక్వా అధ్యయన కమిటీ సభ్యుడిగా 'గద్దె'

రాష్ట్రంలో ఆక్వా రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను అధ్యయనం చేయడానికి ప్రభుత్వం నియమించిన సలహా కమిటీలో ఆక్వా రంగంలో నైపుణ్యం కలిగిన అమెరికాలోని విచిగాన్‌కు చెందిన గద్దె క్రాంతి కుమార్‌ను సభ్యుడిగా చేరుస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

మేయర్, మున్సిపల్ చైర్మన్‌లపై వేటు

- మాచర్ల మున్సిపల్ చైర్మన్ కిశోర్, కడప మేయర్ సురేశ్‌బాబులకు ఉద్వాసన
- వైసీపీకి భారీ షాక్... ఇద్దరూ ఆ పార్టీ నేతలే



మాజీ సీఎం జగన్, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లితో తురకా కిశోర్(ఫైల్)



కె.సురేశ్‌బాబు

అమరావతి/మాచర్ల టౌన్, మే 14(ఆంధ్రజ్యోతి): అవినీతి, అధికార దుర్వినియోగానికి పాల్పడిన వైసీపీ నేతలు, కడప మేయర్ కె.సురేశ్ బాబు, మాచర్ల మున్సిపల్ చైర్మన్ తురకా కిశోర్‌లను ఆయా పదవుల నుంచి తొలగిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కడప మేయర్‌గా ఉన్న కె.సురేశ్‌బాబు తన కుటుంబ సభ్యులకు చెందిన కాంట్రాక్టు సంస్థ ద్వారా కార్పొరేషన్ పరిధిలో పనులు చేపట్టి అవినీతికి పాల్పడ్డారని ప్రభుత్వం గుర్తించింది. ఈ క్రమంలో మేయర్ పదవి నుంచి ఆయనను తొలగిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 'వర్ధిని కన్‌స్ట్రక్షన్' పేరుతో కడప కార్పొరేషన్‌లో పలు పనులు మేయర్ చేపట్టారని, ఈ పనుల్లో అవకతవకలు ఉన్నాయని ఆరోపిస్తూ ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి విజిలెన్స్‌కు ఫిర్యాదు చేశారు. పదవిలో ఉన్న వ్యక్తులు, వారి కుటుంబ సభ్యుల పేరిట స్థానిక సంస్థల్లో పనులు చేపడితే అనర్హత వేటు పడుతుందని తెలిసినా కార్పొరేషన్‌లో పనులు చేపట్టారని ఎమ్మెల్యే మాధవి ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే మేయర్ సురేశ్‌బాబుపై అన్ని కోణాల్లోనూ విచారణ జరిపిన ప్రభుత్వం అవినీతికి పాల్పడ్డారని గుర్తించి ఆయనను పదవి నుంచి తొలగించింది.

మున్సిపల్ చైర్మన్ పదవి నుంచి తురకా తొలగింపు

పల్నాడు జిల్లా మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రధాన అనుచరుడు మాచర్ల మున్సిపల్ చైర్మన్ తురకా కిశోర్‌ను ఆ పదవి నుంచి తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం నిర్ణయం తీసుకుంది. మున్సిపల్ చైర్మన్ పదవిని తురకా కిశోర్ దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై ప్రభుత్వం విచారణ జరిపింది. మున్సిపల్ చట్టంలోని సెక్షన్ 60(1) ఉల్లంఘించారని నిర్ధారించారు. అంతేకాకుండా అనుమతి లేకుండా వరుసగా 15 కౌన్సిల్ సమావేశాలకు గైర్హాజరయ్యారు. తురకా కిశోర్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అండ చూసుకొని ఎన్నో నేరాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. 2022లో డిసెంబరు 16న మాచర్లలోని టీడీపీ కార్యాలయాన్ని తగలబెట్టిన కేసులో తురకా కిశోర్‌తోపాటు అతడి సోదరుడు శ్రీకాంత్‌పై కేసులు నమోదయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. పిన్నెల్లి సోదరుల అండదండలు చూసుకొని తురకా కిశోర్, శ్రీకాంత్‌లు విచ్చలవిడిగా రెచ్చిపోయారు. 2022 డిసెంబరు 16న ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అప్పటి టీడీపీ మాచర్ల ఇన్‌చార్జి, ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న జూలకంటి బ్రహ్మానందరెడ్డిపై వారు హత్యాయత్నంకు ఒడిగట్టారు. పోలింగ్ మరుసటి రోజు కారంపూడిలో సీఐ నారాయణస్వామిపై దాడి, పోలింగ్ రోజు బూత్‌ల వద్ద టీడీపీ నేతలపై దాడితోపాటు, గత స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో పరిశీలకులుగా మాచర్ల నియోజకవర్గ పర్యటనకు వచ్చిన టీడీపీ సీనియర్ నేత బుద్దా వెంకన్న, బొండా ఉమ, న్యాయవాదిలపై దాడి చేసి తురకా కిశోర్ హత్యాయత్నంకు తెగబడ్డారు. తురకా బ్రదర్స్‌పై దాదాపు 10 కేసులు దాకా నమోదయ్యాయి. ఎన్నికల్లో టీడీపీ విజయంతో తురకా సోదరులు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఏడు నెలలపాటు గాలించి హైదరాబాద్‌లో పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. ప్రస్తుతం పీడీ యాక్టు అమలు కావడంతో తురకా కిశోర్ రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

తురకా కిశోర్ గ్యాంగ్‌పై హత్యాయత్నం కేసు

మాచర్లటౌన్, మే 14(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా మాచర్ల మాజీ మున్సిపల్ చైర్మన్ తురకా కిశోర్, అతని అనుచరులపై పట్టణ పోలీస్ స్టేషన్లో హత్యాయత్నం కేసు నమోదైంది. తమ ఇంటి స్థలాన్ని తురకా కిశోర్, అతని అనుచరులు కబ్జా చేశారని టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో మంత్రులకు పట్టణానికి చెందిన చల్లా శివకుమార్ ఫిర్యాదు చేశారు. పట్టణంలోని తన కుమార్తెకు ఇచ్చిన ఇంటిని ఆక్రమించుకుని కూల్చివేసి, అడ్డుకున్న తమపై దాడి చేసి చంపుతామని బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు మాచర్ల పట్టణ పోలీసులు తురకా కిశోర్‌తోపాటు మరో ఐదుగురిపై ఐపీసీ 109, 290, 307, 327, 34, 386, 427, 447 సెక్షన్లు, నాలుగు ఏపీఎల్‌జీప సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

22న కలెక్టరేట్ల వద్ద ఆర్టీసీ ఎన్ఎంయూఏ ఆందోళనలు

విజయవాడ (బస్‌స్టేషన్), మే 14(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 22న రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్ల వద్ద ఆర్టీసీ ఉద్యోగులు ఆందోళన చేసి వినతి పత్రాలు సమర్పించనున్నట్టు ప్రజా రవాణ సంస్థ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయుఏ) బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఎన్ఎంయుఏ రాష్ట్ర కార్యవర్గ సమావేశం బుధవారం జరిగింది. ఎన్ఎంయుఏ సెంట్రల్ కమిటీ ఆమోదించిన తీర్మానం మేరకు ఈ నెల 22వ తేదీన ఆర్టీసీ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా కలెక్టర్ల దృష్టికి తీసుకువస్తామని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.రమణారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆర్టీసీ ఎండీకి లేఖ అందజేశారు. కాగా.. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎన్ఎంయుఏ ఆధ్వర్యంలో ఉద్యోగులు చలో డీపీటీఓ పేరిట రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో బుధవారం ధర్నాలు నిర్వహించారు. ఆర్టీసీ యాజమాన్యం సమస్యలను పరిష్కరించకపోతే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని, దీంతోపాటు తాము సమ్మెకు వెళ్లేందుకు కూడా సిద్ధమని రమణారెడ్డి తెలిపారు.

చీరాల మున్సిపాలిటీ టీడీపీ కైవసం

- చైర్మన్ జంజనంపై అవిశ్వాస తీర్మానం
- చక్రం తిప్పిన ఎమ్మెల్యే కొండయ్య
- ఎక్స్ అఫిషియో ఓట్లతో 27కు చేరిన బలం
- ఫలించని వైసీపీ క్యాంపు రాజకీయం



కౌన్సిలర్లతో ఎమ్మెల్యే కొండయ్య, ఎంపీ కృష్ణ ప్రసాద్

చీరాల, మే 14(ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా చీరాల మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావుపై అవిశ్వాసం తీర్మానంలో టీడీపీ నెగ్గింది. ఈ నేపథ్యంలో తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. వైసీపీ నేతలు రంగంలోకి దిగి క్యాంపు రాజకీయానికి తెరలేపినా ప్రయోజనం దక్కలేదు. ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య కీలక సమయంలో వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ఒకవైపు ఎంపీ కృష్ణప్రసాద్‌ను, మరోవైపు ఆమంచి కృష్ణమోహన్ వర్గం కౌన్సిలర్లను, టీడీపీ కౌన్సిలర్లను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగారు. దీంతో మంగళవారం మధ్యాహ్నం నుంచే పొలిటికల్ హీట్ పెరిగింది. 1/3 బల నిరూపణలో విజయం సాధించేందుకు చైర్మన్ జంజనం పలు ఎత్తులు వేశారు. అయితే, ఎత్తుకు పైఎత్తులు వేస్తూ 2/3 వంతు మద్దతే లక్ష్యంగా బరిలోకి దిగిన ఎమ్మెల్యే ఎట్టకేలకు వైసీపీ శిబిరంలో ఉన్న నలుగురిని అనూహ్యంగా తమవైపు తిప్పుకొన్నారు. ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే కొండయ్య ఓట్లతోపాటు ఆమంచి వర్గం ఐదుగురు కౌన్సిలర్లతో కలుపుకొని 26 ఓట్లతో అవిశ్వాసంలో నెగ్గారు. అలాగే వైస్ చైర్మన్ బొనిగల జైనస్‌బాబుకు 27 మంది కౌన్సిలర్లు అవిశ్వాసం తెలిపారు. ఈ క్రమంలో ప్రిసైడింగ్ అధికారి, ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు టీడీపీ శిబిరం విజయం దక్కించుకున్నట్టు ప్రకటించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం సమీపంలో పెద్దఎత్తున బాణసంచా కాల్చి టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. బుధవారం జరిగిన పరిణామాలను అధికారులు ఎలక్షన్ కమిషనర్‌కు వివరించి మరో పది రోజుల్లో చైర్మన్ ఎంపిక కోసం సమావేశం నిర్వహించనున్నారు.

కుర్చీ వదలక, పార్టీ విడువక!

చీరాల మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు చివరివరకు కుర్చీ వదలలేదు. ఒకవైపు టీడీపీతోనే ప్రయాణమంటూ, మరోవైపు పరోక్షంగా ఎమ్మెల్యేకు ఎదురు నిలిచారు. బుధవారం ఉదయం వరకు మెజార్టీ కోసం ప్రయాసలు పడ్డారు. కౌన్సిల్ సమావేశానికి ముందు మీడియాతో మాట్లాడుతూ.. చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. అనంతరం, అవిశ్వాస ప్రక్రియ ముగిసే వరకు తన చాంబర్‌లోనే ఉండిపోయారు.

చీరాలకు పారదర్శక సేవలు: ఎంపీ, ఎమ్మెల్యే

గత ప్రభుత్వంలో చీరాల మున్సిపాలిటీలో అవినీతి పేరుకు పోయిందని, ఇకపై అభివృద్ధికి దోహదపడే అభ్యర్థిని చైర్మన్‌గా నియమించనున్నట్టు ఎమ్మెల్యే కొండయ్య, ఎంపీ కృష్ణప్రసాద్ అన్నారు. చీరాల ప్రజలకు పారదర్శక సేవలు అందించి అర్హులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

నేడు ఏకకాలంలో 339 అభివృద్ధి పనులకు శ్రీకారం

- ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరురూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయ చిత్రపటంలో నెల్లూరు రూరల్‌లో గురువారం చరిత్ర సృష్టించబోతున్నామని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం నెల్లూరులోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన మాటప్రకారం కేవలం 60 రోజుల్లో చేపట్టిన రూ.41.32 కోట్లు విలువ చేసే 339 అభివృద్ధి పనులను గురువారం ఉదయం 9 గంటలకు ఏకకాలంలో ప్రారంభించబోతున్నట్టు వెల్లడించారు. కల్లూరిపల్లి హౌసింగ్‌బోర్డు కాలనీలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్రతో పాటు తాను పాల్గొంటానని చెప్పారు.

ఆ ముగ్గురూ బీజేపీ భక్తులే: సీపీఐ నారాయణ

తిరుపతి, మే 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు టీడీపీ, జనసేన, వైసీపీ అధినేతలు.. బీజేపీకి వంతపాడే భక్తులేనని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆరోపించారు. వారి పార్టీలు, జెండాలు, గుర్తులు వేరైనా బీజేపీ చెప్పింది చేస్తారన్నారు. తిరుపతిలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీని ఎక్కడికక్కడ ఎండగట్టడానికి రాబోయే ఎన్నికల నాటికి ప్రగతిశీల శక్తులతో కలసి రాష్ట్రంలో రాజకీయ ప్రత్యామ్నాయ వేదికను సిద్ధం చేస్తామని ప్రకటించారు. శాంతి చర్చలకు నక్సల్స్ సంసిద్ధత వ్యక్తం చేసినా చర్చలు జరపకుండా, ఈ ఏడాది చివరినాటికి వారిని అంతమొందిస్తామని కేంద్ర హోం మంత్రి ప్రకటించడంపై నారాయణ మండిపడ్డారు. దేశంలో యుద్ధం వద్దు, ఉగ్రమూకలను ఏరివేయాలన్నందుకు, నన్ను పాకిస్తాన్‌కు పంపాలన్న బీజేపీ ఎంపీ విజయ్‌షాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'శ్రీనివాస గోవిందా' పాట తొలగించకుంటే రూ.100 కోట్లకు పరువు నష్టం కేసు వేస్తా

- 'డీడీ నెక్స్ లెవల్' చిత్ర బృందానికి టీటీడీ సభ్యుడి లీగల్ నోటీసులు

తిరుమల, మే 14(ఆంధ్రజ్యోతి): హిందువులు ఎంతో భక్తితో ఆలపించే 'శ్రీనివాస గోవిందా' అనే పాటను వక్రీకరిస్తూ 'డీడీ నెక్స్ లెవల్' తమిళ చిత్రంలో రీమిక్స్ చేసి వినియోగించడంపై టీటీడీ సభ్యుడు, బీజేపీ నేత భానుప్రకాశ్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా చిత్రీకరించిన ఈ పాటను తొలగించాలని, లేదంటే రూ.వంద కోట్లకు పరువునష్టం కేసు వేయడంతో పాటు క్రిమినల్ కేసులు పెట్టాల్సి వస్తుందని ఆ చిత్ర హీరో సంతానం, నిర్మాతలకు బుధవారం నోటీసులు పంపించారు. మత సంప్రదాయాలను అవమానించేలా పాట వాడినందుకు క్షమాపణ చెప్పాలని కోరారు. ఆ పాటను సోషల్ మీడియా, సినిమా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు రేషన్‌కార్డులు ఇవ్వాలి

- ముఖ్యమంత్రికి సీపీఐ రామకృష్ణ లేఖ

అమరావతి, మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ శాఖలు, పలు విభాగాల్లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రేషన్ కార్డులు మంజూరుకు చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు బుధవారం ఆయన లేఖ రాశారు. చాలీచాలని జీతాలతో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పిల్లల చదువులు, ఆరోగ్య సమస్యలతో కుటుంబ పోషణ పెను భారంగా మారిందని తెలిపారు. అయినప్పటికీ వీరిని ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించడం వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదని వివరించారు. ప్రస్తుతం కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించినందున ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు.

దర్శి నగర పంచాయతీ అప్‌గ్రేడేషన్

అమరావతి, మే 14(ఆంధ్రజ్యోతి): దర్శి, జమ్మలమడుగు నగర పంచాయతీలను అప్‌గ్రేడ్ చేస్తూ మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దర్శి నగర పంచాయతీని సెకండ్ గ్రేడ్ మున్సిపాలిటీ గాను, జమ్మలమడుగు నగర పంచాయతీని థర్డ్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ వేరు వేరు ఉత్తర్వులు జారీ చేశారు.

పాలీసెట్‌లో 95.36% ఉత్తీర్ణత

- 19 మందికి వంద శాతం మార్కులు
- అల్లూరి జిల్లా టాప్.. అనంతపురం లాస్ట్

అమరావతి, మే 14(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాలకు సాంకేతిక విద్యాశాఖ నిర్వహించిన పాలీసెట్-2025 ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి లోకేశ్ ఎక్స్ ద్వారా ఫలితాలు ప్రకటించారు. ఏప్రిల్ 30న నిర్వహించిన పాలీసెట్‌కు 1,39,840 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారిలో 1,33,358 (95.36శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికల ఉత్తీర్ణత 96.9శాతం, బాలుర ఉత్తీర్ణత 94.38శాతం నమోదైంది. జిల్లాల వారీగా అల్లూరి సీతారామరాజు జిల్లా 98.66 శాతంతో అగ్రస్థానంలో ఉంది. 93.11శాతం ఉత్తీర్ణతతో అనంతపురం జిల్లా చివరన నిలిచింది. 19 మంది విద్యార్థులు 120కి 120 మార్కులు సాధించారు. కాగా, విశాఖపట్నం జిల్లాలో అత్యధికంగా 12,365 మంది పరీక్ష రాశారు.

టాపర్లు వీరే..

నూరు శాతం మార్కులు సాధించిన 19 మందిలో ఎక్కువగా ఉభయగోదావరి జిల్లాల విద్యార్థులున్నారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన బడ్డి శశివెంకట్, ఎం.చంద్రహర్ష, డబ్ల్యూ.వరుణ్‌తేజ్, ఎ.నిరంజన్ సాయిరాం, బి.రిషితశ్రీ స్వప్న, ఆర్.చాహ్నా, వై.హేమచంద్ర కుమార్, ఎం.ఉమా దుర్గా శ్రీనిధి, పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన బి.శ్రీకర్, వేల్పూరి ప్రవళిక, కె.కృష్ణ ప్రణయ్, పాల రోహిత్, యు.చక్రవర్తుల సిరి దీపిక, పి.నితీష్, ఎ.యశ్వంత్ పవన్ సాయిరాం, విశాఖ జిల్లాకు చెందిన బాలిసేని కల్యాణ్‌రామ్, చింతాడ చౌహాన్, సీహెచ్.ఖాద్రీష్(ప్రకాశం), కె.అభిజిత్(కాకినాడ) నూరుశాతం మార్కులతో టాపర్లుగా నిలిచారు.

తొమ్మిదేళ్లలో ఇదే అత్యధికం

2017 నుంచి పాలీసెట్ గణాంకాలు పరిశీలిస్తే ఈ ఏడాది అత్యధిక ఉత్తీర్ణత శాతం నమోదైంది. 2017లో 78.2శాతం, 2018లో 80.19శాతం, 2019లో 84.33శాతం, 2020లో 84.85శాతం, 2021లో 94.2శాతం, 2022లో 91.84శాతం, 2023లో 86.35శాతం, 2024లో 87.61శాతం ఉత్తీర్ణత నమోదైంది.

నాలుగు రోజులుగా వాయిదాలే..

పాలీసెట్ ఫలితాల విడుదలలో గందరగోళం నెలకొనడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు అసహనం వ్యక్తంచేశారు. ఫలితాల విడుదల తేదీని సాంకేతిక విద్యాశాఖ పలు మార్లు మార్చింది. గత నాలుగు రోజుల నుంచి 'ఈరోజే' అన్నట్టు సంకేతాలు రావడంతో విద్యార్థులు ఎదురుచూస్తూ వచ్చారు.

ఏపీ నిట్‌కు మళ్లీ ఇన్‌చార్జే దిక్కు

- ఇన్‌చార్జి డైరెక్టర్‌గా రమణారావుకు మరో 6 నెలల పొడిగింపు
- రెగ్యులర్ డైరెక్టర్ లేక పాలనాపరమైన సమస్యలతో కుదేలు



తాడేపల్లిగూడెం అర్బన్, మే 13(ఆంధ్రజ్యోతి): ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎన్‌వీ రమణారావును కేంద్ర ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగించింది. దీంతో రెగ్యులర్ డైరెక్టర్ నియామకం మళ్లీ వాయిదా పడినట్టేనని తేటతెల్లమైంది. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఉన్న ఏపీ నిట్‌కు రెగ్యులర్ డైరెక్టర్ లేకపోవడంతో పాలనాపరమైన సమస్యలు ఎదురవుతున్నాయి. ఇన్‌చార్జి డైరెక్టర్ మూడు నెలలకోసారి కూడా ఏపీ నిట్‌ను సందర్శించడం లేదు. మరోవైపు బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ కూడా ఏర్పాటు కాలేదు. చైర్మన్‌నూ నియమించలేదు. ఇవన్నీ ఏపీ నిట్ అభివృద్ధికి అవరోధంగా మారుతున్నాయి. ఇప్పటికే విద్యార్థుల సంఖ్య 750 నుంచి 480కి పడిపోయింది. వచ్చే ఏడాది కూడా 480 సీట్లకే అడ్మిషన్ కల్పించనున్నారు. దీని వల్ల రాష్ట్రంలోని విద్యార్థులకు అన్యాయం జరుగుతోంది. మొత్తం సీట్లలో 50 శాతం రాష్ట్ర విద్యార్థులకు కేటాయిస్తారు. సీట్ల కుదింపు వల్ల 270 మంది విద్యార్థులకు ఏపీ నిట్‌లో అవకాశం లేకుండా పోతోంది. అందులో 135 మంది రాష్ట్ర విద్యార్థులకు అన్యాయం జరుగుతోంది. ఫ్యాకల్టీ నియామకం, కొత్త హాస్టల్ నిర్మాణం చేపడితేనే 750 సీట్లకు పెంచనున్నట్లు నిట్ అధికారులు చెబుతున్నారు. హాస్టల్స్ ఇతర భవన నిర్మాణాల కోసం రూ.450 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. ఇప్పటికీ అవి మంజూరు కాలేదు. కేంద్ర స్థాయిలో ప్రయత్నాలు చేయాలంటే రెగ్యులర్ డైరెక్టర్ ఉండాలి. గతంలో డైరెక్టర్‌ను మధ్యలో తొలగించడంతో కొత్తవారు రావడానికి ఆసక్తి చూపడం లేదని చెబుతున్నారు. విద్యార్థులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. రెగ్యులర్ డైరెక్టర్ లేక ప్లేస్‌మెంట్స్ కూడా తగ్గిపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. గత రెండేళ్లలో ప్లేస్‌మెంట్స్ తగ్గుముఖం పట్టాయి. ప్రముఖ బహుళ జాతి సంస్థలు కూడా రావడం లేదు. నిట్ డైరెక్టర్ ఉంటేనే ప్లేస్‌మెంట్ ఇచ్చే సంస్థలు కూడా వస్తాయి. ఒక దశలో అభివృద్ధి పరంగా దూసుకుపోయిన ఏపీ నిట్ సంస్థ.. డైరెక్టర్ లేకపోవడంతో చతికిలపడుతోంది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

విరాట్ లేని క్రికెట్

ఆటలో విజయమే తప్ప రాజీపడని పోరాట యోధుడిగా పేరు గాంచిన క్రికెట్ కింగ్ విరాట్ కోహ్లీ తన టెస్టు ప్రస్థానానికి ముగింపు పలికాడు. ఇది క్రికెట్ అభిమానులకు ఒకింత బాధను కలిగించొచ్చు. మొన్నటికి మొన్న టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ క్రికెట్‌లో సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలకడం అందరినీ ఆశ్చర్య పరిచింది. ఇంతలోనే విరాట్ కూడా సంప్రదాయ క్రికెట్ నుంచి వైదొలగడం భారత క్రికెట్‌కు అతిపెద్ద లోటే. కానీ, ఎంత గొప్ప ఆటగాడైనా ఏదో ఒకరోజు తప్పుకోక తప్పదు. ప్రతి ప్రయాణానికీ ముగింపు ఉంటుందనేలా... కోహ్లీ కూడా తన సుదీర్ఘ కెరీర్‌కు గుడ్‌బై చెప్పేశాడు. అయితే, ఈ గొప్ప ఆటగాడి మజిలీలో ఎన్నో మలుపులు, మైలురాళ్లు, మరెన్నో అద్భుతాలను క్రికెట్ ప్రపంచం ఆస్వాదించగలగడం ఇక్కడ చెప్పుకోదగ్గ విశేషం.

కొందరు ఆటతో పేరు తెచ్చుకుంటారు, మరికొందరు ఆ ఆటకే వన్నె తెస్తారు. రెండో కోవలోకి వస్తాడు విరాట్ కోహ్లీ. సాధారణంగా ఓ క్రికెటర్‌కు ఒక ఫార్మాట్‌లో గొప్ప రికార్డు ఉంటుంది. కానీ, మూడు ఫార్మాట్లలోనూ ప్రతిభ చూపడం కోహ్లీకే చెల్లింది. టీ20, వన్డేలు, టెస్టుల్లో అద్భుతమైన ప్రదర్శనతో క్రికెట్‌లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. అద్వితీయమైన ఆటతో, మొక్కవోని పట్టుదలతో క్రికెట్ ప్రేమికులను మంత్రముగ్ధులను చేశాడు. ఎన్నో మెగా టోర్నమెంట్లలో ఒంటిచేత్తో ప్రత్యర్థులను అడ్డుకొని అపురూప మైన విజయాలను అందించాడు. మరీ ముఖ్యంగా ఛేదనలో ఒక్కొక్క బ్యాటర్ చేతులెత్తేస్తుంటే, ప్రత్యర్థి బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో కట్టి పడేస్తుంటే, అభిమానుల ఆశలు మోస్తూ చివరిదాకా మైదానంలో నిలిచిన సందర్భాలు అతని కెరీర్‌లో అనేకం. ధనాధన్ షాట్లతో, వేగంగా పరుగులు రాబట్టగలిగే పరిమిత ఓవర్ల ఆటకే పరిమితమవుతున్న నేటితరం క్రికెట్‌లో... మెరుపు వేగంతో దూసుకొచ్చే ఎరుపు బంతులను కళాత్మక షాట్లతో బౌండ్రీకి తరలిస్తూ ఐదురోజుల ఆటను మరింత జనరంజకంగా మలచిన ఘనత కోహ్లీది. శారీరకంగానే గాకుండా మానసిక పరీక్షగా నిలిచే 'టెస్టు' క్రికెట్‌లో అత్యంత విజయవంతమైన ఆటగాడిగా నిలిచిన తీరు సర్వదా ప్రశంసనీయం. పద్నాలుగేళ్ల క్రితం వెస్టిండీస్ పర్యటనతో మొదలైన అతని టెస్టు ప్రస్థానం, ఒక్కో మెట్టు ఎక్కుతూ దినదిన ప్రవర్ధమానమైంది. 123 టెస్టులాడిన అతను 210 ఇన్నింగ్స్‌ల్లో 9,230 పరుగులు సాధించాడు. 30 శతకాలు, 31 అర్ధ శతకాలతో అలరించాడు. ఓ వైపు పరుగుల మోత మోగిస్తూనే, నాయకుడిగానూ తనకు తిరుగులేదని చాటుకున్నాడు. కెప్టెన్ హోదాలో 68 టెస్టుల్లో 40 విజయాలు జట్టుకు కట్టబెట్టాడు. ఆస్ట్రేలియా గడ్డపై చరిత్రాత్మక సిరీస్ విజయాన్ని అందించాడు. ఏకంగా 42 నెలలపాటు టీమిండియాను టెస్టుల్లో నెంబర్‌వన్ ర్యాంకుతో అగ్రపీఠాన నిలబెట్టాడు. టెస్టుల్లో అత్యంత విజయవంత మైన భారత సారథిగా ఖ్యాతి గడించాడు. స్వదేశం, విదేశం అన్న తేడా లేకుండా అన్ని పిచ్‌లపైనా రాణించగలగడం విరాట్ ప్రత్యేకత. విదేశాల్లో భారత జట్టు టెస్టు మ్యాచ్‌లను డ్రా చేసుకుంటే చాలు అన్న దశ నుంచి ప్రత్యర్థిని వాళ్ల గడ్డపైనే చిత్తు చేసే స్థాయికి తీసుకొచ్చిన గొప్ప సారథి అతను. భారత క్రికెట్‌లో చెరగని ముద్ర వేసిన ధోనీ వారసత్వాన్ని నిలబెట్టిన నిఖార్సయిన నాయకుడు. తనకే సాధ్యమైన ఆటతో ప్రపంచ క్రికెట్‌లో 'విరాట విప్లవం' తీసుకొచ్చిన దిగ్గజ ఆటగాడు. విరాట్ కోహ్లీ ఆటతోనే గాకుండా, సత్ప్రవర్తన, అభిరుచులలో కూడా ఉన్నతంగా నిలుస్తాడు. కఠినమైన శ్రమతో, ఉక్కు సంకల్పంతో వృత్తి జీవితాన్ని చక్కగా మలుచుకొన్న విరాట్ నుంచి ఈ తరం యువత ఎంతో నేర్చుకోవచ్చు.

విరాట్ తరహాలోనే రోహిత్ శర్మ కూడా భారత జట్టుకు లభించిన అరుదైన ఆణిముత్యం. పరిమిత ఓవర్ల ఆటలో ఎన్నో అద్భుత ప్రదర్శనలతో అలరించిన రోహిత్, టెస్టుల పరంగా అంతగా ఆకట్టు కోలేకపోయిన మాట వాస్తవం. కానీ, కోహ్లీ నుంచి నాయకత్వ బాధ్యతలు స్వీకరించాక, జట్టును అత్యున్నత స్థాయిలో చూపిన అగ్రగణ్యుడిగా రోహిత్ కీర్తి గడించాడు. గతేడాది భారత జట్టు టీ20 ప్రపంచకప్ గెలిచిన వెంటనే పొట్టి ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన కోహ్లీ, రోహిత్‌ల ఆట ఇక వన్డేలకు పరిమితం. ఈ ఇద్దరి అనూహ్య నిష్క్రమణతో ఇప్పుడు టెస్టులకు కొత్త సారథిని నియమించడం అనివార్యమైంది. వీళ్ల వారసత్వాన్ని కొనసాగించగల సత్తా ఉన్న ఆటగాళ్లను అన్వేషించే పనిలో భారత బోర్డు ఉంది.

కాల్పుల విరమణ సరైన వ్యూహమేనా?

ఆపరేషన్ సిందూర్‌కు ముందు, తర్వాత జరిగిన అంతర్జాతీయ పరిణామాలు, ఇదే సమయంలో దేశీయంగా గత కొన్నాళ్లుగా నక్సలిజంపై కేంద్రం అనుస రిస్తున్న అణచివేత ధోరణి గమనించిన విశ్లేషకులకు మోదీ ప్రభుత్వ ద్వంద్వ వైఖరి అర్థమవుతుంది. సాగేచోట ఆధిపత్యం చెలాయించడం, సాగనిచోట రాజీకి రావడం... ఈ పద్ధతి ఎంతవరకు సమంజసం? ఇక్కడ ఇంట మావోయిస్టుల మీద అప్రతి హతంగా గెలుస్తూ, అక్కడ ఉగ్రవాదం విషయంలో అర్ధాంతర కాల్పుల విరమణకు సిద్ధపడటం భారత ప్రభుత్వ ద్విముఖ విధానాన్ని చాటుతున్నది.

పహల్గామ్ ఉగ్రహింస తర్వాత పాకిస్థాన్‌పై వరుస దాడులతో సమర్థంగా విరుచుకుపడి, వెంటనే ఆకస్మిక అమెరికా జోక్యంతో కాల్పుల విరమణకు అంగీక రించడం వల్ల, మన దేశం టెర్రరిజంపై బేషరతు ఆధిపత్యాన్ని సాధించే అవకాశాన్ని కోల్పోయిందని వస్తున్న విమర్శ అర్థరహితమైనదేమీ కాదు. 'ఆపరేషన్ సిందూర్' పాకిస్థాన్ సైనిక వ్యవస్థను పతనం అంచుకు తీసుకువచ్చింది. అలాంటి స్థితిలో, వ్యూహాత్మకంగా ప్రశ్నార్థకమైన నిర్ణయంతో, భారతదేశం కాల్పుల విరమణకు అంగీకరించింది.



కాల్పుల విరమణ కారణంగా పాకిస్థాన్ తన దుష్ట సిద్ధాంతాల్ని విరమించుకుంటుందని ఆశించడం అమాయకత్వం మాత్రమే కాదు, ప్రమాదకరం కూడా. ఇటువంటి వ్యూహాల వల్ల పాకిస్థాన్ సైన్యం ఉగ్రవాదంపై ఆధారపడటాన్ని కొనసాగిస్తూనే ఉంటుంది. గొప్ప శక్తులు స్నేహధర్మాన్ని అనుసరించి కాదు, స్వీయ ప్రయోజనాలను అనుసరించి వ్యవహరిస్తాయని భారతదేశం ఇప్పటికైనా గుర్తించాలి.

పాకిస్థాన్ సైన్యం పాటించే అసమాన యుద్ధ సిద్ధాంతంపై నిర్ణ యాత్మకమైన నష్టాన్ని కలగజేసే అరుదైన అవకాశాన్ని ఈ కాల్పుల విరమణ ద్వారా కోల్పోయామని, ఇది వ్యూహాత్మక తప్పిదమని కొందరు విశ్లే షకులు భావిస్తున్నారు. ఇరవయ్యవ శతాబ్దం చివరి నుంచి పాకిస్థాన్ సైన్యం కాపాడుతూ వచ్చిన ఉగ్రవాద సైద్ధాంతిక స్థావరాన్ని శాశ్వతంగా నిర్వీర్యం చేయడానికి ఇదొక మంచి అవకాశం అయ్యేది. దేశం లోపల నక్సలిజంపై చూపిస్తున్న కర్కశ, నిర్దయాత్మక విధానం అంతర్జాతీయ స్థాయిలో ఏమైంది? ఎవరి ఒత్తిడికి లేదా ఏ భీతికి గురై ప్రధానమంత్రి మోదీ ఈ రకమైన వెనకడుగు వేశారు? మొన్నటి వరకూ టెర్రరిజాన్ని కూకటివేళ్లతో పెళ్లగిస్తామని శపథాలకు పోయిన పట్టుదల "ఇది యుద్ధాల యుగం కాదు" అనే నీతివాక్యాల స్థాయికి ఎలా దిగజారింది? అగ్ర రాజ్యం అమెరికా జోక్యంతో భారత దేశం తాత్కాలిక ప్రశాంతతను పొంది ఉండవచ్చు, కానీ అందుకు బదులు దీర్ఘకాలిక వ్యూహాత్మక లాభాన్ని త్యాగం చేసింది. అలా చేయడం ద్వారా జిహాదిస్టు భావ జాలంతో బలపడుతున్న విరోధికి కొత్త ప్రాణం పోసింది.

భారతదేశానికి వ్యతిరేకంగా పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ఉపయోగించుకోవడానికి మూలాలు 1980ల చివరలో, 1990ల ప్రారంభంలో జనరల్ జియా-ఉల్-హక్ ఆధ్వర్యంలో స్థాపితమైన సైనిక సిద్ధాంతంలో ఉన్నాయి. భారత సైన్యం అఖండమైన సాంప్రదాయిక ఆధిపత్యాన్ని చవిచూసిన పాకిస్థాన్ చేసేదేం లేక అసమాన యుద్ధ వ్యూహాన్ని ఎంచుకుంది. మతపరమైన తీవ్రవాదాన్ని ఆయుధంగా చేసుకుని, కశ్మీర్‌లో "స్వాతంత్ర్య సమరయోధుల" ముసుగులో ఉగ్రవాద గ్రూపులను పెంచింది. దీనిని "వెయ్యి కోతలతో భారతదేశాన్ని రక్తసిక్తం చేయడం" అనే వ్యూహంగా పిలుస్తారు. దీన్ని పాటిస్తూ ఆ దేశం భారతదేశ పౌర, సైనిక సంస్థలపై నిరంతర నష్టాన్ని కలగజేసింది.

ఈ చారిత్రక నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకున్నప్పుడు 'ఆపరేషన్ సిందూర్' తర్వాత భారత ప్రభుత్వం కాల్పుల విరమణకు అంగీకరించడం సమస్యాత్మక నిర్ణయమని అర్థమవుతుంది. ఆపరేషన్ సిందూర్ జంట ఆపరేషన్లు కీలకమైన సైనిక స్థావరాలను ధ్వంసం చేశాయని, నియంత్రణ రేఖ వెంబడి ఉన్న ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశాయని, పాకిస్థాన్ సంప్రదాయ సామర్థ్యాలను గణనీయంగా దెబ్బతీశాయని నివేదికలు చెబుతున్నాయి. పాకిస్థాన్ సైన్యంలో నైతిక స్థైర్యం సన్నగిల్లిపోయింది. ప్రజల అసంతృప్తి వీధుల్లోకి వ్యాపించింది. ఆ దేశ అంతర్గత లోపాలు విస్తరించడం మొదలైంది (ముఖ్యంగా బలూచిస్తాన్, ఖైబర్ పఖ్తుంఖ్వాలో). వ్యూహాత్మక ఆధిపత్యం చెలాయించే ఈ తరుణంలో కాల్పుల విరమణ ఉదారతను గానీ, సంయమనాన్ని గానీ సూచించదు. ఉగ్రవాదాన్ని నిరోధించేందుకు సంవత్సరాల ప్రయత్నాలను ఈ నిర్ణయం దెబ్బతీసింది. ప్రత్యర్థి మళ్లీ ధైర్యం పుంజుకునేట్టు చేసింది.

దేశాలు పైచేయి సాధించిన తర్వాత ఆ బలంతో దీర్ఘకాలిక శాంతిని పొందిన ఉదాహరణలు చరిత్ర నిండా ఎన్నో ఉన్నాయి. కానీ ఈ సందర్భంలో భారతదేశం ఇందుకు భిన్నంగా వ్యవహరించింది. కాల్పుల విరమణ కారణంగా పాకిస్థాన్ తన దుష్ట సిద్ధాంతాల్ని విరమించుకుంటుందని ఆశించడం అమాయకత్వం మాత్రమే కాదు, ప్రమాదకరం కూడా. ఇటువంటి వ్యూహాల వల్ల పాకిస్థాన్ సైన్యం ఉగ్రవాదంపై ఆధారపడటాన్ని కొనసాగిస్తూనే ఉంటుంది. గొప్ప శక్తులు స్నేహధర్మాన్ని అనుస రించి కాదు, స్వీయ ప్రయోజనాలను అనుసరించి వ్యవహరిస్తాయని భారతదేశం ఇప్పటికైనా గుర్తించాలి. బాహ్య ఒప్పందాలకు లోబడి జాతీయ ప్రయోజనాలను త్యజించే ఏ విదేశాంగ విధానమైనా దీర్ఘకాలికంగా వ్యతిరేక ఫలితాలను ఇస్తుంది. జాతీయ భద్రతకు ఆటంకం కలిగించే అంశాల విషయంలో న్యూఢిల్లీ తన వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తిని నొక్కి చెప్పడం నేర్చుకోవాలి.

• దోర్బల బాలశేఖరశర్మ

అందాల పోటీలు, అనేక సవాళ్లు!

హైదరాబాద్‌లో జరుగుతున్న మిస్ వరల్డ్ పోటీలు, అధికారుల్లో అత్యుత్సాహాన్ని, ఆలోచనాపరుల్లో కొంత కలవరాన్ని కలిగిస్తున్నాయి. ఈ పోటీలకు పెద్ద ఖర్చు పెట్టడం లేదనీ, పైగా దీని ద్వారా తెలంగాణాలో టూరిజం పెరుగుతుందని ప్రభుత్వం అంటోంది. డబ్బు తక్కువైన రాష్ట్ర ప్రభుత్వాలు విదేశీ పెట్టుబడులని ఆహ్వానించటానికి పడే తంటాల్లో ఇదీ ఒకటని అర్థం చేసుకుందాం అనుకున్నా, అంతకుమించి గత ప్రభుత్వం చేయలేనిది తామేదో కొత్తది చేసి, తామెంత గొప్ప వాళ్ళమో నిరూపించుకోవాలన్న కోరికే ఇక్కడ ఎక్కువ కనిపిస్తోంది. మిస్ వరల్డ్ నిర్వాహకులు దీనివల్ల ఆడ వాళ్ళలో 'స్ఫూర్తి' పెరుగుతుందని ప్రకటించారు. కానీ, ఈ కార్యక్రమం ప్రధానంగా మగవాళ్ళలోనే ఎక్కువ స్ఫూర్తిని నింపుతోందని మీడియా రిపోర్టులు చూస్తే తెలుస్తుంది.

దక్షిణాది రాష్ట్రాల్లో మానవ అభివృద్ధి సూచికలో, ముఖ్యంగా చదువు, ఆరోగ్యంలో వెనకబడి, అన్ని రకాల హింసనీ ఎక్కువగా ఎదుర్కొంటున్న సాధారణ తెలంగాణ మహిళలకి, రాజకీయాలు, ఉద్యోగాలు, పరిశ్రమల్లో వాటా లేనట్లే ఈ ప్రపంచ సుందరి పోటీలని టీవీలలో చూడటం తప్ప ఏమీ దొరకదు. వాళ్ళకేమీ సౌందర్య పిపాస తక్కువ లేదు. ఉన్నంతలో మంచిగా తయారవుతారు. చీరల రంగులు, జాకెట్ల డిజైన్లు, మ్యాచింగ్ నగల విషయంలో అన్ని సమూహాల స్త్రీలకీ, తమ స్తోమతని బట్టి కావాల్సినంత ఆసక్తి ఉంది. అదే లేకుంటే ఇన్ని రకాల దుకాణాలు, ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లు, గల్లీ చివర మగ్గం వర్క్ షాపులు పెరిగేవి కాదు. ఈ గల్లీ ఫ్యాషన్ ప్రపంచంలో భర్తలు, మగవాళ్ల కంటే, తోటి ఆడవాళ్ళ ప్రశంసలే ప్రధానం.

తెలుగు సినిమాలు ఆడవాళ్లకి ఉండాల్సిన ప్రధాన గుణం అందం అనీ, వాళ్ళు కేవలం మగవాళ్ళ కోసమే అందంగా తయారవుతారనీ దశాబ్దాలుగా అందర్నీ నమ్మించటానికి ప్రయత్నిస్తున్నాయి. 20వ శతాబ్దం మధ్యలో చదువులు, ఉద్యోగాల కోసం పరదా నుంచి బయటకొచ్చిన ఆధిపత్య కుల స్త్రీలకి ఆధునిక సంస్కృతి తొడిగిన కొత్త పరదాల్లో ఒకటి అందం. చీర, దాన్నుండి కనీ కనిపించకుండా అతి సన్నటి నడుము, పెద్ద జడ, బొట్టు ఉండే స్త్రీ శరీర రూపాన్ని తెలుగు సౌందర్యానికి ప్రతీకగా చేసిన బాపు బొమ్మ కొన్ని తరాల ఊహల్ని నిర్దే శించింది. ఓల్గా రాజకీయ కథలు, స్త్రీవాద కవిత్వం స్త్రీల జీవితాలని ఇటువంటి ఊహలు ఎంత బలంగా నియం త్రిస్తాయో వివరంగా విశ్లేషించినప్పటికీ, వాటి ప్రభావం చదువుకుని ఆలోచించే ప్రజలకే పరిమితమైంది. తెలుగు సినిమాల్లో హీరోయిన్ల పాత్రలు, కొద్ది మినహాయింపులతో, స్త్రీలు = అందం అనే మూసలోనే బందీగా ఉండిపోయాయి. హీరోయిన్ల శరీర కొలతల గురించి బహిరంగంగా మాట్లాడటం, 'మిల్కీ బ్యూటీ', 'అందాలు ఆరబోయటం', 'నడిచొచ్చిన అందం' అంటూ వర్ణించటం ఇప్పటికీ తెలుగు సినిమా పరిశ్రమ రోజువారీ పదజాలంలో భాగం.



ముప్పై ఏళ్ల ప్రపంచీకరణ తర్వాత, బ్యూటీ పార్లర్లు ప్రతి గల్లీలో పుట్టుకొచ్చి, అనేకమంది యువతుల జీవితాల్లో సౌందర్య ఉత్పత్తులు భాగమైపోయి, అందం పరిశ్రమగా మారిపోయిన తర్వాత ఈ అందాల పోటీలని నిర్వహించి ప్రభుత్వం కొత్తగా ఏం సాధించాలని అనుకుంటోంది? ఫ్యాషన్ పరిశ్రమలోకి వెళ్లే ఆడవాళ్ళని మినహాయిస్తే, ఈ అందం నమూనాలలో ఇమడ లేని అత్యధిక శాతం అమ్మాయిల మానసిక సంఘర్షణ గురించి మన వ్యవస్థలో అసలేమైనా అవగాహన ఉందా?

ఇలా ఆడవాళ్ళని అందమైన శరీరాలుగా మాత్రమే చూసే భావన 1990లో జరిగిన ప్రపంచీకరణ తర్వాత వస్తు ప్రధాన సంస్కృతిలో బాగా ఊపందుకుంది. 1990 లలోనే సుస్మితా సేన్, ఐశ్వర్యరాయ్ ప్రపంచ సుందరీ మణులు అయ్యారు. గత ఇరవయ్యేళ్ళల్లో వస్తువుల ఉత్పత్తితో పాటు వాటిని అమ్ముకోవటానికి స్త్రీల అందం ఒక ప్రధాన వనరుగా మారింది. ఈ సంస్కృతిలో అందమనే భావన కూడా రూపాంతరం చెందింది. అప్పటి వరకూ పుట్టుకతో వచ్చిన శరీర సౌందర్యం కొంతమంది ఆడవాళ్ళకి పెళ్లి కోసం పనికొచ్చేది. అందాన్ని ఆడవా ళ్ళందరికీ తప్పకుండా ఉండాల్సిన గుణాల్లో ఒకటిగా మార్చింది మార్కెట్. అందానికి ఒక కొత్త మూసని తయారు చేసింది. శరీరంపై ఒక్క వెంట్రుక లేకుండా, గీసిన కనుబొమలు, నల్లటి జుట్టు, సన్న ముక్కు, తెల్లటి చర్మం, ఎర్రని పెదవులు కలిగి ఉండటం దీనిలో భాగం. అత్యధిక శాతం భారతీయ స్త్రీలు దీనిలో ఇమడరు. చక్కగా కనిపించాలనే వారి సహజమైన కోరికని మార్కెట్ సంస్కృతి వాళ్ళ బలహీనతగా రూపుదిద్దింది. మా ఉత్పత్తులు వాడితే మీరు అందంగా తయారవుతారు అంటూ ఊదరగొట్టింది. అంతే కాదు, అందంగా ఉంటేనే సంతోషం, ఉద్యోగం, కెరీర్ అన్నీ సాధ్యమవుతాయనే సరికొత్త సక్సెస్ నమూనాని సమాజంలో ప్రవేశపెట్టింది. ఈ క్రమంలో అందాల పోటీలు ప్రపంచ స్థాయి నుండి సాధారణ కాలేజీ ఫెస్టివల్‌లో భాగంగా మారితే; చర్మ సౌందర్య ఉత్పత్తులు, మేకప్ సామాగ్రి అనేకమంది విద్యార్థులు, ఉద్యోగినుల నెలవారీ సామాన్లలో భాగ మయ్యాయి. తెల్ల జుట్టు ఉండే ఆడవాళ్లు సినిమాలు, సీరియళ్లలోనే కాదు, నిజ జీవితంలో కూడా కనిపించటం మానేశారు. మార్కెట్ సంస్కృతిని తీవ్రంగా విమర్శించే వాళ్ళు కూడా దీని నుంచి బయట పడలేనంత లోతుగా ఈ సౌందర్య భావజాల ప్రభావం వ్యాపించింది. ఈ నిర్దేశిత సౌందర్య నమూనా నుండి పక్కకి జరిగితే చాలు, దాన్నొక జీవిత వైఫల్యంగా చూడటం మొదలైంది.

అయితే, సౌందర్య భావజాలం కేవలం శరీరం బయట ఆగిపోదు, లోపలికి ఇంకుతుంది. అది ఆడవాళ్ల అంతరంగిక చూపులో భాగంగా మారి, వాళ్ళు తమని తాము అంచనా వేసుకునే తీరునీ, ఆత్మవిశ్వాసాన్నీ ప్రభావితం చేస్తుంది. ఈ ప్రభావం టీనేజీ అమ్మాయిలు, యువతులలో తీవ్రంగా కనిపిస్తుంది. ఈ సౌందర్య మూసల్లో ఇమడటానికి అమ్మాయిలు తిండి మానెయ్యటంతో వారిలో అనేక శారీరక రుగ్మతలు పెరుగుతున్నాయి. ఇంటర్నెట్ పుణ్యమాని నగరాలకి పరి మితమైన ఈ రుగ్మతలు అన్ని చోట్లకీ పాకాయి. ముప్పై ఏళ్ల ప్రపంచీకరణ తర్వాత, బ్యూటీ పార్లర్లు ప్రతి గల్లీలో పుట్టుకొచ్చి, అనేకమంది యువతుల జీవితాల్లో సౌందర్య ఉత్పత్తులు భాగమైపోయి, అందం పరిశ్రమగా మారి పోయిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం ఈ పోటీలని నిర్వహించి కొత్తగా ఏం సాధించాలని అనుకుంటోంది? దీనితో పాటు ఒక సమాజంగా మనం ఇప్పుడు వేరే ప్రశ్నలు కూడా అడగాలి. ఫ్యాషన్ పరిశ్రమలోకి వెళ్లే ఆడవాళ్ళని మినహాయిస్తే, ఈ అందం నమూనాలలో ఇమడలేని అత్యధిక శాతం అమ్మాయిల మానసిక సంఘర్షణ గురించి మన వ్యవస్థలో అసలేమైనా అవగాహన ఉందా? ప్రభుత్వం గానీ, ఇతర విద్యా సంస్థలు గానీ దీని గురించి అధ్యయనాలు చేశాయా? చదువు, ఉద్యోగాలతో వచ్చే ఆత్మవిశ్వాసాన్ని ఈ సౌందర్య నమూనాలు ఏ విధంగా దెబ్బతీస్తున్నాయి?

ఈ విమర్శ మార్కెట్ నుంచి బయటపడి, అందంగా కనిపించాలనే ఆశని, చక్కగా తయారవ్వాలనే కోరికని వదిలేసుకొమ్మని, ఇతరులిచ్చే కాంప్లిమెంట్లని ఆస్వాదించ రాదని చెప్పదు. అలంకరణలో స్త్రీల వ్యక్తిగత ఇష్టాలు, నిర్ణయాధికారం ఉంటాయి. కానీ వారి నియంత్రణలో లేని మార్కెట్ పెద్దది, అక్కడ స్వయం నిర్ణయాధికారం తక్కువ. మార్కెట్ ఆడవాళ్ళకిచ్చే 'చాయిస్' ఎటువంటిది? బట్టలు, చెప్పులు, హెయిర్ క్లిప్పులు చవకగా అందించటం సరే, మన వేడి వాతావరణానికి సరిపడే సౌకర్యవంత మైన బట్టలు దొరుకుతున్నాయా? ఆడవాళ్ళ చెప్పులు గట్టిగా నడిస్తే తెగిపోయేటట్లు ఎందుకు తయారు చేస్తున్నారు? సల్వార్‌లకి జేబులు ఎందుకుండవు? అత్యధిక శాతం వాడే చర్మ సౌందర్య ఉత్పత్తులకి ప్రభుత్వ నియంత్రణ ఉందా? వివిధ వయసుల ఆడవాళ్ల ఆరోగ్యంపై వీటి ప్రభావం ఏంటి? ఇవి కేవలం ఆడవాళ్లే కాదు, ఈ మధ్య ఫ్యాషన్ ప్రపంచంలోకి వచ్చిన మగవాళ్ళ గురించి కూడా వెయ్యాలి. వాళ్ళు వేసుకుంటున్న బిగుతు జీన్స్ వాడుతున్న హెయిర్ జెల్స్ శరీరంపై ఎటువంటి ప్రభావాన్ని చూపిస్తాయి?

ఈ వ్యవస్థీకృత సౌందర్య నమూనా మనుషులకి తమతో, ఇతరులతో ఏర్పడే సంబంధాలని ప్రభావితం చేసి, జీవితంలో వచ్చే ఒత్తిళ్లకి తోడయినప్పుడు దాని గురించి లోతుగా ఆలోచించాలి. మా ఆవిడ ఎప్పుడూ దుప్పటి లాంటి నైటీ వేసుకు తిరుగుతుంది అంటూ ఇంట్లో పని చేసేటప్పుడు కూడా అందంగా ఉండాలని ఆశించే భర్తలు, నేను అందంగా లేను కాబట్టే నాకు స్నేహితులు లేరు అని ఆత్మవిశ్వాసం దెబ్బతిన్న టీనేజీ పిల్లల కుంగుబాటు, ఉద్యోగినులు 'స్మార్ట్'గా తయారైతేనే ప్రమోషన్లు ఇచ్చే బాసులు, అమ్మాయిలు వ్యాక్సింగ్ చేసుకోకుంటే డేటింగ్ కష్టం అని నమ్మే యువతీ యువకులు – ఈ పరిణామాలన్నీ అందం ఒక సామాజిక సమస్యగా తయారయిందని తెలియచేస్తున్నాయి. వ్యక్తిగతంగా సంతోషం కలిగించే స్థాయి నుంచి మనల్ని నియంత్రించే పనిముట్టుగా తయారయిన సౌందర్య పిపాసని మళ్ళా మన నియంత్రణలోకి ఎలా తెచ్చుకోవా లన్నది ఇప్పుడు మన ముందున్న సవాలు!

◆ ఎ. సునీత

'రాజధాని మార్పు' నాటకాలకు తెర!

రాష్ట్రం విడిపోయాక అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం అమరావతి రాజధాని అని అంటే, 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం మూడు ముక్కలాట ఆడి గందరగోళానికి తెరలేపింది. దీంతో విడిపోయి పదకొండేళ్లయినా రాజధాని లేని రాష్ట్రంగా ఏపీ అనేక విమర్శలు ఎదుర్కొంది. ఇప్పుడు అమరావతినే ఆంధ్రప్రదేశ్‌కు ఏకైక, శాశ్వత రాజధానిగా ఉండేలా రాష్ట్ర విభజన చట్టాన్ని సవరించాలని కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ తీర్మానం చేసింది. కేంద్రం ఈ దిశగా చర్యలు తీసుకుంటే రాష్ట్రానికి అమరావతి చట్టబద్ధమైన రాజధానిగా ఆవిర్భవిస్తుంది. విభజన చట్టం-2014లోని సెక్షన్-5, సబ్‌సెక్షన్-2లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు హైదరాబాద్ పదేళ్ల పాటు ఉమ్మడి రాజధానిగా ఉంటుందని, ఆ తర్వాత తెలంగాణకు హైదరాబాద్ రాజధానిగా ఉంటుందని, ఏపీకి కొత్త రాజధాని ఏర్పాటవుతుందని చెప్పారు. కానీ, ఆ రాజధాని పేరు మాత్రం చెప్పలేదు. దీంతో కేంద్రం కొత్త రాజధాని అమరావతి అని చెప్తూ ఆ సెక్షన్‌ను సవరిస్తే అమరావతి చట్టబద్ధమవుతుందనీ, దీంతో రాజధాని మార్పు నాటకాలకు తెరపడుతుందని కూటమి ప్రభుత్వం భావిస్తోంది.

ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఏపీసీఆర్డీఏ) చట్టంలోని సెక్షన్ 3 ప్రకారం, రాష్ట్రం ఒక నోటిఫికేషన్ జారీ చేస్తూ ఏ ప్రాంతాన్నైనా రాజధానిగా ప్రకటించవచ్చు. అంతేకాదు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 162 ప్రకారం, రాజధానిని నిర్ణయించే అధికారం రాష్ట్రానికే ఉంది. అందువల్ల, కేంద్రం ప్రమేయం అవసరమా? అన్న ప్రశ్న లేకపోలేదు. కానీ, కూటమి ప్రభుత్వం ఇలా వ్యవహరించ డానికి ముఖ్య కారణం– గత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న మూడు రాజధానుల నిర్ణయమే. 2022లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మూడు రాజధానుల ఆలోచనను తిరస్కరించి, అమరావతినే నిర్ధారించినా వైసీపీ ప్రభుత్వం కొనసాగినంత కాలం రాజధానిపై గందరగోళమే నెలకొన్నది. దీనిని దృష్టిలో ఉంచుకుని రాజధాని విషయంలో గందరగోళానికి శాశ్వతంగా చెక్ పెట్టాలని కూటమి ప్రభుత్వం భావిస్తున్నది.

ఇప్పటికే ప్రపంచ బ్యాంక్, ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్ నుంచి తీసుకొచ్చిన 13వేల కోట్ల రూపాయిలకు పైగా నిధులతో అమరావతి పునర్ నిర్మాణం మళ్లీ ఊపందుకుంది. ఈ పెట్టుబడులు సురక్షితంగా ఉండాలంటే, రాజధాని విషయంలో స్థిరత్వం అత్యంత ప్రధానం. కేంద్ర చట్టంలో అమరావతిని రాజధానిగా గుర్తిస్తే, పెట్టుబడిదారులకు, ప్రజలకు ఇది శాశ్వత రాజధాని అనే నమ్మకం కలిగి, అభివృద్ధికి దారులు పడతాయి. అమరావతి కోసం 2015లో 33 వేల ఎకరాల సారవంతమైన భూమిని ల్యాండ్ పూలింగ్ పథకం కింద రైతులు ఇచ్చారు. 2022లో హైకోర్టు తీర్పు, ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వ నిర్ణయం వాళ్లకు ఊరట కలిగించాయి. కేంద్ర చట్టంతో అమరావతిని శాశ్వతం చేయాలనే రాష్ట్రం ఆలోచన వాళ్ల త్యాగాన్ని కాపాడాలనే సంకల్పాన్ని చూపిస్తోంది.

– చిత్తర్వు రఘు, అడ్వకేట్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ-మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

ఎదుగూబొదుగూ లేని వ్యవసాయ విశ్వవిద్యాలయం

తెలుగు రాష్ట్రాల్లో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పడి 60 ఏళ్ళు పూర్తి అయింది. ఈ తరుణంలో వ్యవసాయ విశ్వవిద్యాలయానికి సంబంధించిన కొన్ని అంశాలను ప్రస్తావించాల్సిన అవసరముంది. 1945లో వ్యవసాయ కళాశాలను స్థాపించాలని అప్పటి ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. ఈ సంస్థను తమిళ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కోరుతూ, అందుకు అవసరమైన భూమిని ఇస్తామని తమిళులు ముందుకొచ్చారు. ఆ సమయంలో గుంటూరు జిల్లా బోర్డు అధ్యక్షుడుగా ఉన్న పాములపాటి వెంకట కృష్ణయ్య నాయుడు బాపట్లలోని జిల్లా బోర్డు హై స్కూల్‌లో పది ఎకరాల స్థలాన్ని విడగొట్టి యూనివర్సిటీకి కేటాయించారు. దానితో పాటు పక్కనే మాచవరం గ్రామంలోని తన వంద ఎకరాల భూమిని కళాశాల కోసం ఏడాదికి కౌలుకు ఇచ్చారు. (1940లో కృత్తివెంటి పేరరాజు పంతులు కోనసీమలోని రామచంద్రాపురంలో తన వంద ఎకరాలను ఈ కళాశాల ఏర్పాటు కోసం బ్రిటిషు వారికి దానంగా ఇచ్చారు.) దీంతో 1945లో బాపట్లలో వ్యవసాయ కళాశాల ఏర్పడింది. దశల వారీగా అక్కడ వ్యవసాయ, ఇంజనీరింగ్, హోమ్‌సైన్స్ కళాశాలలు ఏర్పాటయ్యాయి. దీంతో పాటు పొన్నూరులో తమలపాకు పరిశోధనా కేంద్రం ఏర్పడింది.

తరువాత బాపట్లలో ఆర్ట్స్, ఇంజనీరింగ్ కళాశాలలను స్థాపించారు. అక్కడ విద్యనభ్యసించిన ఎందరో ఉన్నత శిఖరాలను అధిరోహించారు. జాతీయ స్థాయిలో అనేక వ్యవసాయ విశ్వవిద్యాలయాలకు ఉప కులపతులుగా, పరిశోధనా కేంద్రాల్లో అగ్రగణ్యులుగా అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు పొందారు. వారిలో అజయ్ కల్లామ్ ఐఏఎస్‌గా, మాలకొండయ్య ఐపీఎస్‌గా, మరి కొందరు ఐఆర్ఎస్, ఐఎఫ్ఎస్ వంటి సివిల్ సర్వీసెస్‌కు ఎంపికయ్యారు. ఈ కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ చింతల గోవిందరాజులు నాబార్డు ఛైర్మన్‌గా జాతీయ స్థాయిలో సేవలు అందించారు.

ఆంధ్రప్రదేశ్ (ఉమ్మడి) వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని 1964 జూన్ 12న హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో రెండువేల ఎకరాల్లో స్థాపించారు. ఈ ప్రాంగణంలోనే జాతీయ గ్రామీణాభివృద్ధి కేంద్రం, MANAGE, NAARM, జాతీయ సహకారరంగ శిక్షణా సంస్థ, జాతీయ వరి-నూనె గింజల పరిశోధనా కేంద్రాలు ఏర్పడ్డాయి. ఇవే కాకుండా క్రీడా, ఇక్రిశాట్ వంటి సంస్థలూ అక్కడకు చేరాయి. ఢిల్లీ తరువాత అత్యధికంగా వ్యవసాయరంగ పరిశోధనా సంస్థలు హైదరాబాద్ కేంద్రంగా ఏర్పడ్డాయి.

నేను 1988-91, 2000-2003 మధ్య కాలంలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యునిగా ఉన్నాను. అప్పటి వరకు యూనివర్సిటీల్లో బదిలీ విధానం లేదు. దీని కోసం కమిటీని ఏర్పాటు చేసి, బదిలీలకు సంబంధించి ఒక విధానాన్ని రూపొందించాను. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వ్యవసాయ అనుబంధ సంస్థలు, విశ్వవిద్యాలయాల్లో ఇప్పటికీ నేను రూపొందించిన బదిలీల విధానమే కొనసాగుతోంది.

ఆచార్య ఎన్.జి రంగా గౌరవార్థంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం అరకొర నిధుల కారణంగా ఒడిదుడుకులతో కుంటినడక నడుస్తోంది. ఆహార, వాణిజ్య పంటలకు జాతీయస్థాయిలో పేరు పొందిన ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగం అభివృద్ధికి ఒక సమగ్రమైన వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉండాల్సిన అవసరాన్ని కేంద్ర, రాష్ట్ర పాలకులు ఎప్పటికి గుర్తిస్తారు?



2000 సంవత్సరంలో పొగాకు క్రాప్ హాలిడే అమల్లోకి తెచ్చాం. యూనివర్సిటీ శాస్త్రవేత్తల సలహాతో పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా శనగ (బెంగాల్ గ్రామ్)ను లక్షలాది ఎకరాల్లో రైతులతో సాగు చేయించాం. జాతీయ స్థాయిలో పప్పుధాన్యాల కొరత తీర్చడానికి ఈ నిర్ణయం దోహదపడింది. సాగునీటికి కొరత ఏర్పడిన సమయంలో మురుగు నీటిని శుద్ధిచేసి, సాగునీటిగా ఉపయోగించుకుంటే మేలు జరుగుతుందని రైతులకు సూచించాం. ఈ నిర్ణయం కూడా సత్ఫలితాలనిచ్చింది. వైస్ ఛాన్సలర్‌గా డాక్టర్ ఐవి సుబ్బారావు ఉన్న సమయంలోనే ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయానికి జాతీయ స్థాయిలో అవార్డు లభించింది.

2004లో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సమావేశాలు రాజేంద్రనగర్‌లోని ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశాలకు నాటి రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం, ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్, అమర్త్యసేన్, ఎంఎస్ స్వామినాథన్ వంటి ప్రముఖులు హాజరయ్యారు. వ్యవసాయ రంగానికి సంబంధించి వారు పలు సూచనలు చేశారు. అదే సమయంలో ఎన్జీ రంగా విశ్వవిద్యాలయ కీర్తిని పెంచే మరో సంఘటన జరిగింది. నాటి అమెరికా అధ్యక్షుడు జార్జ్‌బుష్ భారత్‌లో పర్యటించాలనుకున్నారు. బుష్‌కు మన వ్యవసాయ రంగాన్ని పరిచయం చేయడానికి రాజేంద్ర నగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం అనువైనదిగా భారత వ్యవసాయ పరిశోధనా మండలి గుర్తించింది. బుష్ గంటపాటు ఈ విశ్వవిద్యాలయాన్ని పరిశీలిస్తారని కేంద్రం తెలిపింది. కానీ ఆయన మూడు గంటలకు పైగానే యూనివర్సిటీలో గడిపారు. అక్కడి అభివృద్ధి, మౌలిక వసతులు, పరిశోధనలను ఆయన మెచ్చుకున్నారు.


ఆచార్య ఎన్జీ రంగా 1995 జూన్‌లో మృతి చెందారు. జూన్ 25న నిడుబ్రోలు రామనీడు విద్యాలయంలో రంగా సంతాప సభను నిర్వహించారు. ఆ సమావేశానికి అప్పటి ఆర్థికమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రతిపక్ష నేత రోశయ్య, ఇతర పార్టీల నేతలంతా హాజరయ్యారు. రాజేంద్రనగర్‌లోని అగ్రి యూనివర్సిటీకి ఆచార్య ఎన్జీ రంగా పేరు పెట్టాలని ఈ సభలో నేను సూచించాను. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యాక ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయంగా పేరు మార్చారు.

రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని మంజూరు చేయాలని 2014 విభజన చట్టంలో నిర్ణయించారు. ప్రధాని మోదీ మొదటి ప్రభుత్వంలో ఆర్థికమంత్రిగా ఉన్న అరుణ్ జైట్లీ దీనికి తొలుత రూ.500 కోట్లు కేటాయించారు. కొన్ని కారణాల వల్ల తర్వాత రూ.100 కోట్లు మాత్రమే ఇస్తున్నట్లు కేంద్రం తెలిపింది. 2015 నవంబరు 11న ఏపీలో వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రారంభోత్సం జరిగింది. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రాధామోహన్‌సింగ్‌లు హాజరయ్యారు. అరుణ్ జైట్లీ తొలుత ప్రకటించిన విధంగా ఈ విశ్వవిద్యాలయా నికి రూ.500 కోట్లను మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరాను. కానీ అరకొర నిధుల కారణంగా నాటి నుంచి వ్యవసాయ విశ్వవిద్యాలయం అనేక ఒడిదుడుకులతో కుంటినడక నడుస్తోంది. ప్రభుత్వం మారడంతో ఒక దశలో వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని గుంటూరు సమీపంలోని లాం నుంచి తరలించాలని ప్రయత్నించారు. విభజన జరిగి పదేళ్లు దాటినా ఏపీ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఇంకా అసమగ్రంగానే కొనసాగుతోంది. ఆచార్య ఎన్జీ రంగా పేరుతో లాంలో ఏర్పాటు చేసిన విశ్వవిద్యాలయానికి పూర్తి స్థాయిలో వైస్ ఛాన్సలర్‌ను కూడా ప్రభుత్వం నియమించలేదు. మణిపూర్, మిజోరం వంటి చిన్న రాష్ట్రాల్లో కేంద్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. వాణిజ్య పంటలైన పత్తి, మిరప, పసుపు, పొగాకు తదితర పంటలకు జాతీయ స్థాయిలో కేంద్రంగా ఉన్న ఆంధ్ర ప్రదేశ్‌లో సమగ్రమైన వ్యవసాయ విశ్వవిద్యాలయం లేక పోవడం విచారకరం.

ప్రస్తుతం కేంద్రంలో మోదీ ప్రభుత్వం టీడీపీ మద్దతుతో కొనసాగుతోంది. ఇప్పుడు కేంద్ర మంత్రులుగా రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని వ్యవసాయ విశ్వవిద్యాలయ అభివృద్ధిపై దృష్టి పెట్టాలి. విభజన అనంతరం తెలంగాణ ప్రభుత్వం కేంద్రంతో చర్చించి తమ వ్యవసాయ యూనివర్సిటీలో అన్ని పోస్టులను భర్తీ చేసుకుంది. విశ్వవిద్యాలయం అభివృద్ధి దిశగా సాగుతోంది. ఏపీలోని వ్యవసాయ విశ్వవిద్యాలయం కూడా సమగ్రంగా అభివృద్ధి చెందేలా పాలకులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

■ డా. యలమంచిలి శివాజీ
రాజ్యసభ మాజీ సభ్యుడు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు
గురువారం 15 మే 2025



- జూన్ మొదటి వారంలో మంగినపూడి బీచ్ ఫెస్టివల్
- కృష్ణాజిల్లా చరిత్రను చాటేలా ఏర్పాట్లు
- సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రులకు ఆహ్వానం
- బీచ్ ప్రాంతాన్ని పరిశీలించిన మంత్రి కొల్లు రవీంద్ర

6



ప్రారంభం

ఉయ్యూరు రూరల్ పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని బుధవారం హోంమంత్రి అనిత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పాల్గొన్నారు. 8లో



పరిశీలన

కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని బుడమేరు డైవర్షన్ చానెల్ వద్ద సేఫ్టీవాల్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పరిశీలించారు. 6లో

మెట్రోకు మంచి తరుణం



రుణం ఇచ్చేందుకు ప్రపంచ సంస్థల క్యూ

రూ.5,990 కోట్ల రుణానికి ఏఐఐబీ ఓకే

- తక్కువ వడ్డీ, షరతులు నామమాత్రమే
- ఏపీఎంఆర్సీ అధికారులతో ఏఐఐబీ భేటీ
- బందరురోడ్డు, ఏలూరు రోడ్డు కారిడార్ల పరిశీలన
- రుణం ఇవ్వటానికి మరిన్ని సంస్థల ఆసక్తి
- ఏఐఐబీవైపే మెట్రో అధికారుల మొగ్గు

విజయవాడ మెట్రోరైల్ ప్రాజెక్టు పనులు ఊపందుకుంటున్నాయి. ఈ ప్రాజెక్టులో కీలకమైన రుణాల మంజూరు వ్యవహారం ఇప్పుడిప్పుడే కొలిక్కి వస్తోంది. తాజాగా విజయవాడ మెట్రోరైల్ ప్రాజెక్టుకు రుణం ఇవ్వడానికి ఆసియన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) ముందుకురావడం, మరికొన్ని సంస్థలు కూడా క్యూలో ఉండటంతో ప్రతిష్ఠాత్మకమైన ఈ ప్రాజెక్టు త్వరలోనే పట్టాలెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ మెట్రోరైల్ ప్రాజెక్టుకు ఆసియన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) రూ.5,900 కోట్ల రుణం ఇచ్చేందుకు ముందుకొచ్చింది. విజయవాడ మెట్రోరైల్ ప్రాజెక్టుకు రుణాన్ని ఇవ్వటానికి జైకా, ప్రపంచ బ్యాంకు, ఏడీబీ, ఎన్‌డీబీ, ఏఎఫ్‌డీ, కేఎఫ్‌డబ్ల్యూ వంటి సంస్థలు ఇప్పటికే ముందుకొచ్చాయి. వీటన్నింటిలో ఏఐఐబీ సంస్థ అతి తక్కువ వడ్డీకి ఇబ్బందికర షరతులు లేని రుణాలను ఇస్తామని పేర్కొంది. దీంతో ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు చైనా ప్రధాన కేంద్రం కలిగిన ఈ సంస్థకు ఆహ్వానం పలికారు. మంగళవారం చర్చలు కూడా జరిగాయి. ఏఐఐబీ ప్రతినిధులు సంతోష్, పాస్కల్ రసెల్.. ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ ఎండీ రామకృష్ణారెడ్డితో సమావేశమయ్యారు. విజయవాడ, విశాఖపట్నం మెట్రో ప్రాజెక్టుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆ సంస్థ ప్రతినిధులకు వివరించారు. విజయవాడ మెట్రో కారిడార్-1, 2 గురించి వివరించారు. సమావేశం మిగతా 6లో..



ఏఐఐబీ ప్రతినిధులను సన్మానిస్తున్న ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ ఎండీ ఎన్‌పీ రామకృష్ణారెడ్డి

మెట్రో కన్సల్టెంట్‌కు టెండర్లు

మెట్రో ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడానికి వీలుగా ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ అధికారులు కన్సల్టెంట్ నియామకానికి టెండర్లు పిలిచారు. టెండర్లలో ఖరారైన కన్సల్టెన్సీ సంస్థ ఈ ప్రాజెక్టు పనులను పర్యవేక్షిస్తుంది. గతంలో ఢిల్లీ మెట్రోరైల్ కార్పొరేషన్ (డీఎంఆర్సీ) చైర్మన్ శ్రీధరన్‌ను ప్రభుత్వ మెట్రో సలహాదారుగా నియమించారు. దీంతో ఆయనే కన్సల్టెంట్‌గా వ్యవహరించారు. ప్రస్తుతం డీఎంఆర్సీ భాగస్వామ్యాన్ని తీసుకునే ఉద్దేశం ప్రభుత్వానికి లేకపోవటంతో కన్సల్టెన్సీని నియమించుకోవాలని ఏపీఎంఆర్సీ అధికారులు భావిస్తున్నారు.

రాజకీయం రసవత్తరం



తిరువూరు మునిసిపాలిటీలో క్యాంప్ రాజకీయాలు

- 19న వైసీపీ చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో రాజుకున్న వేడి
- పక్కచూపులు చూస్తున్న కొంతమంది కౌన్సిలర్లు
- చైర్మన్ పీఠం కాపాడుకునేందుకు వైసీపీ ప్రయత్నాలు
- ప్రత్యేక వాహనాల్లో పట్టణం దాటించిన స్థానిక నేతలు



తిరువూరు మునిసిపల్ కార్యాలయం

తిరువూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : తిరువూరు మునిసిపాలిటీలో క్యాంప్ రాజకీయాలు మొదలయ్యాయి. ఈనెల 19న పాలకవర్గ వైసీపీ నుంచి కొత్త చైర్మన్‌ను ఎన్నుకునే అవకాశం ఉండటంతో ఆ పార్టీ పెద్దలు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే కొందరు వైసీపీ కౌన్సిలర్లు పక్క చూపులు చూస్తుండటంతో స్థానిక నాయకులు, కౌన్సిలర్లు కలిసి వారిని బుధవారం పట్టణం దాటించారు. ప్రత్యేక వాహనంలో దూరప్రాంతానికి తరలించారు.

19న కొత్త చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో..

తిరువూరు మునిసిపల్ వైసీపీ చైర్మన్ ఎన్నిక మొదటి నుంచి రాజకీయ వివాదాలకు దారితీసింది. ఈ కౌన్సిల్‌లో మొత్తం 20 మంది సభ్యులు ఉండగా, వారిలో 17 మంది వైసీపీ, ముగ్గురు టీడీపీ సభ్యులు. నాటకీయ పరిణామాల నేపథ్యంలో ప్రస్తుత చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి ఏప్రిల్ 3న తన పదవికి మిగతా 6లో..

ఆది నుంచీ వివాదాలే..

వైసీపీ ఆధ్వర్యంలో పాలకవర్గం కొలువుదీరిన నాటి నుంచి ఆ పార్టీ కౌన్సిలర్ల మధ్య సఖ్యత కొరవడింది. ఆధిపత్య పోరు నేపథ్యంలో కౌన్సిల్ సమావేశాలే రద్దు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. చైర్‌పర్సన్ రెండేళ్ల తర్వాత రాజీనామా చేయాలనే నాటి ఎమ్మెల్యే రక్షణనిధి షరతు, ఆ తర్వాత పరిణామాల నేపథ్యంలో కొన్ని అభివృద్ధి పనులు కూడా నిలిచిపోయాయి.

ధనకార్యాలు

వెస్ట్ బైపాస్‌లో అలైన్‌మెంట్ పేరుతో ఓ కాంట్రాక్టు ఉద్యోగి చేతివాటం

- అధీకృతం కానీ అలైన్‌మెంట్ కాపీలతో పొలాల్లో హల్‌చల్
- టవర్ల మార్పు పేరుతో రైతుల నుంచి భారీగా వసూళ్లు!
- కార్లలో జల్సా.. పెట్రోల్ బంకు ఏర్పాటుకు స్థలాన్వేషణ
- సదరు ఉద్యోగి వ్యవహారశైలిపై సర్వత్రా విమర్శలు

జాతీయ రహదారుల సంస్థ(ఎన్‌హెచ్)లో పనిచేస్తున్న ఓ కాంట్రాక్టు ఉద్యోగి వ్యవహారశైలిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వెస్ట్ బైపాస్‌లో అలైన్‌మెంట్ పేరుతో సదరు ఉద్యోగి 'ధన'కార్యాలు వెలగబెట్టినట్టు ఆరోపణలు వస్తున్నాయి. అధీకృతం కానీ అలైన్‌మెంట్ కాపీలతో పొలాల్లోకి వెళ్లి హల్‌చల్ చేసి.. టవర్ల మార్పు, చేర్పుల పేరుతో రైతుల నుంచి భారీగా వసూళ్లకు పాల్పడినట్టు సమాచారం. ఇతని అవినీతి పనులతో అలైన్‌మెంట్ వివాదాలమయంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వానికి తలనొప్పులను కలిగిస్తోంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ వెస్ట్ బైపాస్ పేరుతో జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్)లో పనిచేస్తున్న ఓ కాంట్రాక్టు ఉద్యోగి చేపట్టిన 'ధన' కార్యాలు తాజాగా ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. సదరు ఉద్యోగి చేసిన పనుల వల్ల బైపాస్‌లో అనేక చిక్కుముడులు ఏర్పడ్డాయి. అలైన్‌మెంట్ వివాదాలతో గడువులోపు ప్రాజెక్టు పూర్తి కాకపోగా, రాష్ట్ర



ప్రభుత్వానికే తలనొప్పులను కలిగిస్తోంది. విజయవాడ వెస్ట్ బైపాస్‌లో మొత్తం ఆరు అలైన్‌మెంట్ల విషయంలో కాంట్రాక్టు ఉద్యోగి అలైన్‌మెంట్‌లను ఇష్టానుసారం మార్పులు, చేర్పులు చేసినట్టుగా తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. ఈ మార్పుల కారణంగా మిగతా 6లో..

మత బోధకుడి మాయ

బ్యాంకు రుణంతో జిమ్ ఏర్పాటు

- రుణం చెల్లించకపోవడంతో జప్తు ప్రకటన
- అయినా ఆఫర్లు ప్రకటించి డబ్బు వసూలు
- జప్తు భవనంలోకి అర్ధరాత్రి అక్రమ ప్రవేశం
- జిమ్ బాధితులపై దాడులు
- కేసుల నమోదు.. పరారీలో పాస్టర్ దంపతులు

ఆయనో మత బోధకుడు. ఎంతోమందికి పరిశుద్ధ వాక్యాలు బోధిస్తాడు. కానీ తప్పు మీద తప్పుచేసి దొంగలా దొరికాడు. చివరికి బ్యాంకు జప్తు చేసిన తన భవనంలోకి అర్ధరాత్రి అక్రమంగా ప్రవేశించాడు. కేసులు నమోదయ్యే సరికి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు.



అర్ధరాత్రి జిమ్ నుంచి బయటకు వస్తున్న ప్రదీప్‌ను ప్రశ్నిస్తున్న పోలీసులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నగరానికి చెందిన పాలిశెట్టి ప్రదీప్‌కుమార్ మొగల్రాజపురంలో చర్చి నడుపుతున్నాడు. డీవీ మనార్ రోడ్డులో ఓ భవనాన్ని అద్దెకు తీసుకుని అందులో అధునాతన సదుపాయాలతో స్నాప్ జిమ్‌ను ఏర్పాటు చేయాలని భావించాడు. దీని నిమిత్తం భార్య జెన్నీ అభిలాషితతో కలిసి ఎస్‌బీఐ నుంచి కొన్ని నెలల క్రితం రూ.6 కోట్ల రుణం తీసుకున్నాడు. దీనికి హామీగా రెండు ఆస్తులను బ్యాంక్ వద్ద తనఖా పెట్టాడు. వాయిదాలు చెల్లించకపోవడంతో బ్యాంకు జప్తు ప్రకటన జారీ చేసింది. దీంతో పాస్టర్‌లో ఉన్న నేరకోణం బయటకొచ్చింది. జిమ్ ఏర్పాటుచేసిన భవనంలో ఎక్కువ మిగతా 6లో..



ఎంఎస్ఎంఈ పార్కుల్లో చేనేత

- దసరాలోగా చేనేత సహకార ఎన్నికలు
- ఇళ్ల నిర్మాణాల్లో రూ.50 వేల సాయం
- 90 శాతం రాయితీతో పనిముట్లు
- త్వరలో కార్మికులకు హెల్త్ ఇన్సూరెన్స్
- నేతన్నలతో మంత్రి సవిత

6లో

కనకదుర్గమ్మకు రూ.3.73 కోట్ల కానుకలు

సెంట్రల్ ట్రాఫిక్‌కు చెక్

కీలక ప్రాంతాల్లో ఆర్‌యూబీలు, ఆర్‌వోబీల నిర్మాణానికి ప్రణాళికలు

- గుణదల ఆర్‌వోబీ సమస్యకు త్వరలోనే పరిష్కారం
- పీఎం గతిశక్తి పథకం ద్వారా పనులకు గ్రీన్‌సిగ్నల్
- ఎంపీ, ఎమ్మెల్యే కృషితో తీరనున్న శివారు సమస్యలు



వైసీపీ ప్రభుత్వంలో ఆగిపోయిన గుణదల ఆర్‌వోబీ

అజిత్‌సింగ్‌నగర్, మే 14 (ఆంధ్రజ్యోతి) : సెంట్రల్ నియోజకవర్గంలోని ప్రజలకు ప్రధాన సమస్యగా మారిన ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు మార్గం సుగమమైంది. పెరుగుతున్న కాలనీలు, జనాభాను దృష్టిలో పెట్టుకుని దశాబ్దకాలంగా ఇక్కడ ట్రాఫిక్ సమస్య తీవ్రమైంది. గంటలకొద్దీ ట్రాఫిక్ జామ్‌తో అల్లాడిపోతున్నామని మొత్తుకున్నా, వందల సార్లు గత వైసీపీ ప్రభుత్వానికి స్థానికులు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ముందుకొచ్చారు. ఎంపీ కేశినేని చిన్నితో కలిసి రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి మిగతా 6లో..

పీఎం గతిశక్తి పథకం ద్వారా మాస్టర్ ప్లాన్

సెంట్రల్ నియోజకవర్గంలో నగర శివారు ప్రాంతాలు అధికం. పైగా ప్రధాన రైల్వేలైన్లు ఇటుగానే వెళ్తాయి. గుణదల, మధురానగర్, అజిత్‌సింగ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో మెయిన్ రైల్వేలైన్లు ఉండటం వల్ల ఈ ప్రాంతాల మీదుగా రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ట్రాఫిక్ సమస్యను శాశ్వతంగా తొలగించాలనే ఆకాంక్షతో ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు కలిసి పీఎం గతిశక్తి పథకం ద్వారా రైల్వే అండర్ బ్రిడ్జి, రైల్వే ఓవర్ బ్రిడ్జిలు నిర్మించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. త్వరలోనే ఈ పనులు ప్రారంభం కానున్నాయి.



పరిమితికి మించి లోడుతో వెళుతున్న ప్రయివేటు ట్రావెల్స్ బస్సులు



ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు నిబంధనలకు విరుద్ధంగా సరుకు రవాణా చేస్తున్నాయి. ఓవర్‌లోడ్‌తో ప్రమాదకరస్థాయిలో పరుగులు తీస్తున్నాయి. ప్రయాణికులను చేరవేయాల్సిన బస్సులు క్వింటాళ్ల కొద్ది సరుకును కూడా తలకెత్తుకుంటున్నాయి. దీంతో ప్రైవేటు బస్సుల్లో ప్రయాణం చేయాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. ఓవర్‌లోడ్ కారణంగా ప్రమాదాలు జరిగితే నష్టం అంతాఇంతా కాదు. రవాణా శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రైవేటు బస్సులు ఓవర్‌లోడ్‌తో రహదారులపై చక్కర్లు కొడుతున్నాయి. కొన్ని బస్సులు వాటి ఎత్తుకు మించి సరుకుతో ప్రయాణిస్తున్నాయి. రాత్రి వేళల్లో అధిక వేగంతో హైవేపై వెళుతున్న బస్సు పొరపాటున అదుపుతప్పితేనే మరణాలు సంభవిస్తాయి. ఇక ఓవర్‌లోడ్ బస్సులు పరిమితికి మించి వేగంతో వెళితే.. ఊహించడానికే భయమేస్తుంది.

భద్రత ఎంత?

నిలువెత్తు నిర్లక్ష్యం!

- గాల్లో దీపంలా ప్రయాణికుల భద్రత
- ఓవర్‌లోడ్‌తో ట్రావెల్స్ బస్సుల పరుగులు
- కాసుల కక్కుర్తితో క్వింటాళ్ల కొద్దీ సరుకు రవాణా
- ప్రమాదమని తెలిసినా యజమానుల నిర్లక్ష్యం
- చూసీ.. చూడనట్టుగా రవాణా అధికారులు

(విజయవాడ, ఆంధ్రజ్యోతి)

ప్రయివేటు ట్రావెల్స్ యజమానులు నిబంధనలు విస్మరించి తమ స్వార్థానికి ప్రయాణికుల ప్రాణాలను పణంగా పెడుతున్నారు. సాధారణంగా ట్రావెల్స్ బస్సులకు ఎక్కడపడితే అక్కడ ఆపి (స్టేజి క్యారియింగ్) ప్రయాణికులను ఎక్కించుకోవడానికి అనుమతులు ఉండవు. కాంట్రాక్టు క్యారీయింగ్(ఒక దగ్గరే ఎక్కించుకోవాలి) పద్ధతిలో ప్రయాణికులను గమ్యస్థానానికి చేర్చాలి. కానీ నగరంలో అనేక చోట్ల ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. చాలా ప్రాంతాల్లో రహదారులకు అడ్డంగా ట్రావెల్స్ బస్సులు నిలపడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలం చెల్లిన బస్సులతో పాటు ఓవర్‌లోడ్‌తో బస్సులను నడుపుతూ ప్రయాణికుల భద్రతను ట్రావెల్స్ యాజమాన్యాలు పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. నగరం నడిబొడ్డున జరుగుతున్నా అధికారులు అంటీముట్టనట్టు వ్యవహరిస్తుండడం గమనార్హం. అధికారుల చొరవతోనే ట్రావెల్స్ యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. నిత్యం ట్రావెల్స్ బస్సులు ఓవర్‌లోడ్‌ను తరలిస్తున్నా అధికారులకు కనిపించడం లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

విజయవాడ కేంద్రంగా రోజూ సుమారు 500 బస్సులు వివిధ ప్రాంతాలకు ప్రయాణికులను చేరవేస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి ప్రయాణాలు చేసేవారే అధికం. ఉద్యోగం, ఇతరత్రా పనులు చేసుకునే వారు సమయానికి ప్రైవేటు ట్రావెల్స్ అందుబాటులో ఉండటంతో అధికశాతం వాటిని ఆశ్రయిస్తుంటారు. విజయవాడ నుంచి ప్రధాన నగరాలైన చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, విశాఖపట్నానికి నిత్యం ప్రయాణం చేస్తుంటారు. ప్రయాణికుల భద్రతపట్ల ట్రావెల్స్ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. టికెట్ల ధరల విషయంలో తగ్గని ట్రావెల్స్ నిబంధనలను సడలించడంలో మాత్రం ముందుంటున్నాయి. ట్రావెల్స్ ప్రయాణికుల లగేజీ (బ్యాగులు, ట్రాలీలు) మాత్రమే వారి వెంట అనుమతించాలి. కానీ కాసులకు కక్కుర్తిపడి క్వింటాళ్ల కొద్దీ లగేజీని తీసుకెళుతూ ప్రయాణికుల జీవితాలతో ఆడుకుంటున్నారు. హైవేపై రోజూ ఏదో ఒక ప్రమాదం జరుగుతూ ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. ఎన్నో కుటుంబాలు తల్లిదండ్రులు, పిల్లల్ని కోల్పోతున్నారు. డబ్బు చెల్లించి ప్రయాణిస్తున్నపుడు ప్రశ్నించే హక్కు ప్రయాణికులకు ఉంటుంది. ట్రావెల్స్ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించినా, దురుసుగా ప్రవర్తించినా వారు అధికారులను ఆశ్రయించవచ్చు.



కానుకల లెక్కింపులో ఈవో, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది

కనకదుర్గమ్మకు రూ.3.73కోట్ల కానుకలు

ఇంద్రకీలాద్రి, మే 14 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం మల్లేశ్వర మహామండపం 6వ అంతస్తులో భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుబడులను లెక్కించారు. 23 రోజులకు రూ.3,73,37,549లు నగదు రూపంలో రాగా, 420 గ్రాముల బంగారం, 7కేజీల20 గ్రాముల వెండి రూపంలో సమకూరాయి. ఈవో, డిప్యూటీ కలెక్టర్ వీకే శీనానాయక్ హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. దేవదాయశాఖ సిబ్బంది, వన్‌టౌన్ పోలీసులు, ఎస్పీఎఫ్ పోలీసులు కానుకల లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

దుర్గమ్మ భక్తులకు సురక్షిత తాగునీరు

- దివీస్ ల్యాబొరేటరీస్ వితరణ

ఇంద్రకీలాద్రి, మే 14 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వరుల దేవస్థానంలో భక్తులకు సురక్షిత తాగునీరు అందించేందుకు దివీస్ ల్యాబొరేటరీస్ సంస్థ ముందుకు వచ్చి జల ప్రసాద కేంద్రాలు ఏర్పాటు చేయటం హర్షణీయమని



ఈవో వీకే శీనా నాయక్ పేర్కొన్నారు. బుధవారం ఇంద్రకీలాద్రి ఘాట్‌రోడ్డు, దుర్గాఘాట్‌లలో దివీస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సురక్షిత తాగునీటి (జల ప్రసాదం) కేంద్రాలను ఈవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సామాజిక సేవలో దైవత్వం ఇమిడి ఉందని, భక్తులకు చేసే సేవ భగవంతునికి చేసినట్టేనన్నారు. సామాజిక, కార్పొరేట్ సంస్థలు భక్తుల సేవలో పాలు పంచుకోవాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. అనంతరం భక్తులకు సురక్షిత నీరు అందించారు. కార్యక్రమంలో దివీస్ సంస్థ ప్రతినిధులు, ఆలయ ఈఈలు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ సేవలో శృంగేరి విరూపాక్ష మఠం పీఠాధిపతులు

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను బుధవారం అనంతపురం శృంగేరి విరూపాక్ష మఠం పీఠాధిపతులు శ్రీవిద్యా నృసింహ భారతీ మహాస్వామి దర్శించుకున్నారు. ఈవో శీనా నాయక్ పీఠాధిపతులకు ఆలయమర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి



దర్శనం కల్పించారు. వేద పండితులు వేద ఆశీర్వచనం అనంతరం వారికి ప్రసాదం, దుర్గమ్మ చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.



ఆలపాటి సురేష్‌కుమార్, కేఎస్ జవహర్, ఈశ్వర్‌లను సత్కరించి జ్ఞాపికలు అందజేస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

ఎంపీ శివనాథ్‌ను కలిసిన కొత్త చైర్మన్లు

వన్‌టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్.జవహర్, కుమ్మరి-శాలివాహన సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పేరపి ఈశ్వర్‌లు బుధవారం ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)ని గురునానక్ కాలనీలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ వారికి అభినందనలు తెలిపి శాలువాతో సత్కరించారు. ఎంపీకి, నాయకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణరాజు, ఏపీ బిల్డింగ్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, జిల్లా తెలుగు రైతు సంఘం అధ్యక్షుడు చెరుకూరి రాజేశ్వరరావు, బొప్పన భవకుమార్, దేవినేని చందు, బాబురావు, ఎమ్మెల్యే గద్దే రామ్మోహన్, గన్నే ప్రసాద్ (అన్న) తదితరులు ఉన్నారు.

రాజకీయం రసవత్తరం

(5వ పేజీ తరువాయి)

రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 23న జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆమె రాజీనామాను ఆమోదించారు. దీంతో గత ఒప్పందం ప్రకారం చైర్‌పర్సన్ పదవి ఆశిస్తున్న మోదుగు ప్రసాద్ మద్దతు కూడగట్టుకునే ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో చైర్మన్ ఎన్నికకు సంబంధించి ఈ నెల 12న నోటిఫికేషన్ జారీ కాగా, 19న ఎన్నిక జరగనుంది. ఈ నేపథ్యంలో తిరువూరులో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. వైసీపీకి చెందిన కొందరు కౌన్సిలర్లు పక్కచూపులు చూస్తున్నట్లు ప్రచారం జరిగింది. ఎనిమిది మంది కౌన్సిలర్లు పార్టీ మారుతున్నారని, ప్రస్తుత మున్సిపల్ బోర్డు వైసీపీ చేయి జారుతుందనే ప్రచారంతో నాయకులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే పలుమార్లు తమ కౌన్సిలర్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో చైర్మన్ పీఠం పార్టీ చేజారి పోకూడదనే ఆలోచనతో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాసు ఆధ్వర్యంలో క్యాంప్ రాజకీయానికి తెరలేపారు.

బుడమేరుకు శాశ్వత పరిష్కారం

- గండ్లు పడిన కట్టకు సేఫ్టీ వాల్ నిర్మాణం
- వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ నుంచి ఎనికేపాడు యూటీ వరకు మరో చానెల్
- 25 వేల క్యూసెక్కులు కొల్లేరులోకి
- బీడీసీ ద్వారా 37,500 క్యూసెక్కులు కృష్ణాలోకి
- మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడి



బీడీసీ గండ్ల వద్ద సీపేజ్ ప్రాంతంలో సమాంతర వాల్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల

ఇబ్రహీంపట్నం, మే 14 (ఆంధ్రజ్యోతి) : బెజవాడ దుఃఖదాయిని బుడమేరు వరదల నుంచి విజయవాడ పల్లపు ప్రాంతాల ప్రజలకు శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. కొండపల్లి మున్సిపాలిటీ శాంతినగర్ వద్ద బుడమేరు డైవర్షన్ చానెల్ (బీడీసీ)కి గత ఏడాది వరదలకు మూడు గండ్లు పడిన విషయం తెలిసిందే. యుద్ధప్రాతిపదికన పూడ్చించిన కట్టకు సమాంతరంగా సేఫ్టీ వాల్ నిర్మాణ పనులను బుధవారం మైలవరం ఎమ్మెల్యేతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో గండ్లు పడిన చోట 500 మీటర్ల మేర పర్మినెంట్‌గా సీసీ వాల్ నిర్మాణం చేపట్టేందుకు రూ.28 కోట్లు కేటాయించినట్టు చెప్పారు. పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించి జూన్ 10 నాటికి వాల్ నిర్మాణం పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించినట్టు చెప్పారు. ఇప్పుడు ఒక యూనిట్ మాత్రమే పనిచేస్తుందని మూడు యూనిట్లు పెంచి ఖచ్చితంగా పూర్తి చేయాలన్నారు. బుడమేరు నుంచి విజయవాడను రక్షించాల్సిన అవసరం ఉందని, అందులో భాగంగా వెలగలేరు రెగ్యులేటర్ నుంచి ఎనికేపాడు యూటీ వరకు ఉన్న పాత బుడమేరును అభివృద్ధి చేయడంతో పాటు దానికి సమాంతరంగా కాలువ తీసి దాని ద్వారా సుమారు 25 వేల క్యూసెక్కుల వరద నీరు ఎనికేపాడు యూటీ నుంచి కొల్లేరులో కలిపే విధంగా భూసేకరణ చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. బీడీసీ నుంచి 37,500 క్యూసెక్కుల నీటిని కృష్ణా నదిలో కలిపేందుకు అసరమైన పనులు పూర్తి చేస్తామన్నారు. డీపీఆర్ మొత్తాన్ని సీఎం చంద్రబాబు వద్ద పెట్టి రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ముందుకు పోతామన్నారు. ఈ పనులన్నింటికి సుమారు రూ.6 వేల నుంచి రూ.8 వేల కోట్లు నిధులు అవసరం అవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో విపత్తుల విభాగం నుంచి ఈ పనులు చేపట్టాలనే ఉద్దేశంలో డీపీఆర్‌ను తయారు చేస్తున్నామన్నారు. కేంద్ర సాయంతో పనులు పూర్తి చేస్తామన్నారు. వర్షాకాలం వచ్చే లోపే బుడమేరుకు పడిన గండ్లు పూడ్చిస్తామన్నారు. బుడమేరు, ఇరిగేషన్, చెరువులు ఇతర స్థలాలు కబ్జా చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. పట్టించుకోని అధికారులపైనా చర్యలుంటాయన్నారు. ప్రధాన గండికి పూర్తి భద్రత కల్పించేందుకు నిధులు మంజూరు చేసిన మంత్రికి మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ కృతజ్ఞతలు చెప్పారు. మొత్తం 188 ప్రదేశాల్లో గండ్లు పడ్డాయని, వాటిలో 40 చోట్ల పనులు పూర్తి చేయించామన్నారు. 127 పనులకు రూ.40 కోట్లు ప్రతిపాదనలు పంపామన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

బుడమేరు సమగ్రాభివృద్ధికి నిధులివ్వండి

- సీఎం చంద్రబాబును కోరిన ఎమ్మెల్యే వసంత

ఇబ్రహీంపట్నం, మే 14 (ఆంధ్రజ్యోతి) : బుడమేరు సమగ్రాభివృద్ధికి అవసరమైన నిధులివ్వాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంటక కృష్ణ ప్రసాద్ ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడ్ని కలిసి విజ్ఞప్తి చేశారు. గతేడాది ఆకస్మిక వరదల వల్ల మైలవరం నియోజకవర్గ వ్యాప్తంగా దెబ్బతిన్న వాగులు, చెరువులు, ఎన్ఎస్పీ కాలువల మరమ్మతులకు, గండ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. బుడమేరు 70శాతం పైగా మైలవరం నియోజకవర్గంలోనే ఉందని తెలిపారు. సీఎం సానుకూలంగా స్పందించారని వసంత తెలిపారు.

ఎంఎస్ఎంఈ పార్కుల్లో చేనేత

- దసరాలోగా చేనేత సహకార ఎన్నికలు
- ఇళ్ల నిర్మాణాల్లో రూ.50వేల ఆర్థికసాయం
- 90 శాతం రాయితీతో పనిముట్లు
- త్వరలో కార్మికులకు హెల్త్ ఇన్సూరెన్స్
- నేతన్నలతో మంత్రి సవిత



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న మంత్రి సవిత, చిత్రంలో ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి

విజయవాడ, మే 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కల్పనలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేయడంతోపాటు యూనిట్ల స్థాపనకు నేతన్నలకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు రాష్ట్ర బీసీఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. బుధవారం నగరంలోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నేతన్నలతో ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డితో కలిసి ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణాల్లో చేనేతలకు అదనంగా రూ.50వేలు అందజేస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో ఉన్న ఎన్‌హెచ్‌డీఎస్ రీజనల్ కార్యాలయం విజయవాడలో ఏర్పాటు చేసేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. 90శాతం సబ్సిడీతో ఆధునిక పనిముట్లు అందజేస్తామన్నారు. చేనేత అమ్మకాలు పెరిగేలా కూటమి ప్రభుత్వం రాష్ట్ర, జాతీయస్థాయిలో ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేస్తోందని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు వారంలో ఒకరోజు చేనేత దుస్తులు తప్పనిసరిగా ధరించేలా త్వరలో పిలుపునివ్వనున్నట్టు తెలిపారు. దసరాలోగా చేనేత సహకార సంఘ ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. నేత కార్మికులకు త్వరలో హెల్త్ ఇన్సూరెన్స్ అమలు చేస్తామని చెప్పారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా మగ్గాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్ల విద్యుత్ ఉచితంగా అందజేస్తామని చెప్పారు. 2019-24 మధ్య నేతన్నలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. త్రిఫ్ట్ పథకం కింద కేటాయించిన రూ.5 కోట్లను త్వరలో విడుదల చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో చేనేత, జౌళీశాఖ కమిషనర్ రేఖారాణి, సెర్ప్ సీఈవో కరుణ, ఆప్కో వీసీ అండ్ ఎండీ ఎం.విశ్వ, పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ అబద్దయ్య, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ ట్రాఫిక్‌కు చెక్

(5వ పేజీ తరువాయి)

నియోజకవర్గంలో అవసరమైన ప్రధాన ప్రాంతాల్లో ఆర్‌యూబీలు, ఆర్‌వోబీలను నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.

జూన్‌లోనే పనులు ప్రారంభిస్తాం.. : బొండా ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్యే

సెంట్రల్ నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్యను తొలగించేందుకు యుద్ధప్రాతిపదికన ఆర్‌యూబీలు, ఆర్‌వోబీలను నిర్మిస్తున్నాం. ఇక్కడ ఎక్కువగా రైల్వేలైన్లు ఉండటం వల్ల ప్రజలు ట్రాఫిక్ సమస్య ఎదుర్కొంటున్నారు. కోల్‌కతా, చెన్నై, గుడివాడ, నర్సాపురం మీదుగా వెళ్లే ప్రధాన మార్గాలన్నీ సెంట్రల్ నియోజకవర్గం మీదుగానే వెళ్తున్నాయి. ఇదే ట్రాఫిక్‌కు ప్రధాన సమస్యగా మారింది. 1995లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా సింగ్‌నగర్ ఫ్లైఓవర్ నిర్మాణాన్ని చేపట్టాం. 2009లో గుణదలలో ఆర్‌వోబీ చేపట్టగా, వైసీపీ ప్రభుత్వం నిలిపివేసింది. తిరిగి తాము అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే ఎంపీ చిన్నితో కలిసి, రైల్వే అధికారులతో మాట్లాడి తిరిగి పీఎం గతిశక్తి పథకం ద్వారా గుణదల ఆర్‌వోబీ నిర్మాణానికి నిధులు రాబట్టాం. జూన్‌లోనే ఆర్‌వోబీ పనులు ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. గతిశక్తి పథకం ద్వారా ఆర్‌వోబీ నెంబర్ 316కు అన్ని ప్రతిపాదనలు సిద్ధం చేశాం. రెండు నెలల్లోపు ఆర్‌వోబీ నిర్మాణ పనులు చేపడతాం. ఈనెల 17న జాయింట్ ఇన్‌స్పెక్షన్ టీమ్ వచ్చి పప్పులమిల్లు వద్ద ఉన్న ఆర్‌యూబీకి ప్రణాళిక సిద్ధం చేస్తుంది.

మెట్రోకు మంచి తరుణం

(5వ పేజీ తరువాయి)

అనంతరం ఏఐఐబీ ప్రతినిధులు మెట్రో కారిడార్ రోడ్లను పరిశీలించారు. రామకృష్ణారెడ్డి వారిని వెంట తీసుకెళ్లి చూపించారు. కారిడార్లను పరిశీలించిన అనంతరం విజయవాడ మెట్రోకు రూ.5,900 కోట్ల రుణం ఇచ్చేందుకు ఏఐఐబీ ప్రతినిధులు అంగీకరించారు. విజయవాడ మెట్రోరైల్ కార్పొరేషన్ అధికారులు కూడా ఈ రుణం తీసుకోవాలని భావిస్తున్నట్టు సమాచారం. ఎందుకంటే ఈ సంస్థ ఇచ్చే రుణాన్ని 35 ఏళ్ల వరకు తీర్చుకునే వెసులుబాటు ఉంది. జైకా సంస్థ అయితే 40 ఏళ్ల వరకు రుణం తీర్చుకునే అవకాశం కల్పించినా ఆంక్షలు ఇబ్బందికరంగా మారాయి. అలాగే, జర్మనీకి చెందిన కేఎఫ్‌డబ్ల్యూ, ఫ్రాన్స్‌కు చెందిన ఏఎఫ్‌డీతో పాటు ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ), నేషనల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డీబీ), ప్రపంచ బ్యాంకు (డబ్ల్యూబీ) వంటి సంస్థలను కూడా ఆహ్వానించాలని మెట్రో అధికారులు భావిస్తున్నారు. విజయవాడ మెట్రో ప్రాజెక్టు తొలిదశ పనులకు కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ (సీఎంపీ) సర్వేకు ఆదేశించిన నేపథ్యంలో కన్సల్టెంట్‌ను నియమించి సర్వే పూర్తిచేశారు. ప్రస్తుతం సంస్థ ప్రతినిధులు ఢిల్లీలో రిపోర్టులు తయారు చేస్తున్నారు. అవి రాగానే, ఏపీఎంఆర్‌సీ అధికారులు కేంద్రానికి నివేదిక పంపిస్తారు.

మత బోధకుడి మాయ

(5వ పేజీ తరువాయి)

భాగాన్ని ది స్నాప్ జిమ్ పేరుతో వేరు చేశాడు. స్నేహితుడు నిమ్మల కృష్ణకుమార్ అలియాస్ క్రిష్, గ్లోరీ పేట్ల, పచ్చిగళ్ల హెప్సిబాను బినామీలుగా పెట్టాడు. ప్రకటన జారీచేసినా ప్రదీప్‌కుమార్ నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో బ్యాంకు రికవరీ విభాగం సిబ్బంది జిమ్‌ను జప్తు చేయడానికి వెళ్లారు. అప్పటికే జిమ్‌లో ఎక్కువ భాగాన్ని బినామీ పేర్లపై, తక్కువ భాగాన్ని అసలు స్నాప్ జిమ్‌గా విభజించాడు. అదిచూసి బ్యాంకు రికవరీ విభాగం సిబ్బంది షాక్ అయ్యారు. అప్పటికే తక్కువ భాగంలో ఉన్న జిమ్‌ను జప్తు చేశారు. తర్వాత వారు కోర్టును ఆశ్రయించి బినామీ పేర్లతో సృష్టించిన ది స్నాప్‌ను స్వాధీనం చేసుకోవడానికి ఉత్తర్వులు పొందారు. కొద్దిరోజుల క్రితం రికవరీ సిబ్బంది ఈ జిమ్‌ను స్వాధీనం చేసుకోవడానికి రావడంతో ప్రదీప్, క్రిష్ కలిసి ఇంటి నెంబరును మార్చేశారు. దీన్ని ఒక కారణంగా చూపించి వేర్వేరు ఇంటి నెంబర్లున్న జిమ్‌ను ఎలా స్వాధీనం చేసుకుంటారని రికవరీ సిబ్బందిపై వివాదానికి దిగి, దాడి చేశారు. దీనిపై వారు ఫిర్యాదు చేయడంతో మాచవరం పోలీసులు కేసు నమోదు చేశారు.

జప్తు తప్పదని తెలిసి..

ఓపక్క తీసుకున్న రుణం చెల్లించలేదు. మరోపక్క బ్యాంకు జప్తు ప్రకటన చేసింది. అయినా రకరకాల ఆఫర్ల పేర్లతో కస్టమర్లను మోసం చేశాడు. ఈస్టర్ బ్లాస్ట్, హోలీ బ్లాస్ట్, ఉగాది ఫీస్ట్ వంటి ఆఫర్లను ప్రకటించి ఫీజులో 40-50 శాతం మినహాయింపు ఇచ్చాడు. ఈవిధంగా సుమారు 250 మందికి పైగా ఒక్కొక్కరి నుంచి రూ.17 వేల నుంచి రూ.20 వేల వరకు ఏడాది ఫీజుగా వసూలు చేశాడు. జప్తు చేసిన విషయం బయట పడకుండా గేటుకు 'ఈరోజు జిమ్‌కు సెలవు' అని బోర్డు తగిలించేవాడు. ఫీజులు చెల్లించిన కస్టమర్లంతా వ్యాయామం కోసం వచ్చి ఈ బోర్డు చూసి వెనుదిరిగేవారు. కారణాలు అడిగిన వారికి లోపల నీళ్ల సమస్య ఉందని, ఏసీ పనిచేయడం లేదని, టాయిలెట్ పూడుకుపోయిందని చెప్పేవాడు. ఎన్నిరోజులైనా ఇవే కారణాలు చెబుతుండటంతో ఫీజులు చెల్లించిన వారంతా మోసపోయామని భావించారు. వారంతా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసులు నమోదు చేశారు. బాధితులంతా ఒక వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేసుకుని న్యాయం కోసం పోరాడారు. ప్రదీప్ భార్య అభిలాషిత గురించి గ్రూపులో అసభ్యకరంగా మాట్లాడిన ఓ బాధితుడికి డబ్బులిస్తామని చెప్పి నిర్మలా కాన్వెంట్ సెంటర్‌కు పిలిపించుకుని దాడి చేశాడు.

అర్ధరాత్రి చోరీకి యత్నం

బ్యాంకు రికవరీ విభాగం సిబ్బంది జిమ్‌లను జప్తు చేశాక ఆ భవనానికి తాళాలు వేశారు. సెక్యూరిటీ గార్డులను నియమించారు. జప్తు చేసే సమయానికి లోపల ఉన్న సామాగ్రి లెక్కలు రాసుకున్నారు. కొద్దిరోజుల క్రితం ప్రదీప్‌కుమార్, కృష్ణకుమార్ అర్ధరాత్రి ఆ భవనం వద్దకు వెళ్లారు. ఆయుధాలతో కొట్టి చంపేస్తామని సెక్యూరిటీ సిబ్బందిని బెదిరించారు. తర్వాత జనరేటర్ రూమ్ పగలగొట్టి అక్రమంగా లోపలకు ప్రవేశించారు. అద్దాలు పగలగొట్టి జిమ్‌లోకి వెళ్లిటీవీలు, ఇతర వస్తువులు మాయం చేశారు. ఈ విషయాన్ని సెక్యూరిటీ గార్డులు రికవరీ విభాగానికి తెలియజేయడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. బీట్ పోలీసులు అక్కడికి చేరుకునేసరికి జనరేటర్ గదిలో నుంచి ప్రదీప్‌కుమార్, కృష్ణకుమార్ బయటకు వస్తూ కనిపించారు. వరుసగా ఒక దాని తర్వాత మరో కేసు నమోదు కావడంతో భార్య అభిలాషితతో కలిసి ప్రదీప్ పరారయ్యాడు. అతడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ధన కార్యాలు!

(5వ పేజీ తరువాయి)

ఎంతో మంది రైతులు నష్టపోగా.. కొంత మందికి మాత్రం జేబులు దండిగా నిండాయి. ఎన్‌హెచ్ అధికారులంతా సివిల్ పనులపై అవగాహన కలిగిన వారు. అలైన్‌మెంట్ వ్యవహారాలకు సంబంధించి వారికి పూర్తిగా పట్టు ఉండదు. దీనిని అదనుగా చేసుకుని ఆ కాంట్రాక్టు ఉద్యోగి విజయవాడ బైపాస్‌లో విశ్వరూపం చూపించాడని తెలుస్తోంది. అధీకృత సంతకాలు లేని అలైన్‌మెంట్లను పట్టుకెళ్లి క్షేత్ర స్థాయిలో పెగ్ మార్క్ చేయటం వంటి పనులతో రైతులు బెంబేలెత్తిపోయారు. అలైన్‌మెంట్ పేరుతో అక్కడ టవర్లు వస్తున్నాయి.. ఇక్కడ టవర్లు వస్తున్నాయంటూ రైతులను భయాందోళనలకు గురిచేశాడని తెలుస్తోంది. హైటెన్షన్ ట్రాన్స్‌మిషన్ టవర్ పడితే భవిష్యత్తులో తమ భూములను కొనేవారు ఎవరూ ఉండరని భయపడిన రైతుల నుంచి దండిగా లంచాలు వసూలు చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎకరం రూ.కోటిపైన ఖరీదు చేసే భూముల రైతుల నుంచి డబ్బులు తీసుకుని వేరే పొలంలోకి టవర్ వెళ్లే విధంగా అలైన్‌మెంట్‌ను ఫిక్స్ చేశాడని సమాచారం. ఇలా తన ఆఫర్‌ను అంగీకరించిన రైతులకు మేలు చేసినట్టు తెలిసింది. మొత్తం ఆరు లైన్ల విషయంలో కూడా కాంట్రాక్టు ఉద్యోగి ఇదే విధంగా వ్యవహరించాడని సమాచారం. ట్రాన్స్‌కో, పీజీసీఐఎల్, ల్యాంకో లైన్స్ అన్నింటి విషయంలోనూ ఆ ఉద్యోగి ఇదే విధంగా చేశాడని తెలుస్తోంది. ల్యాంకో లైన్స్‌ను అర్ధ చంద్రాకారంగా రైతుల పొలంలో తిప్పటం వెనుక కూడా ఆ ఉద్యోగి హస్తం ఉందని తెలుస్తోంది. టవర్లను రీ లోకేట్ చేస్తున్న కాంట్రాక్టు సంస్థతో కలిసి ఆ ఉద్యోగి ఇష్టానుసారం టవర్లను మార్చి గందరగోళాన్ని సృష్టించినట్టు సమాచారం. నున్న, సూరాయపాలెం రైతులు ఈ అలైన్‌మెంట్‌పై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఫిర్యాదు చేయటంతో అసలు ఈ అలైన్‌మెంట్ ఏ విధంగా వస్తుందన్న దానిపై ఆయన కూడా విచారణకు ఆదేశించారు.

అధీకృత అలైన్‌మెంట్ ఎలా ఉండాలి? క్షేత్ర స్థాయిలో ఏమి చేశారు?

ముందుగా నిర్దేశించుకున్న అలైన్‌మెంట్ ప్రకారం ఏయే రైతుల పొలాల్లో టవర్లు పడుతున్నాయో గుర్తించి ఆ రైతులకు ముందుగా సమాచారాన్ని తెలియపరచాలి. ఆ తర్వాత వారి సమక్షంలో టవర్ లోకేషన్ ఎక్కడ వస్తుందో అధికారిక అలైన్‌మెంట్ కాపీని చూపించి పెగ్ మార్క్ చేయాల్సి ఉంటుంది. కానీ, సదరు ఉద్యోగి అధీకృతం కానీ ప్లాన్ కాపీతో వచ్చి పెగ్ మార్కింగ్ పనులతో రైతులను భయాందోళనలకు గురి చేశారు. అధీకృత అలైన్‌మెంట్ కాపీ మీద ఏఈ, డీఈఈ, ఈఈ, ఎస్ఈ సంతకాలు ఉండాలి. ఆ తర్వాత ఎన్‌హెచ్ పీడీ సంతకాలు ఉండాలి. ఈ సంతకాలు అన్నీ ఉంటేనే అది అధీకృత అలైన్‌మెంట్ కాపీ అవుతుంది. ఎలాంటి సంతకాలు లేకుండా అలైన్‌మెంట్ ప్రింట్ తీసుకు వచ్చి రైతులను భయభ్రాంతులకు గురి చేశారు. వీటి గురించి రైతులకు పెద్దగా తెలియదు. దీంతో అతడు ఆడింది ఆట పాడింది పాటగా సాగింది.

డబుల్ దోపిడీ

అలైన్‌మెంట్ పేరుతో డబుల్ దోపిడీ జరిగిందని తెలుస్తోంది. ముందుగా ప్రస్తుత అలైన్‌మెంట్‌లో ఉన్న రైతులతో మాట్లాడి నీ పొలం నుంచి టవర్ తీసేస్తాం.. ఎంత ఇస్తావ్ ? అని బేరం పెట్టినట్టు తెలిసింది. ఆ తర్వాత కొత్తగా వెళ్లే భూముల రైతులతో నీ పొలంలో టవర్ పడుతుంది! పడకుండా ఉండాలంటే ఎంత ఇస్తావ్? అంటూ బేరసారాలు సాగించినట్టు సమాచారం. ఇలా రైతుల అమాయకత్వాన్ని, ఖరీదైన భూములను కాపాడుకోవాలన్న వారి ఆశలను ఎంచక్కా మన కాంట్రాక్టు ఉద్యోగి భారీగా క్యాష్ చేసుకున్నట్టు తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బైక్‌పై వచ్చి.. కార్లను మార్చే రేంజ్‌కి..

కాంట్రాక్టు ఉద్యోగి ఎన్‌హెచ్‌లో ప్రవేశించే ముందు ఓ బైకును ఉపయోగించినట్టు సమాచారం. విజయవాడ వెస్ట్ బైపాస్ పుణ్యమా అని అతను ఇప్పుడు కారులో ఆఫీసుకు వచ్చే రేంజ్‌కు ఎదిగాడని తెలిసింది. ఒక కారు అయితే అనుకోవచ్చు.. ఇప్పటికి రెండు కార్లను మార్చినట్టు సమాచారం.

బైపాస్ వెంబడి పెట్రోల్ బంకు కోసం స్థలాన్వేషణ

సదరు కాంట్రాక్టు ఉద్యోగి విజయవాడ వెస్ట్ బైపాస్ వెంబడి పెట్రోల్ బంకును ఏర్పాటు చేయటానికి స్థలాన్వేషణ చేస్తున్నట్టు తెలిసింది. విజయవాడ వెస్ట్ బైపాస్ ప్రారంభమయ్యే లోపు అనువైన స్థలాన్ని కొనుగోలు చేసి అందులో పెట్రోల్ బంకును ఏర్పాటు చేయాలన్నది అతని ఆలోచనగా ఉన్నట్టు సమాచారం. విజయవాడ వెస్ట్ బైపాస్ వెంబడి ఒక ఎకరం కొనాలంటే కనిష్ఠంగా రూ. కోటి నుంచి గరిష్ఠంగా రూ.7 కోట్ల వరకు ఉంది.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125,134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

హెచ్‌ఐవీపై జానపద కళాజాతా

ఆటోనగర్, మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, ది కృష్ణా డిస్ట్రిక్ లారీ ఓనర్స్ ట్రక్కర్స్ ప్రాజెక్టు, వైద్య ఆరోగ్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం హెచ్‌ఐవీపై అవగాహనకు జానపద కళాజాతా ప్రచార కార్యక్రమం ఆటోనగర్‌లో నిర్వహించారు. నెలరోజులపాటు నగరంలోని పలు ప్రాంతాల్లో కళాజాతా నిర్వహించి ప్రజల్లో ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తామని అడిషనల్ డిస్ట్రిక్ట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉషారాణి అన్నారు. ఏపీ శాక్స్ ప్రాజెక్టు అధికారి మల్లేశ్వరరావు, ట్రక్కర్స్ ప్రాజెక్టు మేనేజర్ వీవీ సాంబశివరావు, ఏపీ శాక్స్ ఔట్ రీచ్ సిబ్బంది రాయప్ప, ప్రసాద్, శేషు, గణేష్, పలువురు మెకానిక్‌లు, ట్రక్కర్లు పాల్గొన్నారు.

20 నుంచి గ్రంథాలయ వర్క్‌షాప్

● గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక

గవర్నర్‌పేట, మే 14 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఆట, మాట, పాట, పుస్తక పఠనంపై ఆసక్తి పెంచేందుకు విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ, గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక, స్వేచ్ఛాంధ్ర ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి సివిల్ కోర్టుల సమీపంలోని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ప్రాంగణంలో గ్రంథాలయ వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్‌నాయుడు, లక్ష్మయ్య తెలిపారు. సొసైటీ కార్యాలయంలో బుధవారం వర్క్‌షాపునకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగు, మాతృభాష పట్ల ఆసక్తి పెంచడం, కథలు చెప్పడం, ఆటలు, మ్యాజిక్ షో, సైన్స్ సందేహాల నివృత్తి, నిఘంటవులు చదవడం ఉంటాయన్నారు. 6వ తరగతి నుంచి ఇంటర్ చదివే విద్యార్థులకు ప్రతి రోజు ఉదయం 9 నుంచి 11వరకు, సాయంత్రం 4 నుంచి 6 వరకు వర్క్‌షాపు నిర్వహించనున్నట్టు తెలిపారు.



గుణదల వద్ద వ్యర్థాలతో ఏలూరు కాల్వ



గుణదల వద్ద పూడికతో బుడమేరు కాల్వ



రామవరప్పాడు రింగ్ వద్ద గుర్రపుడెక్కతో బుడమేరు

వ్యర్థాలు, గుర్రపుడెక్కతో కాల్వలు

ఏలూరు, రైవస్, బుడమేరు కాల్వల్లో ప్రారంభం కాని పూడికతీత పనులు

గుణదల, ఆంధ్రజ్యోతి: వర్షాకాలం సమీపిస్తున్నా నగరంలోని ఏలూరు, రైవస్, బుడమేరు కాల్వల్లో పూడికతీత పనులు ప్రారంభం కాలేదు. ఎండాకాలంలో కాల్వల్లో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు, గుర్రపుడెక్క తొలగిస్తే వర్షాకాలంలో వరదల బారిన పడకుండా కాపాడవచ్చు. గత ఏడాది సెప్టెంబరులో వరదలకు విజయవాడ నగరం అతలాకుతలం అయ్యింది. మరోమారు వరద తాకిడికి నగరం నష్టపోకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలు మాత్రం తీసుకున్న దాఖలాలు ఎక్కడా కనపడటంలేదు.

నగరంలో పారుదల అవుతున్న ఏలూరు, రైవస్, బుడమేరు కాల్వల్లో పూడిక తీయకపోవడంతో ఎక్కడికక్కడ చెత్త, గుర్రపుడెక్క పేరుకుపోయి నీరు పారుదల కాకుండా అడ్డంకిగా తయారైంది. వేసవిలో కాల్వలు కట్టేసిన సమయంలో కాల్వల్లో పేరుకుపోయిన చెత్త, గుర్రపుడెక్క తొలగింపునకు అధికారులు చర్యలు చేపడితే కొంత మేరకు వర్షాకాలంలో వరదల బారిన పడకుండా కాపాడేందుకు అవకాశం ఉంటుంది. మధురానగర్, గుణదల, రామవరప్పాడువద్ద కాల్వలపై ఉన్న వంతెనలపై నుంచి చూస్తుంటే ఎక్కడెక్కడ నుంచో కొట్టుకొచ్చిన పెద్దపెద్ద వృక్షాలు సైతం కాల్వల్లో దర్శనమిస్తున్నాయంటే అతిశయోక్తిలేదు. వీటిని తొలగించకపోవడంతో వర్షాకాలంలో నీరు సజావుగా పారుదల కాకపోవడంతో వీధుల్లో వర్షపునీరు చేరిపోతుంది. తక్షణమే అధికారులు బుడమేరు కాల్వ వెంబడి ఉన్న ఆక్రమణలు తొలగించి కాల్వలో పెరిగిపోయిన గుర్రపుడెక్కను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని నగర వాసులు కోరుతున్నారు. అదే సమయంలో ఏలూరు, రైవస్ కాల్వల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి కాల్వల్లో నీరు సజావుగా పారుదల అయ్యేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఉన్నత అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని నగర వాసులు కోరుతున్నారు.

వీధి వ్యాపారుల సర్వే ప్రారంభం

కార్పొరేషన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : స్ట్రీట్ వెండర్ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు వీధి వ్యాపారుల సర్వేను నిర్వహిస్తున్నట్టు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. 2018 సర్వే ప్రకారం 17,282 మంది వీధి వ్యాపారులు ఉన్నారు. 2025 నాటికి ఎంతమంది ఉంటారు, కొత్తవారు ఎవరైనా ఉన్నారా తదితర అంశాలపై సర్వే జరుగుతుందన్నారు. 286 సచివాలయాల పరిధిలో ఉన్న 286 వెల్ఫేర్ సెక్రటరీలు ఎన్యూమరేటర్స్‌గా, ఆరుగురు సూపర్‌వైజర్ల ఆధ్వర్యంలో ముగ్గురు జోనల్ కమిషనర్ల పర్యవేక్షణలో సర్వే చేస్తున్నట్టు తెలిపారు.సర్వే ముగిసిన తర్వాత గుర్తింపు కార్డులు జారీ చేస్తామన్నారు. సర్వేలో 45 అంశాలతో కూడిన నివేదికను సేకరిస్తారని, వారికి వారి కుటుంబ సభ్యులకు వీధి వ్యాపారంతోనే జీవనోపాధి ఉందన్న ధ్రువీకరణ పత్రం సర్వేలో భాగ మన్నారు. సర్వే అనంతరం గుర్తింపు కార్డులను అందజేస్తామని కమిషనర్ తెలిపారు.

చంద్రబాబుకు మరింత సేవచేసే శక్తి దేవుడివ్వాలి

రూ. 38లక్షల చెక్కులు పంపిణీ చేసిన గద్దె



లబ్ధిదారులకు ఎల్‌వోసీ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

బెంజిసర్కిల్, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమాన్ని రాష్ట్ర అభివృద్ధిని సమానంగా చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు భగవంతుడు మరింత సేవ చేసే శక్తినివ్వాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆకాంక్షించారు. బుధవారం తూర్పు పరిధి 11వ డివిజన్ రైతుబజారు దగ్గర నియోజకవర్గంలోని 30మంది లబ్ధిదారులకు రూ. 38లక్షలు విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు(సీఎంఆర్‌ఎఫ్), ఎల్‌వోసీ పత్రాలను ఆయన స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గద్దె మాట్లాడుతూ రాజకీయాలతో సంబంధం లేకుండా దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్క అర్హులైన వారికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ డివిజన్ అధ్యక్షుడు కోనేరు రాజేష్, నేతలు దేవరపల్లి ఆంజనేయులు, కొలసాని నాగమణి, పాలడుగు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు అధ్వానం

● రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



ధ్వంసమైన సిమెంట్ రోడ్డు

భారతీనగర్, ఆంధ్రజ్యోతి : భారతీనగర్ కాలనీలోని కడియాల శివరామకృష్ణయ్య వీఎంసీ పార్కుకు ఎదురుగా ఉన్న సిమెంట్ రోడ్డు అధ్వానంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈ సిమెంట్ రోడ్డును బ్లాకులుగా వేసి రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డు నిర్మించి ఏళ్ల గడిచిపోవడంతో ప్రస్తుతం సిమెంట్ రోడ్డు ధ్వంసమై పోయింది. దీంతో ఈ రోడ్లో రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముగిసిన అవగాహన తరగతులు

రైల్వేస్టేషన్, మే 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్, నూతన పెన్షన్ విధానాలపై అవగాహన సదస్సు విజయవాడ డివిజన్ సంఘ్ కార్యాలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్నారు. బుధవారం ముగింపు కార్యక్రమంలో సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్ అల్లం రమేష్ పాత, నూతన పెన్షన్ విధానం, యూనిఫైడ్ పెన్షన్ విధానాలపై మాట్లాడారు. ఇంజనీర్లు నాగశయన, రవికుమార్ కార్మికులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి కర్నూల్ సుకుమార్, ఇంజనీరింగ్ బ్రాంచి కార్యదర్శి ఎం.ఎస్. రావు, కార్యవర్గ సభ్యులు నవీన్, లాజ రస్, మణికుమార్, బి.వెంకటేశ్వరరావు, మదర్, పాల్గొన్నారు.

నగర వీధులన్నీ జోన్లుగా విభజించాలి

● చీఫ్ సిటీప్లానర్ సంజయ్ రత్నకుమార్



మాట్లాడుతున్న చీఫ్ సిటీప్లానర్ సంజయ్ రత్నకుమార్

కార్పొరేషన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : నగర పరిధిలోని వీధులన్నీ జోన్లు వారీగా విభజించాలని నగర పాలకసంస్థ చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్ పేర్కొన్నారు. విజయవాడ నగర కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు బుధవారం ప్రధాన కార్యాలయంలోని నూతన మీటింగ్ హాలులో పట్టణ ప్రణాళిక సిబ్బంది, ప్లానింగ్ సెక్రటరీలతో నగరపాలక సంస్థ చీఫ్ సిటీప్లానర్ సంజయ్ రత్నకుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. సంజయ్ రత్నకుమార్ మాట్లాడుతూ తాజాగా నిర్వహించిన టౌన్ వెండింగ్ కమిటీలో తీసుకున్న నిర్ణయాన్ని అనుసరిస్తూ వీధి వ్యాపారులకు రెడ్ జోన్, ఎంబర్ జోన్, గ్రీన్ జోన్‌లను గుర్తించేందుకు పట్టణ ప్రణాళిక సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి, జోన్లు వారీగా విభజించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ సిటీప్లానర్ చంద్రబోస్, అసిస్టెంట్ సిటీప్లానర్‌లు మోహన్‌బాబు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ఫన్‌టైమ్ రోడ్డులో



పంటకాల్వ రోడ్డులో...

పంటకాల్వ రోడ్డులో చెత్తకుప్పలు

దుర్వాసనతో స్థానికుల ఇబ్బందులు

బెంజిసర్కిల్, ఆంధ్రజ్యోతి: పటమట పంటకాల్వ రోడ్డు స్టెల్లా ఆడిటోరియం గ్రౌండ్స్ సమీపంలో రోడ్డుపై చెత్తకుప్పలు పేరుకుపోయి దుర్వాసన కొడుతోంది. చెత్త కుండీలు నిండి పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా మారాయి. చెత్తను నిత్యం తొలగించకపోవడంతో దుర్వాసన కొడుతోంది. ఫన్‌టైం రోడ్డులో కూడా చెత్తకుప్పలు పేరుకుపోయాయి. పేరుకుపోయిన చెత్తపై ఈగలు, దోమలు వాలుతూ పరిసరాలను మరింత అపరిశుభ్రంగా మారుస్తున్నాయి. దీనిపై వీఎంసీ అధికారులు తగు శ్రద్ధ వహించి శానిటరీ సిబ్బందితో చెత్తకుప్పలను తొలగింపజేయాలని స్థానికులు కోరుతున్నారు.



విజయవాడ	శైలజ	మచిలీపట్నం	సిరికాంప్లెక్స్
విజయవాడ	జి3 రాజ్ యువరాజ్	మచిలీపట్నం	వరం PVR INOX
విజయవాడ	ఊర్వశి INOX	గుడివాడ	జి3 భాస్కర్
ఎంజిరోడ్	లైలా INOX	చల్లపల్లి	సాగర్
లబ్బీపేట	పీవీపీ సినీపోలిస్	గుడ్లవల్లేరు	రామకృష్ణ
లబ్బీపేట	పీవీఆర్‌సినిమాస్	కైకలూరు	జి3 విజయలక్ష్మి
బెంజిసర్కిల్	క్యాపిటల్ సినిమాస్	జంగారెడ్డిగూడెం	శ్రీదుర్గామహల్
పటమట	LEPL INOX	లక్ష్మీపురం	అంజనాసినీమ్యాక్స్
ఆటోనగర్	పవర్ సినీపోలిస్	నూజివీడు	సత్యనారాయణ
పటమట	సౌమ్య	హనుమాన్‌జంక్షన్	గుర్గసినీమ్యాక్స్
భవానీపురం	స్వాతి	కొండపల్లి	శివకృష్ణ
పోరంకి	తారాస్వేస్	కంచికచర్ల	వివిఆర్ సినీప్లెక్స్
గుణదల	రామ్ సినిమాస్	నందిగామ	జి3మయూరి
పోరంకి	వెంకటకృష్ణ	జగ్గయ్యపేట	జి3 కమల
కంకిపాడు	శ్రీరామచంద్ర	మైలవరం	సంఘమిత్ర
ఉయ్యూరు	జి3 శ్రీనివాస	తిరువూరు	వెంకటేశ్వర
పామర్రు	శివరామ్	విస్సన్నపేట	శ్రీరామ్

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



భారతీనగర్, ఆంధ్రజ్యోతి: విజయలక్ష్మి కాలనీలోని కోటి రెడ్డి రోడ్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పిచ్చి మొక్కలతో నిండి ప్రమాదకరంగా ఉంది. కోటి రెడ్డి రోడ్డులో నివాసాలకు దగ్గరగా, రోడ్డుకు అతి సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ లేకపోవడం, ప్రధాన రోడ్డు కావడంతో ప్రజలు ఈ ప్రాంతంలో రాకపోకలు సాగించడానికి భయపడుతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు

విజ్ఞాన సర్వస్వ రూపశిల్పి కొమర్రాజు లక్ష్మణరావు గ్రంథావిష్కరణ



కొమర్రాజు లక్ష్మణరావు జీవిత విశేషాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న యార్లగడ్డ, డాక్టర్ గుమ్మా సాంబశివరావు తదితరులు

విజయవాడ కల్చరల్, మే 14 (ఆంధ్రజ్యోతి) : కొమర్రాజు లక్ష్మణరావు జీవిత విశేషాలు, సాహిత్య కృషిని ప్రతిబింబిస్తూ ఆంధ్ర విశ్వవిద్యాలయం విశ్రాంత అధ్యాపకులు ఆచార్య వెలమల సిమ్మన్న, ఆంధ్ర లయోలా కళాశాల విశ్రాంత వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గుమ్మా సాంబశివరావు రచించిన 'విజ్ఞాన సర్వస్వ రూపశిల్పి కొమర్రాజు లక్ష్మణరావు అనే గ్రంథాన్ని విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీలోని హిందీ భవన్‌లో బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ హిందీ సలహా మండలి సభ్యులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ పాల్గొని, తెలుగువారికి విజ్ఞాన సర్వస్వం అంటే ఏమిటో తెలియని రోజుల్లో, ఆ దిశగా ముందడుగు వేసి అపూర్వమైన కానుకలను అందించిన మహనీయుడు కొమర్రాజు లక్ష్మణరావని, ఈ తరానికి ఆయన ఘనత తెలియకపోవడం బాధాకరమన్నారు. ఆ లోటును తీర్చేందుకు ఈ గ్రంథం ఎంతో ఉపయోగపడుతుందని కొనియాడారు. అనంతరం గ్రంథ రచయితలను సత్కరించి అభినందించారు. అనంతరం గ్రంథ సమీక్షలో ప్రసంగించిన డాక్టర్ డీవీ సూర్యారావు, కొమర్రాజు రచనలను సేకరించి, విమర్శనాత్మక దృష్టితో విశ్లేషించిన ఈ గ్రంథం, భావితరాలకు తెలుగు సాహిత్య చరిత్ర, భాషాశాస్త్ర పరిశోధనలకు దిక్సూచి అవుతుంది అన్నారు. తెలుగు సంస్కృతి పరిరక్షణకు, విజ్ఞాన సమృద్ధికి ఈ గ్రంథం ఓ విలువైన డాక్యుమెంట్‌గా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

కొనసాగుతున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల ధర్నా



ధర్నాచౌక్‌లో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల ధర్నా

ధర్నాచౌక్, మే 14 (ఆంధ్రజ్యోతి): సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కరించాలని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. దీనిలో భాగంగా ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నాచౌక్‌లో చేపట్టిన ధర్నా బుధవారం ఎనిమిదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా యూనియన్ నేతలు మాట్లాడుతూ అత్యవసర విభాగమైన నీటి సరఫరా, వీధి దీపాలు, డ్రెయినేజీ, పార్కు్లు, మెకానిక్స్ టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాల వారికి టెక్నికల్ రూ.29,200, నాన్ టెక్నికల్ రూ.24,500 వేతనం అమలు చేయాలన్నారు. పదేళ్ల పైబడిన మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాలన్నారు. హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ రద్దు చేస్తే కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, ఇతర ఉద్యోగుల మాదిరిగా గ్రాడ్యూటీతో పాటు కనీస పెన్షన్ రూ.10 వేలు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.ఫక్రుద్దీన్, కె.కోటేశ్వరరావు గౌడ్, నగర గౌరవాధ్యక్షుడు గుంటుపల్లి శేషగిరి రావు, అధ్యక్షప్రధానకార్యదర్శులు, పిట్ట మహేష్ బాబు, ఎండీ.గౌస్, ఉపాధ్యక్షులు పరసా బుచ్చిబాబు, వేముల జయపాల్, కోశాధికారి పడిగిపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బందరు ముఖచిత్రం మార్చేద్దాం

కృష్ణాజిల్లా చరిత్రను చాటేలా మసూలా బీచ్ ఫెస్ట్

● క్రీడలు, సాంస్కృతిక ప్రదర్శనలకు ప్రాధాన్యత ● జూన్ మొదటి వారంలో బీచ్ ఫెస్టివల్
● సీఎం చంద్రబాబు రాక ● స్వదేశీ దర్శన్ పథకం కింద రూ.120 కోట్లు : మంత్రి రవీంద్ర

మచిలీపట్నం టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో కృష్ణాజిల్లా చరిత్రను చాటిచెప్పేలా జూన్ మొదటి వారంలో మసూలా బీచ్ ఫెస్ట్-2025 నిర్వహిస్తామని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. బుధవారం మంగినపూడి బీచ్‌లో జరుగుతున్న బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్లపై మంత్రి కొల్లు రవీంద్ర అధికారులతో చర్చించారు. ఆర్డీవో స్వాతి, ఎలక్ట్రికల్ ఏడీ, పోలీస్, టూరిజం, స్పోర్ట్స్, రవాణాశాఖ అధికారులతో చర్చించారు. సినీఆర్ట్ డైరెక్టర్, డిజైనర్ వంకా రమణతో తయారు చేయించిన పలు కళాఖండాల ఆకృతులను మంత్రి పరిశీలించారు. బీచ్ రోడ్డు వెడల్పు పనులను పరిశీలించారు. బీచ్ కబడ్డీ క్రీడాకారులతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మే 15 నుంచి జరగాల్సిన బీచ్ ఫెస్టివల్‌ను జూన్ మొదటి వారానికి వాయిదా వేశామన్నారు. మొదటి రోజు 2వేల మంది క్రీడాకారులతో జాతీయ బీచ్ కబడ్డీ, జల క్రీడలు పోటీలు నిర్వహిస్తామన్నారు. పారా గ్లైడింగ్, హెలికాప్టర్ రైడింగ్, నీటిలో నడిచే స్కూటర్లు, మోటారు స్పీడ్ బోట్లుతో సాహస క్రీడలు ఉంటాయన్నారు. అలాగే జెయింట్ వీల్స్, ఫ్లవర్ ఎగ్జిబిషన్, మ్యూజికల్ ఫౌంటేన్, ఫుడ్‌కోర్టు ఏర్పాటు చేస్తామన్నారు. సినీ కళాకారులు, సంగీత దర్శకులతో సంగీత విభావరి నిర్వహిస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు కేంద్రమంత్రులను ఆహ్వానిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ స్వదేశీ దర్శన్ పథకం కింద రూ.150 కోట్లతో బీచ్‌లో అభివృద్ధి చేస్తామన్నారు. రిసార్ట్స్, హోటళ్లు నెలకొల్పేందుకు రూ.800 నుంచి వెయ్యి కోట్ల వరకు పెట్టుబడులు పెట్టే అవకాశాలున్నాయన్నారు. విజయవాడతో పాటు రాష్ట్ర రాజధాని అమరావతికి మచిలీపట్నం ముఖ ద్వారమన్నారు. హైదరాబాద్‌కు సమీపంలోనే ఈ బీచ్ ఉందన్నారు. మంత్రి వెంట ఆర్డీవో స్వాతి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచేనాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, తహసీల్దార్లు నాగభూషణం, హరనాథ్, సీఐ ఏసుబాబు, విద్యుత్ శాఖ డీఈ రామకృష్ణ, రహదారులు, భవనాల శాఖ డీఈ సంగీత, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ తలారి సోమశేఖర్, లంకే హరికృష్ణ ఉన్నారు.



గేట్ వే ఆఫ్ అమరావతి కళాఖండం నమూనాను పరిశీలిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

మోడల్ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటు సరైందికాదు: ఏపీటీఎఫ్

దర్నాచౌక్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఏ రాష్ట్రంలో లేని విధంగా తొమ్మిది రకాల పాఠశాలలను నెలకొల్పే ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని, అయితే ప్రభుత్వ పాఠశాలలు బలహీనపడతాయని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో ఉపాధ్యాయులు బుధవారం ధర్నా చేపట్టారు. జీవో 117కు ముందున్న పాఠశాల వ్యవస్థ విధానాలు కావాలని డిమాండ్ చేశారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల మాట్లాడుతూ విద్యారంగాన్ని గాడిలో పెడతామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ విధంగా చేయకపోగా విద్యారంగాన్ని మరింత గందరగోళంలోకి నెడుతుందని విమర్శించారు. ఈ విధానాన్ని తమ ఫెడరేషన్ ముక్తకంఠంతో వ్యతిరేకిస్తుందన్నారు.ఉపాధ్యాయ ప్రధాన సంపాదకుడు షేక్ జిలానీ, ఫెడరేషన్ మాజీ ప్రధానకార్యదర్శి పి.పాండురంగ వరప్రసాద్, ఎ.శ్యామ్‌సుందర్‌రెడ్డి, కె.అశోక్‌కుమార్, టి.త్రినాథ్ తదితర నేతలతో పాటు అధికంగా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





సదస్సులో మాట్లాడుతున్న కుమారి

తూకంలో ఎలాంటి తేడాలు ఉండొద్దు

● తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ కుమారి

విజయవాడ, మే 14 (ఆంధ్రజ్యోతి): తూకంలో తేడా లేకుండా ఖచ్చితత్వం ఉండాలని, ఎలాంటి మోసాలకు పాల్పడొద్దని తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ బి.కుమారి అన్నారు. ప్రపంచ మెట్రోలజీ దినోత్సవం సందర్భంగా బుధవారం నగరంలోని బంగారు దుకాణాల అసోసియేషన్ సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ ఖచ్చితమైన తూనికలు, పరికరాలు మాత్రమే ఉపయోగించాలన్నారు. బంగారు దుకాణాల్లో 1 మి. గ్రా తూకం ఉండాల్సిందేనన్నారు. ఇప్పటి వరకు కూరగాయల మార్కెట్లు, వంటనూనె తయారీదారులు, గ్రోసరీ రిటైల్ స్టోర్స్, ఫార్మస్యూటికల్స్ వినియోగదారులకు మాత్రమే అవగాహన కల్పించడం జరిగిందన్నారు. తూకంలో ఖచ్చితత్వంతో పాటు వాస్తవ ధరకు కన్నా అధిక ధరలకు అమ్మితే చర్యలుంటాయని బి.కుమారి హెచ్చరించారు.

కుమ్మరి శాలివాహన సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన సంఘనేతలు

విద్యాధరపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కుమ్మరి - శాలివాహన సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన పేరేపి ఈశ్వర్‌ను బుధవారం అశోక్‌నగర్‌లోని ఆయన కార్యాలయంలో సంఘం నేతలు నెల్లూరి వీరరాజు (నాని), బొమ్మిన రవి, రాజవరపు వెంకట్‌తో పాటు బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ కె.శివశర్మ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఈశ్వర్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపారు.



ఈశ్వర్‌ను కలిసిన కుమ్మరి సంఘం నేతలు వీర్రాజు, రవి, వెంకట్



ఫ్లెక్స్ అప్పియరల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీ భూమిపూజలో పాల్గొన్న ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఏపీఎస్ఎంసీ చైర్మన్ శివశంకర్, టీడీ జనార్దన్

మహిళలతోనే ఆర్థికాభివృద్ధి

● రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి అనుకూల వాతావరణం.
● ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): మల్లవల్లి పారిశ్రామికవాడ అభివృద్ధి ద్వారా రాష్ట్రం ఉన్నత శిఖరాలకు ఎదిగేలా కూటమి ప్రభుత్వం సహాయసహకారాలనందిస్తోందని పారిశ్రామివేత్తలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. మల్లవల్లి పారిశ్రామికవాడలో రూ.8కోట్లకు పైగా వ్యయంతో నిర్మిస్తున్న ఫ్లెక్స్ అప్పియరల్స్ ప్రైవేట్ లిమిటెడ్ (దుస్తులకు సంబంధించిన పరిశ్రమ) ఫ్యాక్టరీ నిర్మాణానికి బుధవారం నిర్వహించిన భూమిపూజలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఏపీఎస్ఎంసీ చైర్మన్ శివశంకర్, టీడీ జనార్ధన్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ ఎక్కడ స్త్రీ గౌరవించడబడుతుందో అక్కడ అభివృద్ధికి జరుగుతుందన్నారు. ప్రపంచ జనాభాలో సగభాగంగా ఉన్న మహిళలకు సహకారం అందించగలిగితే దేశాభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రధాని మోదీ చెప్పినట్లు మహిళ సాధికారత కాకుండా మహిళలతో సాధికారతగా గుర్తించాలన్నారు. మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతున్న సమయంలో రాష్ట్రాల్లోని మహిళాశక్తిని గుర్తించి సహకరించేలా కేంద్రసహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ పురందేశ్వరి సూచించారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్ధన్ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి సహకరించే పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సింగిల్ విండో పథకం ప్రవేశపెట్టినా నెలల తరబడి తాత్సార్యం చేయడం కూడదన్నారు. పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా ఏపీఐఐసీ అధికారులు సహకరించాలని సూచించారు. సమస్యలను పరిష్కరిస్తూ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో కలిసి మల్లవల్లి పారిశ్రామికవాడ అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోనే మేటి పారిశ్రామిక వాడగా అభివృద్ధి చెందుతుందన్నారు. పారిశ్రామిక వాడలో ఏర్పాటు చేసిన మౌలికసదుపాయాలు, లే అవుట్‌లు బాగున్నాయన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించేలా పారిశ్రామికవేత్తలు సహకరించాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. రైల్వే, ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు, మచిలీపట్నం పోర్టు లాంటి అన్ని రకాల రవాణా సౌకర్యాలతో కూడిన అనువైన ప్రాంతం రాష్ట్రంలో మరెక్కడా లేదని, పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే యార్లగడ్డ హామీ ఇచ్చారు. పరిశ్రమలకు భూమి పొందినవారు 18 నెలల్లో స్థాపించాలని లేదా భూములు వెనక్కు తీసుకునేలా ప్రభుత్వం పాలసీ తీసుకు వచ్చిందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి ఐదేళ్లుగా పట్టిన గ్రహణం వీడిందని, పారిశ్రామికవేత్తలు సంతోషంగా పెట్టుబడులు పెట్టవచ్చని, ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తుందని ఏపీఎస్ఎంసీ చైర్మన్ శివశంకర్ అన్నారు. అనంతరం మల్లవల్లి పారిశ్రామికవేత్తలు వారిని ఘనంగా సత్కరించారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ, ఫ్లెక్స్ అప్పియరల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు చెరుకూరి చాముండేశ్వరి, రోహిత, టీడీపీ నేతలు మూల్పూరి సాయికళ్యాణి, దయాల రాజేశ్వరరావు, పుట్టా సురేష్, అక్కినేని కృష్ణాజీ, బీజేపీ నేతలు చిగురుపాటి కుమారస్వామి, తుమ్మల అంజిబాబు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు ప్రాధాన్యత

● హోంమంత్రి అనిత

ఉయ్యూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతి భద్రతలకు ప్రాధాన్యతనిచ్చి కూటమి ప్రభుత్వం పాలన చేస్తుందని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. గండిగుంట పంచాయతీ పరిధి కాటూరు రోడ్డులో కాకాని నగర్ వద్ద ఉయ్యూరు రూరల్ పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కుంటుపడిందని, నిధులున్నప్పటికీ పనులు పూర్తిచేయలేక పోయారన్నారు. రాష్ట్రంలో అన్ని పోలీస్‌స్టేషన్లకు భవనాలు నిర్మిస్తామన్నారు. నేరాలు అరికట్టేందుకు సీసీ కెమెరాలు, డ్రోన్ల వంటి అధునాతన పరికరాలతో పోలీస్ వ్యవస్థ పని చేస్తోందన్నారు. రూరల్ పోలీస్ స్టేషన్ నిర్మాణానికి 20 సెంట్ల స్థలం ఇచ్చిన దాత సజ్జా వెంకటేశ్వరరావు, సహాయం అందజేసిన వారందరూ అభినందనీయులన్నారు. కొల్లు రవీంద్ర మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణలో రూరల్ స్టేషన్‌తో పాటు ఇతర ప్రభుత్వ భవనాలు పోగా 2017లో రూరల్ స్టేషన్ భవనంతో పాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైన స్థలాన్ని సజ్జా వెంకటేశ్వరరావు విరాళంగా ఇస్తే భవనాల నిర్మాణం ప్రారంభించి 80 శాతం పైగా పూర్తిచేస్తే తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం 5ఏళ్ల పాటు పనులు పూర్తిచేయకుండా నిర్లక్ష్యం చేసి వృథాగా ఉంచిందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. తిరిగి కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సజ్జా వెంకటేశ్వరరావు, ఇతర దాతల సహకారంతో పనులు పూర్తిచేసి ప్రారంభించడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా దాతలకు ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు అభినందనలు తెలిపారు. కంకిపాడు సీఐ మురళీకృష్ణ, ఉయ్యూరు సీఐ రామారావు, రూరల్ ఎస్సై సురేశ్‌బాబు, పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.



రూరల్ స్టేషన్ నూతన భవనం ప్రారంభిస్తున్న మంత్రులు

కేసులు ఎత్తివేయాలి.. దండమూడి వినతి

వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఉద్యమం చేసిన టీడీపీ కార్యకర్తలు, తెలుగు యువత నేతలపై అక్రమంగా పెట్టిన కేసులు, రౌడీ షీట్లు ఎత్తివేయాలని జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు దండమూడి చౌదరి హోంమంత్రి అనితను కోరారు. బుధవారం ఉయ్యూరు వచ్చిన ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఉత్కంఠభరితంగా ఎడ్ల బండలాగుడు పోటీలు

నందిగామ రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాలపాడు గ్రామంలో తిరునాళ్ల మహోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఎడ్ల బండలాగుడు పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. బుధవారం ఆరు పళ్ల జతల ఎడ్ల బండ లాగుడు పోటీలను లక్ష్మీ పేరంటాళ్లు అమ్మవారి ఆలయ వంశపారంపర్య ధర్మకర్త చిరుమామిళ్ల వెంకటలక్ష్మీ సాయిబాబు ప్రారంభించారు. ఈ పోటీల్లో 17 జతలు పాల్గొనగా 15 నిమిషాల వ్యవధిలో 10.20 క్వింటాళ్ల బండ లాగినట్లు రైతు కమిటీ సభ్యులు తెలిపారు. ఎడ్ల యజమానులకు అంబారుపేట సత్యమ్మ అమ్మవారి మాజీ చైర్మన్ గరికపాటి భాస్కరం సోదరులు వస్త్రాలు, జ్ఞాపికలు అందజేశారు. పోటీలను తిలకించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.



నాలుగు పళ్ల విభాగం విజేతలు

మంగళవారం రాత్రి జరిగిన 4 పళ్ల జతల విభాగంలో గుంటూరు జిల్లా కొల్లిపర గ్రామానికి చెందిన గుడిబండ మాధవరెడ్డి శ్రీనివాసరెడ్డి ఎడ్ల జత 4,750 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచి రూ.30 వేలు గెలుచుకుందన్నారు. అలాగే బాపట్ల జిల్లా సంతమాగులూరుకు చెందిన వజ్రాల తేజరెడ్డి, కృష్ణాజిల్లా పెనమలూరుకు చెందిన అనంతనేని శ్రీకన్యశ్రీ మధు ఎడ్ల జత 4,702 అడుగులు లాగి ద్వితీయ స్థానంలో నిలిచి రూ.25వేలు, బాపట్ల జిల్లా యద్దనపూడికి చెందిన ఖాదర్ మస్తాన్, బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం పూసపాడుకు చెందిన ఏలూరి లిఖిత చౌదరి ఎడ్ల జత 3,750 అడుగుల దూరం లాగి తృతీయ స్థానంలో నిలిచి రూ.20వేలను గెలుచుకుందన్నారు. చందర్లపాడు గ్రామానికి చెందిన గడుపూడి సాంబశివరావు ఎడ్లజత 3,500 అడుగుల దూరం లాగి 4వ స్థానంలో నిలిచి రూ.18 వేలను గెలుచుకున్నాయి. వెంకటేశ్వరరావు, విక్రం, రాంబాబు, వెంకట్రావ్, గంటా శివాజీ, మధుసూదనరావు, దాతల సహకారంతో బహుమతులు అందజేశారు.

ఉపాధి హామీ పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించను: కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మే 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా శ్రామికులకు 80 లక్షల పనిదినాలను కల్పించాలనే లక్ష్యాన్ని సాధించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, లక్ష్య సాధనలో నిర్లక్ష్యాన్ని సహించనని, పనుల నిర్వహణలో వెనుకబడితే చర్యలు తప్పవని, శ్రామికులకు రూ.307 కనీస వేతనం కల్పించి ఆర్థిక ఊతం ఇచ్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో చేపడుతున్న పనుల ప్రగతిపై బుధవారం నీటి యాజమాన్య సంస్థ అధికారులు, ఉద్యాన శాఖ అధికారులు, మండలాభివృద్ధి అధికారులు, పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ అధికారులతో కలెక్టర్ లక్ష్మీశ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ కాన్ఫరెన్సులో కలెక్టర్ మాట్లాడుతూ శ్రామికులకు పని కల్పించి వారికి ఆర్థిక ఊతం ఇవ్వాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చడంలో ఎటువంటి అలసత్వం వహించినా సహించేదిలేదన్నారు. ఈ ఏడాది శ్రామికులకు 80 లక్షల పనిదినాలను కల్పించాలన్నది లక్ష్యం కాగా ఇప్పటి వరకు కేవలం 13.40 లక్షల పనిదినాలను మాత్రమే కల్పించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నానన్నారు. ఉపాధి హామీ ద్వారా 3వేల పంట కుంటలను నిర్మించాలనే లక్ష్యంగా నిర్దేశించామని, ఇప్పటివరకు 572 కుంటలు పూర్తి చేయడం జరిగిందని, వివిధ దశలలో ఉన్న 2012, పంట కుంటల నిర్మాణాలను రానున్న జూన్ నాటికి నూరు శాతం నిర్మాణం పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ప్రతి గ్రామ పంచాయితీ పరిధిలో ఉద్యాన పంటల సాగుకు కనీసం 20 ఎకరాలను గుర్తించి మల్లె, గులాబి పూల తోటలు, మామిడి, జామ, నిమ్మ, సపోట, నారింజ, సీతాఫలం, డ్రాగన్‌ఫ్రూట్, జీడి మామిడి, దానిమ్మ, నేరేడు, ఆపిల్‌బేర్, మునగ, పామాయిల్ వంటి పండ్ల తోటలను పండించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యాన పంటలను చేపట్టేందుకు రైతులను ప్రోత్సహించాలని ఉపాధి హామీ పనుల ద్వారా ఉచితంగా రైతులు ఉద్యాన పంటల సాగును చేపట్టవచ్చునన్న సమాచారాన్ని రైతులకు తెలియజేయాలని రైతులు ముందుకు వస్తే ఉపాధి హామీ పనుల ద్వారా మొక్కలు నాటేందుకు గుంతల తవ్వకం నుంచి మొక్కలు నాటి సంరక్షించేందుకు పనిదినాలను కల్పించాలని కలెక్టర్ తెలిపారు. ఉద్యాన తోటలకు ఉపయోగపడేలా పంట కుంటలు నిర్మాణాలను చేపట్టాలని, తద్వారా మొక్కల పెంపకానికి ఉపయోగించుకోవడంతో పాటు భూగర్భ జలాల పెంపుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వీడియో కాన్ఫరెన్సులో జాతీయ ఉపాధి హామీ పథకం ప్రాజెక్ట్ డైరక్టర్ ఎ.రాము, ఉద్యాన శాఖ సహాయ సంచాలకులు పి.బాలాజీ కుమార్, గ్రామ వార్డు సచివాలయ ప్రత్యేక అధికారి జి.జ్యోతి, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, మండలాభివృద్ధి అధికారులు, ఉపాధి హామీ, ఉద్యాన శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

పీ4 అమలుకు పూర్తి వివరాలు నమోదు చేయాలి

బంగారు కుటుంబాల మార్గదర్శకుల ఎంపికకు ప్రత్యేకంగా రూపొందించిన ఫార్మాట్‌లో పూర్తి వివరాలను నమోదు చేయాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. పీ4 అమలులో భాగంగా బంగారు కుటుంబం - మార్గదర్శి కుటుంబ సమగ్ర సమాచార వివరాల నమోదుపై బుధవారం ఎంపీడీవోలు, నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ లక్ష్మీశ కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదరికాన్ని సమూలంగా నిర్మూలిద్దామనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుచూపుతో ప్రవేశపెట్టిన పీ4 విధానం అమల్లో అధికారుల భాగస్వామ్యం ముఖ్యమన్నారు. దీనిలో భాగంగా ఇప్పటికే జిల్లాలోని 604 సచివాలయాల పరిధిలో 86,398 బంగారు కుటుంబాలను గుర్తించడం జరిగిందన్నారు. వీఎంసీ పరిధిలోని 286 సచివాలయాల పరిధిలో 46,169 కుటుంబాలు ఉన్నాయన్నారు. కుటుంబసభ్యుల వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన ఫార్మాట్‌లో నమోదు చేసేలా ఫ్లాష్ సర్వే జరగాలన్నారు. పీ4లో ప్రతి కుటుంబం వివరాలు సమగ్రంగా తయారుచేసి సిద్ధం చేయాలన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కన్నా ముందుగానే కార్యాచరణ ప్రణాళిక రూపొందించి సిద్ధం చేయడం ద్వారా ఉన్నత స్థాయిలో ఉన్నవారు పేదవర్గాలకు అందించే సహాయం పూర్తిస్థాయిలో సద్వినియోగం అవుతుందని, విజన్ 2047 లక్ష్యం నెరవేరుతుందన్నారు.

సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

● 16 నుంచి 25 వరకు నడుపుతాం : ప్రజారవాణా అధికారి ఎం.వై.దానం

విజయవాడ, మే 14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15 నుంచి 26 వరకు జరిగే సరస్వతి పుష్కరాలను పురస్కరించుకుని కాళేశ్వరం త్రివేణి సంగమ యాత్రకు నగరంలోని పండిట్ నెహ్రూ బస్టేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా ప్రజారవాణా అధికారి ఎంవై దానం తెలిపారు. దీనికోసం సూపర్ లగ్జరీ, ఇంద్ర ఏసీ బస్సులు ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సులు ఈనెల 16 నుంచి 25 వరకు ప్రతిరోజూ అందుబాటులో ఉంటాయన్నారు. ఇక్కడ బయలుదేరిన బస్సులు మూడు రోజులు తెలంగాణలోని వివిధ పుణ్యక్షేత్రాల అనంతరం 4వ రోజు ఉదయం నగరానికి చేరుకుంటాయన్నారు. విజయవాడ నుంచి ఖమ్మం, వరంగల్, భూపాలపల్లి మీదగా కాళేశ్వరం వెళతాయన్నారు. పుష్కరస్నానం, ముక్తేశ్వరస్వామి దర్శనానంతరం ధర్మపురిలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి, కొండగట్టు వీరాంజనేయ స్వామి, వేములవాడ శ్రీ రాజరాజేశ్వరి దేవి, మహాశివుని దర్శనానంతరం రెండోరోజు బస్సు వేములవాడలో ఆగుతుందన్నారు. 3వ రోజు ఉదయం వరంగల్ భద్రకాళిమాత, వేయిస్తంభాల గుడి, రామప్ప దేవాలయం, రామప్ప సరస్సు దర్శనం తరువాత 4వ రోజు నగరానికి తిరిగొస్తుంది. పుష్కరయాత్రకు వెళ్లాలనుకునేవారు ఆన్‌లైన్ (ఏపీఎస్ఆర్టీసీఆన్‌లైన్.ఇన్) లేదా దగ్గర్లోని బస్టేషన్, ఆర్టీసీ బుకింగ్ ఏజెంట్ల ద్వారా టిక్కెట్లు బుక్ చేసుకోవచ్చన్నారు. ఒకవేళ యాత్రకు సమూహంగా (కనీసం 30 మంది) వెళ్లాలనుకుంటే ఇంటి నుంచే బస్సు ఏర్పాటు చేస్తామని ఎం.వై.దానం వెల్లడించారు. సూపర్‌లగ్జరీకి ఒక్కొక్కరి రూ.1999, ఇంద్ర ఏసీకి రూ.2599గా ధరలు నిర్ణయించారు. వివరాలకు 80742 98487, 93903 98475 నంబర్లను సంప్రదించాలన్నారు.

పాలిసెట్ ఫలితాల్లో అమ్మాయిలదే పైచేయి

ఎన్టీఆర్ జిల్లాకు 6, కృష్ణాకు 15వ ర్యాంక్

బెంజిసర్కిల్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణాజిల్లా పాలిసెట్ ఫలితాల్లో అమ్మాయిలే పై చేయి సాధించారు. మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ బుధవారం పాలిసెట్-2025 ఫలితాలను విడుదల చేయగా ఎన్టీఆర్ జిల్లా 6వ ర్యాంక్, కృష్ణాజిల్లా 15వ ర్యాంక్ సాధించింది. ఈ ప్రవేశ పరీక్షకు ఎన్టీఆర్ జిల్లా నుంచి 6,761 మంది హాజరుకాగా 6,532 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 4,124 మంది, బాలికలు 2,637 మంది హాజరుకాగా వీరిలో బాలురు 3,967 మంది, 2,565 మంది బాలికలు ఉత్తీర్ణులయ్యారు. బాలురు 96.19 శాతం, బాలికలు 97.27 శాతం ఉత్తీర్ణత శాతం సాధించారు. మొత్తం బాలబాలికలు కలిపి ఎన్టీఆర్ జిల్లాలో 96.61 శాతం ఉత్తీర్ణులయ్యారు. కృష్ణాజిల్లాలో 4,083 మంది బాలబాలికలు పరీక్షకు హాజరు కాగా 3,882 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 2,425 మంది పరీక్షకు హాజరుకాగా 2,269 మంది, బాలికలు 1,658 మంది పరీక్షకు హాజరుకాగా వారిలో 1613 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 97.29 శాతం, బాలురు 93.57 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 95.08 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు.

ర్యాంకర్‌లు వీరే..

ఎన్టీఆర్ జిల్లా నుంచి షేక్ ముబీన్ 49వ ర్యాంక్, వేములకొండ ధీమంత్ 64వ ర్యాంక్, చోరగుడి శశి మంజూష 93వ ర్యాంక్ సాధించారు. కృష్ణాజిల్లాలో ఉత్సా జోషిత 331వ ర్యాంక్, నల్లా హర్షిత శేషసాయి 498వ ర్యాంక్, కడవకొల్లు హేమ వరుణ్ చతుర్వేది 520 ర్యాంక్ సాధించారు. అలాగే వీవి జోషిత 116 మార్కులు, ఎన్ హర్షిత శేషసాయి, కే హేమవరుణ్ చతుర్వేది 115 మార్కులు సాధించి కృష్ణాజిల్లాలో తొలి మూడు స్థానాల్లో నిలిచారు.

గన్నవరంలో ఊపందుకున్న అభివృద్ధి పనులు

● జాతీయ రహదారి సుందరీకరణ పనులు వేగవంతం చేయండి ● అధికారులకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాలు

విజయవాడ, మే 14 (ఆంధ్రజ్యోతి): గన్నవరం ముఖచిత్రాన్ని మార్చే జాతీయ రహదారి డివైడర్లు, ఫుట్‌పాత్‌ల సుందరీకరణ పనులను మరింత వేగవంతం చేయాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గన్నవరం విమానాశ్రయం అమరావతికి ప్రధాన ద్వారమన్నారు. ఇది రాష్ట్రానికి వచ్చే పారిశ్రామికవేత్తలు, విదేశీ అతిథులు నగరానికి వచ్చినప్పుడు మొదటగా చూసే ప్రాంతమని, దీన్ని మరింత అందంగా, శుభ్రంగా ఉంచాల్సిన అవసరం ఉందన్నారు. డివైడర్లపై మొక్కలు లేని చోట్ల తక్షణమే మొక్కలు నాటాలన్నారు. పుట్‌పాత్‌లపై ఆకర్షణీయమైన కుండీలు ఏర్పాటు చేసి అందులో హరిత ముసుగు ఏర్పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డివైడర్లపై సృజనాత్మక రంగులతో కూడిన చిత్రలేఖనాలతో అందంగా తీర్చిదిద్దాలన్నారు. డీపీవో, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు, ఇతర శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

రాజధాని పనులకు అనుమతులు

కలెక్టరేట్, మే 14 (ఆంధ్రజ్యోతి): అమరావతి నిర్మాణంలో భాగంగా కీలకమైన భవన నిర్మాణ సముదాయాలకు లెటర్ ఆఫ్ అవార్డులను సీఆర్‌డీఏ కమిషనర్ కె.కన్నబాబు బుధవారం అందచేశారు. విజయవాడలోని సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో అమరావతిలోని నాన్ గెజిటెడ్ అధికారుల హౌసింగ్ క్వార్టర్స్ భవన నిర్మాణ పనులకు ఎల్‌అండ్‌టీ సంస్థ ప్రతినిధులకు, అలాగే గెజిటెడ్ అధికారుల టైప్-1, టైప్-2, గ్రూప్-డి అధికారుల రెసిడెన్షియల్ క్వార్టర్స్ నిర్మాణ పనులకు షాపూర్‌జీ, పల్లోంజీ సంస్థ ప్రతినిధులకు లెటర్ ఆఫ్ అవార్డును కమిషనర్ అందచేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్‌తో పాటు ఈఎన్‌సీ ఆర్.గోపాలకృష్ణారెడ్డి, సీఆర్‌డీఏ అధికారులు పాల్గొన్నారు.

కౌన్సెలింగ్

మా బాబుకు కంటి సమస్య ఎందుకు?

డాక్టర్! మా అబ్బాయికి ఎనిమిదేళ్లు. చదువులో వెనకబడుతున్నాడు. బోర్డు మీద రాసినవి చదవలేకపోతున్నాడు. పుస్తకాలను కూడా కళ్లకు దగ్గరగా పెట్టుకుని చదువుతున్నాడు. మా బాబుకు ఉన్న కంటి సమస్య గురించి వివరిస్తారా?

- ఓ సోదరి, హైదరాబాద్



పెద్దల్లో లాగే పిల్లల్లో కూడా దృష్టి దోషాలు సహజం. 'పిల్లలు పెరిగేకొద్దీ అన్నీ సర్దుకుంటాయిలే!' అని నిర్లక్ష్యం చేస్తే, శాశ్వతంగా కంటి చూపే పోయే ప్రమాదం ఉంటుంది. కాబట్టి పిల్లల కంటి సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలి. పిల్లల్లో పుట్టుకతో లేదా పెరిగే క్రమంలో కంటి సమస్యలు తలెత్తుతాయి. వీటిని తేలికగానే కనిపెట్టవచ్చు. కొన్ని సమస్యలు కనుగుడ్లలో స్పష్టంగా కనిపిస్తే, ఇంకొన్ని పిల్లలు ప్రవర్తన ద్వారా బయల్పడుతూ ఉంటాయి. దూరం లేదా దగ్గరి వస్తువులు కనిపించని సమస్య 'రిఫ్రాక్టివ్ ఎర్రర్స్'. ఈ సమస్య వల్ల పిల్లలు పుస్తకాన్ని కళ్లకు దగ్గరగా పెట్టుకోనిదే చదవలేకపోతూ ఉంటారు. టివి లేదా బ్లాక్‌బోర్డు దగ్గరకు వెళ్లి చూడడం చేస్తూ ఉంటారు. కంటిచూపు తక్కువగా ఉండడం మూలంగా ఆటలకు కూడా పిల్లలు దూరంగా ఉంటూ ఉంటారు. ఎక్కువ సమయాల పాటు తోటి పిల్లలతో కలవకుండా, అంతర్ముఖులుగా ఇళ్లకు, తమ గదులకే పరిమితమైపోతూ ఉంటారు. చదువులో కూడా వెనకపడిపోతూ ఉంటారు. పిల్లల్లో ఈ లక్షణాలను గమనించినప్పుడు ఆలస్యం చేయకుండా కంటి వైద్యుల చేత పరీక్ష చేయించాలి. కళ్లలో సమస్య ఉందని తేలినప్పుడు, కళ్లజోడు వాడుకోవలసి ఉంటుంది. ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తే, పిల్లల కంటిచూపు బాగా దెబ్బతిని, అంధత్వం వచ్చే అవకాశం ఉంటుంది. కంటి నంచి మెదడుకు సిగ్నల్స్ అందక కన్ను లేజీ ఐగా మారి, 'అంబ్లియోపియా' అనే పరిస్థితి తలెత్తుతుంది. ఈ సమస్యను చికిత్సతో చక్కదిద్ది, కంటిచూపును మెరుగు పరచడం కష్టం. కాబట్టి సమస్యను ఎంత త్వరగా గుర్తించి, చికిత్స ఇప్పిస్తే, అంతగా మెరుగ్గా కంటిచూపును కాపాడుకోగలిగిన వాళ్లం అవుతాం.

- డాక్టర్ మాధవి ఘంటా,
కంటి వైద్యులు, ఖమ్మం

మిస్ వరల్డ్

'ప్రపంచ సుందరి పోటీలంటే అందమే కాదు... సామాజిక కోణం కూడా ఉంటుంది' అంటున్న ప్రిన్సెస్ ఇస్సీ... గడచిన ఐదేళ్లుగా మహిళలకు ఆర్థిక భరోసా ఇస్తున్నారు. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌లో జరుగుతున్న 'మిస్ వరల్డ్' మెగా ఈవెంట్‌లో కామెరూన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆమె... 'నవ్య'తో ప్రత్యేకంగా ముచ్చటించారు.



ఇది ఒక జీవితానుభవం

"మధ్య ఆఫ్రికా దేశమైన కామెరూన్ మాది. 'మిస్ వరల్డ్' పోటీలు నాకు ఒక జీవిత అనుభవం. కేవలం కిరీటం దక్కించుకొనే ఉద్దేశంతోనే ఇక్కడకు రాలేదు. అందంతో పాటు ప్రతిభను ప్రదర్శించడానికి ఇది ఒక చక్కని వేదిక. అంతేకాదు... ఇందులో సామాజిక కోణం ఉంటుంది. ప్రస్తుత పోటీల 'బ్యూటీ విత్ ఏ పర్పస్' చాలెంజ్‌లో భాగంగా మహిళలకు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించడం, అవసరంలో ఉన్నవారికి, చిన్నారుల విద్యకు సాయం అందించడం లాంటి అంశాలు ఉంటాయి. అంటే పోటీలో పాల్గొనే యువతుల్లోని సామాజిక కోణాన్ని ఆవిష్కరించే ప్రయత్నం ఇది. ఐదేళ్లుగా నేను ఇదే మార్గంలో పయనిస్తున్నా. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా. దీనికి ప్రధాన కారణం... ఈ మహమ్మారి నా ప్రాణ స్నేహితురాలిని బలిగొంది. అప్పటినుంచి ఏ స్త్రీ కూడా దీని బారిన పడకూడదనే సంకల్పంతో పని చేస్తున్నాను. ఈ వేదిక ద్వారా నా గళాన్ని ప్రపంచానికి వినిపించే అవకాశం లభించింది. అంతేకాదు... మహిళలకు ఆర్థికంగా సహాయం చేయడానికి కృషి చేస్తున్నాను. వారిలో మానసిక ఆందోళనలు, ఒత్తిడులను దూరం చేసేందుకు నా వంతు ప్రయత్నం సాగిస్తున్నాను. గత ఏడాది వంద మందికి పైగా బ్రెస్ట్ క్యాన్సర్ బాధిత మహిళల పిల్లలకు స్కూలు ఫీజులు చెల్లించాను. నా సామాజిక సేవ ప్రయాణంలో మరింత అవగాహన పెంచుకోవడానికి 'మిస్ వరల్డ్' దోహదపడుతుంది.

భారతీయత నచ్చింది...

అద్భుత చారిత్రక నగరం హైదరాబాద్. దీంతో పాటు తెలంగాణ, భారత్‌లోని ఇతర నగరాలు, అక్కడి సంప్రదాయాల గురించి మరింతగా తెలుసుకోవాలని అనుకుంటున్నా. చిన్నప్పటి నుంచి టెలివిజన్‌లో భారతీయ చిత్రాలు, డ్యాన్సులను చూసేవాళ్లం. ఇక్కడి మహిళలు పెట్టుకునే బొట్టు నాకు బాగా నచ్చింది. అది అద్భుతంగా, ఆకర్షణీయంగా ఉంది. విమానాశ్రయంలో దిగగానే బొట్టు పెట్టి స్వాగతం పలికారు. అది నన్ను ఎంతో ఆకట్టుకుంది. అలాగే ఇక్కడి ఆలయాలు కూడా సందర్శించాలనేది నా కోరిక. దేవాలయాలు పవిత్ర ప్రదేశాలు. అక్కడ మన మనసులో ఏదున్నా భగవంతుడితో చెప్పుకోవచ్చు. ప్రతిచోటా దేవుడు ఉంటాడు. అయితే దేశం, ప్రాంతం, తెగను బట్టి ప్రార్థించే విధానం మాత్రమే మారుతుందనేది నా నమ్మకం.

మహిళకకు చదువే అందం...

ఈ వేదికను నేను శారీరక సౌందర్యం ప్రదర్శించడానికే కాదు... మహిళా సాధికారతకు లభించిన ఒక చక్కని అవకాశంగా కూడా భావిస్తున్నాను. మహిళా సాధికారత అంటే పురుషులను విమర్శించడం కాదని స్త్రీలు అర్థం చేసుకోవాలి. ప్రతిభాపాటవాలను ప్రదర్శించడం ద్వారా మహిళలు సాధికారత సాధించాలి. దృఢ సంకల్పం, పట్టుదల ఉంటే ఎంతటి లక్ష్యాన్నయినా సాధించగల శక్తిసామర్థ్యాలు తమలో ఉన్నాయని గుర్తించాలి. సమాజంలో మనల్ని మనం ఉన్నతంగా నిలుపుకోవాలి. అది జరగాలంటే ప్రతి అమ్మాయీ విద్యావంతురాలు అవ్వాలి. చదువుకున్న మహిళ మరింత అందంగా ఉంటుందనేది నా నమ్మకం. అందుకే నేను మహిళలను విద్యావంతులను చేయడానికి కృషి చేస్తున్నాను. స్త్రీకి చదువు చెప్పడమంటే... ప్రపంచ మానవాళిని విద్యావంతులను చేయడమే.



> **ఒక్కొక్కటీ ఆస్వాదిస్తున్నా...**
>
> ఇక్కడ హోటల్‌లో దిగినప్పటి నుంచీ అందరూ ఒకటే చెబుతున్నారు... హైదరాబాద్ బిర్యానీ గురించి. త్వరలోనే తింటా. ప్రస్తుతానికి రోజుకో వంటకాన్ని రుచి చూస్తున్నా. వంటలు చాలా కారంగా ఉన్నాయి. అయినా బాగున్నాయి. చీజ్‌తో వండిన వంటలు నాకు చాలా ఇష్టం.

సమస్యలను అధిగమించాలంటే...

జీవితం అన్నాక ఎన్నో సవాళ్లు, సమస్యలు ఎదురవుతాయి. వాటిని అధిగమించాలంటే ముఖ్యంగా కావల్సింది మనపై మనకు నమ్మకం. ఆత్మవిశ్వాసమే విజయ తీరాలకు నడిపించే సాధనం. కెరీర్ ప్రారంభంలో నేను ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నాను. ఎంతో కష్టంగా అనిపించింది. కానీ ఆత్మవిశ్వాసంతో అన్నిటినీ అధిగమించాను. ఏదైనా కొత్తగా ప్రారంభించినప్పుడు సమస్యలు ఎదురవుతాయి. వాటికి భయపడి వెనకడుగు వేయకూడదు. మనల్ని మనం అర్థం చేసుకోవడానికి, ఇబ్బందులను దాటి అనుకున్న రంగంలో రాణించడానికి కొంత సమయం పడుతుంది.

ఇదే మొదటిసారి...

నేను భారత్‌కు రావడం ఇదే మొదటిసారి. 'మిస్ వరల్డ్' ఇక్కడ జరుగుతాయని తెలిసినప్పుడు ఎంతో ఆనందపడ్డాను. వచ్చేముందు కామెరూన్‌లోని భారత కాన్సులేట్‌కు వెళ్లి, భారత రాయబారితో మాట్లాడాను. నేను పోటీలకు వస్తున్నప్పుడు హైదరాబాద్‌లో ఒక క్యాన్సర్ సెంటర్ గురించి తెలుసుకున్నాను. ఆ కేంద్రాన్ని సందర్శించాలని, బ్రెస్ట్ క్యాన్సర్ కోసం వినియోగించే రేడియో థెరపీ, కీమోథెరపీలో కొత్త టెక్నాలజీ గురించి తెలుసుకోవాలని అనుకొంటున్నాను.

మా వీధులు ఎంతో శుభ్రం...

జీవితమనే పరుగులో మనం ఎంత బిజీగా ఉన్నా... పర్యావరణం, పరిసరాల గురించి కూడా ప్రతిఒక్కరూ పట్టించుకోవాలి. ముఖ్యంగా పర్యావరణం గురించి మనం నిత్యం ఏదో ఒక వేదికపై మాట్లాడుతూనే ఉంటాం. కానీ అదొక్కటే సరిపోదు. పర్యావరణ పరిరక్షణకు ఏంచేయాలనేది ప్రజలకు నేర్పించాలి. మన వాతావరణాన్ని, పరిసరాలను పరిశుభ్రంగా ఎలా ఉంచుకోవాలో అవగాహన కల్పించాలి. దీనిపై విస్తృత ప్రచారం కల్పించాలి. పరిశుభ్రమైన వాతావరణం ఉంటే ఎన్నో వ్యాధులను నివారించవచ్చు. నేను నివసించే పెసో నగరంలో వీధులన్నీ ఎంతో శుభ్రంగా ఉంటాయి.

నన్ను నేను మెరుగుపరుచుకొని...

మొదటిసారి 2017లో 'మిస్ వరల్డ్' పోటీల్లో పాల్గొన్నాను. అప్పుడు చాలా కష్టపడాల్సి వచ్చింది. ఆ తర్వాత నన్ను నేను తీర్చిదిద్దుకున్నాను. మాట్లాడటం, నడవటం, నిలబడటంతో పాటు బయటకు వెళ్లినప్పుడు ఎలా ఉండాలి, దేశానికి ప్రాతినిధ్యం వహించేటప్పుడు ఎలా వ్యవహరించాలి... ఇలా అన్ని విషయాల్లో నన్ను నేను మెరుగుపరుచుకున్నాను. తర్వాత 2020లో 'మిస్ కామెరూన్' పోటీల్లో విజయం సాధించాను. అదే నా మొదటి కిరీటం. మిస్ వరల్డ్ అనేది అందం, తెలివితేటల సమ్మేళనం. నా ఈ ప్రయాణంలో కుటుంబ సభ్యులు, కోచ్ ఎంతో సహకరించారు. నా విజయాలను చూసి స్నేహితులు, బంధువులు, కుటుంబ సభ్యులు గర్వపడుతున్నారు."

• దండా రామకృష్ణ

విభిన్నం

ఈ 'సాయిల్ డాక్టర్' సామాన్యురాలు కాదు

భూసార పరీక్షలను సులభతరం చేసి, వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తెస్తోంది, న్యూఢిల్లీకి చెందిన, యువ ఆవిష్కర్త సౌమ్య రావత్. 'సాయిల్ డాక్టర్' పరికరాన్ని ఆవిష్కరించి, గ్రామీణ మహిళల సాధికరతకు పాటుపడుతున్న సౌమ్య గురించిన ఆసక్తికరమైన విశేషాలు...

భూమిలో సారం ఉంటేనే పంటలు బాగా పండుతాయి. అధిక దిగుబడి వస్తుంది. సాధారణంగా చాలామంది రైతులకు సారవంతమైన భూమికి ఎలాంటి పోషకాలు అవసరమనే విషయం తెలియదు. నిజానికి భూసార పరీక్ష చేయగలిగితే, భూమికి అవసరమైన పోషకాల మోతాదులు తెలుస్తాయి. దాంతో పంట దిగుబడి పెంచుకోవడంతో పాటు ఎరువుల దుర్వినియోగాన్ని అరికట్టవచ్చు. అయితే తన రిసెర్చ్‌లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించిన సమయంలో సౌమ్య రావత్, రైతులు భూసార పరీక్షకు దూరంగా ఉంటున్నారనే విషయాన్ని గ్రహించింది. ప్రజలకు శాస్త్రీయతపై నమ్మకం లేదనీ, భూసార పరీక్షలు రైతులకు అందుబాటు ధరల్లో ఉండడం లేదని కూడా తెలుసుకుంది. ఈ ఇబ్బందులతో పాటు, భూసార పరీక్షా కేంద్రాలు అందుబాటులో లేక, ఫలితాలు కూడా సకాలంలో అందడం లేదని ఆమె గుర్తించింది.

సాయిల్ డాక్టర్ పరికరంతో...

ఈ సమస్యలకు పరిష్కారం కోసం ఆలోచించిన సౌమ్య, ఎకోసైట్ టెక్నాలజీస్ అనే అగ్రిటెక్ కంపెనీని స్థాపించడంతో పాటు, తక్కువ ఖర్చుతో భూసార పరీక్షలు అందుబాటులోకి తెచ్చేందుకు అరచేతి పరిమాణంలో ఉండే సాయిల్ డాక్టర్ పరికరాన్ని కూడా రూపొందించింది. ఈ పరికరంతో అప్పటికప్పుడే భూసార పరీక్ష చేపట్టవచ్చు. నిమిషాల్లోనే నేల స్వభావం, నేలలోని నత్రజని, భాస్వరం, పొటాషియం, పీహెచ్, తేమ వంటి వాటిని గుర్తించి వివరాలు సేకరించవచ్చు. రైతుల ప్రయోజనం కోసం సాయిల్ డాక్టర్‌ను రూపొందించినా దానికి రైతుల ఆమోదం పెద్ద సవాలుగా మారింది. సౌమ్య మాటలను రైతులు విశ్వసించకపోగా, ఆమె స్వలాభం కోసం తన ఉత్పత్తిని అమ్ముకునే ప్రయత్నాలు చేస్తోందని అనుమానించారు. ఆమె సలహాలు తీసుకునేందుకు కూడా ఏమాత్రం సుముఖత చూపలేదు.

> **దేశంలో 80 శాతం కంటే ఎక్కువ మంది రైతులకు 2 హెక్టార్ల(దాదాపు 5 ఎకరాలు) కంటే తక్కువ భూమి ఉంది. రైతులు తమ భూమికి అవసరమైన పోషకాల గురించి తెలియక గుడ్డిగా అధికంగా ఎరువులు వాడుతున్నారు. దీని వల్ల రైతులకు పెట్టుబడి బరమవుతుంది. అలాగే వనరులు వృధా అవడంతో పాటు ఉత్పాదకత తగ్గుతుంది.**



రైతులు మనసు గెలిచిన సాయిల్ దీదీలు

తెలిసిన వారు చెబితేనే రైతులు అర్థం చేసుకుంటారని, నమ్ముతారనే నిర్ణయానికొచ్చిన సౌమ్య, సాయిల్ దీదీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి, గ్రామీణ మహిళలకు సాయిల్ డాక్టర్ గురించి వివరించి, వారికి దానిపై శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టింది. అలా శిక్షణ పొందిన ఆ 'సాయిల్ దీదీ'లు భూసార పరీక్షలు చేసి రైతులకు సలహాలు ఇవ్వడం మొదలుపెట్టారు. కేవలం సాయిల్ దీదీలతో పరీక్షలు చేయడం ద్వారానే సౌమ్య రైతుల నమ్మకం గెలుచుకోలేదు. ఈ సాయిల్ దీదీలు, నేలకు పరీక్షలు చేపట్టి, కావాల్సిన పోషకాలను సూచించడమే కాకుండా, ఆ తర్వాత ఆ పంటకాలం మొత్తం పంటలను పర్యవేక్షించేవారు. రైతులు తాము సూచించిన ఎరువులు వాడుతున్నారో, లేదో తెలుసుకుంటూ, వాటి ఫలితం ఎలా ఉందని ఎప్పటికప్పుడు ఆరా తీస్తూ ఉంటారు. ఆ విధంగా రైతుల్లో నమ్మకం చూరగొన్నారు. ప్రస్తుతం అనేక రాష్ట్రాల్లో ఎన్‌జీవోలు, ఎఫ్‌పీవోల ద్వారా సాయిల్ డాక్టర్ వినియోగం ఎంతో బాగా పెరిగింది.

మహిళా సాధికారతతో...

సాయిల్ దీదీ కార్యక్రమం మహిళా సాధికారతకు దోహదపడింది. మహిళలు ఇంటి పనులకే పరిమితం కాకుండా సాయిల్ డాక్టర్ పరికరాలతో పొలాల్లో పరీక్షలు చేస్తూ ఆదాయంతో పాటు, గుర్తింపు పొందుతున్నారు. సాయిల్ దీదీలు వ్యవసాయం, అనుబంధ రంగాల్లో సొంత వ్యాపారులు చేసుకోవడానికి సౌమ్య రావత్ అవకాశం కల్పించారు. ఇలా సౌమ్య రైతులతో పాటు, మహిళల ఎదుగుదలకు కూడా తోడ్పడింది.

ప్రజలు సాధారణంగా రక్తపోటు, మధుమేహ పరీక్షలు ఎలా తరచూ చేయించుకుంటారో, రైతులు కూడా భూసార పరీక్షలు చేయించాలని, రైతుల్లో అలాంటి మార్పు తీసుకురావడమే తన లక్ష్యమని ఒక సందర్భంలో సౌమ్య రావత్ అన్నారు. దీని వల్ల రైతులకు పెట్టుబడి తగ్గడంతోపాటు ఉత్పాదకత పెరుగుతుందని, భవిష్యత్ తరాలకు సారవంతమైన నేల అందించవచ్చని ఆమె నమ్మకం.

సీలింగ్ ఫ్యాన్ స్పీడ్‌గా తిరగట్లేదా..?

ఎండాకాలంలో ఒక్కోసారి... సీలింగ్ ఫ్యాన్‌కి ఎంత స్పీడ్ పెట్టినా గాలి ఆడదు. చెమటతో చికాకుగా అనిపిస్తూ ఉంటుంది. ఇలా ఇబ్బంది పడకుండా కొన్ని చిట్కాలు పాటించి ఫ్యాన్ వేగాన్ని పెంచుకోవచ్చు.

- ఫ్యాన్ రెక్కల మీద దుమ్ము, ధూళి పేరుకుంటే ఫ్యాన్ వేగంగా తిరగలేదు. వారానికి ఒకసారి ఫ్యాన్ రెక్కలను రెండువైపులా తడి గుడ్డతో శుభ్రంగా తుడవాలి. అలాగే మోటార్ దగ్గర ఉండే బేరింగ్‌లను కూడా తుడవాలి. ఫ్యాన్ శుభ్రంగా ఉంటే గాలి వేగంగా గది అంతటా వ్యాపిస్తుంది.
- ఫ్యాన్ వేగాన్ని కెపాసిటర్ నియంత్రిస్తుంది. మోటార్‌కు కావాల్సిన శక్తిని అందిస్తుంది. కెపాసిటర్ సరిగా పని చేయని పక్షంలో ఫ్యాన్ నెమ్మదిగా తిరుగుతుంది. ఒక్కోసారి ఆగిపోవచ్చు కూడా. అంతేకాదు ఫ్యాన్ నుంచి శబ్దాలు కూడా వస్తుంటాయి. కాబట్టి కెపాసిటర్‌ను తరచూ పరీక్షిస్తూ ఉండాలి.. అవసరమైతే సమాన ఓల్టేజ్ ఉన్న కొత్త కెపాసిటర్‌ను అమరిస్తే సమస్య తీరుతుంది.
- మోటార్‌లోని బేరింగ్‌లు... ఫ్యాన్ సజావుగా తిరగడానికి తోడ్పడతాయి. వీటి మధ్య రాపిడీ పెరిగినప్పుడు ఫ్యాన్ వేగం తగ్గుతుంది. శబ్దం కూడా వస్తుంటుంది. బేరింగ్‌లకు ఎప్పటికప్పుడు లూబ్రికెంట్ ఆయిల్ వేస్తే ప్రయోజనం కనిపిస్తుంది. అవసరమైతే బేరింగ్‌లను వెంటనే మార్చుకోవాలి.
- ఇంట్లో ఓల్టేజ్ తక్కువగా ఉన్నా కూడా ఫ్యాన్ నెమ్మదిగా తిరుగుతుంది. ఇంటి వైరింగ్‌ను పరీక్షించి అవసరమైతే ఓల్టేజ్ స్టెబిలైజర్‌ను వాడడం మంచిది. సరైన ఓల్టేజ్ అందితేనే ఫ్యాన్ వేగంగా తిరుగుతుంది.
- ఫ్యాన్ రెక్కలు సమతుల స్థితిలో లేకపోయినా, అవి వంగిపోయినా, వాటిని సరిగా బిగించకపోయినా ఫ్యాన్ వేగం తగ్గుతుంది. అలాగే తిరిగేటప్పుడు ఫ్యాన్ ఎక్కువగా ఊగుతుంది. అలాంటప్పుడు వెంటనే బాగు చేయించండి.
- గది విస్తీర్ణాన్ని అనుసరించి రెక్కల పరిమాణం, మోటార్ సామర్థ్యం ఉండే ఫ్యాన్‌ని ఎంచుకుంటే గాలి చక్కగా అన్ని వైపులా ప్రసరిస్తుంది.





ఇంటికి దూరంగా ఉంటున్నారా..?

ఒక్కోసారి పై చదువుల కోసం లేదా ఉద్యోగాల నిమిత్తం వేరే ఊళ్లకి వెళ్లి అక్కడ వసతి గృహాల్లో లేదా అద్దె ఇళ్లల్లో ఉండాల్సి వస్తుంది. ఒంటరిగా ఉండడం బాధగా భయంగా అనిపిస్తుంది కూడా. ఇలా కొత్త ప్రదేశాల్లో ఉండాల్సివచ్చినప్పుడు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం...

- కొత్త ప్రదేశాలకు వెళ్లినప్పుడు పరిశుభ్రమైన ఆహారం ఎక్కడ దొరుకుతుందో అడిగి తెలుసుకోవాలి. తాగు నీటి నాణ్యతను పరిశీలించాలి. హాస్టల్‌లో ఉంటున్నట్లయితే అక్కడ ఆహారం వండే విధానాన్ని పరీక్షించాలి. వంటగదిలో పరిశుభ్రత పాటిస్తున్నారో లేదో తెలుసుకోవాలి.
- అత్యవసరమైన మందులను దగ్గర ఉంచుకోవాలి.
- హాస్టల్ లేదా అద్దె ఇంటి చిరునామాను కుటుంబ సభ్యులకు, దగ్గరి స్నేహితులకు తెలియజేయాలి.
- ఉంటున్న ప్రదేశానికి దగ్గరలోని ఆసుపత్రి, పోలీస్ స్టేషన్, రెస్టారెంట్, ట్రాన్స్‌పోర్ట్‌లకు సంబంధించిన ఫోన్ నెంబర్లను మొబైల్లో సేవ్ చేసి పెట్టుకోవాలి.
- వ్యక్తిగత సమాచారాన్ని తెలిపే ఆధార్ కార్డ్, ఓటర్ కార్డ్, పాన్ కార్డ్, కాలేజీ లేదా ఉద్యోగానికి సంబంధించిన ఐడెంటిటీ కార్డ్‌లను దగ్గర ఉంచుకోవాలి.
- అనవసరమైన ఖర్చులను తగ్గించుకోవాలి. ప్రతి నెలా కొంత మొత్తాన్ని పొదుపు చేయడం అలవరచుకోవాలి.
- కొత్త ప్రదేశం అలవాటు కావడానికి సమయం పడుతుంది కాబట్టి వీలైనప్పుడల్లా పరిసరాల్లో తిరుగుతూ ఆ కాలనీ లేదా వీధి గురించి అవగాహన ఏర్పరచుకోవాలి.
- ఒంటరిగా అనిపించినప్పుడు కుటుంబ సభ్యులు లేదా స్నేహితులకు ఫోన్ లేదా వీడియో కాల్ చేసి మాట్లాడుతూ ఉండాలి.
- రూమ్‌మేట్స్ ఉన్నట్లయితే వారి గురించి పూర్తి సమాచారం తెలుసుకోవాలి. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు వాళ్లని సంప్రదించి సలహా తీసుకోవడం మంచిది.
- రాత్రి సమయాల్లో బయట ఎక్కువగా తిరగవద్దు. మొబైల్లో లొకేషన్ సెట్ చేసి పెట్టుకోవాలి. అనుమానాస్పద వ్యక్తులకు దూరంగా ఉండాలి.

బిజినెస్

యూపీలో హెచ్‌సీఎల్- ఫాక్స్‌కాన్ సెమీకండక్టర్ ప్లాంట్

న్యూఢిల్లీ: హెచ్‌సీఎల్ గ్రూప్ సెమీకండక్టర్ల రంగంలోకి ప్రవేశిస్తోంది. తైవాన్ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఫాక్స్‌కాన్‌తో కలిసి రూ.3,706 కోట్ల పెట్టుబడితో ఇందుకోసం ఉత్తరప్రదేశ్‌లోని జేవార్ వద్ద ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతోంది. ఇందుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపినట్టు కేంద్ర సమాచార, ప్రసార శాఖల మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. 2027 కల్లా ఉత్పత్తి ప్రారంభించే ఈ ప్లాంట్ ద్వారా 2,000 మందికి ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయన్నారు. ఈ ప్లాంటులో మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఆటోమొబైల్స్‌లో వినియోగించే డిస్‌ప్లే డ్రైవర్ చిప్స్ తయారవుతాయని చెప్పారు.

జెన్‌సోల్‌పై ఇరెడా దివాలా పిటిషన్

న్యూఢిల్లీ: పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు రుణాలిచ్చే ప్రభుత్వ రంగ సంస్థ ఇండియన్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఇరెడా).. జెన్‌సోల్ ఇంజనీరింగ్‌పై దివాలా కేసు వేసింది. రూ.510 కోట్ల రుణాల తిరిగి చెల్లింపుల్లో విఫలమైనందుకు గాను జెన్‌సోల్‌పై దివాలా పరిష్కార చర్యలు చేపట్టాలంటూ జాతీయ కంపెనీల చట్టం ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)కు పిటిషన్ సమర్పించినట్లు ఇరెడా వెల్లడించింది. ఒకవేళ ఎన్‌సీఎల్‌టీ ఈ పిటిషన్‌ను ఆమోదిస్తే, జెన్‌సోల్ రుణదాతలంతా తమ బకాయిలను క్లెయిమ్ చేసుకునేందుకు కోర్టు నియమిత దివాలా పరిష్కార నిపుణుడికి వివరాలు సమర్పించాల్సి ఉంటుంది. ప్రమోటర్లు పెద్దఎత్తున నిధుల దుర్వినియోగానికి పాల్పడటంతో జెన్‌సోల్ ఇప్పటికే ఆర్థిక సంక్షోభంలోకి జారుకుంది.

13 నెలల కనిష్ఠానికి ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ:టోకు ధరల ఆధారిత ద్రవ్యోల్బణం (డబ్ల్యూపీఐ) దిగొస్తోంది. ఏప్రిల్‌లో డబ్ల్యూపీఐ 13 నెలల కనిష్ఠ స్థాయి 0.85 శాతానికి పడిపోయింది. ఆహార, ఇంధనం, తయారీ వస్తువుల ధరలు తగ్గడమే ఇందుకు ప్రధాన కారణంగా ఉంది.

హైదరాబాద్ 'రక్షణ' కంపెనీల హవా

» ఆపరేషన్ సిందూర్‌తో ఆర్డర్ల వెల్లువ

» వారం వారం సరఫరాలు షురూ



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): 'ఆపరేషన్ సిందూర్'తో హైదరాబాద్‌లో ఉన్న రక్షణ రంగంలోని కంపెనీలకు ఆర్డర్లు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ రంగంలోని డీఆర్‌డీఓ, బీడీఎల్, బీఈఎల్‌తో పాటు ప్రైవేట్ రంగంలోని ఎంటార్ టెక్నాలజీస్, అదానీ ఎల్బిట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, అస్త్రా మైక్రోవేవ్, కల్యాణి రాఫెల్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, అనంత్ టెక్నాలజీస్, రఘువంశీ, జెన్ టెక్నాలజీస్ వంటి కంపెనీలకు సైనిక దళాల నుంచి పెద్దఎత్తున ఆర్డర్లు వస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్‌లో ఈ కంపెనీలు తయారు చేసిన ఆయుధాలు, ఆయుధ విడిభాగాలు తమ సత్తా చాటాయి. దీంతో రక్షణ మంత్రిత్వ శాఖ ఈ కంపెనీల నుంచి పెద్ద మొత్తంలో ఆయుధాలు, మందుగుండు సామాగ్రి కొనుగోలు చేసి నిల్వ చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం పాక్‌తో కాల్పుల విరమణ కుదిరినా, అది తాత్కాలికమేనని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో ముందు జాగ్రత్తగా పెద్దఎత్తున బ్రహ్మోస్, ఆకాశ్ వంటి క్షిపణులు, డ్రోన్లను పెద్దఎత్తున కొనుగోలు చేసి నిల్వ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

శరవేగంగా సరఫరాలు

గతంలో సైనిక దళాల నుంచి వచ్చిన ఆర్డర్లను కంపెనీలు ఆరు నెలల నుంచి ఏడాదిలోపు పూర్తి చేసేందుకు గడువు ఇచ్చేవారు. ఇప్పుడు కొద్ది నెలల్లోనే సరఫరాలు పూర్తి చేయాలని సైనిక దళాలు కోరుతున్నాయి. దీంతో వారాంతాల్లో కూడా పని చేస్తూ, ఏ వారానికి ఆ వారం సరఫరాలు చేయాల్సి వస్తోందని బ్రహ్మోస్, ఆకాశ్ మిస్సైల్స్, డ్రోన్లకు అవసరమైన కీలక విడిభాగాలు సరఫరా చేసే ఒక కంపెనీ అధినేత చెప్పారు.

మరిన్ని ఆర్డర్లు

ఇక భారత్‌లో ఎక్కడ ఉగ్ర దాడి జరిగినా దాన్ని పాక్ ప్రభుత్వ దాడిగానే పరిగణిస్తామని ప్రధాని మోదీ ప్రకటించారు. ఇదే సమయంలో కీలక రక్షణ స్థావరాలు, మౌలిక సదుపాయాల రక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఇందుకు అవసరమైన డ్రోన్లు, యాంటీ డ్రోన్ వ్యవస్థల కొనుగోళ్లపై ఉన్నత సైనికాధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చింది. దీంతో వచ్చే రెండు మూడు నెలల్లో మరిన్ని ఆర్డర్లు వచ్చే అవకాశం ఉందని యాంటీ డ్రోన్ల వ్యవస్థలను తయారు చేసే ఒక కంపెనీ అధినేత చెప్పారు. పాక్ సైన్యం నుంచి గతంలోలా భూతలం నుంచి నుంచి కాకుండా ఇక గగనతలం నుంచే అసలు ముప్పు ఉంటుందని నిపుణులు హెచ్చరించడం ఇందుకు కారణంగా కనిపిస్తోంది.

ఎంటార్‌కు రూ.34 కోట్ల ఆర్డర్

ఎంటార్ టెక్నాలజీస్ సంస్థ కొత్తగా రూ.34 కోట్ల విలువైన ఆర్డర్‌ను దక్కించుకుంది. ఈ ఆర్డర్ కింద ఈ ఆర్థిక సంవత్సరం చివరికల్లా ఏరోస్పేస్, కాలుష్య రహిత ఇంధన రంగాలకు కీలకమైన ఇంజనీరింగ్ ఉత్పత్తులు సరఫరా చేయబోతున్నట్టు కంపెనీ తెలిపింది.

బీమా వ్యాపారంలోకి అపోలో 24/7



త్వరలో కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డు విడుదల

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అపోలో హెల్త్ కంపెనీ అనుబంధ సంస్థ, డిజిటల్ హెల్త్‌కేర్ ప్లాట్‌ఫామ్ అపోలో 24/7.. బీమా డిస్ట్రిబ్యూషన్ వ్యాపారం, క్రెడిట్ కార్డ్ విభాగంలోకి అడుగుపెడుతున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా త్వరలోనే ఆరోగ్య, జీవిత, సాధారణ బీమా ఉత్పత్తుల విక్రయం, డిస్ట్రిబ్యూషన్ కార్యకలాపాలను ప్రారంభించనున్నట్లు అపోలో హెల్త్ కంపెనీ సీఈఓ మాధివానన్ బాలకృష్ణన్ వెల్లడించారు. బుధవారం నాడిక్కడ ఆయన మాట్లాడుతూ.. బీమా ఉత్పత్తులకు సంబంధించి అపోలో 24/7 కార్పొరేట్ ఏజెంట్‌గా వ్యవహరించేందుకు ఇప్పటికే అవసరమైన రెగ్యులేటరీ అనుమతులు అందుకుందని ఆయన వివరించారు. ఇప్పటికే 8 బీమా సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నామని, ఇందులో 4 ఆరోగ్య బీమా సంస్థలని ఆయన చెప్పారు. రానున్న రోజుల్లో మరో 4 కంపెనీలతో జట్టు కట్టేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. బీమా వ్యాపారం ప్రారంభించిన ఏడాది కాలంలో లక్ష పాలసీల విక్రయం, రూ.80-రూ.100 కోట్ల ప్రీమియం ఆదాయం ఆర్జించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు బాలకృష్ణన్ వెల్లడించారు. అపోలో 24/7 12 కోట్ల మందితో పటిష్ఠమైన యూజర్ బేస్ కలిగి ఉందని, బీమా డిస్ట్రిబ్యూషన్ వ్యాపార విస్తరణకు ఇది ఎంతగానో తోడ్పడనుందని ఆయన చెప్పారు.

క్రెడిట్ కార్డ్ విభాగంలోకి అడుగు

అపోలో 24/7 క్రెడిట్ కార్డ్ విభాగంలోకి అడుగు పెడుతోందని బాలకృష్ణన్ వెల్లడించారు. ఇందులో భాగంగా ప్రముఖ క్రెడిట్ కార్డ్ కంపెనీతో కలిసి కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డ్‌ను వచ్చే పదిహేను రోజుల్లో విడుదల చేయనున్నట్లు ఆయన చెప్పారు. ఔషధాలు, డయాగ్నోస్టిక్స్ సేవలు, డాక్టర్ కన్సల్టేషన్, వెల్‌నెస్ సర్వీసులపై ప్రత్యేక బెనిఫిట్స్‌ను ఈ కార్డు ద్వారా అందించనున్నట్లు ఆయన తెలిపారు. కాగా అపోలో 24/7 ప్లాట్‌ఫామ్ ద్వారా ఆరోగ్య సంరక్షణ కోసం ప్రత్యేకంగా అల్టిమేట్ హెల్త్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించినట్లు బాలకృష్ణన్ వెల్లడించారు.

అంతర్జాతీయ లైఫ్ సైన్సెస్ కంపెనీల హబ్‌గా హైదరాబాద్

సీబీఆర్ఈ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జీవ శాస్త్రాలు (లైఫ్ సైన్సెస్), ఆ రంగాలకు చెందిన తయారీ కంపెనీల కేంద్రంగా హైదరాబాద్ ఎదుగుతోంది. హైదరాబాద్ సమీపంలోని జీనోమ్ వ్యాలీలో ఇప్పటికే 18 దేశాలకు చెందిన 200కుపైగా బయోటెక్, ఫార్మా కంపెనీలు కొలువుతీరాయి. బయోటెక్ రంగానికి చెందిన టాప్-10 పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ) కంపెనీల్లో ఆరు కంపెనీలు ఇప్పటికే జీనోమ్ వ్యాలీలో తమ యూనిట్లు ఏర్పాటు చేశాయి. రియల్ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ సీబీఆర్ఈ 'గ్లోబల్ లైఫ్ సైన్సెస్ అట్లాస్' పేరుతో విడుదల చేసిన నివేదికలో ఈ విషయం తెలిపింది. అంతేకాకుండా 20కి పైగా లైఫ్ సైన్సెస్, మెడికల్ టెక్నాలజీ ఇంక్యుబేటర్స్ ఇక్కడ ఉన్నాయని పేర్కొంది. కాగా గత ఏడాది భారత్‌లో లైఫ్ సైన్సెస్ సంస్థలు లీజుకు తీసుకున్న స్థూల కార్యాలయ స్థలం 56 శాతం వృద్ధితో 58 లక్షల చదరపు అడుగులకు చేరుకుందని సీబీఆర్ఈ తెలిపింది. ఇందులో హైదరాబాద్ జీనోమ్ వ్యాలీ 200కు పైగా గ్లోబల్ బయోటెక్, ఫార్మా కంపెనీలతో కీలకంగా ఉందని పేర్కొంది. అంతేకాకుండా ఆసియా పసిఫిక్ రీజియన్‌లో లైఫ్ సైన్సెస్ ఆర్ అండ్ డీ కేంద్రాల్లో హైదరాబాద్, బీజింగ్, షాంఘై, గ్రేటర్ టోక్యో కీలకంగా ఉన్నాయని సీబీఆర్ఈ నివేదిక వెల్లడించింది. కాగా ప్రతిపాదిత ఫార్మా సిటీ, మెడికల్ డివైజెస్ పార్కులతో ఈ రంగంలో హైదరాబాద్ మరింత దూసుకుపోతుందని తెలిపింది.

ఏజీఐ గ్రూప్‌తో స్టాండర్డ్ గ్లాస్ ఒప్పందం

గ్లాస్-లైన్డ్ షెల్, ట్యూబ్ హీట్ ఎక్స్ఛేంజర్స్ తయారీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్ (ఎస్‌జీఎల్‌టీఎల్).. జపాన్‌కు చెందిన ఏజీఐ గ్రూప్, దాని అనుబంధ సంస్థ జీఎల్ హక్కోతో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నట్లు వెల్లడించింది. ఈ ఒప్పంద కాలపరిమితి 20 సంవత్సరాలని తెలిపింది. ఒప్పందంలో భాగంగా జీఎల్ హక్కోకు చెందిన గ్లాస్-లైన్డ్ షెల్, ట్యూబ్ హీట్ ఎక్స్ఛేంజర్స్‌ను భారత్‌లో తయారు చేయటంతో పాటు మార్కెట్ చేయనున్నట్లు స్టాండర్డ్ గ్లాస్ తెలిపింది. ఇప్పటి వరకు ఈ స్పెషలైజ్డ్ పరికరాలను పూర్తిగా దిగుమతి చేసుకుంటూ వస్తున్నామని, భారత్‌లో తొలిసారిగా స్టాండర్డ్ గ్లాస్ వీటి తయారీ, విక్రయాలను చేపడుతోందని సంస్థ ఎండీ నాగేశ్వర రావు తెలిపారు. ఏజీఐ, జీఎల్ హక్కోతో కుదుర్చుకున్న ఒప్పందం తమకే కాకుండా భారత ఫార్మాస్యూటికల్, కెమికల్ రంగాలకు ఎంతో మేలు చేకూర్చనుందన్నారు. గ్లాస్-లైన్డ్ షెల్, హీట్ ఎక్స్ఛేంజర్స్‌కు అంతర్జాతీయంగా 200 కోట్ల డాలర్ల మార్కెట్ ఉండగా.. ఒక్క భారత్‌లోనే రూ.2,000 కోట్ల మార్కెట్ ఉందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికం నాటికి హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్న కొత్త ప్లాంట్‌లో ప్రతి నెల 200 యూనిట్ల సామర్థ్యంతో ఈ ఉత్పత్తుల తయారీని చేపట్టాలని చూస్తున్నట్లు నాగేశ్వర రావు తెలిపారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

15వ తేదీ			
హైదరాబాద్	505	విజయవాడ	515
వరంగల్	507	గోదావరి	505
చిత్తూరు	593	విశాఖపట్నం	510
		డజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	115	విజయవాడ	119
వరంగల్	115	గుంటూరు	122
కరీంనగర్	115	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	105
కర్నూలు	115	నెల్లూరు	110
విశాఖపట్నం	116	అనంతపురం	110
గోదావరి	119		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	96,060 ▲	88,050 ▲	1,09,000 ▼
విజయవాడ	96,250 ▼	90,000 ▼	99,400 ▼
విశాఖపట్నం	96,600 ▼	88,050 ▼	1,09,000 ▼
రాజమండ్రి	96,050 ▼	88,050 ▼	99,400 ▲
ప్రొద్దుటూరు	95,800 ▲	88,140 ▲	98,500 ▼
ముంబై	93,859 ▼	85,975 ▼	96,400 ▼

ఒడుదుడుకుల్లోనూ లాభాలొచ్చాయ్..

» 182 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

» రూ.4 లక్షల కోట్ల సంపద వృద్ధి

ముంబై: దేశీయ మార్కెట్ సూచీలు బుధవారం తీవ్ర ఊగిసలాటలకు లోనైనప్పటికీ లాభాలు నమోదు చేశాయి. గత నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 6 ఏళ్ల కనిష్ఠ స్థాయి 3.16 శాతానికి తగ్గడం, అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలు, విదేశీ సంస్థాగత పెట్టుబడులు కొనసాగడంతో పాటు మెటల్, ఇండస్ట్రియల్ రంగ షేర్లలో భారీగా కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. సెన్సెక్స్ 182.34 పాయింట్ల వృద్ధితో 81,330.56 వద్ద స్థిరపడగా.. నిఫ్టీ 88.55 పాయింట్ల లాభంతో 24,666.90 వద్ద ముగిసింది. ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.3.79 లక్షల కోట్లు పెరిగి రూ.434.89 లక్షల కోట్లకు (5.10 లక్షల కోట్ల డాలర్లు) చేరింది.

ఆసియా మార్కెట్లలో భారత్ భేష్

భారత్ జపాన్‌ను వెనక్కి నెట్టి ఆసియాలో అత్యంత ప్రాధాన్య ఈక్విటీ మార్కెట్‌గా నిలిచింది. బ్యాంక్ ఆఫ్ అమెరికా తాజాగా నిర్వహించిన ఆసియా ఫండ్ మేనేజర్ సర్వేలో ఈ విషయం వెల్లడైంది. సర్వేలో పాల్గొన్న ఫండ్ మేనేజర్లలో 42 శాతం భారత ఈక్విటీ మార్కెట్లో పెట్టుబడులకు మొగ్గుచూపారు. ఈ విషయంలో జపాన్ రెండో స్థానానికి జారుకోగా.. గత నెల అట్టడుగు స్థాయిలో నిలిచిన చైనా మళ్లీ మూడో స్థానానికి ఎగబాకింది.

రక్షణ షేర్లలో కొనసాగిన ర్యాలీ

భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ జరిగినప్పటికీ రక్షణ రంగ షేర్లలో బుల్ ర్యాలీ కొనసాగుతోంది. బుధవారం ట్రేడింగ్‌లో మిశ్ర ధాతు నిగమ్ (మిధానీ) స్టాక్ ఏకంగా 15.12 శాతం ఎగబాకింది. యాక్సిస్‌కేడ్స్ టెక్నాలజీస్ 5 శాతం, పారస్ డిఫెన్స్ 4 శాతం లాభపడ్డాయి. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ 3.47 శాతం, డేటా ప్యాటర్న్స్ 2.93 శాతం, భారత్ ఎలక్ట్రానిక్స్ 2.56 శాతం, అస్త్రా మైక్రోవేవ్ ప్రొడక్ట్స్ 2.26 శాతం, భారత్ డైనమిక్స్ 1.16 శాతం పుంజుకున్నాయి. డ్రోన్ తయారీదారుల్లో డ్రోనాచార్య ఏరియల్ ఇన్నోవేషన్స్ 2 శాతం, ఐడియాఫోర్జ్ టెక్నాలజీ 0.86 శాతం పెరిగాయి.

స్పోర్ట్స్

రేసు రసవత్తరం

గిల్, బుమ్రా.. ఎవరికో టెస్టు పగ్గాలు?



న్యూఢిల్లీ: టెస్టుల నుంచి కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ వైదొలిగారు. దాంతో సుదీర్ఘ ఫార్మాట్ జట్టుకు కొత్త సారథిని ఎంపిక చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో కొత్త కెప్టెన్ రేస్‌లో యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్, పేస్ దళపతి జస్‌ప్రీత్ బుమ్రా పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. అయితే వన్డేలలో రోహిత్‌కు డిప్యూటీగా ఉన్న 25 ఏళ్ల గిల్ రేస్‌లో ముందంజలో ఉన్నట్టు తెలిసింది. జూన్ 20 నుంచి ఇంగ్లండ్‌తో జరిగే ఐదు టెస్టుల సిరీస్‌కు గిల్ సారథ్యంలోనే భారత్ బరిలోకి దిగడం ఖాయమని సమాచారం. అయితే గిల్ ఎంపిక సరైనది కాబోదని కొందరు మాజీ క్రికెటర్లు చెబుతుండగా...గిల్ నియామకమే ఉత్తమమని ఇంగ్లండ్ మాజీ స్పిన్నర్ మొయిన్ అలీ అభిప్రాయపడ్డాడు. 'గిల్‌ను కెప్టెన్ చేయడం తెలివైన నిర్ణయం. అయితే గతంలో నాయకత్వ బాధ్యతలను సమర్థంగా నిర్వహించిన బుమ్రానే సారథిగా నియమించాలని బీసీసీఐ అనుకుంటోంది. కానీ గాయాల బెడద పొంచి ఉండడంతో..పనిభారం రీత్యా ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల్లో బుమ్రా ఆడే చాన్స్ లేదు' అని మొయిన్ విశ్లేషించాడు. ఇక..తుది జట్టులో స్థానమే దక్కించుకోలేకపోయిన శుభ్‌మన్‌కు ఎలా కెప్టెన్సీ అప్పగిస్తారని మాజీ ఓపెనర్ కృష్ణమాచారి శ్రీకాంత్ ప్రశ్నించాడు. గత బోర్డర్-గవాస్కర్ సిరీస్‌లో బాక్సింగ్ డే టెస్ట్ జట్టునుంచి గిల్‌ను తప్పించిన విషయాన్ని క్రిష్ గుర్తు చేశాడు. 'టెస్ట్ క్రికెట్ జట్టులో గిల్‌కు చోటు గ్యారెంటీ లేదు. అందువల్ల సారథ్యం బుమ్రాకే ఇవ్వాలి. బుమ్రా కాదనుకుంటే కేఎల్ రాహుల్, పంత్‌లో ఒకరికి ఆ బాధ్యత అప్పగించాలి' అని శ్రీకాంత్ సూచించాడు. మరో మాజీ ఆటగాడు సంజయ్ మంజ్రేకర్ కూడా శ్రీకాంత్‌ను బలపరుస్తూ బుమ్రాకు కెప్టెన్సీ ఇవ్వాలన్నాడు. 'బుమ్రా కాకుండా టెస్ట్ కెప్టెన్‌గా వేరే పేరు వినిపిస్తుండడంతో షాక్‌కు గురయ్యా. ఒకవేళ అతడు గాయాలకు లోనవుతాడన్న అనుమానం ఉంటే వైస్-కెప్టెన్‌ను జాగ్రత్తగా ఎంపిక చేయండి' అని మంజ్రేకర్ సూచించాడు.

భారత్‌లో ప్రతిభకు కొదవ లేదు..

భారత్‌లో అపార ప్రతిభావంతులైన క్రికెటర్లు ఎందరో ఉన్నారని ఇంగ్లండ్ దిగ్గజ పేసర్ జేమ్స్ అండర్సన్ ప్రశంసించాడు. దూకుడైన స్వభావం, భయం లేకుండా ఆడే టీవిండియా యువ ఆటగాళ్లు.. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల స్థానాలను భర్తీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించాడు. ఐపీఎల్ ద్వారా టెస్ట్ క్రికెట్‌లో అడుగుపెట్టేందుకు చాలామంది యువ ఆటగాళ్లు ఎదురు చూస్తున్నట్టు అండర్సన్ చెప్పాడు.

ఐపీఎల్ ప్లేఆఫ్స్‌కు సఫారీ ఆటగాళ్లు దూరం!

జొహాన్నెస్‌బర్గ్: ఐపీఎల్ మిగతా మ్యాచ్‌లు రెండ్రోజుల్లో మొదలవనున్నాయి. ఇప్పటికే ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు (సీఏ) తమ ఆటగాళ్లను భారత్ పంపేందుకు అనుమతిచ్చింది. దక్షిణాఫ్రికా బోర్డు (సీఎస్ఏ) కూడా మిగతా మ్యాచుల్లో తమ క్రికెటర్లను ఆడించేందుకు అంగీకరించింది. కాకపోతే, ప్లేఆఫ్స్ కంటే ముందే స్వదేశం రావాలని తమ ఆటగాళ్లకు షరతు విధించింది. ఎందుకంటే.. జూన్ 11 నుంచే ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ ఉండడం. వాస్తవానికి ఐపీఎల్ ముందు షెడ్యూల్ ప్రకారం ఈనెల 25న ఫైనల్ జరగాలి. దీంతో మరుసటి రోజు అంటే.. 26న సఫారీ క్రికెటర్లు లీగ్ నుంచి వెనుదిరిగేలా బీసీసీఐతో సీఎస్ఏ ముందస్తు ఒప్పందం చేసుకుంది. ఆ తర్వాత ఈనెల 30న సఫారీ ఆటగాళ్లంతా డబ్ల్యూటీసీ ఫైనల్ వేదికైన లండన్‌కు చేరుకోవాలి. కానీ, పహల్గామ్ దాడితో భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఐపీఎల్‌లో మిగతా మ్యాచ్‌ల షెడ్యూల్ మారింది. ఫైనల్ జూన్ 3కు మారింది. ఈ పరిస్థితుల్లో అన్ని రోజులు భారత్‌లో ఉండకుండా, ముందస్తు షెడ్యూల్ ప్రకారం ఈనెల 26నే స్వదేశం రావాలని తమ ఆటగాళ్లను సీఎస్ఏ ఆదేశించింది. ఐపీఎల్ ఆడుతూ డబ్ల్యూటీసీ ఫైనల్‌కు ఎంపికైన సఫారీ ఆటగాళ్లలో బాష్, రికెల్టన్ (ముంబై), ముల్డర్ (సన్‌రైజర్స్), జాన్సెన్ (పంజాబ్), మార్‌క్రమ్ (లఖ్‌నవూ), ఎంగిడి (ఆర్సీబీ), రబాడ (గుజరాత్), స్టబ్స్ (ఢిల్లీ) ఉన్నారు. వీళ్లంతా ప్లేఆఫ్స్ కంటే ముందే స్వదేశం బయలుదేరనున్నారు.

నీరజ్.. ఇక లెఫ్టినెంట్ కల్నల్



న్యూఢిల్లీ: దేశ ప్రాదేశిక సైన్యంలో సుబేదార్ మేజర్‌గా పని చేస్తున్న స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాకు లెఫ్టినెంట్ కల్నల్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు భారత ఆర్మీ.. గెజిట్‌ను విడుదల చేసింది. శుక్రవారం నుంచి దోహాలో డైమండ్ లీగ్ ప్రారంభమవనున్న తరుణంలో ఈ ఉత్తర్వులు రావడం నీరజ్‌లో మరింత స్ఫూర్తి నింపనుంది. టోక్యో, పారిస్ ఒలింపిక్స్‌లో పతకాలు సాధించడంతో పాటు క్రీడా రంగంలో నీరజ్ చోప్రా కనబరిచిన విశిష్ట ప్రతిభను గుర్తించి పదోన్నతి కల్పించినట్టు మిలటరీ వ్యవహారాల శాఖ సంయుక్త కార్యదర్శి, మేజర్ జనరల్ జీఎస్ చౌధురి తెలిపారు. 2016లో నయిబ్ సుబేదార్‌గా సైన్యంలో చేరిన నీరజ్, 2021లో విశిష్ట సేవా పతకంతో పాటు సుబేదార్‌గా పదోన్నతి పొందాడు. 2022లో పరమ విశిష్ట సేవా పతకాన్ని అందుకోగా.. గత ఏడాది సుబేదార్ మేజర్‌గా నీరజ్‌కు పదోన్నతి లభించడం తెలిసిందే.

ఓర్లెన్ బరిలో చోప్రా

ఓర్లెన్ జానస్జ్ కుసొసిన్‌స్కీ స్మారక పోటీల్లో నీరజ్ చోప్రా బరిలోకి దిగుతున్నాడు. ఈనెల 23 నుంచి జరిగే ఈ పోటీలకు పోలెండ్‌లోని చోర్జోవ్ ఆతిథ్యమివ్వనుంది. వాస్తవానికి ఈనెల 24 నుంచి బెంగళూరులో జరిగే ఎన్‌సీ క్లాసిక్ టోర్నమెంట్‌లో నీరజ్ పాల్గొనాల్సి ఉంది. అయితే, భారత-పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ఈ పోటీలు వాయిదా పడ్డాయి.

'ఏ ప్లస్'లోనే రోహిత్, విరాట్

బీసీసీఐ కార్యదర్శి సైకియా



న్యూఢిల్లీ: రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించారు. అయితే వీరిద్దరూ వన్డేలలో కొనసాగనున్నారు. సుదీర్ఘ ఫార్మాట్‌కు ఇటీవల వీడ్కోలు పలికిన వీరిద్దరు..గత జూన్‌లో టీ20లకు గుడ్‌బై చెప్పిన విషయం విదితమే. ఈనేపథ్యంలో రోహిత్, విరాట్ బీసీసీఐ వార్షిక కేంద్ర కాంట్రాక్టులలో ఎ+కేటగిరీలోనే కొనసాగిస్తారా..లేదా..అనే చర్చ మొదలైంది. గత నెలలో ప్రకటించిన 2024-25 కాంట్రాక్టుల జాబితాలో రోహిత్, కోహ్లీలను ఎ+గ్రేడ్‌లో బీసీసీఐ కొనసాగించింది. వారితోపాటు పేసర్ బుమ్రా, ఆల్‌రౌండర్ జడేజా ఆ జాబితాలో ఉన్నారు. ఈ విభాగం క్రికెటర్లకు వార్షిక వేతనం రూ. ఏడు కోట్లు లభిస్తుంది. టెస్టుల నుంచి తప్పుకోవడంతో రోహిత్, విరాట్‌లను ఆ కేటగిరీలో కొనసాగిస్తారా..అన్న ప్రశ్నలు ఉదయించాయి. కానీ వీరిద్దరూ ఎ+విభాగంలోనే కొనసాగుతారని బీసీసీఐ కార్యదర్శి దేవజీత్ సైకియా బుధవారం స్పష్టంజేశాడు. 'టెస్టులు, టీ20లనుంచి వైదొలగినా రోహిత్, కోహ్లీ ఎ+కేటగిరీలోనే కొనసాగుతారు. జట్టులో వారిద్దరు ఇప్పటికే భాగమే. ఎ+ఆటగాళ్లకు లభించే అన్ని సౌకర్యాలు వారికి వర్తిస్తాయి' అని వివరించాడు.

జడేజా..1151 రోజులు

నెం.1 ఆల్‌రౌండర్‌గా చరిత్ర



న్యూఢిల్లీ: వెటరన్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా చరిత్ర సృష్టించాడు. వరుసగా 1151 రోజులు టెస్టుల్లో నెం.1 ఆల్‌రౌండర్‌గా నిలవడం ద్వారా రికార్డు పుటలకెక్కాడు. దిగ్గజ ఆల్‌రౌండర్లు కపిల్ దేవ్, కలిస్ వంటివారికి కూడా సాధ్యంకాని ఘనతను అతడు దక్కించుకున్నాడు. వెస్టిండీస్‌కు చెందిన జాసన్ హోల్డర్‌ను వెనక్కు నెట్టి మార్చి 9, 2022న టెస్ట్ ఆల్‌రౌండర్ నెం.1 ర్యాంకును అతడు సొంతం చేసుకున్నాడు. అప్పటి నుంచి ఆ ర్యాంక్‌ను నిలబెట్టుకుంటూ వస్తున్నాడు.

ఢిల్లీ జట్టులో ముస్తాఫిజుర్

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియా బ్యాటర్ జేక్ మెక్‌గర్క్ స్థానంలో బంగ్లాదేశ్ ఎడమచేతి వాటం పేసర్ ముస్తాఫిజుర్ రహ్మాన్‌ను ఢిల్లీ జట్టు తీసుకుంది. స్వదేశానికి వెళ్లిపోయిన మెక్‌గర్క్ తిరిగి రాకపోవడంతో అతడి స్థానంలో ముస్తాఫిజుర్‌ను తీసుకోవాలని ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణయించింది. ఇక..స్వదేశం వెళ్లిపోయిన క్వింటన్ డికాక్ కోల్‌కతా జట్టులో తిరిగి చేరనున్నాడు.

రో-కో ఎన్ని వన్డేలు ఆడతారంటే..

న్యూఢిల్లీ: రోహిత్, కోహ్లీ టెస్టులకు కూడా గుడ్‌బై చెప్పడంతో ఈ ద్వయం ఇక పూర్తిగా వన్డేలపైనే దృష్టిసారించనుంది. దాంతో 2027 వన్డే వరల్డ్ కప్‌నకు సంబంధించి టీమిండియా రోడ్ మ్యాప్ ఎలా ఉండనుందనేది ఆసక్తికరంగా మారింది. ఆ మెగా టోర్నీకి దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్నాయి. వరల్డ్‌కప్‌నకు ముందు 8 దేశాలతో ద్వైపాక్షిక సిరీస్‌లలో భాగంగా భారత జట్టు 27 వన్డేలు ఆడనుంది. ఫలితంగా ఆఖరి మెగా టోర్నీకి సన్నద్ధమయ్యేందుకు రోహిత్, విరాట్‌కు తగినంత సమయం లభిస్తుంది. ద్వైపాక్షిక సిరీస్‌ల ద్వారా క్రికెటర్ల సత్తాను అంచనా వేయడంతో పాటు, విభిన్న కాంబినేషన్ల కూర్పుతో ప్రపంచ కప్‌కు బలమైన జట్టును ఎంపికచేసుకునే అవకాశం సెలెక్టర్లకు లభించనుంది.

అగ్రస్థానంలో ప్రజ్ఞానంద

బుఖారెస్ట్ (రుమేనియా): సూపర్ బెట్ చెస్ క్లాసిక్ టోర్నీ ఏడో రౌండ్ ముగిసేసరికి భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద టాప్‌లో నిలిచాడు. బుధవారం జరిగిన ఏడో రౌండ్‌లో అలీ ఫిరౌజా (ఫ్రాన్స్)తో గేమ్‌ను ప్రజ్ఞానంద డ్రా చేశాడు. దాంతో నాలుగు పాయింట్లతో ఫిరౌజా, కరువాన, లగ్రావ్‌తో కలిసి ప్రజ్ఞానంద సంయుక్తంగా ఆధిక్యంలో కొనసాగుతున్నాడు. మరో భారత గ్రాండ్‌మాస్టర్, ప్రపంచ చాంపియన్ గుకేష్ ఏడో రౌండ్‌లో వెస్లీ సోతో పాయింట్ పంచుకున్నాడు. దాంతో 2.5 పాయింట్లతో గుకేష్ సంయుక్తంగా 9వ స్థానంలో కొనసాగుతున్నాడు.

'ఖేలో'లో రామలక్ష్మికి రజతం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 11వ రోజు పోటీల్లో ఆంధ్రప్రదేశ్ వెయిట్‌లిఫ్టర్ కర్నాటి నాగ రామలక్ష్మి రజత పతకం సొంతం చేసుకుంది. బుధవారం బిహార్‌లోని గయలో జరిగిన 81 ప్లస్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో ఏలూరుకు చెందిన రామలక్ష్మి మొత్తం 176 కిలోల బరువెత్తి ద్వితీయ స్థానంలో నిలిచింది. రామలక్ష్మి స్నాచ్‌లో 75 కి., క్లీన్ అండ్ జెర్క్‌లో 101 కి., బరువెత్తింది. అమృత (కేరళ) స్వర్ణం, గగన్‌దీప్ కౌర్ (పంజాబ్) కాంస్యం సాధించింది. తెలంగాణ జిమ్నాస్ట్ నిషిక అగర్వాల్ ఒక స్వర్ణం, రెండు కాంస్యాలు, తెలంగాణ టెన్నిస్ ప్లేయర్లు బసిరెడ్డి రిషిత రెడ్డి సింగిల్స్‌లో స్వర్ణం, డబుల్స్‌లో రజతం, దండు లక్ష్మీ సిరి సింగిల్స్‌లో కాంస్యం, డబుల్స్‌లో రజతం సాధించింది.

తొలి రౌండ్‌లోనే లక్ష్యసేన్ అవుట్

బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్ 500 టోర్నమెంట్ తొలి రౌండ్‌లోనే భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్ ఇంటిముఖం పట్టాడు. మహిళల సింగిల్స్‌లో మాళవిక బన్సోద్, ఆకర్షి కశ్యప్, ఉన్నతి హుడా, డబుల్స్‌లో గాయత్రీ గోపీచంద్ జోడీ ముందంజ వేశారు. సింగిల్స్ తొలి రౌండ్‌లో సేన్ 18-21, 21-9, 17-21తో నాట్ గైన్ (ఐర్లాండ్) చేతిలో ఓడాడు. రజావత్ 13-21, 21-17, 16-21తో అల్వీ (ఇండోనేసియా) చేతిలో ఓడాడు. డబుల్స్‌లో గాయత్రి-ట్రీసా జోడీ 21-15, 21-13తో టింగ్ (మలేసియా) ద్వయంపై గెలిచి రెండోరౌండ్ చేరింది. సింగిల్స్‌లో మాళవిక 21-12, 13-21, 21-17తో నెస్లిహాన్ (టర్కీ)పై, ఆకర్షి 21-16, 20-22, 22-20తో సుగియమ (జపాన్)పై, ఉన్నతి 21-14, 18-21, 23-21తో తమోన్వాన్ (థాయ్‌లాండ్)పై గెలిచి ముందంజ వేశారు.

కర్రెగుట్టల్లో 31 మంది మావోయిస్టులు హతం

- ఇప్పటి వరకు 28 మందిని గుర్తించాం
- వీరందరిపై రూ.1.72 కోట్ల రివార్డు
- మావోయిస్టు అగ్రనేతలూ హతమై ఉంటారు!
- సెర్చ్ ఆపరేషన్‌లో మృతదేహాలు దొరుకుతున్నాయి
- ఐఈడీలు, అధునాతన తుపాకులు స్వాధీనం
- ఆపరేషన్ కగార్ కొనసాగుతుంది
- మావోయిస్టులకు లొంగిపోవడం తప్ప మరో దారి లేదు
- సీఆర్‌పీఎఫ్ డీజీ జి.పి.సింగ్, ఛత్తీస్‌గఢ్ డీజీపీ అరుణ్‌దేవ్
- మార్చి 31, 2026 కల్లా నక్సల్స్ రహిత భారత్: షా

చర్ల, మే 14(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో 21 రోజులపాటు జరిగిన ఆపరేషన్‌లో 31 మంది మావోయిస్టులను హతమార్చినట్లు అధికారులు తెలిపారు. మావోయిస్టు సమస్య అంతానికి ఇది ఆరంభమన్నారు. బీజాపూర్ జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఆర్‌పీఎఫ్ డీజీ గ్యానేంద్ర ప్రతాప్(జీపీ) సింగ్, ఛత్తీస్‌గఢ్ డీజీపీ అరుణ్ దేవ్ గౌతమ్.. కర్రెగుట్టల ఆపరేషన్ వివరాలను వెల్లడించారు. మావోయిస్టులకు లొంగిపోవడం తప్ప మరో అవకాశం లేదని స్పష్టం చేశారు. తెలంగాణ మావోయిస్టు పార్టీ, ఛత్తీస్‌గఢ్ నక్సల్స్ కర్రెగుట్టలపై ఉన్నట్లు సమాచారం రావడంతో ఏప్రిల్ 21న ఆపరేషన్ ప్రారంభించినట్లు తెలిపారు. అత్యంత కఠిన పరిస్థితుల్లో బలగాలు కూంబింగ్ చేశాయని, ఆపరేషన్ సాగిన 21 రోజుల్లో 21 ఎన్‌కౌంటర్లు జరిగాయని చెప్పారు. అడవుల్లో 450 బీర్ బాంబులు, ఐఈడీలను గుర్తించి నిర్వీర్యం చేసినట్లు తెలిపారు. మొత్తం 31 మంది మావోయిస్టులు చనిపోయారని, ఇప్పటివరకు 28 మందిని గుర్తించామని, ఏడుగురి మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగించామని వివరించారు. వీరందరిపై రూ.1.72 కోట్ల రివార్డు ఉందన్నారు. బలగాల దాడిలో చాలా మంది మావోయిస్టులు మృతి చెందారని, సెర్చ్ ఆపరేషన్‌లో మృతదేహాలు దొరుకుతున్నాయని తెలిపారు. మృతుల్లో చాలా మంది కీలక నేతలు కూడా ఉంటారని పేర్కొన్నారు. ప్రధాన నేతలు చనిపోవడం లేదా గాయపడడం జరిగిందని తెలిపారు. గుట్టల్లో 214 మావోయిస్టు డంపులు గుర్తించామని, భారీగా ఐఈడీలు, డిటోనేటర్లు, బీజీఎల్ లాంచర్లు, వైర్లు, విప్లవ సాహిత్య పుస్తకాలు, జనరేటర్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నాలుగు ఆయుధ తయారీ ఫ్యాక్టరీలను ధ్వంసం చేశామన్నారు. చనిపోయిన మావోయిస్టుల నుంచి అధునాతన మెషిన్‌గన్స్, ఏకే 47, ఇన్సాస్ తుపాకులు లభించాయని వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో తాము అనుకున్న దానికంటే ఎక్కువే సాధించామన్నారు. మావోయిస్టుల సమస్యను అంతం చేసే క్రమంలో ఇది ఆరంభమేనని.. దేశంలో మార్చి 2026కల్లా నక్సల్స్‌ను పూర్తిగా ఏరిపారేస్తామని సింగ్ స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్‌లో 18 మంది జవాన్లు గాయపడ్డారన్నారు. మావోయిస్టుల కు లొంగిపోవడం తప్ప మరో అవకాశం లేదని చెప్పారు. లొంగిపోయిన వారికి పునరావాసం కల్పిస్తామన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఆర్‌పీఎఫ్ డీజీ జీపీ సింగ్

వచ్చే మార్చి కల్లా నక్సల్స్ రహిత దేశం: షా

భద్రతా బలగాలు కర్రెగుట్టల్లో 31 మంది కరుడుగట్టిన నక్సలైట్లను హతమార్చడం ద్వారా దేశాన్ని నక్సల్స్ రహితంగా మార్చే లక్ష్యంలో కీలక ముందడుగు వేశాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. దేశంలో నక్సలిజాన్ని తుడిచిపెట్టేందుకు ప్రధాని మోదీ నాయకత్వంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని చెప్పారు. మార్చి 31, 2026 కల్లా దేశాన్ని నక్సల్స్ రహితంగా చేస్తామని మరోసారి భారతీయులకు హామీ ఇస్తున్నట్లు బుధవారం ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు.

బీజేపీలోకి జకియా ఖానమ్

- మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా

అమరావతి, మే 14(ఆంధ్రజ్యోతి): శాసన మండలి డిప్యూటీ చైర్‌పర్సన్, వైసీపీ ఎమ్మెల్సీ జకియా ఖానమ్ బీజేపీలో చేరారు. అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన ఆమె తన పదవులన్నింటికీ రాజీనామా చేశారు. ఉమ్మడి కడప జిల్లాలో ఆమె భర్త అఫ్జల్ అలీఖాన్ కాంగ్రెస్ పార్టీలో బలంగా ఉండేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన గుండెపోటుతో మృతి చెందారు. తరువాత ఆ కుటుంబం వైసీపీలోకి వెళ్లింది. జూలై 2020లో జకియా ఖానమ్‌కు ఎమ్మెల్సీ పదవి ఇచ్చిన వైసీపీ నాయకత్వం శాసనమండలి వైఎస్ చైర్మన్ హోదా కల్పించింది. ఆమెకు పదవి ఇచ్చారే కానీ.. అధికారాలు ఇవ్వకపోవడంతో పార్టీ నాయకత్వంపై కినుక వహించారు. 2023 నుంచి వైసీపీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. 6 నెలల క్రితం టీటీడీ దర్శన టికెట్లు అమ్ముకున్నారంటూ ఖానమ్‌పై వైసీపీ సోషల్ మీడియా ప్రచారం చేసింది. కొద్దిరోజుల క్రితం నారా లోకేశ్‌ను కలిశారు. దీంతో ఆమె టీడీపీలో చేరుతారని అందరూ ఊహించారు. అనూహ్యంగా ఆమె బీజేపీలో చేరారు. విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో అధ్యక్షురాలు పురందేశ్వరి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జకియా మాట్లాడుతూ, ట్రిపుల్ తలాక్ రద్దుతో ముస్లిం మహిళలకు అన్నలా మారిన నరేంద్ర మోదీ నిరుపేద ముస్లింల అభ్యున్నతి కోసం పాటుపడుతున్నారని కొనియాడారు.



పురందేశ్వరి సమక్షంలో బీజేపీలో చేరుతున్న జకియా ఖానమ్

ప్రధాని చర్యలు ముస్లిం మహిళలకు సంతోషాన్ని కలిగించడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా పురందేశ్వరి, మంత్రి సత్యకుమార్ వ్యాఖ్యానించారు.

రైతులకు మార్కెటింగ్ కీలకం: పురందేశ్వరి

నాణ్యమైన విత్తనాలు, సాగునీరు, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తే కష్టించే రైతుకు ఎంతో ప్రయోజనకరమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి అభిప్రాయపడ్డారు. చిగురుపాటి కుమారస్వామి అధ్యక్షతన జరిగిన కిసాన్ మోర్చా సమావేశంలో మాట్లాడారు. ఎన్నో ఆటంకాలు అధిగమిస్తూ వ్యవసాయం చేస్తున్న రైతులకు కేంద్రం అన్ని విధాలా సహకారం అందిస్తోందని తెలిపారు.







చిత్రజ్యోతి

SINCE 1965

కొత్త తేదీన కింగ్‌డమ్



విజయ్ దేవరకొండ కథానాయకుడిగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించిన చిత్రం 'కింగ్‌డమ్'. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ప్రతిష్ఠాత్మకంగా నిర్మించాయి. తొలుత ప్రకటించిన విధంగా ఈ నెల 30న ఈ చిత్రం విడుదల వ్వాల్సి ఉంది. అయితే ఇప్పుడు తేదీ మారింది. జూలై 4న కింగ్‌డమ్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు మేకర్స్ బుధవారం ప్రకటించారు. ఇటీవల దేశంలో జరిగిన ఊహించని సంఘటనల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని తెలిపారు. ఈ చిత్రంలో విజయ్‌కు జోడీగా భాగ్యశ్రీ బోర్సే నటించారు. సంగీతం: అనిరుధ్ రవిచందర్, ఎడిటర్: నవీన్ నూలీ, సినిమాటోగ్రఫీ: జోమోన్ టీ జాన్, గిరీశ్ గంగాధరన్.

ఆ ప్రశ్నను రేకెత్తించే చిత్రమే 23



"ఒకే తరహా నేరం చేసిన వ్యక్తుల్లో ఒకరికి తక్కువ శిక్ష ఎందుకు పడుతుంది? మరొకరికి ఎక్కువ శిక్ష ఎందుకు పడుతుంది? వారిలో ఒకరికి 24 గంటల్లో బెయిల్ వస్తుంది? అదే తప్పు చేసిన మరొకరికి రెండేళ్లయినా బెయిల్ దొరకదు. ఇలా ఎందుకు జరుగుతుంది? చట్టం అందరికీ సమానం అన్నప్పుడు అందరికీ ఒకేలా వర్తించాలి కదా. కానీ అలా జరగడం లేదు. దీన్ని ఎవరో ఒకరు ప్రశ్నించాలి. జనాల్లో అలాంటి ఒక ప్రశ్నను రేకెత్తించే చిత్రమే '23'" అని దర్శకుడు రాజ్ ఆర్ అన్నారు. 'మల్లేశం', '8 ఏఎం మెట్రో' చిత్రాలతో ఆయన ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. వాస్తవ సంఘటనల ఆధారంగా రాజ్ ఆర్ తెరకెక్కించిన తాజా చిత్రం '23'. వెంకట్ సిద్ధారెడ్డి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా స్టూడియో 99 నిర్మించింది. తేజ, తన్మయి ప్రధాన పాత్రలు పోషించారు. ఈ నెల 16న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా రాజ్ ఆర్ మీడియాతో మాట్లాడారు. కొన్ని దశాబ్దాల క్రితం చిలకలూరిపేట, చుండూరు, జూబ్లీహిల్స్‌లో జరిగిన సంఘటనల ఆధారంగా అల్లుకున్న కథతో '23' చిత్రాన్ని తెరకెక్కించాను. తెలిసి చేసినా, తెలియక చేసినా తప్పు తప్పే. ఆ ఘటనల వల్ల ఎన్నో జీవితాలు నాశనం అయ్యాయి. చాలా కుటుంబాలు రోడ్డునపడ్డాయి. ఆ మూడు సంఘటనలకూ ఓ ప్రేమజంటకూ ఉన్న సంబంధం ఏమిటి అనేది కథలో ఆసక్తికరంగా ఉంటుంది. కథాపరంగా ఇది కొంచెం టఫ్ సబ్జెక్ట్. ఏకాగ్రతతో చూడాల్సిన సినిమా ఇది. ఇందులో నటీనటులంతా అద్భుతంగా నటించారు. ఈ సినిమా తప్పకుండా ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది' అని రాజ్ ఆర్ అన్నారు.


కథ నుంచి వచ్చిన టైటిల్



"లెవన్' కథ నాకు బాగా నచ్చింది. కథ విని ఉద్వేగానికి లోనయ్యా. ఇందులో పోలీసులు హంతకుణ్ణి పట్టుకునేందుకు సాగించే అన్వేషణ నవ్య పంథాలో ఉంటుంది. ప్రేక్షకులు ఆశించే అంశాలతో సినిమా ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది' అని నవీన్‌చంద్ర అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన తెలుగు, తమిళ ద్విభాషా చిత్రం 'లెవన్'. లోకేశ్ అజ్ల్స్ దర్శకత్వంలో అజ్మల్‌ఖాన్, రేయా హరి నిర్మించారు. ఈ నెల 16న విడుదలవుతున్న సందర్భంగా నవీన్‌చంద్ర సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- ఒక సైకో కిల్లర్ చేసే హత్యల నేపథ్యంలో అల్లుకున్న ఆసక్తికర కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కింది. 'లెవన్' అనేది కథ నుంచి వచ్చిన టైటిల్. దానికి కథలో ఉన్న ప్రాముఖ్యం ఏవిటో సినిమా చూస్తే తెలుస్తుంది. ప్రీమియర్స్ చూసిన ప్రేక్షకులు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు. కథలో మలుపులు, ప్రేక్షకులను ఎగ్జైట్ చేశాయి. ఇప్పటివరకూ ఏ థ్రిల్లర్‌లోనూ రాని ఒక డిఫరెంట్ ఎమోషనల్ కాన్సెప్ట్ ఈ సినిమాలో ఉంది. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుంది. నిర్మాతలు ఖర్చుకు వెనుకాడలేదు. విజువల్స్ పరంగా ఓ కమర్షియల్ సినిమా చూస్తున్న ఫీలింగ్ కలుగుతుంది. ఈ సినిమా తమిళ వెర్షన్‌లోనూ నా పాత్రకు నేనే డబ్బింగ్ చెప్పాను. నటుడిగా అన్ని వర్గాల ప్రేక్షకులకు చేరువవ్వాలనేది నా ప్రయత్నం. అందుకే విభిన్న పాత్రలు చేస్తున్నాను. ప్రస్తుతం 'హనీ', 'కాళీ' చిత్రాలతో పాటు రవితేజ చిత్రంలో విలన్ పాత్ర చేస్తున్నాను.

తెలుగులో 'కేసరి: ఛాప్టర్ 2'



అక్షయ్‌కుమార్ కథానాయకుడిగా నటించిన బాలీవుడ్ చిత్రం 'కేసరి: ఛాప్టర్ 2'. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం హిందీ బెల్ట్‌లో చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. కరణ్ సింగ్ త్యాగి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ఆర్. మాధవన్, అనన్యపాండే కీలకపాత్రలు పోషించారు. ఇప్పుడు ఈ చిత్రం తెలుగు వెర్షన్ ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సురేశ్ ప్రొడక్షన్స్ ఈ చిత్రం తెలుగు హక్కులు దక్కించుకుంది. ఈ నెల 23న ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నట్లు సురేశ్ ప్రొడక్షన్స్ తెలిపింది. జలియన్ వాలాబాగ్ హత్యాకాండ తర్వాత బ్రిటిష్ పరిపాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన న్యాయవాది సి. శంకరన్ నాయర్ జీవితం ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కింది.

సినిమా టికెట్ రేట్ల ఖరారుపై కమిటీ



ఏపీలో సినిమా టికెట్ల ధరలను పునః పరిశీలించి ఖరారు చేసేందుకు ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. సినీ నిర్మాత వివేక్ కూచిభొట్ల చైర్మన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో హోం, ఫైనాన్స్, సమాచార, ప్రసార శాఖ ముఖ్య కార్యదర్శులు, లా సెక్రటరీ సభ్యులుగా ఉంటారు. వారితో పాటు చిత్ర నిర్మాత వివేక్ కూచిభొట్లకు కూడా ఈ కమిటీలో సభ్యుడిగా అవకాశం దక్కింది. గత వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన టికెట్ ధరల జీవో 35తోపాటు జీవో 13పైనా ఎగ్జిబిటర్లు, సినీ నిర్మాతలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ కోర్టును ఆశ్రయించారు. వైసీపీ ప్రభుత్వ వివాదాస్పద జీవోలు, కోర్టులో పిటిషన్లు, ప్రేక్షకుల అభిప్రాయాలు, ఎగ్జిబిటర్ల వినతులు, సినీ పరిశ్రమ పెద్దల సూచనలు పరిగణలోకి తీసుకుని సమగ్ర నివేదిక సమర్పించాలని ప్రభుత్వం కమిటీకి బాధ్యత అప్పగించింది. ఈ నివేదిక ఆధారంగా రాష్ట్రంలో సినిమా టికెట్ల ధరలపై ప్రభుత్వం సముచిత నిర్ణయం తీసుకోనుంది.


అమరావతి (ఆంధ్రజ్యోతి)

మిస్టరీ క్రైమ్ థ్రిల్లర్



విజయ్ ఆంటోని కథానాయకుడిగా స్వీయ నిర్మాణంలో రూపొందిస్తున్న చిత్రం 'మార్గన్'. ఆయన సతీమణి మీరావిజయ్ ఆంటోని సమర్పిస్తున్నారు. ఈ మిస్టరీ క్రైమ్ థ్రిల్లర్‌ను లియోజాన్ పాల్ తెరకెక్కిస్తున్నారు. విజయ్ ఆంటోని మేనల్లుడు అజయ్ ధీషన్ ఈ సినిమాతో పరిచయమౌతున్నారు. సముద్రఖని, మహానటి శంకర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవలె విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌కు మంచి ఆదరణ లభించింది. తాజాగా. ఈ సినిమాను జూన్ 27న విడుదల చేస్తున్నట్లు ప్రకటిస్తూ ఓ నూతన పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్ సినిమా అన్ని వర్గాలనూ ఆకట్టుకుంటుందని తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్: యువ.ఎన్.ఎస్, సంగీతం: విజయ్ ఆంటోని.

కేన్స్‌లో మెరిసిన ఊర్వశి.. డ్రెస్‌పై విమర్శలు



కేన్స్ 78వ చిత్రోత్సవం ఇటీవలె అట్టహాసంగా ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈ వేడుకల్లో మొదటిరోజున ప్రధానాకర్షణగా నిలిచారు ఊర్వశీ రౌతేలా. రంగురంగుల గౌనును ధరించడంతో పాటు చిలుక ఆకారంలో ఉండే ఓ ఆకర్షణీయమైన బ్యాగుతో రెడ్ కార్పెట్‌పై సందడి చేశారామె. ఈ ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. లుక్ బాగుందంటూ కొందరు ఊర్వశిని ఆకాశానికెత్తేస్తుండగా, మరి కొందరు ఆమెను కాపీ క్యాట్ అంటూ విమర్శిసున్నారు. దీనికి కారణం, 2018లో ఐశ్వర్యా రాయ్ ధరించిన గౌనూ.. ఊర్వశి ధరించిన డ్రెస్ ఒకేలా కనిపించడమే. ఈ ఏడాది జరిగే కేన్స్ వేడుకల్లో భారత్ నుంచి ఐశ్వర్యారాయ్, జాన్వీ కపూర్, షర్మిలా ఠాగూర్ తదితరులు రెడ్ కార్పెట్‌పై హొయలొలికించనున్నారు. కాగా, ఈ నెల 24న విజేతలను ప్రకటిస్తారు.

కెనడా విదేశాంగ మంత్రిగా అనితా ఆనంద్

» మంత్రివర్గంలో మరో ముగ్గురు భారత సంతతి ఎంపీలు



ఒట్టావా, మే 14: కెనడా మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో భారత సంతతి ఎంపీలకు కీలక పదవులు లభించాయి. ఇటీవల కెనడాలో జరిగిన ఫెడరల్ ఎన్నికల్లో లిబరల్ పార్టీ మరోసారి ఘనవిజయం సాధించి అధికారాన్ని దక్కించుకుంది. ఈ క్రమంలోనే కెనడా ప్రధాని మార్క్ కార్నీ మంత్రివర్గంలో భారత మూలాలున్న నలుగురు కెనెడియన్లు చోటు దక్కించుకున్నారు. అనితా ఆనంద్‌ను విదేశాంగ మంత్రిగా, మణిందర్ సిద్ధును వాణిజ్యమంత్రిగా కీలక శాఖలు కేటాయించారు. రూబీ సహోటా నేర నిరోధక విభాగ సహాయ మంత్రిగా, రణ్‌దీప్ సారాయ్ అంతర్జాతీయ విదేశాంగ కార్యదర్శిగా నియమితులయ్యారు. 58 ఏళ్ల అనితా ఆనంద్ కెనడాలోని ఓక్‌విల్లే నుంచి ఎంపీగా 2019లో ఎంపికయ్యారు. గతంలో కెనడా రక్షణ మంత్రిగా సహా పలు కీలక పదవుల్లో పనిచేసిన అనుభవం ఉంది. ఒకానొక సమయంలో ప్రధాని పదవికి పోటీదారుగా నిలిచారు. 41 ఏళ్ల మణిందర్ సిద్ధు బ్రాంప్టన్ ఈస్ట్ నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. వాణిజ్యమంత్రిగా సిద్ధు నియామకం ట్రంప్ ప్రభుత్వం కెనడాపై విధించిన టారిఫ్‌లను వ్యతిరేకిస్తున్న సమయంలో జరగడం గమనార్హం. ప్రధాని తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని ప్రమాణస్వీకారం అనంతరం ఎక్స్ వేదికగా మంత్రులు ప్రకటించారు.

మసూద్ అజర్‌కు రూ.14 కోట్ల పరిహారం!

ఇస్లామాబాద్, మే 14: జైషే మహ్మద్ చీఫ్, ఐరాస అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించిన మసూద్ అజర్‌కు పాకిస్థాన్ సర్కారు రూ.14 కోట్ల పరిహారం ఇవ్వనుంది. పాక్‌లోని ఉగ్రస్థావరాలపై భారత్ చేసిన క్షిపణి దాడుల్లో మసూద్ అజర్ కుటుంబ సభ్యులు 14 మంది హతమైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మృతులు ఒక్కొక్కరికి పాక్ ప్రభుత్వం రూ.కోటి చొప్పున పరిహారం ప్రకటించినట్లు 'ద ట్రిబ్యూన్ ఇండియా' కథనంలో పేర్కొంది. మృతుల వారసులకు ఈ సొమ్మును అందించనున్నారని.. ఒక వేళ అజర్ తానే వారసుడినని ప్రకటించుకుంటే మొత్తం డబ్బు అతనికే ఇస్తారని తెలిపింది. పరిహారంతో పాటు భారత్ దాడుల్లో ధ్వంసమైన ఇళ్లను కూడా పునర్నిర్మిస్తామని పాక్ సర్కారు పేర్కొన్నట్లు వెల్లడించింది. ఈ చర్యలతో పాకిస్థాన్ ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

గాజాపై ఇజ్రాయెల్ దాడుల్లో 84 మంది మృతి

గాజా, మే 14: హమా‌స్‌ను తుదముట్టించే చర్యల్లో భాగంగా ఇజ్రాయెల్... గాజాలో జరిపిన వైమానిక దాడుల్లో 84 మంది మృతిచెందారు. వీరిలో 22 మంది చిన్నారులున్నారు. ఖాన్ యూనిస్‌తో పాటు ఉత్తర గాజాలోని పలు ప్రాంతాల్లో ఈ దాడులు కొనసాగాయి. హమాస్ తమ వద్ద బందీగా ఉన్న అమెరికన్ జాతీయుడిని విడుదల చేసిన మరుసటి రోజే ఈ దాడులు జరిగాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఖతార్‌లో పర్యటిస్తుండగా, హమాస్-ఇజ్రాయెల్ మధ్య శాంతి ఒప్పందం కోసం మధ్యవర్తులు దోహాలో సమావేశమవుతున్న తరుణంలో ఈ దాడులు జరగడం కలకలం రేపింది. హమాస్ వద్ద బందీలుగా ఉన్న వారినందరినీ విడుదల చేసేదాకా దాడులు కొనసాగుతాయని ఇజ్రాయెల్ ఇప్పటికే స్పష్టం చేసింది.

జూన్ 21న విశాఖకు మోదీ

అమరావతి, మే 14(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో జూన్ 21న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు జరగనున్నాయి. ఈ వేడుకలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లపై బుధవారం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో సీఎస్ విజయానంద్ సంబంధితశాఖల అధికారులతో ప్రాథమికంగా సమీక్ష నిర్వహించారు. కేంద్ర ఆయుష్ మంత్రిత్వశాఖ సహకారంతో ఆర్ట్ ఆఫ్ లివింగ్, ఈశా ఫౌండేషన్, యోగా స్పోర్ట్స్ అసోసియేషన్, వివిధ విశ్వవిద్యాలయాలు తదితర సంస్థల భాగస్వామ్యంతో సుమారు 2 లక్షల మందితో రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విశాఖలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

సీజేఐ జస్టిస్ గవాయ్

ప్రమాణం చేయించిన రాష్ట్రపతి ముర్ము.. హాజరైన ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు

» తొలి బౌద్ధ, రెండో దళిత సీజేఐగా జస్టిస్ గవాయ్ రికార్డు

న్యూఢిల్లీ, మే 14: జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ భారతదేశ 52వ ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా బుధవారం ప్రమాణం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జస్టిస్ గవాయ్ చేత ఈ మేరకు ప్రమాణం చేయించారు. ప్రమాణం అనంతరం జస్టిస్ గవాయ్ తన తల్లి కమల్‌తాయి గవాయ్‌కి పాదాభివందనం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షా, జేపీ నడ్డా, అర్జున్‌రాం మేఘ్వాల్, ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్, విపక్షనేత రాహుల్‌గాంధీ తదితరులు హాజరయ్యారు. 64 ఏళ్ల వయసున్న జస్టిస్ గవాయ్.. ఈ ఏడాది నవంబరు 23 వరకూ సీజేఐ పదవిలో కొనసాగనున్నారు. కాగా, జస్టిస్ గవాయ్ బౌద్ధమతావలంబకులు. తద్వారా దేశ తొలి బౌద్ధ సీజేఐగా నిలిచారు. అంతేకాదు జస్టిస్ బాలకృష్ణన్ తర్వాత సీజేఐ పదవిని చేపట్టిన రెండో దళితవ్యక్తిగా పేరొందారు.

జస్టిస్ గవాయ్ మహారాష్ట్రలోని అమరావతికి చెందినవారు. ఆయన తండ్రి ఆర్ఎస్ గవాయ్ సీనియర్ రాజకీయ నాయకుడు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (గవాయ్) పార్టీని స్థాపించి దళిత వర్గాల నేతగా పేరొందారు. 1985లో భూషణ్ రామకృష్ణ గవాయ్ న్యాయవాదిగా తన కెరీర్‌ను ప్రారంభించారు. 1992-93లో బాంబే హైకోర్టు నాగ్‌పూర్ బెంచ్‌లో ప్రభుత్వ అసిస్టెంట్ ప్లీడర్‌గా, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేశారు. 2000లో ప్రభుత్వ ప్లీడర్‌గా, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పదోన్నతి పొందారు. 2003లో బాంబే హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2005లో హైకోర్టు శాశ్వత న్యాయమూర్తి అయ్యారు. 2019 మే24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతిపొందారు. సీజేఐగా మంగళవారం పదవీ విరమణ చేసిన జస్టిస్ సంజీవ్‌ఖన్నా అదే ఏడాది అదేరోజు సుప్రీంకోర్టు జడ్జిగా నియమితులయ్యారు.



52వ సీజేఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న జస్టిస్ గవాయ్

700 ధర్మాసనాల్లో భాగస్వామి

సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ గవాయ్ గత ఆరేళ్లలో దాదాపు 700 ధర్మాసనాల్లో ఉన్నారు. దాదాపు 300 తీర్పులను స్వయంగా రాశారు. పలు కీలక తీర్పుల్లో ఆయన భాగస్వామి. వాటిలో జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తినిచ్చిన ఆర్టికల్ 370ను కేంద్రం రద్దు చేయటానికి సమర్థన, పెద్దనోట్ల రద్దు సబబేనని తీర్పు, ఎన్నికల బాండ్లరద్దు, బుల్డోజర్లతో ప్రభుత్వమే నిందితుల ఇళ్లను కూల్చటాన్ని నిలిపివేస్తూ తీర్పు.. ఉన్నాయి. ఇటీవల అలహాబాద్ హైకోర్టు జడ్జి ఒకరు.. నిందితుడు ఓ మహిళ పైజామా తాడు లాగటం, ఛాతిని తాకటం రేప్ కిందకు రాదంటూ ఇచ్చిన తీర్పును జస్టిస్ గవాయ్ సారథ్యంలోని బెంచ్ నిలిపేసింది.

జై భీం అంటూ పలకరింపు

సీజేఐగా ప్రమాణం అనంతరం సుప్రీంకోర్టులో తనను న్యాయవాదులు కలిసిన సందర్భంగా జస్టిస్ గవాయ్.. 'జై భీం' అంటూ వారిని పలకరించారు. రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనల స్ఫూర్తితో 'జై భీం' నినాదం రూపుదిద్దుకున్న విషయం తెలిసిందే. కాగా, సీజేఐగా ప్రమాణం చేయటానికి కొన్ని రోజుల ముందు తన నివాసంలో జస్టిస్ గవాయ్ విలేకర్లతో మాట్లాడుతూ.. సీజేఐగా తనకు రాజ్యాంగమే అత్యున్నత ప్రమాణంగా ఉంటుందని స్పష్టం చేశారు. పదవీ విరమణ తర్వాత ఏ ప్రభుత్వ పదవినీ చేపట్టబోనని చెప్పారు. తాజాగా, రిటైర్ అయిన సీజేఐ సంజీవ్‌ఖన్నా కూడా ఏ పదవీ చేపట్టనని స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

శత్రు డ్రోన్ల దండుపై 'భార్గవాస్త్రం'

» స్వదేశీ కౌంటర్ డ్రోన్ వ్యవస్థ పరీక్ష సక్సెస్

న్యూఢిల్లీ, మే 14: భారత గగనతల రక్షణ వ్యవస్థ మరింత బలోపేతమయ్యే దిశగా మరో ముందడుగు పడింది. గుంపుగా వచ్చిపడే శత్రు డ్రోన్ల సమూహాన్ని పక్కాగా ఛేదించే స్వదేశీ కౌంటర్ డ్రోన్ వ్యవస్థ 'భార్గవాస్త్ర'ను భారత్ విజయవంతంగా పరీక్షించింది. సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్ (ఎస్‌డీఏఎల్) స్వదేశీ పరిజ్ఞానంతో, తక్కువ ఖర్చుతో అభివృద్ధి చేసిన భార్గవాస్త్ర... ఒకేసారి అనేక డ్రోన్లతో దాడి చేసినప్పటికీ వాటిని సమర్థవంతంగా అడ్డుకుంటుంది. ఈ వ్యవస్థలో ఉపయోగించిన రాకెట్లకు ఒడిసాలోని గోపాల్‌పూర్‌లో ఉన్న సీవార్డ్ ఫైరింగ్ రేంజ్‌లో మంగళవారం నిర్వహించిన పరీక్ష విజయవంతమైంది. ఈ సందర్భంగా ఇది అన్ని లక్ష్యాలను విజయవంతంగా ఛేదించినట్లు ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ (ఏడీడీ) అధికారులు తెలిపారు. దీనికి మొత్తం మూడు ట్రయల్స్ నిర్వహించారు. రెండు సార్లు ఒక్కో రాకెట్‌ను విడివిడిగా పరీక్షించగా.. మూడో ట్రయల్‌లో రెండు సెకన్ల వ్యవధిలో రెండు రాకెట్లను పరీక్షించారు. పరీక్షల సందర్భంగా ఈ నాలుగు రాకెట్లు సమర్థవంతంగా పనిచేశాయని, నిర్దేశిత పారామితులను సాధించాయని అధికారులు చెప్పారు.

6-10 కి.మీ. దూరంలోనే గుర్తింపు

భార్గవాస్త్రను పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేశారు. ఇది 2.5 కిలోమీటర్ల దూరం నుంచి వస్తున్న డ్రోన్లను గుర్తించి మైక్రో రాకెట్ల సాయంతో నిర్వీర్యం చేయగలదు. తొలి లేయర్‌లో అన్‌గైడెడ్ మైక్రో రాకెట్ల సాయంతో 20 మీటర్ల పరిధిలో ఉన్న డ్రోన్ల దండును నాశనం చేయగలదు. రెండో లేయర్‌లో ఉన్న గైడెడ్ మైక్రో మిస్సైల్స్ లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో గుర్తించి నిర్వీర్యం చేస్తాయి. ఇందులో ఏర్పాటు చేసిన రాడార్ వ్యవస్థ గగనతలంలో 6 నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న ముప్పును కూడా పసిగట్టగలదు. దీనిలోని ఎలక్ట్రో-ఆప్టికల్/ఇన్‌ఫ్రారెడ్ సెన్సర్ సూట్ తక్కువ ఎత్తులో వచ్చే డ్రోన్లను కూడా అత్యంత కచ్చితత్వంతో గుర్తించగలదు. సముద్ర మట్టానికి 5వేల మీటర్ల ఎత్తులో ఉండే భూభాగాల్లో, కొండ ప్రాంతాల్లోనూ వీటిని సమర్థవంతంగా ఉపయోగించవచ్చు.



లోకం తీరు



మోదీ అధ్యక్షతన సీసీఎస్ భేటీ

న్యూఢిల్లీ, మే 14: ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారం భద్రతా వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ (సీసీఎస్) సమావేశం జరిగింది. భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ తర్వాత సీసీఎస్ భేటీ కావడం ఇదే తొలిసారి. తాజా భద్రతా పరిస్థితులు, దేశ సన్నద్ధతపై సమావేశంలో చర్చించారు. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా పాల్గొన్నారు. కాగా, మహా దళపతి (సీడీఎస్) అనిల్ చౌహాన్‌తో పాటు త్రివిధ దళాధిపతులు బుధవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిసి ఆపరేషన్ సిందూర్ గురించి వివరించారు. మరోవైపు, భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ భద్రతను కేంద్రం మరింత పెంచింది. ఇటీవల జరిపిన సమీక్షలో భాగంగా ఆయనకు ప్రస్తుతం కల్పిస్తున్న జెడ్ కేటగిరీ సెక్యూరిటీలో మరో రెండు బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను చేర్చినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

కశ్మీర్‌లో 9,500 బంకర్లు.. మరిన్ని నిర్మిస్తాం: సీఎస్ అటల్

జమ్మూకశ్మీర్, మే 14: భారత్ - పాకిస్థాన్ అంతర్జాతీయ సరిహద్దు, నియంత్రణ రేఖ వెంబడి 9,500 బంకర్లు ఉన్నాయని, జనావాసాలే లక్ష్యంగా పాకిస్థాన్ కాల్పులకు తెగబడుతుండడంతో స్థానికుల భద్రత దృష్ట్యా వాటి సంఖ్యను మరింత పెంచుతామని జమ్మూకశ్మీర్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అటల్ డుల్లూ అన్నారు. నియంత్రణ రేఖ వెంబడి ఉన్న కాల్పుల ప్రభావిత ప్రాంతాలను మంగళవారం ఆయన పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. అవసరానికి అనుగుణంగా బంకర్ల సంఖ్యను పెంచుతామన్నారు. ప్రాణ, ఆస్తినష్టాలు జరిగాయని నష్టపోయిన వారికి త్వరలోనే పరిహారం అందజేస్తామని తెలిపారు. బాధితులకు సంఘీభావాన్ని ప్రకటించి, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వారి భద్రతకు, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రకటించారు.

పాడి, పౌల్ట్రీ రంగాల్లో
నూతన ఆవిష్కరణలు

అత్యాధునిక టెక్నాలజీతో మెరుగైన ఫలితాలు



పశుసంవర్ధక టెక్ ఏఐ 2.0 సదస్సులో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

» వృద్ధిరేటులో పశుసంవర్ధక శాఖది కీలకపాత్ర

» గ్రామాల్లో డెయిరీ షెడ్లపై ట్యాక్స్ రద్దు

» పశుసంవర్ధక-టెక్ ఏఐ 2.0లో చంద్రబాబు

అమరావతి, మే 14(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడి, పౌల్ట్రీ రంగాల్లో నూతన ఆవిష్కరణలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న అత్యాధునిక సాంకేతిక టెక్నాలజీని ఉపయోగించుకుని మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. గ్లోబ్ ఫోరమ్ ఫర్ సస్టెయినబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్(జీఎఫ్ఎస్‌టీ) ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలో నిర్వహించిన పశుసంవర్ధకశాఖ-టెక్ ఏఐ 2.0 సదస్సులో ఆయన ప్రసంగించారు. 'రాబోయేదంతా టెక్నాలజీ యుగమే. ఏఐతో పాటు క్వాంటమ్ కంప్యూటింగ్‌ను సమర్థంగా ఉపయోగించుకోగలిగే అభివృద్ధికి గేమ్ చేంజర్‌గా నిలుస్తుంది. ఇప్పటికే టెక్నాలజీని ఉపయోగించి వ్యవసాయ అనుబంధ రంగాల్లో నూతన పరిశోధనలకు శ్రీకారం చుడుతున్న లైవ్‌స్టాక్ స్టార్టప్ కంపెనీలకు ప్రభుత్వ పరంగా ప్రోత్సాహకాలు అందిస్తాం. ఇలాంటి స్టార్టప్ కంపెనీలు పెద్దఎత్తున రావాలి. నిత్యం పరిశోధనలు కొనసాగాలి. రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్‌కు అత్యంత ప్రాధాన్యమిస్తున్నాం. పౌల్ట్రీ, టెక్స్‌టైల్స్ తదితర రంగాలు ఇబ్బందుల్లో ఉన్నాయి. వాటిని ఏవిధంగా పరిష్కరించాలో ఆలోచిస్తున్నాం. తగు విధానపరమైన నిర్ణయాలు తీసుకుని పాడి, పౌల్ట్రీ రంగాలను లాభాల బాట పట్టిస్తాం. కేంద్ర పథకాలను ఆన్‌లైన్‌లో పెడతాం. వెటర్నరీ సర్వీసులను అత్యవసర సేవల్లో చేరుస్తాం. అవసరమైనన్ని వెటర్నరీ మొబైల్ అంబులెన్స్‌లను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం. నరేగా ద్వారా ప్రాసెస్ చేసిన ఫాడర్(గడ్డి)ని ప్రతి రైతుకు సరఫరా చేయిస్తాం. ఈ బాధ్యతలను డ్వాక్రా గ్రూపులకు అప్పగిస్తాం. మొక్కజొన్న పంటను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. వెటర్నరీ స్టూడెంట్స్‌కు ఫీల్డ్ నాలెడ్జ్ కోసం రైతులతో అనుసంధానం చేస్తూ ఇంటర్న్‌షిప్ విధానాన్ని ప్రవేశపెడతాం. రాష్ట్రంలో వివిధ కులవృత్తులవారి జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వ పరంగా ఆర్థిక తోడ్పాటు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం 18 లక్షల హెక్టార్లలో ఉన్న ఉద్యాన పంటల సాగును రెట్టింపు చేసి 36 లక్షల హెక్టార్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం' అని చంద్రబాబు వివరించారు.

ఏపీ నంబర్ వన్

'టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడల్లా వ్యవసాయం, అనుబంధ రంగాలకు అత్యంత ప్రాధాన్యమిస్తోంది. ఫలితంగానే ఆయా రంగాల్లో ఏపీ నంబర్ వన్‌గా నిలుస్తూ వస్తోంది. వ్యవసాయంలో ఏపీ నంబర్ వన్ కాగా.. గుడ్ల ఉత్పత్తిలోనూ మొదటి స్థానంలో ఉంది. మాంసం ఉత్పత్తిలో 5వ స్థానం, పాల ఉత్పత్తిలో 7వ స్థానంలో ఉంది. మొత్తంగా రాష్ట్ర జీఎస్‌డీపీలో పశుసంవర్ధక శాఖ వాటా 11.23 శాతంగా ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26)లో జీఎస్‌డీపీ లక్ష్యం రూ.1,95,460 కోట్లుగా నిర్ణయించాం. పాడి పరిశ్రమపై రాష్ట్రవ్యాప్తంగా 42లక్షల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. వ్యవసాయ, అనుబంధ రంగాలతో పాటు పరిశ్రమలు, సేవల రంగం ఇంకా మెరుగుపడాల్సిన అవసరం ఉంది. డెయిరీకి మైక్రో ఇరిగేషన్‌ను వర్తింపజేస్తాం. మైక్రోఇరిగేషన్‌లో ఈ ఏడాది 2.50 లక్షల ఎకరాలకు ప్రాధాన్యం ఇచ్చాం. మహిళలు సైతం గడ్డి కోసేలా కటింగ్ యంత్రాలు అందుబాటులోకి తీసుకువస్తాం. సోలార్ పవర్‌కు 1000 యూనిట్ల వరకు పర్మిషన్ ఇస్తాం' అని చంద్రబాబు అన్నారు. 'గత ఐదేళ్లలో రాష్ట్రంలో జరిగింది మామూలు విధ్వంసం కాదు. రూ.10లక్షల కోట్ల అప్పుల భారాన్ని ప్రజలపై వేసి వెళ్లారు. బ్రాండ్ ఏపీ ఫైనస్‌కు పడిపోయింది. ఏపీ పేరు చెబితేనే.. పారిశ్రామికవేత్తలు భయపడి పరుగులు తీసే పరిస్థితి. ఈ నేపథ్యంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత ఐదేళ్లలో జరిగిన విధ్వంసాన్ని స్టెప్ బై స్టెప్ సరిచేసుకుంటూ వెళ్తున్నాం. నా విశ్వసనీయతతో అందరినీ రాష్ట్రానికి తిరిగి తీసుకువస్తున్నాం. ప్రజలకు ఇబ్బందికరంగా మారిన చట్టాలను సమీక్షిస్తున్నాం. గత ప్రభుత్వం విధించిన నాలా పన్ను తీసేశాం. తాజాగా గ్రామాల్లో డెయిరీ షెడ్లపై గత ప్రభుత్వం విధించిన ప్రాపర్టీ ట్యాక్స్‌ను వెంటనే రద్దు చేయాలని ఆదేశాలు ఇచ్చాం. ఎన్టీఆర్ స్ఫూర్తితో పేదరిక నిర్మూలన కోసం పీ4కు శ్రీకారం చుట్టాం' అని సీఎం వివరించారు.

నేను నిత్య విద్యార్థిని

'నేనెప్పుడూ నిత్య విద్యార్థిగా నేర్చుకుంటూనే ఉంటాను. టెక్నాలజీలో చాలా మార్పులు వస్తున్నాయి. దాన్ని అందిపుచ్చుకున్నవారు మాత్రమే అభివృద్ధి చెందగలరు. హైదరాబాద్‌లో ఐటీని అభివృద్ధి చేయడంతో ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అత్యధిక తలసరి ఆదాయం పొందుతున్న వారిలో భారతీయులు ఎక్కువగా ఉన్నారు. వారిలో 35 శాతం తెలుగువారు ఉన్నారు. ప్రస్తుతం నాలెడ్జ్, టెక్నాలజీని ఉపయోగించుకుని ఇంటికొక పారిశ్రామికవేత్తను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం' అని చంద్రబాబు చెప్పారు. ఈ కార్యక్రమానికి హాజరైన వివిధ వృత్తిదారులతో ముఖ్యమంత్రి ముఖాముఖీ మాట్లాడారు. పశు పోషణ, డెయిరీ, పౌల్ట్రీల నిర్వహణలో వారి అనుభవాలు, ఆదాయ, వ్యయాల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, సత్యకుమార్, కొండపల్లి శ్రీనివాసరావు, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని ఊడ్చేసి చిల్లికుండ చేతికి..
అయినా పనులు చేస్తున్నాం

» తెస్తున్న డబ్బంతా జగన్ అప్పులకే సరి: నిమ్మల



బుడమేరు గండ్ల వద్ద సీపేజ్ ప్రాంతంలో సమాంతర వాల్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

ఇబ్రహీంపట్నం, మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని ఊడ్చేసి ఖాళీ చిల్లికుండను మాజీ సీఎం జగన్ తమ చేతికి ఇచ్చినా ఏదో ఒకటి చేసి అభివృద్ధి పనులు చేపడుతున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఏదైనా ప్రజలకు చేయాలని రూ.10వేల కోట్లు అప్పు తెస్తే జగన్ చేసిన అప్పులకు వడ్డీలు కట్టేందుకే అవి సరిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొండపల్లి మున్సిపాలిటీ శాంతినగర్ వద్ద బుడమేరు డైవర్షన్ చానెల్‌కు గత ఏడాది వరదలకు ఏర్పడ్డ మూడు గండ్ల వద్ద యుద్ధ ప్రాతిపదికన పూడ్చించిన కట్టకు సమాంతరంగా సేఫ్టీ వాల్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. వాటిని ఆయన మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. జగన్ రాష్ట్రాన్ని ఆర్థికంగా ఎంత ముంచినా సరే పరిపాలన దక్షత కలిగిన చంద్రబాబు ఉన్నారనే ధైర్యమే తమను, రాష్ట్ర ప్రజలను నిలబెడుతోందన్నారు. చంద్రబాబుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అండగా ఉన్నారని, ప్రధాని నరేంద్ర మోదీ సహకారం ఉందన్నారు. అందువల్లే సవాళ్లను అధిగమించి ముందుకు సాగగలుగుతున్నామని తెలిపారు. బుడమేరుకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని, ఇందుకు కేంద్ర సాయం అవసరమన్నారు. ఇప్పుడున్న పరిస్థితులనుబట్టి రాష్ట్ర బడ్జెట్ ఒక్కటే సరిపోదని, రూ.28కోట్లతో మూడు గండ్లు పడిన చోట సుమారు 500 మీటర్ల పర్మినెంట్ సేఫ్టీ వాల్ నిర్మాణం జూన్ 10నాటికి పూర్తయ్యేలా యుద్ధ ప్రాతిపదికన పనులు సాగుతున్నాయని తెలిపారు.

సంక్షేమ సందడి!

(మొదటి పేజీ తరువాయి)

సుమారు లక్షమందికి పైగా ఉన్నారని అచ్చెన్నాయుడు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజును పురస్కరించుకుని జూన్ 12న వీరందరికీ పింఛన్లు ఇవ్వాలని నిర్ణయించామని చెప్పారు. గ్యాస్ లబ్ధిదారులకు ఇప్పటి వరకు సిలిండర్ బుక్ చేసిన తర్వాత వారి ఖాతాల్లో డబ్బులు వేసేవారని, దీనిపై ఫిర్యాదులు వస్తుండటంతో ఇకపై 3 సిలిండర్లకు సంబంధించిన మొత్తాన్ని ముందుగానే లబ్ధిదారుల ఖాతాల్లో వేయాలని నిర్ణయించామని వివరించారు. పాఠశాలలు తెరిచే సమయానికి జూన్ 12లోగా 'తల్లికి వందనం' డబ్బులను తల్లుల ఖాతాలో వేయనున్నట్లు పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ కింద కేంద్రం రైతుల ఖాతాల్లో నిధులు వేసిన రోజే రాష్ట్ర ప్రభుత్వం కూడా వేసేలా పొలిట్‌బ్యూరో నిర్ణయం తీసుకుందని వివరించారు. ఏడాదిలో అమలు చేయనున్న సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను ముందుగానే విడుదల చేయాలని నిర్ణయించామని, ప్రతినెలా ఒక సంక్షేమ పథకానికి సంబంధించిన కార్యక్రమాలతో క్యాలెండర్‌ను రూపొందించనున్నట్లు తెలిపారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతాన్ని పురస్కరించుకుని ఈ నెల 16, 17, 18 తేదీల్లో రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో తిరంగా ర్యాలీలు నిర్వహించనున్నామని, వీటిలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పాల్గొంటాయని తెలిపారు.

కార్యకర్తల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

టీడీపీ కార్యకర్తల సంక్షేమానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలని పొలిట్‌బ్యూరో సమావేశంలో నిర్ణయించినట్లు అచ్చెన్నాయుడు చెప్పారు. పార్టీ సభ్యత్వం తీసుకున్నవారు ప్రమాదవశాత్తు మరణిస్తే గతంలో రూ.2 లక్షలు ఇచ్చేవారమని, ఈ ఏడాది జనవరి నుంచి రూ.5 లక్షలు ఇస్తున్నామని, ఇప్పటి వరకు 190 మంది రూ.9.57 కోట్లు చెల్లించామని వివరించారు. ఈ చెల్లింపులు ఆలస్యం లేకుండా చూడాలని తీర్మానం చేశామన్నారు. పార్టీ సంస్థాగత ఎన్నికలన్నీ మే నెలాఖరు నాటికి, జిల్లాస్థాయి కమిటీలు మహానాడులోగా పూర్తి చేయాలని నిర్ణయించామని తెలిపారు. మండల పార్టీ అధ్యక్షులుగా మూడు విడతలు, ఆరేళ్ల పాటు పనిచేసిన వారిని అంతకన్నా పెద్ద పదవుల్లో నియమించాలే తప్ప అదే పదవిలో కొనసాగించకూడదని నిర్ణయించామని చెప్పారు.

ఘనంగా మహానాడు

మే 27, 28, 29 తేదీల్లో కడప జిల్లా సీకే దిన్నె మండలంలో జాతీయ రహదారి పక్కనే మహానాడు నిర్వహిస్తున్నట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. కాగా, నీరు-చెట్టు పనులకు సంబంధించి రూ.445 కోట్లు, ఉపాధి హామీ పనులకు సంబంధించి రూ.211 కోట్లు బకాయిలు ఉన్నాయని వీటిని మహానాడులోగా చెల్లించాలని నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆధార్ కార్డు, రేషన్ కార్డులు లేని గిరిజనుల కోసం ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టాలని, ఈ మేరకు కలెక్టర్లకు ఆదేశాలు ఇవ్వాలని తీర్మానించారు. తెలుగుదేశం పార్టీకి ఇప్పటి వరకు వివిధ యాప్‌లను కలిపి 'మై టీడీపీ' యాప్‌ను తీసుకొస్తున్నారు. పార్టీ అధ్యక్షుడి నుంచి కార్యకర్త వరకు అందరూ ఇకపై ఈ యాప్‌ను మాత్రమే వినియోగించాలని నిర్ణయించారు. మహానాడు నుంచే దీన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పార్టీ కార్యాలయాల నిర్మాణం కోసం రాష్ట్రస్థాయిలో పార్టీ అధ్యక్షుడి నేతృత్వంలో, జిల్లాస్థాయిలో జిల్లా మంత్రి ఆధ్వర్యంలో త్రీమెన్ కమిటీలు ఏర్పాటు చేశారు.



టీడీపీ కేంద్ర కార్యాలయంలో మహానాడు కమిటీల కన్వీనర్లు, కో-కన్వీనర్లతో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేశ్

కడప మహానాడు
చరిత్రలో నిలిచిపోతుంది: సీఎం

అమరావతి, మే 14 (ఆంధ్రజ్యోతి): కడపలో తొలిసారిగా నిర్వహిస్తున్న మహానాడు చరిత్రలో గుర్తుండిపోతుందని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు అన్నారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మహానాడు నిర్వహణ కమిటీ బాధ్యులు, ముఖ్య నేతలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాయలసీమను దశాబ్దాల తరబడి పట్టిపీడిస్తున్న ఫ్యాక్షన్ భూతాన్ని సమూలంగా అంతం చేసిన చరిత్ర టీడీపీదని తెలిపారు. ఎడారిగా మారుతున్న అనంతపురం జిల్లాకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి తాగు, సాగునీరు ఇచ్చామని, డ్రిప్ ఇరిగేషన్ ద్వారా సీమలో కరువుకు సమాధానం చెప్పామని వివరించారు. రాయలసీమలో పరిశ్రమలు, డెయిరీలు అభివృద్ధి చేస్తున్నామని, హార్టికల్చర్‌లో వచ్చే మార్పులతో సీమ రైతులు కోనసీమ రైతులను అధిగమిస్తారని అన్నారు. పార్టీ నేతలు ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి చర్చ పెట్టాలని సూచించారు. ఈ నెల 18, 19, 20 తేదీల్లో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో, 22, 23 తేదీల్లో పార్లమెంట్ నియోజకవర్గాల్లో మినీ మహానాడులను నిర్వహించాలని పార్టీ నేతలకు చంద్రబాబు సూచించారు.

మహానాడు మూడు రోజులు

నిర్వహణ కమిటీలతో లోకేశ్ భేటీ

అమరావతి, మే 14(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ మహానాడును మూడు రోజుల పాటు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమం నిర్వహణకు ఇప్పటికే ఆరు కమిటీలు ఏర్పాటు చేశారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో పొలిట్‌బ్యూరో సమావేశానికి ముందు మహానాడు కమిటీల కన్వీనర్లు, కో-కన్వీనర్లతో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మహానాడును కుదించకుండా మూడు రోజుల పాటు నిర్వహించాలని నిర్ణయించారు. మొదటి రోజు టీడీపీ విధివిధానాలు, సిద్ధాంతాలు, కార్యాచరణపై చర్చించాలని, రెండోరోజు రాష్ట్రం కోసం కూటమి ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై రూపొందించిన తీర్మానాలపై చర్చించాలని నిర్ణయించారు మూడోరోజు బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పలువురు మంత్రులు, సీనియర్ నేతలకు మహానాడు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో మహానాడు నిర్వహణపైనా సమావేశంలో చర్చించారు. మహానాడు నిర్వహణలో.. వసతి, రవాణాకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని నేతలకు లోకేశ్ దిశానిర్దేశం చేశారు. మహానాడు ఏర్పాట్లపై లోకేశ్ ఆధ్వర్యంలో మంత్రుల కమిటీ పొలిట్‌బ్యూరో సమావేశంలో నివేదిక సమర్పించింది. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, సవిత, పి.నారాయణ, గొట్టిపాటి రవికుమార్, డోలా బాల వీరాంజనేయ స్వామి, సీనియర్ నాయకుడు బీద రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.



కిరానా హిల్స్‌లో ఏం జరిగింది?

అణుధార్మికత లీక్ అయ్యిందా?.. అక్కడ పాక్ టాక్టికల్ న్యూక్లియర్ వార్‌హెడ్ల నిల్వ!

- ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో అక్కడికి హడావుడిగా అమెరికా బీ-350 విమానం
- అందులో రేడియేషన్‌ను అంచనా వేసే టెక్నాలజీ
- ఈజిప్ట్ నుంచి బోరాన్‌తో మరో విమానం!
- కిరానా హిల్స్‌లో రేడియేషన్ లీక్ వార్తలకు బలం

(సెంట్రల్ డెస్క్)

పాకిస్థాన్‌లోని కిరానా హిల్స్‌లో ఏం జరిగింది? అక్కడి టాక్టికల్ న్యూక్లియర్ వార్ హెడ్స్ నిల్వలకు నష్టం వాటిల్లిందా? ఫలితంగా.. కిరానా హిల్స్ నుంచి అణుధార్మికత వెలువడుతోందా? అమెరికాకు చెందిన ప్రత్యేక 'న్యూక్లియర్ ఎమర్జెన్సీ' విమానం పాకిస్థాన్‌లో ల్యాండ్ అయినట్లు ఫ్లైట్ ట్రాకింగ్ డేటా వెల్లడి చేయడం.. అణుధార్మికతను కొంత వరకు నియంత్రించగలిగే బోరాన్ నిల్వలతో ఈజిప్ట్‌కు చెందిన విమానం ఇస్లామాబాద్‌కు చేరిందనే వార్తలు వెల్లువెత్తడంతో ఇప్పుడు ఈ అంశంపై మరింత ఉత్కంఠ నెలకొంది. పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్ పరిధిలో.. సర్గోధా జిల్లాలో కిరానా హిల్స్ ఉన్నాయి. వీటి వైశాల్యం 68 చదరపు కిలోమీటర్లు కాగా.. 39 కిలోమీటర్ల వ్యాసార్థంలో పాకిస్థాన్ రక్షణ శాఖ తన స్థావరాలను ఏర్పాటు చేసుకుంది. ఈ కొండల్లో 10కి మించి సొరంగాలను నిర్మించిన పాక్.. వాటిలో టాక్టికల్(చిన్నపాటి అణు దాడులు) న్యూక్లియర్ వార్‌హెడ్ నిల్వలను భద్రపరిచినట్లు వార్తలు వెలువడుతున్నాయి. స్ట్రాటజిక్(భారీ విధ్వంసం సృష్టించే అణు దాడులు) న్యూక్లియర్ వార్‌హెడ్‌లు నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్ సమీపంలో ఉన్నట్లు అంతర్జాతీయ వార్తాసంస్థలు చెబుతున్నాయి. 1980-89 మధ్యకాలంలో కిరానా హిల్స్‌పై పాకిస్థాన్ టాక్టికల్ న్యూక్లియర్ పరీక్షలు నిర్వహించినట్లు 2023లో 'ద బులెటిన్ ఆఫ్ ది అటామిక్ సైంటిస్ట్స్' నివేదిక వెల్లడించింది. ఇదే నివేదికలో వార్‌హెడ్‌ల నిల్వల ప్రస్తావన ఉండడం గమనార్హం..! ఇక్కడ ఆయుధాల గ్రేడ్ ప్లుటోనియం ఉత్పత్తికి ఉపయోగించే 4భారజల రియాక్టర్లు ఉన్నట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి.



పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్, ఆర్మీ చీఫ్ మునీర్ బుధవారం సియాల్‌కోట్‌లోని పస్రూర్ కంటోన్మెంట్‌లో పర్యటించారు. ఇలా యుద్ధ ట్యాంకుపై నిలబడి సైనికులతో మాట్లాడారు. ప్రధాని మోదీ మంగళవారం ఆదంపూర్ ఎయిర్‌బేస్‌కు వెళ్లిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో.. మోదీని షెహబాజ్ కాపీ కొడుతున్నారని నెటిజన్లు ఎద్దేవా చేస్తున్నారు.

ఇప్పుడు ఎందుకు ఉత్కంఠ?

ఇటీవల 'ఆపరేషన్ సిందూర్'పై వాయుసేన అధికారి ఏకే భారతి ప్రెస్ బ్రీఫింగ్‌లో భాగంగా.. ఓ విలేకరి "కిరానా హిల్స్‌ను టార్గెట్‌గా చేసుకున్నారా? అక్కడ రేడియేషన్ వెలువడుతోందంటూ సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి" అని ప్రస్తావించారు. దానికి ఏకే భారతి సమాధానమిస్తూ.. "మా టార్గెట్లలో కిరానా హిల్స్ లేవు. అక్కడ పాకిస్థానీ అణ్వాయుధాలున్నట్లు సమాచారం చెప్పినందుకు ధన్యవాదాలు" అని వ్యాఖ్యానించారు. ఆ తర్వాత రేడియేషన్ లీకేజీపై అంతటా చర్చ మొదలైంది. ఎకనామిక్ టైమ్స్‌తోపాటు.. పలు అంతర్జాతీయ వార్తా సంస్థలు కూడా ఇదే కోణంలో వార్తలను ప్రచురించాయి. దీనికి బలాన్ని చేకూరుస్తూ.. ఫ్లైట్‌రాడార్-24 వంటి ఫ్లైట్ ట్రాకర్ వెబ్‌సైట్లలో అమెరికాకు చెందిన బీ-350(ఏఎంఎస్) విమానం పాకిస్థాన్‌కు వచ్చినట్లు పేర్కొన్నాయి. ఈ విమానాన్ని 'న్యూక్లియర్ ఎమర్జెన్సీ' అని పిలుస్తారు. ఒక ప్రాంతంలో వెలువడే అణుధార్మికత తీవ్రతను గుర్తించే సాంకేతిక పరికరాలు ఈ విమానంలో ఉంటాయి. ఫుకుషిమా ఉదంతంలోనూ ఈ విమానం జపాన్‌కు వెళ్లినట్లు ఎకనామిక్ టైమ్స్ గుర్తుచేసింది. అదేవిధంగా ఈజిప్ట్ నుంచి బోరాన్ నిల్వలతో మరో విమానం పాకిస్థాన్‌కు చేరుకున్నట్లు వార్తలు వచ్చాయి. అణుధార్మికతకు సంబంధించిన న్యూట్రాన్లు బోరాన్-10 ఐసోటోప్‌లలో విలీనం అవుతాయి. ఫలితంగా రేడియేషన్ ప్రభావం తగ్గుతుంది. అందుకే ఈజిప్ట్ బోరాన్‌ను పంపించి ఉంటుందని ఆయా కథనాలు చెబుతున్నాయి.

నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్ వద్ద కూడా..

నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్ సమీపంలో బంకర్లలోని వార్‌హెడ్లకు నష్టం జరిగి.. రేడియో ధార్మికత లీకై ఉండొచ్చని అమెరికా అత్యున్నత దర్యాప్తు సంస్థ సీఐఏ మాజీ అధికారి, రాండ్ కార్పొరేషన్ విశ్లేషకుడు డెరెక్ గ్రాస్‌మన్‌ను ఉటంకిస్తూ ఎకనామిక్ టైమ్స్ తన కథనంలో తెలిపింది. ఈ దాడులు పాకిస్థాన్ న్యూక్లియర్ కమాండ్ అథారిటీ పాలిట శరాఘాతమని ఆయన వ్యాఖ్యానించినట్లు ఎకనామిక్ టైమ్స్ కథనం స్పష్టం చేస్తోంది.

ఇంటెలిజెన్స్ హెచ్చరిక ఇదేనా?

పాక్‌పై దాడులను భారత్ తీవ్రతరం చేయడంతో.. ఈ నెల 10వ తేదీన తెల్లవారుజామున ప్రధాని మోదీకి అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఫోన్ చేసిన విషయం తెలిసిందే..! దీనికి కారణాలను విశ్లేషిస్తూ సీఎన్ఎన్ ఓ కథనాన్ని ప్రసారం చేసింది. అత్యంత కీలకమైన హెచ్చరికలను ఇంటెలిజెన్స్ వర్గాలు వైట్‌హౌస్‌కు అందజేసినట్లు పేర్కొంది. ఆ వెంటనే అధ్యక్షుడు ట్రంప్, వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో భేటీ అయ్యి.. భారత్-పాక్ ఉద్రిక్తతలను తక్షణం నిలువరించాల్సిన అవసరం ఉందని భావించినట్లు వెల్లడించింది. ఆ మేరకు వైట్‌హౌస్ తీసుకున్న నిర్ణయంతో వాన్స్ వెంటనే(శనివారం ఉదయం) ప్రధాని మోదీకి ఫోన్ చేసినట్లు స్పష్టం చేసింది. ఆ ఇంటెలిజెన్స్ హెచ్చరికలు అణుధార్మికత లీకేజీకి సంబంధించినవే అయి ఉంటాయని తాజా పరిణామాలను బట్టి తెలుస్తోంది. ఇదిలా ఉండగా, భారత్ దాడులతో దారుణంగా దెబ్బతిన్న పాకిస్థాన్.. ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం ఢిల్లీని లక్ష్యంగా చేసుకుని, ఫతాహ్ క్షిపణిని ప్రయోగించింది. దీన్ని భారత్ సరిహద్దుల్లోనే కూల్చివేసింది. అయితే.. విశ్రాంత మేజర్ జనరల్ జీడీ భక్షి ఓ న్యూస్‌చానల్‌లో మాట్లాడుతూ.. టాక్టికల్ న్యూక్లియర్ వార్‌హెడ్‌తో ఫతాహ్ క్షిపణి వచ్చి ఉంటుందని, ఇది తన వ్యక్తిగత అభిప్రాయమని చెప్పారు.

కర్త, కర్మ, క్రియ.. ఏపీ సింగ్



పాకిస్థాన్ మిలిటరీకి అత్యంత కీలకమైన నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్‌పై వైమానిక దాడులు చేయాలన్న మాస్టర్ ప్లాన్ ఎయిర్‌ఫోర్స్ చీఫ్ అమర్‌ప్రీత్ సింగ్‌దే అని రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ ఎయిర్ బేస్‌పై దాడికి ప్రణాళిక రచించిందీ, అమలు చేసిందీ.. చివరకు పైలట్లను ఎంపిక చేసిందీ ఆయనే అని తెలిపాయి. ఏపీ సింగ్‌కు జాతీయ భద్రత సలహాదారు అజిత్ డోభాల్ మద్దతుగా నిలిచారని, ఆపరేషన్‌కు అనుమతి ఇచ్చారని పేర్కొన్నాయి. నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్ రావల్పిండిలో ఉంది. దీనికి సమీపంలోనే చక్లాలాలో పాక్ ఆర్మీ చీఫ్ ప్రధాన కార్యాలయం, న్యూక్లియర్ కమాండ్ కార్యాలయం ఉన్నాయి. ఈ నేపథ్యంలో, నూర్‌ఖాన్ బేస్‌పై దాడి చేయడం ద్వారా తాము ఎక్కడైనా దాడి చేయగలదన్న గట్టి సందేశాన్ని పాకిస్థాన్‌కు పంపించాలని ఏపీ సింగ్ భావించారని రక్షణ వర్గాలు వివరించాయి. ఆయన అనుకున్నట్లుగానే, నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్‌పై దాడితో పాక్ ఆత్మస్థైర్యం దెబ్బతిన్నదని, ఆ దేశ ఆర్మీ చీఫ్ మూడు గంటల పాటు బంకర్లో దాక్కోవాల్సి వచ్చిందని తెలుస్తోంది. ఈ దాడుల కోసం భారత్ బ్రహ్మోస్ క్షిపణులను ఉపయోగించి ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

భారత్, పాక్ కలిసి డిన్నర్ చేయాలి!

- రెండు దేశాల మధ్య యుద్ధాన్ని నేనే ఆపాను



న్యూయార్క్/లండన్ మే 14: భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందానికి తానే కారణమని పదే పదే చెప్పుకొంటున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. మరోసారి ఇదే విషయం చెప్పారు. రెండు అణ్వాయుధ దేశాల మధ్య యుద్ధం రాకుండా తన మధ్యవర్తిత్వం దోహదపడిందని అన్నారు. అయితే ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గాలంటే భారత్, పాకిస్థాన్ కలిసి డిన్నర్ చేయాలని సూచించారు. ప్రస్తుతం సౌదీ అరేబియా పర్యటనలో ఉన్న ట్రంప్.. మంగళవారం రియాద్‌లో జరిగిన సౌదీ-అమెరికా ఇన్వెస్ట్‌మెంట్ ఫోరం సదస్సు సందర్భంగా మాట్లాడారు. భారత్, పాక్ మధ్య యుద్ధం జరిగి ఉంటే లక్షల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయేవారని, అలాంటిది జరగకూడదనే తాను కోరుకున్నానని తెలిపారు. తనకు తాను శాంతి దూతగా ట్రంప్ చెప్పుకొన్నారు.

'సింధు'పై పునఃసమీక్షించండి

- భారత్‌కు పాక్ జలవనరుల శాఖ లేఖ

ఇస్లామాబాద్, మే 14: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో సింధూజలాల ఒప్పందం అమలును నిలిపివేస్తూ భారత్ తీసుకున్న నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని పాకిస్థాన్ విజ్ఞప్తి చేసింది. సింధూ జలాలు నిలిపివేస్తే పాకిస్థాన్‌లో తీవ్ర దుర్భిక్షం నెలకొంటుందంటూ ఆదేశ జలవనరుల శాఖ భారత విదేశాంగశాఖకు లేఖ రాసింది. దీనిపై భారత్‌తో చర్చించడానికి సిద్ధమని తెలిపింది. వాస్తవానికి భారత్ ఈ నిర్ణయం తీసుకున్నప్పుడు సింధూ నదిలో నీళ్లు పారకపోతే రక్తం పారుతుందని వ్యాఖ్యానించిన పాక్.. ఆపరేషన్ సిందూర్, కాల్పుల విరమణ తర్వాత వెంటనే దారిలోకొచ్చింది. కాల్పుల విరమణకు అంగీకరించినా సింధూజలాల ఒప్పందంపై వైఖరి మార్చుకోబోమని భారత్ తేల్చి చెప్పింది. పాక్‌తో చర్చలంటూ జరిగితే పీఓకే, ఉగ్రవాదంపైనే జరుగుతాయని ప్రధాని మోదీ ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ తరుణంలో పాక్ విజ్ఞప్తి చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. 1960లో భారత్-పాక్ మధ్య సింధూ జలాల ఒప్పందం కుదిరింది.

మనకు ఎలాంటి నష్టం జరగలేదు

- ఆపరేషన్ సిందూర్‌పై కేంద్ర ప్రభుత్వం ప్రకటన

న్యూఢిల్లీ, మే 14: పహల్గాం ఉగ్రదాడి తర్వాత చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో భారత సంపత్తికి ఎలాంటి నష్టం వాటిల్ల లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. తద్వారా భారత యుద్ధ విమానాలను దెబ్బతీశామన్న పాక్ వాదనను కొట్టిపారేసింది. అదే సమయంలో నియంత్రణ రేఖను, అంతర్జాతీయ సరిహద్దును దాటకుండానే వైమానిక దాడులు నిర్వహించినట్లు తెలిపింది. దాడుల సమయంలో పాకిస్థాన్‌లోని చైనా తయారీ గగనతల రక్షణ వ్యవస్థలను భారత వైమానిక దళం... జామ్(తాత్కాలికంగా పనిచేయకుండా చేయడం) చేసిందని వెల్లడించింది. జామ్ చేసి పాక్‌లోని సైనిక లక్ష్యాలను దెబ్బతీసినట్లు తెలిపింది. మొత్తం 23 నిమిషాల్లోనే దాడులను పూర్తి చేసినట్లు వెల్లడించింది. అదే విధంగా పాక్ నుంచి వచ్చిన చైనా, టర్కీ తయారీ డ్రోన్లను, మిసైళ్లను... ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ద్వారా విజయవంతంగా అడ్డుకున్నామని భారత్ తెలిపింది. భారత రక్షణ చరిత్రలో, సైనిక చర్యల్లో ఆపరేషన్ సిందూర్ మైలురాయిలా నిలిచిపోతుందని తెలిపింది.

భారత దౌత్యవేత్తను బహిష్కరించిన పాకిస్థాన్

న్యూఢిల్లీ, మే 14 : ఢిల్లీలో పాక్ రాయబార కార్యాలయంలోని ఒక అధికారిని గూఢచర్యం ఆరోపణలపై భారత్ మంగళవారం బహిష్కరించిన నేపథ్యంలో పాకిస్థాన్ ప్రతి చర్యకు దిగింది. బుధవారం ఇస్లామాబాద్‌లోని భారత రాయబార కార్యాలయంలోని ఒక దౌత్య ఉద్యోగిని అవాంఛనీయ వ్యక్తిగా ప్రకటించి బహిష్కరించింది. ఆయన హోదాకు తగని పనులు చేస్తున్నట్లు ఆరోపించింది. 24 గంటల్లో దేశం విడిచి వెళ్లాలని ఆదేశించింది. ఈమేరకు ఆ దేశ విదేశాంగ శాఖ 'ఎక్స్'లో పోస్ట్ చేసింది.

ఇరాక్ స్టీమర్‌లో పాకిస్థానీ.. కారవార ఓడరేవులో దిగనివ్వని పోలీసులు

బెంగళూరు, మే 14(ఆంధ్రజ్యోతి): ఉత్తర కన్నడ జిల్లా కేంద్రంలోని కారవార ఓడరేవుకు వచ్చిన 'ఎంటీఆర్ ఓషియన్' సరుకు రవాణా స్టీమర్ నుంచి పాకిస్థానీని కిందకు దిగనివ్వకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఇరాక్‌లోని జుబైర్ నుంచి ఈ నెల 12న కారవార ఓడరేవుకు స్టీమర్ చేరుకుంది. అందులో 15 మంది భారతీయులు, ఇద్దరు సిరియావాసులు, ఒక పాకిస్థానీ ఉన్నారు. స్టీమర్‌లో పాకిస్థానీ ఉన్న విషయాన్ని ఓడరేవుల శాఖ అధికారులు తీరం గస్తీ బృందానికి తెలియజేశారు. దీంతో కారవార పోలీసులు, ఓడరేవు రక్షణ సిబ్బంది అతడిని కిందకు రానివ్వకుండా నిలుపుదల చేశారు. అతడి మొబైల్, ఇతర వస్తువులను కెప్టెన్ ద్వారా స్వాధీనం చేసుకున్నారు. స్టీమర్‌లోని సరుకును దించేందుకు రెండు రోజులు పట్టింది. కారవార నుంచి స్టీమర్ బుధవారం షార్జాకు బయలుదేరింది. అందులో పాకిస్థానీని పంపేశారు. మరోవైపు, ఒడిశాలోని పారాదీప్ ఓడరేవుకు బుధవారం 21 మంది పాకిస్థాన్‌కు చెందిన సిబ్బందితో క్రూడాయిల్ నౌక ఒకటి రావడంతో ఆ రాష్ట్ర పోలీసులు అప్రమత్తమై అక్కడ భద్రత కట్టుదిట్టం చేశారు.

ట్రంప్ వ్యాఖ్యలపై ప్రధాని సమాధానం చెప్పాలి

- కాంగ్రెస్ డిమాండ్..దేశ వ్యాప్తంగా ర్యాలీలకు ప్రణాళిక

న్యూఢిల్లీ, మే 14 : భారత్, పాక్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం తానే కుదిర్చానన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలపై ప్రధాని మోదీ ఎందుకు మౌనంగా ఉంటున్నారు...? అలాగే ఆపరేషన్ సిందూర్ ఎందుకు నిలిపివేశారో జవాబు చెప్పాలని కోరుతూ దేశ వ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. బుధవారం ఇక్కడ ఆ పార్టీ సీనియర్ నేతల సమావేశం జరిగింది. అనంతరం నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరాం రమేష్, మీడియా, ప్రచార హెడ్ పవన్ ఖేరా మాట్లాడుతూ ఈమేరకు తెలిపారు. సైనిక చర్య సైనిక దళాలు, దేశం సాధించిన విజయమైతే.. బీజేపీ తన సొంతం చేసుకోవాలని చూస్తోందని పవన్ ఖేరా ఆరోపించారు. తమ ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరుతూ పలు రాష్ట్రాల్లో జైహింద్ ర్యాలీలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు.

స్వతంత్ర దేశంగా బలూచిస్థాన్!

- తమను గుర్తించాలని భారత్, ఐక్యరాజ్యసమితికి ఆ ప్రాంత నేతల వినతి

న్యూఢిల్లీ, మే 14: భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో ఇప్పటికే ఉక్కిరిబిక్కిరి అవుతున్న పాకిస్థాన్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. పాకిస్థాన్‌లోనే అతి పెద్ద ప్రావిన్స్(విస్తీర్ణం పరంగా) అయిన బలూచిస్థాన్.. పాకిస్థాన్ నుంచి విడిపోతున్నట్లు బలూచ్ నేతలు ప్రకటించారు. అంతేకాక బలూచిస్థాన్‌ను ప్రత్యేక దేశంగా గుర్తించాలని భారత్, ఐక్యరాజ్యసమితిని కోరారు. ఈ మేరకు బలూచిస్థాన్ నాయకుడు మీర్ యార్ బలూచ్ ఎక్స్‌లో పలు పోస్టులు చేశారు. రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్థాన్ ఏర్పాటును తన పోస్టుల్లో ప్రకటించారు. అలాగే, న్యూఢిల్లీలో బలూచిస్థాన్ రాయబార కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని భారత ప్రభుత్వాన్ని కోరారు. తమను దేశంగా గుర్తించి.. కరెన్సీ, పాస్‌పోర్టు జారీ వంటి ప్రాథమిక అవసరాలకు నిధులు సమకూర్చాలని ఐక్యరాజ్యసమితిని అభ్యర్థించారు. అలాగే, తమను, పాకిస్థానీయులను ఒక్కటిగా చూడవద్దని భారత మీడియాను కోరారు. మీర్ యార్ బలూచ్ చేసిన పోస్టుల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు బలూచిస్థాన్ జెండాలు, స్వతంత్ర బలూచిస్థాన్ మ్యాపులు చూపిస్తున్న ఫొటోలు, వీడియోలు కూడా ఉన్నాయి. కాగా, కషిష్ చౌదరి(25) అనే పాకిస్థాన్‌కు చెందిన హిందూ యువతి బలూచిస్థాన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(బీపీఎస్సీ) పరీక్షలో ఉత్తీర్ణత సాధించి అసిస్టెంట్ కమిషనర్‌గా ఉద్యోగం పొందింది. బలూచిస్థాన్‌లో ఈ ఘనత సాధించిన తొలి మైనార్టీ మహిళగా కషిష్ చరిత్ర సృష్టించింది.

డ్రోన్లే కాదు.. సైనికులనూ పంపిన తుర్కియే!

భారత్‌పై దాడికి ఆ దేశం సాయం.. 'సిందూర్'లో ఇద్దరు తుర్కియే సైనికుల మరణమే నిదర్శనం

- మంచిచెడుల్లోనూ పాకిస్థాన్‌కు తోడుంటాం: ఎర్డోగాన్

న్యూఢిల్లీ, మే 14: భారత్‌పై దాడి చేసేందుకు పాకిస్థాన్‌కు డ్రోన్లను ఇవ్వడంతోపాటు తమ దేశ సైనికులను కూడా తుర్కియే పంపిన విషయం బట్టబయలైంది. ఆపరేషన్ సిందూర్‌లో ఇద్దరు తుర్కియే సైనికులు హతమయ్యారు. భారత్‌పై దాడి చేసేందుకు పాకిస్థాన్‌కు 350కిపైగా డ్రోన్లు ఇచ్చిన తుర్కియే.. సైనికులను కూడా పాకిస్థాన్‌కు పంపినట్టు ఇది నిరూపిస్తోందని అధికార వర్గాలు ఇండియా టుడే టీవీకి తెలిపాయి. ఆ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్‌పై డ్రోన్ దాడులను సమన్వయం చేసుకోవడంలో పాకిస్థాన్ ఆర్మీ అధికారులకు తుర్కియే సలహాదారులు సాయం చేశారు. ఈ నెల 7, 8 తేదీల్లో రాత్రివేళ భారత్‌పైకి 300 నుంచి 400 డ్రోన్లను పాకిస్థాన్ ఆర్మీ ప్రయోగించింది. ఈ డ్రోన్ల శకలాలకు ఫోరెన్సిక్ దర్యాప్తు నిర్వహించగా, అవి తుర్కియేకు చెందిన అసిస్‌గార్డ్ సొంగార్ డ్రోన్లని ప్రాథమికంగా తేలింది. ఈ విషయాన్ని ఆపరేషన్ సిందూర్‌పై మీడియా సమావేశంలో కల్నల్ సోఫియా ఖురేషీ కూడా చెప్పారు. భారత్‌పై దాడికి తుర్కియే సాయం చేయడంపై భారతీయుల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతున్నా తుర్కియే అధ్యక్షుడు రిసెప్ తయ్యిప్ ఎర్డోగన్ వెనక్కి తగ్గడం లేదు. తాజాగా ఆయన బుధవారం పాకిస్థాన్‌కు మద్దతును పునరుద్ఘాటించారు. పాకిస్థాన్‌ను సోదరదేశంగా ఆయన ప్రస్తావించారు. మంచి, చెడ్డ సమయాల్లోనూ పాక్ పక్షాన నిలబడతామని వ్యాఖ్యానించారు. పాకిస్థాన్‌కు బలమైన మద్దతు, అచంచలమైన సంఘీభావం తెలియజేశారంటూ ఎర్డోగన్‌కు ధన్యవాదాలు తెలుపుతూ పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ 'ఎక్స్'లో చేసిన పోస్టుకు స్పందనగా ఎర్డోగన్ ఈ వ్యాఖ్యలు చేశారు.



తుర్కియేకు మేం వెళ్లం

బాయ్‌కాట్ తుర్కియే, అజర్‌బైజాన్ నిరసన దేశంలో ఊపందుకుంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు మద్దతుగా నిలిచిన ఆ దేశాలపై భారతీయుల ఆగ్రహం కొనసాగుతోంది. పహల్గాం దాడులకు ముందు ఆ రెండు దేశాల్లో పర్యటనలకు సిద్ధపడ్డ భారతీయులు.. ఇప్పుడు ఆ ప్రయాణాలను రద్దు చేసుకుంటున్నారు. ఈ విషయాన్ని సీఎన్ఎన్-న్యూస్ 18 చానల్‌తో మాట్లాడుతూ ఈజ్‌మైట్రిప్ సహ వ్యవస్థాపకుడు ప్రశాంత్ పిట్టి ధ్రువీకరించారు. గత కొద్ది రోజులుగా భారత్ నుంచి పర్యాటక ట్రిప్పులు భారీగా రద్దు అవుతున్నాయని ఆయన తెలిపారు. తుర్కియేకు 22%, అజర్‌బైజాన్‌కు 30శాతానికి పైగా తమ సంస్థ ద్వారా ట్రిప్పులు రద్దు అయ్యాయని చెప్పారు. ఆ రెండు దేశాలతో పాటు చైనాకు కూడా ట్రిప్పులు రద్దు చేసినట్లు ఇక్సిగో సీఈవో అలోకి చెప్పారు.

తుర్కియే, చైనా మీడియా సంస్థలపై భారత్ ఆంక్షలు

- అధికారిక సోషల్ మీడియా ఖాతాలు నిలిపివేత

న్యూఢిల్లీ, మే 14: ఆపరేషన్ సిందూర్‌పై పాకిస్థాన్ తప్పుడు ప్రచారానికి వంత పాడుతున్న తుర్కియే, చైనా మీడియా సంస్థల ఎక్స్ ఖాతాలపై భారత్ బుధవారం ఆంక్షలు విధించింది. తుర్కియే ప్రభుత్వ ఆధీనంలోని ప్రసార సంస్థ 'టీఆర్‌టీ వరల్డ్' ఎక్స్ ఖాతాను కేంద్రం నిలిపివేసింది. తుర్కియే డ్రోన్లతో భారత్‌పై పాకిస్థాన్ దాడి చేసిన కొద్దిరోజులకే ఈ చర్య తీసుకోవడం గమనార్హం. అదేసమయంలో చైనా అధికారిక మీడియా సంస్థలైన 'గ్లోబల్ టైమ్స్', 'జిన్హువా' ఎక్స్ ఖాతాలను కూడా కేంద్రం భారత్‌లో నిషేధించింది. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి తప్పుడు సమాచారాన్ని పోస్టు చేసినందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. ప్రస్తుతం ఈ ఖాతాలను యాక్సెస్ చేయడానికి ప్రయత్నిస్తే "చట్టపరమైన డిమాండ్‌కు ప్రతిస్పందనగా భారత్‌లో మీ ఖాతా నిలిపివేశాం" అనే సందేశం కనిపిస్తోంది.

'ఉగ్రవాదులను వాళ్ల మతానికి చెందిన సోదరితో మట్టుబెట్టించారు'

- కల్నల్ సోఫియా ఖురేషీపై మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ వ్యాఖ్య
- హైకోర్టు తీవ్ర ఆగ్రహం
- పది సార్లు క్షమాపణ చెప్పడానికైనా సిద్ధం : విజయ్ షా

న్యూఢిల్లీ, మే 14 : ఆపరేషన్ సిందూర్ వివరాలను మీడియాకు వెల్లడించిన వారిలో ఒకరైన కల్నల్ సోఫియా ఖురేషీని ఉద్దేశించి మధ్యప్రదేశ్ మంత్రి కున్వర్ విజయ్ షా చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదం అయ్యాయి. ఉగ్రవాదులను వాళ్ల తోబుట్టువుతోనే మోదీ మట్టుబెట్టించారంటూ విజయ్ షా అనడం వివాదానికి కారణమైంది. కాంగ్రెస్‌తోపాటు జాతీయ మహిళా కమిషన్, మధ్యప్రదేశ్ హైకోర్టు కూడా ఈ అంశంపై స్పందించాయి. విజయ్‌షా వ్యాఖ్యలను క్యాన్సర్‌తో పోల్చిన హైకోర్టు.. ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని బుధవారం ఆదేశించింది. అసలేం జరిగిందంటే.. మధ్యప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి విజయ్ షా.. ఇండోర్‌లో మంగళవారం జరిగిన ఓ ప్రభుత్వ కార్యక్రమంలో ఆపరేషన్ సిందూర్ విషయంలో ప్రధాని మోదీపై పొగడ్తల జల్లు కురిపించారు. ఈ క్రమంలో "పహల్గాంలో ఉగ్రవాదులు మన సోదరీమణుల నుదుట సిందూరాన్ని తుడిపి వారిని వితంతువులను చేస్తే.. ప్రధాని మోదీ వాళ్ల(ఉగ్రవాదుల) మతానికే చెందిన సోదరిని విమానంలో పంపి ఉగ్రవాదులను మట్టుబెట్టించారు" అని అన్నారు. నిజానికి, ఆపరేషన్ సిందూర్‌లో కల్నల్ సోఫియా ఖురేషీ ప్రత్యక్షంగా పాల్గొనలేదు. విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీతో కలిసి ఆపరేషన్ వివరాలను మీడియాకు వివరించారు. ఖురేషీ ముస్లిం కావడంతో.. విజయ్‌షా ఆమెనే ఉగ్రవాదుల సోదరి అన్నారని, మత విద్వేషాలను రెచ్చగొట్టారని దుమారం రేగింది. విషయం తీవ్ర వివాదాస్పదంగా మారడంతో స్పందించిన విజయ్ షా తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చుకున్నారు. సోఫియా ఖురేషీని కలలో కూడా అవమానించనని, తన సొంత సోదరి కంటే ఎక్కువగా ఆమెను గౌరవిస్తున్నానని పేర్కొన్నారు. సోఫియా ఖురేషీ దేశానికి చేసిన సేవలకు ఆమె సెల్యూట్ చేస్తున్నానని, తన మాటలు ఎవరినైనా బాధపెట్టి ఉంటే పది సార్లు క్షమాపణ చెప్పడానికైనా తాను సిద్ధమని వి



విజయ్ షా

బీఎస్ఎఫ్ జవాన్ పూర్ణం కుమార్‌ను భారత్‌కు అప్పగించిన పాకిస్థాన్

అమృత్‌సర్, మే 14: పాకిస్థాన్ రేంజర్ల అదుపులో ఉన్న మన బీఎస్ఎఫ్ జవాన్ విడుదల విషయంలో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. 21 రోజుల తర్వాత బీఎస్ఎఫ్ జవాన్ పూర్ణం కుమార్ షాను బుధవారం భారత్‌కు పాకిస్థాన్ అప్పగించింది. ఉదయం 10.30 గంటలకు మన జవాన్‌ను అట్టారి-వాఘా సరిహద్దు వద్ద పాకిస్థాన్ రేంజర్లు బీఎస్ఎఫ్‌కు అప్పగించినట్టు బీఎస్ఎఫ్ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. పాకిస్థాన్ రేంజర్లతో బీఎస్ఎఫ్ నిరంతరం నిర్వహించిన ఫ్లాగ్ సమావేశాలు, ఇతర కమ్యూనికేషన్ మార్గాల ద్వారా బీఎస్ఎఫ్ కానిస్టేబుల్‌ను వెనక్కి తీసుకురావడం సాధ్యపడినట్టు చెప్పారు. ఇన్ని రోజులు బీఎస్ఎఫ్ జవాన్.. పాక్ రేంజర్ల అదుపులో ఉన్న నేపథ్యంలో ఈయనకు పూర్తిస్థాయిలో బాడీ చెకప్‌తోపాటు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలుస్తోంది. 24వ బీఎస్ఎఫ్ బెటాలియన్‌కు చెందిన షాను పంజాబ్‌లో భారత్-పాకిస్థాన్ మధ్య ఉన్న అంతర్జాతీయ సరిహద్దు వెంబడి పాక్ రేంజర్లు ఏప్రిల్ 23న అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఫెరోజ్‌పూర్ సెక్టార్ ప్రాంతంలో విధుల్లో ఉన్న షా అనుకోకుండా సరిహద్దు దాటడంతో పాకిస్థాన్ రేంజర్లు అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా.. బీఎస్ఎఫ్ జవాన్‌ను బుధవారం పాకిస్థాన్ అప్పగించిన వెంటనే దాదాపు రెండు వారాలుగా కస్టడీలో ఉన్న పాకిస్థాన్ రేంజర్‌ను భారత్ విడుదల చేసింది.



పూర్ణం కుమార్ షా



ఏది అడిగినా దాటవేత... మౌనం
లేదంటే అధికారులకే ఎదురుప్రశ్నలు

- ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి తీరిది
- నేడు మరోసారి విచారణకు పిలిచిన సిట్

అమరావతి, మే 14(ఆంధ్రజ్యోతి): 'మద్యం పాలసీ రూపొందించేది ప్రభుత్వం. ఆ పాలసీని అమలు చేసేది అబ్కారీ శాఖ. ఈ కేసుతో మాకేంటి సంబంధం?' అంటూ లిక్కర్ స్కామ్‌లో ఇద్దరు కీలక నిందితులు దర్యాప్తు అధికారులనే ఇంటరాగేషన్ చేశారు. అధికారుల ప్రశ్నలకు తెలియదు అంటూ చాలావరకు దాటవేశారు. మరికొన్ని ప్రశ్నలకు మౌనంగా ఉండిపోయారు. ఎన్నో విధాలుగా, ఎంతో ఓపిగ్గా సిట్ అధికారులు ప్రశ్నించినా వారిద్దరి ధోరణిలో మార్పు లేదని తెలిసింది. ఇప్పటివరకూ అరెస్టయిన, వాంగ్మూలాలిచ్చినవారిలో ఎక్కువ మంది మాజీ సీఎం జగన్ కార్యదర్శి రిటైర్డ్ ఐఏఎస్ ధనుంజయ్ రెడ్డి(ఏ31), మాజీ ఓఎస్‌డీ కృష్ణమోహన్ రెడ్డిల(ఏ 32) పేర్లు చెప్పారు. సిట్ నోటీసులను బేఖాతరు చేసి అజ్ఞాతంలోకి వెళ్లిన ఈ ఇద్దరూ అనూహ్యంగా విజయవాడలోని సిట్ కార్యాలయం వద్ద ప్రత్యక్షమయ్యారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో సిట్ విచారణకు హాజరయ్యారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8.15వరకూ సీఐడీ అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో సిట్ అధికారులు వారికి ప్రశ్నలు సంధించారు. ఆరు గంటలకుపైగా అరవై ప్రశ్నలు అడిగినా కొంచెమైనా నిందితులు సహకరించలేదని తెలిసింది. పైగా ఎదురు ప్రశ్నలతో ధనుంజయ్ రెడ్డి సిట్ అధికారులనే ఇంటరాగేషన్ చేసినట్లు సమాచారం. 'లిక్కర్ పాలసీ రూపొందించిన మీటింగ్‌లో పాల్గొన్న మీరు పోషించిన పాత్ర ఏంట'ని అడగ్గా.. 'ప్రభుత్వం రూపొందిస్తుంది.. అబ్కారీ శాఖ అమలు చేస్తుంది.. నా పాత్ర ఇందులో ఎందుకు ఉంటుంది?' అంటూ ధనుంజయ్ రెడ్డి ఘాటుగా బదులిచ్చినట్లు తెలిసింది. 'పాలసీ నుంచి పైసా వసూల్ వరకూ అన్నీ మాకు తెలుసు.. ఇప్పటివరకూ విచారించినవారిలో ఎక్కువమంది మీ ప్రతి చర్యనూ వెల్లడించారు.. గతంలో ఎప్పుడైనా మీ సర్వీసులో లిక్కర్ పాలసీ రూపొందించిన అనుభవం ఉందా?.' అని అడగ్గా.. ఎవరు ఏమి చెప్పారో మాకు అనవసరం.. పాలసీ లేదు, పైసా లేదు.. మాకెప్పుడూ అలాంటి అనుభవం లేదని బదులిచ్చారు. ఆ సమావేశాల్లో పాల్గొన్న విజయసాయి రెడ్డి(ఏ 4), మొత్తం కుంభకోణంలో కర్త, కర్మ, క్రియగా వ్యవహరించిన కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి(ఏ1) కూడా మీ పేర్లు చెప్పారు.. అంటూ ప్రశ్నించిన అధికారులతో.. వారిద్దరూ అలా ఎందుకు చెప్పారో మాకు తెలీదు.. అయినా ఎవరు ఏది చెబితే అది నిజమవుతుందా.. మాకు ఎలాంటి సంబంధం లేదు.. అంటూ ఇద్దరూ ఒకటే సమాధానం ఇచ్చారు. దీంతో ఇరువురినీ వేర్వేరుగా కూర్చోబెట్టి ప్రశ్నల పరంపర కొనసాగించారు. అయినా, సిట్ అధికారులకు ఎలాంటి సహకారం లభించలేదు. ఏ ప్రశ్న అడిగినా.. మాకు సంబంధం లేదు.. అనడం లేదంటే మౌనం వహించడం.. తప్ప మరొక జవాబు వారిద్దరి నుంచి రాలేదని తెలిసింది. మద్యం ముడుపుల వసూళ్ల వరకూ ఈ కుంభకోణంలో భాగస్వామ్యం గురించి అడగ్గా, ఏమీ తెలీదని చెప్పారు.. ఎక్కువ ప్రశ్నలకు మౌనంగా ఉన్నారు తప్ప నోరు విప్పలేదు. ఓపిగ్గా ప్రశ్నించిన సిట్ అధికారులు ముఖ్యమంత్రి కార్యాలయంలో ఐదేళ్ల పాటు మీ ఇద్దరూ అన్నీ తెలిసిన వ్యక్తులు..మీకు ఇంత పెద్ద వ్యవహారం తెలీదా? అని ప్రశ్నించగా.. కూటమి ప్రభుత్వం కేసు నమోదు చేసే వరకూ కూడా తమకు తెలియదు అని బదులిచ్చారని తెలిసింది.

ఒక్కసారి కూడా రాజ్‌తో మాట్లాడలేదట!

వైసీపీ హయాంలో ఒక్కసారి కూడా కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డితో మాట్లాడలేదని ధనుంజయ్ రెడ్డి ఇచ్చిన సమాధానంతో అధికారులు అవాక్కయ్యారు. ఈ స్థాయిలో విచారణకు సిద్ధమై వచ్చారా.? అంటూ ముక్కున వేలేసుకున్నారు. 'రాజ్ కసిరెడ్డి నామినేటెడ్ పదవిలో ఉండే వ్యక్తి.. నేను సీఎంవోలో పనిచేసే అధికారిని...నాకు ఆయనతో మాట్లాడాల్సిన అవసరం ఏముంటుంది?.' అని ఎదురు ప్రశ్నించారని సమాచారం. అందరూ మీ పేరు చెబుతున్నారని అడిగితే.. అలా ఎందుకు చెబుతున్నారో వాళ్లకే తెలియాలి అంటూ బదులిచ్చారు. అయితే, రేపు ఉదయం విచారణకు వచ్చేటప్పుడు మీ అనుయాయుడు శ్రీధర్‌ను వెంటబెట్టుకుని రండి.. అంటూ సిట్ అధికారులు విచారణ ముగించారు. మరో వైపు కృష్ణ మోహన్ రెడ్డిని లిక్కర్ ముడుపుల వసూళ్లు, పెట్టుబడులు, కుటుంబ వ్యాపారాల గురించి అధికారులు ప్రశ్నించారు. గురువారం విచారణకు ఆయా వ్యాపారాలకు సంబంధించి ఆడిట్ రిపోర్టులు, బ్యాంకు లావాదేవీల వివరాలు తీసుకు రండి అని చెప్పినట్లు తెలిసింది.



అదే సారే.. ఇప్పటికీ వారే!

(మొదటి పేజీ తరువాయి)

మార్క్ మార్పులు, సంస్కరణలు తీసుకురాకపోతే ఈ శాఖ పూర్తిగా ప్రభుత్వంతో సంబంధం లేని వ్యవస్థగా మారిపోయే ప్రమాదం ఉందని సీనియర్ అధికారులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీతో హౌస్‌ఫుల్

జగన్ సర్కారు గ్రామస్థాయి నుంచే వైసీపీ రాజకీయ వ్యూహాలను అమలు చేసేందుకు వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చింది. వారికి శిక్షణ ఇచ్చే పేరిట రామ్ఇన్ఫోకు నాలుగేళ్ల భారీ కాంట్రాక్టు ఇచ్చింది. ఇక వలంటీర్ల సేవల పర్యవేక్షణ, సమన్వయం పేరిట రామ్‌ఇన్ఫోకే మరో కాంట్రాక్టు ఇచ్చింది. ఈ పనిలో యాని కార్పొరేట్ కంపెనీ జత కలిసింది. ఇలా రెండు కాంట్రాక్టుల కింద రూ.554 కోట్ల ప్రభుత్వ సొమ్ము రామ్‌ఇన్ఫోకు చేరింది. ఈ సొమ్ము రూట్ మారి ఐప్యాక్‌కు చేరినట్లుగా ఇప్పుడు అనుమానాలు బలంగా వ్యక్తమవుతున్నాయి. ఇందుకు కారణం.. గ్రామ, వార్డు సచివాలయాల్లో వలంటీర్లు, వారిపైన ఉన్న సూపర్‌బాస్‌లు పూర్తిగా ఐప్యాక్ నియంత్రణలో పనిచేశారు. ఇది జగమెరిగిన సత్యం. ఇక గ్రామ, వార్డు సచివాలయాల ప్రధాన కార్యాలయం కూడా ఐప్యాక్ గుప్పిట్లోకి వెళ్లింది. ఆ సంస్థ సూచించిన వారినే కీలక పోస్టుల్లో కూర్చోబెట్టారు. అలా వచ్చిన వారంతా జగన్‌కు వీరభక్తులుగా, విధేయులుగా పనిచేశారు. కీలక అధికారులు సైతం ఐప్యాక్ నుంచి వచ్చే ఆదేశాలకు జీ హుజూర్ అన్నారు. బిల్లుల చెల్లింపు, కాంట్రాక్టుల విషయంలో ఇద్దరు అధికారులు కీలక పాత్ర వహించారు. ఓ సీనియర్ అధికారి, మరో కన్సల్టెంట్ పక్కా ఐప్యాక్ రెగ్యులర్ ఏజెంట్లుగా పనిచేశారని ఉద్యోగులు బాహాటంగా చెబుతున్నారు. రామ్‌ఇన్ఫోకు బిల్లుల చెల్లింపుపై ఆడిట్ విభాగం తొలుత కొర్రీలు వేసింది. ఒకేసారి నాలుగేళ్ల పాటు కాంట్రాక్టు ఎలా ఇస్తారని ప్రశ్నించింది. అంతే.. ఈ శాఖలోని ఓ కీలక అధికారి, మరో కన్సల్టెంట్ మంత్రాంగం నడిపి కేవలం అరగంటలో బిల్లులు క్లియర్ చేయించారు. దీన్నిబట్టి వారి మాటకు ఎంత ప్రాధాన్యం ఉందో అర్థమవుతుంది.

లెక్కాపత్రం లేదు

రాష్ట్రవ్యాప్తంగా వివిధ డిజిటల్ సేవలకు సంబంధించి ప్రభుత్వ శాఖల నుంచి ఏటా కోట్లాది రూపాయలు సర్వీసు చార్జీల రూపంలో గ్రామ, వార్డు సచివాలయాల విభాగానికి వస్తాయి. ఇలా వచ్చిన నిధులను ఏం చేశారు? ఎక్కడ ఖర్చుపెట్టారు? అన్న లెక్క లేదు. దీనిపై ఆడిట్ నిర్వహించాలని స్వయంగా ఉద్యోగులే కోరుతున్నారు. దీనిపై విచారణ జరిపే లోపు హార్డ్‌డిస్క్‌లు, రికార్డులు మాయం చేస్తారేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి అక్కడే పనిచేస్తున్న అధికారులను, రిటైర్డ్ అయిన వారిని మళ్లీ కొనసాగించడం విచారణకు అడ్డంకిగా ఉంటుందని సీనియర్ అధికారులు చెబుతున్నారు.

ఎన్నికల ముందు వైసీపీ కోసం

గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ కార్యాలయం అధికారులు గత ఎన్నికల్లో వన్‌సైడ్ అయ్యారు. వలంటీర్లతో పాటు సచివాలయ ఉద్యోగులను వైసీపీకి అనుకూలంగా వినియోగించుకున్నారు. ఎన్నికల కమిషన్ వలంటీర్లకు సిమ్‌లు బ్లాక్ చేయాలని ఎన్నిసార్లు హెచ్చరించినా అధికారులు ఖాతరు చేయలేదు. ఎన్నికల కమిషన్ అధికారులు గట్టిగా హెచ్చరిస్తే ఎన్నికల ముందు రోజు సిమ్‌లను బ్లాక్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయ శాఖను నడిపించింది వైసీపీ ఆధ్వర్యంలోని ఐప్యాక్ సంస్థనే. ఈ విషయాలన్నింటిపై విచారణ జరిగితే తప్ప వాస్తవాలు వెలుగులోకి రావు.

ఇప్పుడూ వారే..

నాడు జగన్ ప్రభుత్వంలో ఈ శాఖలో కీలకంగా వ్యవహరించిన అధికారి ఇప్పటికీ కొనసాగుతున్నారు. ఆయన తర్వాతి స్థానంలో ఉన్న మరో అధికారి, కన్సల్టెంట్లు, రిటైర్డ్ అధికారులు దర్జాగా కొనసాగుతున్నారు. ఐప్యాక్ సూచనల మేరకు వీరిందరిని నాటి జగన్ ప్రభుత్వం ఈ శాఖలో తెచ్చిపెట్టుకుంది. కూటమి సర్కారు వచ్చి పది నెలలు అవుతున్నా ఈ శాఖలో ఏ మార్పూ లేదు. ఆ అధికారులే ఉన్నారు. పనితీరులో మార్పు అంతకన్నా లేదని ఉద్యోగులు వాపోతున్నారు. రోజువారీ కార్యకలాపాలు, శాఖకు సంబంధించిన సున్నితమైన డేటా, ఇతర వ్యవహారాలన్నీ ఐప్యాక్ తెచ్చిపెట్టుకున్న ఉద్యోగుల చేతుల్లోనే ఉన్నాయి. అలాంటప్పుడు ఈ శాఖ డేటా ఐప్యాక్‌కు, దాన్ని పెంచిపోషిస్తున్న వైసీపీకి వెళ్లకుండా ఎలా ఉంటుందన్న అనుమానాలు ఉద్యోగులే వ్యక్తం చేస్తున్నారు. నిజానికి శాఖ అధికారిని మార్చాలని తొలుత ప్రభుత్వం భావించింది. ఈ విషయం తెలుసుకున్న ఆయన టీడీపీ నేతల గుడ్‌లుక్స్‌లోకి వెళ్లారు. దీంతో ఆయన బదిలీ ఆగిపోయింది. ఆ తర్వాత ఆయన మిగతా అధికారులను బదిలీ చేయకుండా, తనతో పాటే ఉండేలా చక్రం తిప్పారు. ఓ అధికారిపై వైసీపీ మనిషిగా ముద్ర ఉండటంతో కర్నూలు జిల్లాకు బదిలీ చేశారు. అయితే, ఈ శాఖ కీలక అధికారి లాబీయింగ్ చేసి ఆ బదిలీని ఆపేయించినట్లు తెలిసింది. ఆ తర్వాత మరో కన్సల్టెంట్‌ను కూడా అక్కడే కొనసాగేలా చక్రం తిప్పారని ఉద్యోగ వర్గాలు చెబుతున్నాయి.

వైసీపీ వీరాభిమానులే

గ్రామ, వార్డు సచివాలయ శాఖను జగన్ హయాంలో ఏర్పాటు చేసింది కావడంతో వైసీపీకి అనుకూలంగా పనిచేసే అధికారులను చాలామందిని అక్కడ నియమించుకున్నారు. జగన్ ఇలాకాకు చెందిన వారే ఎక్కువగా ఉన్నారు. ఇటీవల ఐఏఎస్ అధికారి కాటమనేని భాస్కర్‌ను నియమించినా, ఆ శాఖపై ఆయనకు ఇంకా పట్టు దొరకలేదు. కింది స్థాయిలో ఉన్న అధికారులే ఆ శాఖను నడిపిస్తున్నారు. ఈ శాఖలో అత్యంత కీలకమైన డేటాకు సంబంధించిన డిజిటల్ సర్వీసులు ఓ మధ్య స్థాయి అధికారి నియంత్రణలోనే ఉన్నాయి. మరో ప్రైవేటు ఉద్యోగి చేతిలో మొత్తం గ్రామ, వార్డు సచివాలయ శాఖ సమాచారం నిక్షిప్తమై ఉంది. వైసీపీ హయాంలో నియమించిన ఈ ప్రైవేటు ఉద్యోగికి రూ.1.50 లక్షలు జీతమిచ్చి కొనసాగిస్తున్నారు. ఈ విభాగంలోనే మరికొందరు కన్సల్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పనిచేస్తున్నారు.

'డిజిటల్' పోషణ

గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ద్వారా డిజిటల్ సేవల పేరుతో భారీగా కన్సల్టెంట్లను నియమించారు. లక్షల్లో జీతాలిచ్చి వారిని పోషిస్తున్నారు. ప్రతి నెలా సుమారు రూ.4 కోట్లు వారికి జీతాలుగా అందిస్తున్నారు. గత నాలుగేళ్లలో సుమారు రూ.200 కోట్లు వారికి జీతాల రూపంలో చెల్లించారు. ఇప్పుడు వాస్తవానికి రాష్ట్రంలో ఎలాంటి డీబీటీ పథకాలూ అమలు కావడం లేదు. గతంలో అమలు చేసిన ఒక్క డీబీటీ కూడా ఇప్పుడు అమల్లో లేవు. వారంతా పని లేకుండా ఖాళీగా ఉంటున్నారు. పైగా వైసీపీ హయాంలో చేసిన అక్రమాలను కప్పిపుచ్చేందుకు ఆయా స్థానాల్లో కొనసాగుతున్నారా? అని ఉద్యోగులే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ శాఖలోని ఆర్థిక అరాచకాలను బయటకు తీయాలంటే అన్ని విభాగాల్లో అధికారులను, సిబ్బందిని, ప్రైవేటు కన్సల్టెంట్లను మార్చాల్సి ఉంటుందని అధికారులు సూచిస్తున్నారు.





కనకదుర్గమ్మకు అగ్గిపెట్టెలో పట్టుచీర

తెలంగాణలోని సిరిసిల్లకు చెందిన నల్ల విజయ్ కుమార్ చేనేత రంగంలో అద్భుతమైన కళాకారుడు. అగ్గిపెట్టెలో పట్టే చీర, శాలువా, కుట్టులేకుండా లాల్చీ పైజామా, మూడు కొంగుల చీర, సువాసనల చీర, దబ్బనంలో దూరిపోయే చీర, బంగారం, వెండి చీరలు రూపొందించారు. ఆయన బుధవారం బెజవాడ కనకదుర్గమ్మను దర్శించుకుని, అగ్గిపెట్టెలో పట్టే పట్టుచీరను కానుకగా సమర్పించారు. చీర బరువు 100 గ్రాములు, పొడవు ఐదున్నర మీటర్లు, వెడల్పు 48 అంగుళాలు. దీనిని పూర్తిగా పట్టుదారాలతో గోల్డ్ జరీ వినియోగించి, ఐదు రోజులపాటు శ్రమించి తయారు చేశానని విజయ్‌కుమార్ చెప్పారు. దుర్గగుడి ఈవో వీకే శీనా నాయక్ ఆయనను అభినందించి అమ్మవారి ప్రసాదాలు అందజేశారు.

- ఇంద్రకీలాద్రి, ఆంధ్రజ్యోతి

అనంతలో భారీ ఇంధన కాంప్లెక్స్

(మొదటి పేజీ తరువాయి)

స్థాపించనుంది. ఇక్కడ మొత్తంగా 1,800 మెగావాట్ల సౌర, 2,000 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ యూనిట్లను వివిధ దశల్లో రెన్యూ సంస్థ ఏర్పాటు చేస్తుంది. కాగా, 2019-24 మధ్య జగన్ హయాంలో పారిశ్రామికవేత్తలు ఎవరూ ముందుకు రాలేదు. అంతకుముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో కుదుర్చుకున్న ఒప్పందాలనూ అమలు చేయకుండా జగన్ సర్కారు నిలిపివేసింది. విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలను రద్దు చేసింది. హైకోర్టు ఆదేశాల మేరకు జగన్ ఈ ఒప్పందాలను పునరుద్ధరించుకోవాల్సి వచ్చింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రానికి పునరుత్పాదక విద్యుత్తు ప్రాజెక్టులు భారీగా వస్తున్నాయి. దావోస్ సదస్సులో రెన్యూ చైర్మన్ సుమంత్ సిన్హాతో మంత్రి లోకేశ్ సమక్షంలో రాష్ట్ర ఇంధన శాఖ ఒప్పందాన్ని చేసుకుంది. ఆ ప్రాజెక్టు ఇప్పుడు అనంతపురం జిల్లాలో ఏర్పాటవుతోంది. రానున్న ఐదేళ్లలో క్లీన్ ఎనర్జీ రంగంలో 72 గిగావాట్ల విద్యుత్తు ప్లాంటులు రాష్ట్రంలో ఏర్పాటు కాబోతున్నాయి. 65,000 కోట్లతో 500 మెగావాట్ల కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంటును రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేస్తోంది. ఈ ప్లాంటు తొలిదశకు మంత్రి లోకేశ్ శంకుస్థాపన చేశారు. రూ. 1.85 లక్షల కోట్లతో ఎన్‌టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టును, వేదాంత అనుబంధ సంస్థ సెరెంటికా 10,000 మెగావాట్ల ప్రాజెక్టును, రూ. 50,000 కోట్లతో ఎస్ఏఈఎల్ ఇండస్ట్రీస్ 1,200 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్తు ప్లాంటును రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్నాయి.

ఏపీ కోటా ముగిసింది.. తాగునీరూ ఇవ్వొద్దు!

- కేఆర్ఎంబీకి తెలంగాణ లేఖ
- తీవ్రంగా స్పందించిన ఏపీ
- లెక్కలతో సహా వివరణ
- 3.75 టీఎంసీలు ఇవ్వాలని వినతి

అమరావతి, మే 14(ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాల్లో ఏపీ తన వాటా నీటిని పూర్తిగా వాడుకుందని... ఇక తాగునీటి అవసరాలకు కూడా నీరు విడుదల చేయవద్దని కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ)ను తెలంగాణ కోరింది. ఈ నెల 11న కేఆర్ఎంబీకి దీనిపై లేఖ రాసింది. అయితే, ఈ వ్యవహారంపై ఏపీ ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఈ నెలాఖరు వరకు నీటి సంవత్సరం ఉందని, కేటాయింపుల మేరకు నాగార్జున సాగర్ కుడి ప్రధాన కాలువ ద్వారా దుర్భిక్ష ప్రాంత తాగునీటి అవసరాలకు కృష్ణా జలాలను విడుదల చేయాలని కేఆర్ఎంబీని కోరింది. శ్రీశైలం జలాశయంలో ఏపీకి 10 టీఎంసీలు, తెలంగాణకు 13.16 టీఎంసీలు, నాగార్జునసాగర్‌లో ఏపీకి 45 టీఎంసీలు, తెలంగాణకు 50.10 టీఎంసీలు కేటాయించారు. దీనిలో ఏపీ శ్రీశైలం జలాశయంలో 3.485 టీఎంసీలు, తెలంగాణ 12.59 టీఎంసీలు వాడుకున్నాయి. శ్రీశైలం జలాశయంలో ఏపీకి ఇంకా 6.515 టీఎంసీలు, తెలంగాణకు 0.57 టీఎంసీలు, నాగార్జున సాగర్‌లో ఏపీకి ఇంకా 15.37 టీఎంసీలు, తెలంగాణకు 12.71 టీఎంసీలు మిగిలాయి. వేసవి తీవ్రత నేపథ్యంలో రాష్ట్రానికి 3.75 టీఎంసీలను తాగునీటి అవసరాలకు విడుదల చేయాలని కేఆర్ఎంబీని రాష్ట్ర జల వనరుల శాఖ కోరింది. తాగునీటి అవసరాలకు కూడా తెలంగాణ అడ్డుపడుతోందని కేఆర్ఎంబీకి ఫిర్యాదు చేసింది. తక్షణమే తమకు తాగునీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేసింది.

తక్షణమే అమరావతికి రండి

- కార్యాలయం పరిశీలనకు అధికారులను పంపండి
- కేఆర్ఎంబీ చైర్మన్‌కు జలవనరుల శాఖ ఈఎన్‌సీ లేఖ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అమరావతి/హైదరాబాద్, మే 14(ఆంధ్రజ్యోతి): కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) ప్రధాన కార్యాలయాన్ని తక్షణమే అమరావతిలో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ మేరకు బోర్డు చైర్మన్ అతుల్‌జైన్‌కు జలవనరుల శాఖ ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు లేఖ రాశారు. 'హైదరాబాద్ దాటి రాలేరా?' శీర్షికతో బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై జలవనరుల శాఖ స్పందించింది. 2020 అక్టోబరు 6న జరిగిన అపెక్స్ కౌన్సిల్ రెండో సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు తక్షణం బోర్డు ను ఏపీకి తరలించాలని కోరారు. హెడ్‌క్వార్టర్‌ను అమరావతికి మార్చాలని పలుమార్లు కోరామని ఈఎన్‌సీ పేర్కొన్నారు.అధికారుల బృందాన్ని విజయవాడకు పంపాలని ఆ లేఖలో వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. కాగా, జలవనరుల శాఖ ఇంజనీరింగ్ విభాగంలో ముగ్గురు చీఫ్ ఇంజనీర్లకు ఈఎన్‌సీ(ఇంజనీర్ ఇన్ చీఫ్)గా పదోన్నతులు కల్పించారు. ఇరిగేషన్ ఇంజనీర్ ఇన్ చీఫ్‌గా ఉన్న ఎం.వెంకటేశ్వరరావు స్థానంలో కె.నరసింహమూర్తిని నియమించారు.



ఓరుగల్లులో హన్మకొండలోని వెయ్యిస్తంభాల గుడి వద్ద మిస్‌వరల్డ్ పోటీదారులు

అందాలభామల సందడి

- చీరకట్టు.. నుదుటిన బొట్టుతో తెలుగుదనం ఉట్టిపడేలా ముస్తాబు
- వరంగల్ కోట, రామప్ప ఆలయం, వేయి స్తంభాల గుడి సందర్శన

వరంగల్, మే 14(ఆంధ్రజ్యోతి): సంప్రదాయ చీరకట్టు, నుదుటిన బొట్టు, జడ కొప్పు, మల్లె పూలు ధరించి.. ప్రపంచ సుందరి పోటీదారులు తెలుగుదనం ఉట్టిపడేలా ముస్తాబయ్యారు. మొత్తంగా బుధవారం మిస్‌వరల్డ్-2025 పోటీదారులు ఓరుగల్లు పర్యటనలో సందడిగా గడిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు రెండు బృందాలుగా వచ్చిన 57 మంది సుందరీమణులు చారిత్రక వేయిస్తంభాల ఆలయం, వరంగల్ కోట, రామప్ప ఆలయాలను సందర్శించారు. అతిథులకు అటవీశాఖ ఆధ్వర్యంలో వెదురు కర్రతో తయారు చేసిన అందమైన బహుమతులను మంత్రి సీతక్క, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీష్ చేతుల మీదుగా అందజేశారు. ప్రపంచ సుందరి పోటీదారుల్లో 22 మంది మరో బృందంగా వరంగల్ కోటను సందర్శించారు. కోటలోని శిల్పవనంలో శిలలను పరిశీలించారు. ఫొటోలకు ఫోజులిస్తూనే.. సెల్ఫీలు దిగుతూ సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ తమ ఆనందాన్ని తమ దేశంలోని వారితో పంచుకున్నారు. మిస్ వరల్డ్ పోటీలకు ఆతిథ్యం ఇవ్వటం తెలంగాణకు గర్వకారణమని మంత్రి కొండా సురేఖ అన్నారు. మిస్ వరల్డ్ పోటీ దారులకు వరంగల్ కోటలో స్వాగతం పలికారు. మిస్ వరల్డ్ పోటీలను రద్దు చేయాలంటూ ఐద్వా ఆధ్వర్యంలో మహిళలు నిరసనలకు దిగారు. రాష్ట్రంలో విద్య, వైద్యం సరిగ్గా అందక ప్రజలు అల్లాడుతుంటే ప్రభుత్వం అందాల భామల పేరుతో ప్రజాధనాన్ని వృధాగా ఖర్చు చేస్తోందని నినాదాలు చేశారు. దీంతో పోలీసులు వెంటనే వారిని అదుపులోకి తీసుకుని హనుమకొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఆర్టీఐ చీఫ్ కమిషనర్‌పై చర్యలు తీసుకోండి

- మౌలిక వసతుల నిలిపివేతపై ఫోరం ఫర్ ఆర్టీఐ ఫిర్యాదు
- మంత్రి సత్యకుమార్, మాజీ మంత్రి సోమిరెడ్డికి వినతిపత్రం



సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఫోరం ఫర్ ఆర్టీఐ ప్రతినిధులు

అమరావతి, మే 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమాచార కమిషన్ కార్యాలయంలో రెండేళ్లుగా మౌలిక సదుపాయాలు నిలిపివేసి, తనను ఎవరూ కలవరాదని నిరంకుశంగా వ్యవహరిస్తున్న చీఫ్ కమిషనర్ బాషాపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్టీఐ ఫోరం బుధవారం సచివాలయంలోని జీపీడీ కార్యదర్శికి ఫిర్యాదు చేసింది. మంత్రి సత్యకుమార్, మాజీ మంత్రి సోమిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసింది. ఆర్టీఐ ఫోరం జాతీయ అధ్యక్షుడు ప్రత్తిపాటి చంద్రమోహన్ ఆధ్వర్యంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఆర్టీఐ కార్యకర్తలు తొలుత మంగళగిరిలోని కమిషన్ కార్యాలయానికి చేరుకున్నారు. కార్యాలయానికి వచ్చే కార్యకర్తలు, ఇతర సిబ్బందికి తాగునీరు, కుర్చీలు, వెయిటింగ్ హాల్ వంటివి కల్పించాలని చీఫ్ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు ప్రయత్నించారు. కానీ, ఆయన తమ అర్జీని స్వీకరించలేదని, సిబ్బంది కూడా నిరాకరించారని ఫోరం ఫర్ ఆర్టీఐ ప్రతినిధులు తెలిపారు. కమిషనర్ కార్యాలయంలో అవకతవకలను సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

'ఫ్రీ హోల్డ్'పై కదలిక

- 20న మంత్రివర్గ ఉపసంఘం భేటీ
- భూ వివాదాల పరిష్కారంపై చర్చ
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందన
- ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరా!

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అమరావతి, మే 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరుపేదలు ఎదుర్కొంటున్న భూ సమస్యలపై సర్కారు స్పందించింది. భూ వివాదాల పరిష్కారంపై చర్చించేందుకు ఈ నెల 20వ తేదీన మంత్రివర్గ ఉపసంఘం సమావేశం నిర్వహించాలని రెవెన్యూ శాఖను ఆదేశించింది. ఈ నేపథ్యంలో 20న మధ్యాహ్నం మూడు గంటలకు సచివాలయంలో ఉపసంఘం సమావేశం కానుందని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.జయలక్ష్మి వెల్లడించారు. ఉపసంఘంలో సభ్యులుగా ఉన్న మంత్రులు, కార్యద ర్శులకు ఈ మేరకు సమాచారం ఇచ్చారు. ఈ సమావేశంలో ఫ్రీ హోల్డ్ భూములపై ఏం నిర్ణయం తీసుకోవాలి? అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయాలు ఏమిటి? పేదలు, సామాన్యులకు ఇబ్బంది కలగకుండా ఎలాంటి తక్షణ చర్యలు చేపట్టాలి? వంటి విషయాలపై చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అధికారవర్గాలు తెలిపాయి. అసైన్డ్, ఇనాం, షరతు గల పట్టా భూముల వివాదాలపై చర్చించి ప్రభుత్వానికి పరిష్కార మార్గాలు సూచించేందుకు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ నేతృత్వాన మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటైంది. మార్చి 19వ తేదీన ఉపసంఘం తొలి సమావేశం జరిగింది. ఆ తర్వాత ఏప్రిల్‌లో సమావేశం కావాలని అనుకున్నా వివిధ కారణాల వల్ల జరగలేదు. మరోవైపు నిషేధ జాబితా నుంచి తొలగించిన అసైన్డ్ భూముల (ఫ్రీ హోల్డ్) రిజిస్ట్రేషన్లపై నిషేధాన్ని మరో రెండు నెలల పొడిగిస్తూ రెవెన్యూ శాఖ ఈ నెల 11వ తేదీన ఉత్తర్వులు ఇచ్చింది. ఇప్పటికే ఈ అంశంపై 10 నెలలుగా నిషేధ పొడిగింపు ఉత్తర్వులు అమల్లో ఉన్నాయి. ఇలా ఇంకెంతకాలం నిషేధాన్ని కొనసాగిస్తారని పేద, సామాన్య రైతాంగం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఇదే అంశంపై 'ఆంధ్రజ్యోతి' బుధవారం 'నెలలకొద్దీ నాన్చుడు, ఫ్రీ హోల్డ్‌పై ఎటూ తేల్చని సర్కారు' శీర్షికన వార్తను ప్రచురించింది. 50 సెంట్లు, ఎకరం, రెండు ఎకరాలు ఫ్రీ హోల్డ్‌కు అవకాశం ఉన్న నిరుపేద రైతులు గత పదినెలలుగా సర్కారు నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నారు. బడా దొంగలు, భూ అక్రమార్కులను కనిపెట్టి వారి అక్రమ రిజిస్ట్రేషన్లను నిలిపి వేయాల్సింది పోయి తమకు ఇబ్బందులు గురి చేస్తున్నారని ప్రజలు ఆందోళనకు గురవుతున్న విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ వార్తపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరా తీశారు. ఉపసంఘం ఏం చేసిందని అడిగినట్లు సమాచారం. రెండో సమావేశం జరగలేదని, కాబట్టి ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని సీఎంకు అధికారులు నివేదించినట్లు తెలిసింది. ఉపసంఘం వెంటనే సమావేశం అయ్యేలా నిర్ణయం తీసుకోవాలని సీఎం ఆదేశించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మంత్రివర్గ ఉపసంఘం భేటీ జరగనుంది.

28 వరకు వంశీ రిమాండ్ పొడిగింపు

- కిడ్నాప్ కేసులో ఏసీబీ కోర్టు ఆదేశాలు
- టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో వంశీ బెయిల్ పిటిషన్‌పై 16న తీర్పు



విజయవాడ, మే 14(ఆంధ్రజ్యోతి): ముదునూరి సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌తోపాటు మరో ఐదుగురికి ఏసీబీ కోర్టు రిమాండ్‌ను పొడిగించింది. ఈ కేసులో నిందితులకు రిమాండ్ పూర్తికావడంతో వారిని బుధవారం కోర్టులో హాజరు పరిచారు. వారి రిమాండ్‌ను ఈనెల 28 వరకు న్యాయాధికారి పి.భాస్కరరావు పొడిగించారు. కాగా, ఈ కేసులో వంశీతో పాటు మరో నలుగురికి ఏసీబీ కోర్టు బెయిల్ మంజూరు చేసినప్పటికీ ఇద్దరు మాత్రమే జైలు నుంచి బుధవారం విడుదలయ్యారు. ఈ కేసులో పోలీసులు వంశీతోపాటు గంటా వీర్రాజు, నిమ్మ చలపతి, వెలినేని శివరామకృష్ణప్రసాద్, వేలూరి వంశీబాబు, ఓలుపల్లి మోహనరంగారావు అలియాస్ రంగాను అరెస్టు చేశారు. వారిలో వెలినేని శివరామకృష్ణప్రసాద్ బెయిల్ పిటిషన్ హైకోర్టులో పెండింగ్‌లో ఉండటంతో మిగిలిన ఐదురుగురికి ఏసీబీ కోర్టు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. కాగా, గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో వంశీ బెయిల్ పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. తీర్పును ఈనెల 16కి వాయిదా వేస్తూ 12వ ఏడీజే కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో 71వ నిందితుడిగా ఉన్న వంశీకి బెయిల్ రాకపోవడంతో, సత్యవర్ధన్ కేసులో బెయిల్ వచ్చినా జైల్లోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

విడదల గోపి బెయిల్‌పై 16న తీర్పు

విజయవాడ, మే 14(ఆంధ్రజ్యోతి): గ్రానైట్ క్వారీ యజమానిని బెదిరించి వసూళ్లు చేసిన కేసులో మాజీమంత్రి విడదల రజిని మరిది గోపి బెయిల్ పిటిషన్‌పై ఏసీబీ కోర్టులో వాదనలు బుధవారం ముగిశాయి. గోపి తరఫున న్యాయవాది నరేంద్ర వాదనలు వినిపించారు. న్యాయాధికారి పి.భాస్కరరావు తీర్పును ఈ నెల 16కు రిజర్వ్ చేశారు.

మూడు రోజుల సిట్ కస్టడీకి సజ్జల శ్రీధర్‌రెడ్డి

- ఒకరోజు కస్టడీకి కసిరెడ్డి పీఏ దిలీప్

విజయవాడ/హైదరాబాద్, మే 14(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న సజ్జల శ్రీధర్‌రెడ్డిని మూడు రోజులపాటు సిట్ కస్టడీకి ఇస్తూ విజయవాడ ఏసీబీ కోర్టు బుధవారం ఆదేశాలు జారీ చేసింది. శ్రీధర్‌రెడ్డిని కస్టడీకి ఇవ్వాలని సిట్ అధికారులు పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై వాదనలు ముగియడంతో న్యాయాధికారి పి.భాస్కరరావు గురువారం నుంచి మూడు రోజులపాటు కస్టడీకి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఇదే కేసులో కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి పీఏ దిలీప్‌ను ఒకరోజు సిట్ కస్టడీకి ఇస్తూ ఏసీబీ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. సిట్ సిబ్బంది దిలీప్‌ను గురువారం కస్టడీలోకి తీసుకుంటారు. ఇదిలావుంటే, లిక్కర్ స్కామ్‌కు సంబంధించి హైదరాబాద్‌లోని ఆరు ప్రాంతాల్లో సిట్ అధికారులు సోదాలు నిర్వహించారు. మాజీ సీఎం జగన్ ఓఎస్‌డీ కృష్ణమోహన్ రెడ్డి కుమారుడు రోహిత్‌రెడ్డికి చెందిన కంపెనీల్లో 2 రోజులుగా సోదాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సిట్ అధికారులు కొన్ని కీలకపత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది.

రాజ్ కసిరెడ్డి అరెస్టుపై సుప్రీం విచారణ వాయిదా

- ఏపీ ప్రభుత్వానికి నోటీసులు.. 19లోగా వివరణ ఇవ్వాలని ఆదేశం

న్యూఢిల్లీ, మే 14(ఆంధ్రజ్యోతి): ఏపీ మద్యం కుంభకోణంలో ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అలియాస్ రాజ్ కసిరెడ్డి అరెస్టుకు సంబంధించిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ ఈనెల 19కి వాయిదా పడింది. ఆలోగా అరెస్టుపై వివరణ ఇవ్వాలని ఏపీ ప్రభుత్వానికి ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. మద్యం కుంభకోణంలో తన కుమారుడుకి రిమాండ్ విధిస్తూ ఏసీబీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను చట్టవిరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ కసిరెడ్డి తండ్రి ఉపేందర్ రెడ్డి పిటిషన్ వేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.